ఏప్రిల్ 2016

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 8 సంచిక : 3 పేజీలు : 68 వెల: రూ.20/-




## ప్రత్యక్ష ప్రజాస్వామ్య వేదికలుగా స్థానిక ప్రభుత్వాలు



రవీంద్రభారతిలో జరిగిన ఉగాది ఉత్సవాలల్లో పాల్గొని జ్యోతిప్రజ్వలన చేస్తున్న ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్‌రావు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల మరియు మిషన్ భగీరథ ప్రాజెక్ట్‌పై మాట్లాడుతున్న కేంద్ర పంచాయతీరాజ్
మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ చౌదరి బిరేందర్‌సింగ్, సహాయ మంత్రి రామ్‌క్రిపాల్, తెలంగాణ రాష్ట్ర పిఆర్& ఆర్డీ శాఖ మంత్రి
శ్రీ కె.తారక రామారావు, పత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీ ఎస్.పి.సింగ్, ఐఏఎస్., కమీషనర్ శ్రీమతి అనిత రామచంద్రన్, ఐఏఎస్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలపై ఉద్దేశించి మాట్లాడుతున్న నీతిఅయోగ్ వైస్‌చైర్మన్ అరవింద్ పనగారియా,
తెలంగాణ ముఖ్యకార్యదర్శి శ్రీ రాజీవ్‌శర్మ, ఐఏఎస్.,
పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ముఖ్యకార్యదర్శి శ్రీ ఎస్.పి.సింగ్ ఐ.ఏ.ఎస్.

టిసిపార్డ్

TSIPARD




సంపుటి : 8 సంచిక : 3

ఏప్రిల్ 2016



ఎడిటర్

**అనిత రామచంద్రన్**, ఐ.ఏ.ఎస్.

కమీషనర్, టిసిపార్డ్

ఎడిటోరియల్ బోర్డు

**కె.యాదయ్య**

**డా॥కె.అసయ్య**

**ఎ.నాగేశ్వరరావు**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్,**
**టిసిపార్డ్**

**నవతెలంగాణ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ

**టిసిపార్డ్**



రాజేంద్రనగర్
హైదరాబాద్ - 500 030
తెలంగాణ, ఇండియా.
ఫోన్ : 040 - 24018656
ఫ్యాక్స్ : 040 - 24017005
E-mail:editorsthanikapalana@gmail.com
Website: www.tsipard.gov.in



ఈ సంచికలో రచయితలు
వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా
ప్రభుత్వానికిగాని, టిసిపార్డ్‌కిగాని
చెందినవిగా భావించనక్కరలేదు


# విషయ సూచిక


సంపాదకీయం ..... 4

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ..... 5

మరువలేని మనిషి స్థానిక స్వపరిపాలన పితామహుడు లార్డ్‌రిప్పన్ ..... 9

ఉపాధి హామీ చట్టం ఫలితాలు ..... 12

మానవీయ మదర్‌కు సెయింట్ హెూదా ..... 14

వేసవిలో కూరగాయలను పురుగుల నుండి రక్షించడం ఎలా? ..... 16

స్థానిక ప్రభుత్వాలలో మహిళాల ప్రాతినిధ్యం ..... 19

రైజో బ్యాక్టీరియా పోషకాల లభ్యత ..... 21

గ్రామ్ ఉదయ్ సే భారత్ ఉదయ్ అభియాన్ ..... 22

సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ..... 23

సమాజసేవే లక్ష్యంగా ముందుకు సాగిపోతున్న సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు ... 25

వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల ఆవశ్యకత ..... 26

ఆడపిల్లను చదివించండి ..... 27

కులవ్యవస్థపై అలుపెరగని పోరాటం డా॥బి.ఆర్.అంబేద్కర్ ..... 29

బరువైన నేలలకు అనువైన శనగపంట ..... 31

తెలంగాణ పంచాయతీరాజ్ వ్యవస్థ స్వరూప స్వభావాలు ..... 33

సూక్ష్మధాతువు లోపాలు - మరియు సవరణలు ..... 36

జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ - పంచాయతీరాజ్ సంస్థల సమన్వయం . 38

జల నిర్వహణలో ప్రజల పాత్ర ..... 41

(వాల్మీకి) బోయల చరిత్ర ..... 43

దళిత ప్రజల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ ..... 46

సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ..... 48

ఆరోగ్య తెలంగాణ దిశగా అడుగులు ..... 52

దళిత బహుజనుల ఆశాకిరణం డా॥బి.ఆర్.అంబేద్కర్ ..... 54

తెలంగాణ సినిమా - రాశిలో కన్నా వాసిలో ఘనం ..... 56

విద్యుత్ పొదుపు చేద్దాం - భావితరాలకు వెలుగునిద్దాం ..... 59

జీవవైవిధ్య పరిరక్షణ ఆవశ్యకత ..... 61

యాద్రాద్రి పుణ్యక్షేత్రం ..... 63

పరిమితిమించితే పాన్ - లేదంటే పరేషాన్ ..... 65

# పంచాయితీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేద్దాం

## ఏప్రిల్ 24 పంచాయితీరాజ్ దినోత్సవం

**భా**రతదేశం గ్రామాల్లోనే నివసిస్తుందని మహాత్మాగాంధీ ఎప్పుడో అన్నారు. నేటికి జనాభాలో మూడొంతులు గ్రామాల్లోనే ఉంటున్నారు. అంటే గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయమని చెప్పవచ్చు. మన సామాజిక ఆర్థిక ప్రగతి ప్రణాళికలలో గ్రామాలకు ఎంత ప్రాముఖ్యత ఉండాలో మనకర్థమవుతుంది.

ఈ మూడొంతుల గ్రామ జనాభాకు ఎన్ని పథకాలు అమలు చేసిన ఆ పథకాలు అట్టడుగుస్థాయిలో అమలు చేయవలసిన బాధ్యత పంచాయితీలదే. అందుకు ప్రజలలో అవగాహన పెంచి వారిని భాగస్వాములను చేసే బాధ్యత గ్రామపంచాయితీలపై ఉంది. అంటే ప్రణాళికల రూపకల్పన వాటి అమలు, ప్రజా చైతన్యాన్ని పెంచటం వంటి కీలక అంశాలపై దృష్టిని కేంద్రీకరించటంలో ముఖ్య పాత్రధారులు, పంచాయతీ రాజ్ వ్యవస్థలోని ప్రజాప్రతినిధులు, అధికారులే.

భారతదేశం సమాఖ్య వ్యవస్థ కావడం వలన మన రాజ్యాంగం ప్రకారం గ్రామ పంచాయతీలకు కొన్ని విధులు, అధికారాలు రాష్ట్ర ప్రభుత్వాలే అప్పగించాలి. ఈ బదలాయింపు అన్ని రాష్ట్రాలలో ఒకేలా లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పలు ప్రతిష్టాత్మక పథకాలు పంచాయతీ సంస్థలకు భాగస్వామ్యమివ్వడం జరిగింది. ప్రతి ఏటా దాదాపు రూ. 30 వేల కోట్లు ఆ పథకాలకు కేటాయించి ఖర్చు చేయబడుతున్నాయి. వాటిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పంచాయతీరాజ్ సంస్థలకు అధిక సంబంధం ఉంది. పనులు ఎంపిక మొదలు సామాజిక తనిఖీ వరకు ప్రతిస్థాయిలో పంచాయతీరాజ్ సంస్థల భాగస్వామ్యం తప్పనిసరి అయ్యింది. విద్య, వైద్యం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం జాతీయ ఆరోగ్యమిషన్, మధ్యాహ్న భోజన పథకం, జాతీయ గ్రామీణ త్రాగునీటి పథకం, స్వచ్ఛభారత్, ఐసిడిఎస్, సర్వశిక్ష అభియాన్ వంటి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు నేడు పంచాయతీరాజ్ వ్యవస్థ భాగస్వామ్యంతో అమలవుతున్నాయి.

ఈ గురుతర పాత్రను సక్రమంగా సమర్థవంతంగా నిర్వహించేందుకు పంచాయితీరాజ్ వ్యవస్థలో ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తమ అవగాహనను, సామర్థ్యాలను మెరుగుపరుచుకొంటూ ఉండాలి. ఆత్మవిమర్శ చేసుకోవాలి. అటువంటి సానుకూల దృక్పథము ఉంటేనే వారు తమ పాత్రకు న్యాయం చేకూర్చి గ్రామీణాభివృద్ధికి తమవంతు కృషి ద్వారా తోడ్పడిన వారవుతారు. దాని ద్వారా వచ్చే తృప్తి చాలా విలువైనది.

తెలంగాణ రాష్ట్రంలో పంచాయితీలను బలోపేతం చేయటానికి, వాటి ప్రతినిధులను సుశిక్షితులను చేయడాన్ని టిసిపార్డు నిర్విరామంగా కృషి చేస్తోంది. టిసిపార్డులో శిక్షణతో పాటు వారి సామర్థ్యం పెంపొందించుటకు తగిన సమాచారాన్ని అందించటం. వివిధ శిక్షణా పథకాల ద్వారా ప్రతినిధులను ఉత్తేజితులను చేయడం, స్థానిక పాలన పత్రిక ద్వారా, సిబిటిల ద్వారా, శాటిలైట్ ద్వారా, ఎన్‌జిఓలను భాగస్వామ్యం చేయటం దూరదర్శన్, మనటివి, రేడియో వంటి ప్రసార మాధ్యమాలు నిరంతరాయంగా కొనసాగుతోంది. అటు ప్రభుత్వస్థాయి ఇటు టిసిపార్డు స్థాయిలో పంచాయతీ ప్రతినిధులను చొరవ తీసుకొనే విధంగా సమాయత్తం చేయడం జరుగుతుంది. పంచాయతీరాజ్ సంస్థలను సుపరిపాలనవైపు నడిపేందుకు అన్ని రకాలుగా కృషి చేయడం జరుగుతోంది.

(అనిత రామచంద్రన్)

సంపాదకీయం





# జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం

**గాంధీజీ** కలలుగన్న నిజమయిన స్వరాజ్యం స్థానిక స్వపరిపాలన.

భారత దేశంలో సరిగ్గా 23 సం॥ క్రితం ఏప్రిల్ 24, 1993న మూడంచెల పంచాయతీ రాజ్ ప్రభుత్వాలకు రాజ్యాంగ బద్ధత కల్పించబడింది. ఇది ఒక పెద్ద ప్రజాస్వామిక విప్లవం అని చెప్పవచ్చు. పంచాయతీ రాజ్ సంస్థలకు రాజ్యాంగ పరంగా ప్రత్యేకమయిన అస్థిత్వం, గుర్తింపు వచ్చింది. అట్టడుగు స్థాయిలో ప్రజాస్వామ్యం వికసించింది. దాని పర్యవసానమే....

- పంచాయతీ రాజ్ సంస్థలకు మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ
- పటిష్ఠ పునాది వ్యవస్థగా గ్రామసభల నిర్వహణ
- క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు
- అట్టడుగు స్థాయి నుండి దళిత, గిరిజన, బలహీన వర్గాలు మరియు మహిళలకు ప్రజా ప్రతినిధులుగా జనాభాలో ఆయా వర్గాల నిష్పత్తికి అనుగుణంగా సీట్ల కేటాయింపుకు అవకాశం.
- పంచాయతీల పటిష్ఠతకు, ఆర్థిక సంఘం మరియు ఎన్నికల నిర్వహణకు స్వతంత్ర్యస్థాయి ఎన్నికల సంఘం ఏర్పాటు
- అధికారాల బదలాయింపు వంటి అంశాలు చట్టంలో పొందుపరచడం జరిగింది.

దేశ పంచాయతీ రాజ్ చరిత్రలో విప్లవాత్మకమయిన ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికిన ఈ రోజును మననం చేసుకోవడానికి, పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా గ్రామీణ వ్యవస్థను మెరుగుపరచడానికై పంచాయతీ రాజ్ ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు, ప్రజా సంఘాలు జాతికి పునరంకితమయ్యే ప్రధాన ఉద్దేశంతో ఏటా ఏప్రిల్ 24నాడు **జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని** జరుపుకోవడం జరుగుతుంది.

ప్రజాస్వామ్య పరిపాలన అంటే, అధికారంలో ప్రజలందరూ పాలు పంచుకోవడం. పంచాయితీ వ్యవస్థ, ప్రజాస్వామ్యానికి మూలాధారం అందువలననే పరిపాలనా సౌలభ్యం కోసం, ఎక్కువ సంఖ్యలో పజలు పాల్గొనేందుకు వీలుగా మన రాజ్యాంగం కేంద్రంలో పార్లమెంటు, రాష్ట్ర స్థాయిలో శాసన సభలు, జిల్లాలలో స్థానిక పరిపాలనను ఏర్పరచింది. మన రాజ్యాంగం ఆదేశ సూత్రాలలోని 40వ ఆర్టికల్ స్థానిక స్వపరిపాలన యొక్క ప్రాముఖ్యతను గురించి చెప్పబడింది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక ప్రభుత్వాలకు విశేషమయిన ప్రాముఖ్యత ఉంది. ప్రజాస్వామ్య ప్రయోజనాలు అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు స్థానిక ప్రభుత్వాలు దోహదపడతాయి.

దేశ పాలనా వ్యవస్థలో అట్టడుగున ఉన్న గ్రామ పంచాయతీ నుండి మండల స్థాయి, జిల్లా స్థాయి వరకు గల పాలనా వ్యవహారాలలో ప్రజలు స్వయంగా పాల్గొన్నట్లయితే, అభివృద్ధి కార్యక్రమాలు జయప్రద మవుతాయని ప్రజలు తమ అవసరాలను తామే గుర్తించి పరిష్కార మార్గాలు తామే కనుక్కుని, స్వయంగా

తామే నిర్ణయం తీసుకునే అవకాశం లభించినప్పుడే వారు పాలనా విషయాల్లోనూ, అభివృద్ధి కార్యక్రమాల్లోను విరివిగా పాల్గొనటానికి ప్రోత్సాహం లభిస్తుందని గ్రహించి పంచాయతీ రాజ్ వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ రక్షణ కల్పిస్తూ పార్లమెంటులో 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని చేసింది.

భారతదేశంలో స్థానిక ప్రభుత్వాలకు విశేషమయిన చారిత్రాత్మక ప్రాముఖ్యత ఉంది. ప్రాచీన కాలం నుండే గ్రామ స్థాయి పరిపాలన జరిగినట్లు చరిత్ర ఆధారాలు చెపుతున్నాయి. అప్పటి నుండి పరిస్థితులకు అనుగుణంగా మారుతూ నేటి వరకు, అవిచ్ఛినంగా, సజీవంగా పంచాయతీరాజ్ సంస్థలు పనిచేస్తున్నాయి. ప్రాచీన కాలం నుండి, బ్రిటీష్ సామ్రాజ్యవాద వలస పాలకుల వరకు భారతదేశాన్ని అనేక రాజ వంశాలు పరిపాలన సాగించినప్పటికీ పంచాయతీ రాజ్ వ్యవస్థ పంచాయతీల పాలన ఎన్నో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ సజీవంగా కొనసాగుతూ వచ్చినది.

నాలుగు వేదాల్లో మొదటిదయిన రుగ్వేదంలో స్థానిక సంస్థల ప్రస్థావన ఉంది. రుగ్వేదంలో 'సభ', 'సమితి' అనే రెండు స్థానిక స్వపరిపాలనా సంస్థల ప్రస్థావన వాటి పరిపాలనా విధానం గురించి చెప్పబడింది.

మౌర్యుల పరిపాలనలో కౌటిల్యునిచే వ్రాయబడిన "అర్థశాస్త్ర" గ్రంథంలో "గ్రామిక", "గ్రామకూట" అనే గ్రామాధికారుల గురించి చెప్పబడింది. గ్రామాధికారిని "గ్రామణి" అని, 10 గ్రామాల అధిపతిని "దశ గ్రామణి" అనే వారని ప్రస్థావించారు. గ్రామ సమస్యలను గ్రామ సభలో చర్చించే వారని దుష్టులను గ్రామము నుండి బహిష్కరించేవారని చెప్పడం జరిగింది. మౌర్యుల కాలంలోని స్థానిక ప్రభుత్వాల గురించి మెగస్తనీసు "ఇండికా" అనే గ్రంథంలో వివరించారు. పట్టణ ప్రాంతములో నగర అధికారిని "నాగరిక" అని పిలిచేవారు.

గుప్తుల స్వర్ణయుగం (క్రీ.శం. 571 వ సం॥) నాటి కాలంలో చంద్రగుప్తుడు గ్రామ సభను "పంచ మండలి" అని పిలిచేవారు.

చోళుల స్థానిక స్వపరిపాలన గురించి తమిళనాడులోని ఉతిర మేరూరు గ్రామం శిలాశాసనంలో ఎంతో వివరంగా చెప్పడం జరిగింది. గ్రామ పాలన కోసం "పంచాస్" అనే ఐదుగురుసభ్యులతో కూడిన మండలి ఉండేది. పంచాస్ అనే పదమే తరువాత పంచాయతీగా మారింది. వీరి కాలంలో తాటి ఆకులను బ్యాలెట్ పత్రాలుగా, మట్టి కుండలను బ్యాలెట్ బాక్సులుగా ఉపయోగించి, స్థానిక సంస్థలకు పాలకులను ఎంపిక చేసినట్లు తెలుస్తుంది. కాకతీయుల కాలంలో ప్రతి గ్రామానికి నాయకుడు నూరు గ్రామాలకు సామంతుడు వేయి గ్రామాలకు ఆశాపాలుడు ఉండేవారు. 12వ శతాబ్ది నుండి భారతదేశంలో మహ్మదీయుల పాలన వచ్చింది. మొగలుల కాలంలో పట్టణ పాలనను, కొత్వాల్ అనే అధికారి చూసుకొనేవాడు. కొత్వాల్‌కు సహాయంగా 'మున్సబులు' ఉండేవారు. గ్రామ పరిపాలనలో జాగీర్థారీ, జమీందారి వ్యవస్థలు అమలులోకి వచ్చింది.



ఆధునిక భారతదేశంలో బ్రిటిష్ పాలనలో లార్డ్‌మెమో అధికార వికేంద్రీకరణలో భాగంగా 1870లో స్థానిక ప్రభుత్వాలను తొలిసారిగా ప్రవేశపెట్టడం జరిగింది. లార్డ్ రిప్పన్ 1882, స్థానిక ప్రభుత్వాల చట్టం ప్రకారం దేశంలో స్థానిక ప్రభుత్వాలను అభివృద్ధి చేశాడు.

స్వాతంత్ర్యానంతరం మొదటి పంచవర్ష ప్రణాళిక కాలంలో భారతదేశంలో 1952 సం॥లో పేదరికం, అసమానతలు, వెనుకబాటుతనం, అణచివేతలు రూపుమాపడానికి సమాజాభివృద్ధి పథకం ప్రారంభించడం జరిగింది. ఈ పథకాన్ని జాతీయ విస్తరణ సేవా పథకంగా 1953లో దేశమంతటా అమలు చేశారు. దేశంలోని అన్ని ప్రాంతాలలో సమాజాభివృద్ధి కేంద్రాలను (CD Blocks) నెలకొల్పారు. ఒక్కొక్క కేంద్రంలో 100 గ్రామాలు 1 లక్ష జనాభా ఉండేటట్లు వాటిని ఏర్పాటు చేశారు.

సామాజిక అభివృద్ధి పథకం జాతీయ విస్తరణ సేవా పథకం ద్వారా ఆశించిన ఫలితాలు కలుగక పోవడంతో ప్రజలకు, గ్రామ స్వపరిపాలనలో భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత ఏర్పాట్లు సూచించ వలసిందిగా స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి 1956 సం॥లో బల్వంతరాయ్ మెహతా ఆధ్వర్యంలో కమిటీ వేయడం జరిగింది. గుజరాత్‌కు చెందిన బల్వంతరాయ్ మెహతా సత్యాగ్రహం, క్విట్ ఇండియా లాంటి ఉద్యమాలలో పాల్గొని దాదాపు ఏడు సం॥ పాటు జైలు శిక్ష అనుభవించాడు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1957లో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా, లోక్‌సభ సభ్యులుగా, గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1957లో ఈ కమిటీ నివేదికలు సమర్పించినది. కమిటీ సిఫార్సుల ఆధారముగా 1959వ సం॥లో ఆనాటి కమ్యూనిటీ అభివృద్ధి శాఖామాత్యులు శ్రీ. ఎస్. కె. డే ఆధ్వర్యంలో పంచాయితీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది. రాజస్థాన్‌లో మొట్టమొదటగా పంచాయితీ రాజ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఇందుకోసం 1959 సం॥లో గ్రామ పంచాయతీ, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్ చట్టాలు ఏర్పాటుతో మూడంచెల వ్యవస్థకు శ్రీకారం జరిగింది.

కమిటీ సిఫార్సుల ప్రకారం దేశ అభివృద్ధిలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడం, మూడంచెల వ్యవస్థ, స్థానిక సంస్థలకు ఐదేళ్ళకొకసారి ఎన్నికలు, పార్టీ ప్రాతిపదికన కాకుండా స్వతంత్ర్యంగా ఎన్నికలు నిర్వహించాలని, గ్రామ పంచాయతీ, పంచాయతీ సమితి, జిల్లా పరిషత్తుల ఏర్పాటు, గ్రామ పంచాయితీకి ప్రత్యక్ష్యంగా, పంచాయితీ సమితి మరియు జిల్లా పరిషత్తుకు పరోక్షంగా ఎన్నికలు జరపాలని సిఫార్సులు చేయడం జరిగింది.

స్థానిక సంస్థలు బలోపేతానికి కేంద్రంలో అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయి జనతా ప్రభుత్వం పంచాయితీ వ్యవస్థను అధ్యయనం చేయడం కోసం: 1977లో అశోక మెహతా కమిటీ ఏర్పాటు చేసింది. పరిపాలనలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అశోక్ మెహతా కమిటీ 1978 సం॥లో సిఫార్సులు, మూడంచెల స్థానంలో రెండంచెల విధానం కొరకు సిఫార్సు జిల్లా స్థాయిలో జడ్.పి. బ్లాకు స్థాయిలో మండల పంచాయితీ ఏర్పాటు చేయాలని, గ్రామ పంచాయతీ రద్దుచేసి గ్రామ కమిటీల ఏర్పాటు గురించి న్యాయ౦ పంచాయితీ సంస్థ పర్యవేక్షణకై పంచాయతీ రాజ్ శాఖా మంత్రి నియామకం గురించి చెప్పడం జరిగింది.

పంచాయితీరాజ్ వ్యవస్థను అభివృద్ధి పరచి, బలోపేతం చేయడానికి దేశమంతా ఒకే రకమైన వ్యవస్థ ఏర్పాటు చేయడానికి 1989లో, ఎమ్.ఎల్.సంఘ్వి, పి.కె. తుంగన్ మరియు ఇతర కమిటీల సిఫారసుల ఆధారంగా రాజీవ్‌గాంధీ హయాంలో వచ్చిన 68, 69వ పంచాయతీ రాజ్ మరియు నగర పాలన చట్టాల రాజ్యాంగ సవరణలను చారిత్రాత్మకమయినవిగా చెప్పుకోవాలి. ఇవి లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజార్టీతో ఆమోదం పొందాయి. అయితే సంచలనాత్మక మయిన ఈ రెండు బిల్లులను రాజ్య సభలో ప్రతిపక్ష్యాలు ఓడించాయి.

కేంద్ర ప్రభుత్వం ఎల్.ఎం.సింఘ్వి మరియు వివిధ కమిటీల సూచనల మేరకు పంచాయతీ రాజ్ మరియు నగర పాలక సంస్థలకు 73, 74 వ రాజ్యాంగ సవరణల ద్వారా, రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. 1992వ సం॥లో 73వ రాజ్యాంగ సవరణ పార్లమెంట్ ఆమోదం పొందింది. రాష్ట్రపతి 17 రాష్ట్రాల శాసన సభలు ఆమోద ముద్ర వేయడంతో 24 ఏప్రిల్ 1993న ఈ రాజ్యాంగ సవరణ చట్టం అమలులోకి వచ్చింది. దీని ప్రకారం రాష్ట్రాలు, ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుకూలంగా పంచాయతీ రాజ్ చట్టాలు చేశాయి. దేశ వ్యాప్తంగా ఏకీకృత మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడింది.

73వ రాజ్యాంగ సవరణ తర్వాత అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా చేయాల్సిన అంశాలను తమ తమ రాష్ట్ర ప్రభుత్వ పంచాయితీ రాజ్ చట్టాలలో పొందు పరచి అమలు చేస్తున్నాయి. రాజ్యాంగం 9వ భాగంలో 243 ఎ నుండి 243ఓ వరకు పంచాయతీ రాజ్ నిర్మాణానికి సంబంధించిన సమగ్ర విచారణను



పొందుపరచడం జరిగింది. అలాగే 11వ షెడ్యూలులో పంచాయతీలు నిర్వర్తించాల్సిన 29 విధులను కూడా పొందు పర్చారు.

**స్థానిక ప్రభుత్వాల ముందున్న సవాళ్ళు:**

- ఆరోగ్య భద్రత, మాతా శిశు మరణాలు తగ్గిచడం, ప్రసూతి మరణాలు తగ్గించడం
- పౌష్టికాహార లోపం లేకుండా చూడటం, వ్యాధి నిరోదకాలు వాడునట్లు చూడటం.
- అందరినీ బడిలో చేర్పించి నాణ్యమయిన, గుణాత్మకమయిన విద్య అందేటట్లు చూడటం.
- పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, పారదర్శకంగా అమలు చేయడం
- మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షించడం.
- నీరు, విద్యుత్తు పొదుపుగా వాడుకోవడం, భూగర్భ జలాలను పెంచేందుకు కృషి చేయడం
- ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, ఇంకుడు గుంతల నిర్మాణము
- సౌరశక్తిని వినియోగించుకోవడం
- సామాజిక అడవుల పెంపకం, హరిత గ్రామాలుగా మార్చడం, పర్యావరణ పరిరక్షణ చర్యలు గైకొనడం.
- పౌరులకు మెరుగైన వసతులు కల్పించి, మంచి సేవలు అందించడం.

## ప్రయోజనాలు

1. భారతదేశంలో ప్రజాస్వామ్య సంస్థలకు స్థానిక సంస్థలు పునాదిగా ఉంటాయి.
2. స్థానిక ప్రభుత్వాలు ప్రజలలో రాజకీయ అవగాహనను, బాధ్యతను పెంపొందిస్తాయి.
3. స్థానిక ప్రభుత్వాలు స్థానిక స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలకు భాగస్వామ్యాన్ని కల్పిస్తాయి.
4. స్థానికంగా అందుబాటులో ఉండే భౌతిక వనరులను సక్రమంగా వినియోగించుకోవడంలో స్థానిక ప్రభుత్వాలు దోహదపడతాయి.

గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు - గ్రామ స్వరాజ్యమే సంపూర్ణ స్వరాజ్యం అవుతుందని మహాత్మాగాంధీ అన్న వాక్కు నెరవేరగలదని వేచి చూద్దాం.

## తెలంగాణ ప్రభుత్వం స్థానిక స్వపరిపాలనలో సంస్కరణలు:

- కొత్త పంచాయతీ రాజ్ చట్టం కోసం ప్రభుత్వ సన్నాహాలు చేస్తుంది. స్థానిక ప్రభుత్వాలు బాధ్యతాయుతమయిన, జవాబుదారీ సంస్థలుగా, పారదర్శకతతో ప్రజల సమస్యలను పరిష్కరించే వేదికలుగా తయారు చేయడానికి ప్రభుత్వం పూనుకున్నది.
- ఈ-పంచాయతీల దిశగా అడుగులు
- పల్లె సమగ్ర సేవా కేంద్రాల ఏర్పాటు, అన్ని పౌరసేవలను ఒకేచోట అందించడం.
- పెరిగిన పంచాయతీ రాజ్ ప్రజా ప్రతినిధుల గౌరవ వేతనాలు
- పంచాయతీల పటిష్టతకు గ్రామజ్యోతి కార్యక్రమాలు - తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ రాజ్ సంస్థబలోపేతం చేయడానికి, ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికా రచనతో పాటు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుకు గ్రామజ్యోతి అనే కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అనేక పథకాల క్రింద ఏర్పాటు చేసిన వివిధ భాగస్వామ్య కమిటీలు, పంచాయతీ రాజ్ సంస్థలకు సమాంతర వ్యవస్థలుగా పనిచేస్తూ, స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీ తనంగా వ్యవహరించడం లేదు. పరస్పర సంఘర్షణాత్మక దోరణితో, సమన్వయ రహితంగా, క్షేత్రస్థాయిలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా పనిచేయడం జరుగుతుంది. స్థానిక ప్రభుత్వాలు మరియు ఇతర శాఖల సంఘాల మధ్య పరస్పర సంబంద భాందవ్యాలు నెలకొనేటట్లు, రాజ్యాంగ బద్ద సంస్థలకు జవాబుదారీ తనంగా ఈ సమాంతర వ్యవస్థలు రూపుదిద్దుకునేలా ప్రభుత్వం గ్రామజ్యోతి ద్వారా చర్యలు చేపట్టింది.

- వివిధ అంశాల మీద గ్రామ స్థాయిలో కార్యాచరణ కమిటీలు.
- వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం.
- సామర్థ్యాల పెంపుకై పంచాయతీ రాజ్ ప్రజా ప్రతినిధులకు, పంచాయతీ రాజ్ సిబ్బందికి శిక్షణలు




## గ్రామోదయ్ సే భారత్ ఉదయ్ అభియాన్:-

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవము సందర్భముగా కేంద్ర ప్రభుత్వము "గ్రామ ఉదయ్ సే భారత్ ఉదయ్ యోజనా" అనే కార్యక్రమానికి రూపకల్పన చేసింది. గౌ॥డా॥ బి.ఆర్.అంబేద్కర్ గారి 125వ జన్మదినమయిన ఏప్రిల్ 14వ తేదీ నుండి జాతీయ పంచాయతీ దినోత్సవము 24వ తేది వరకు ఉత్సవాలు జరుపుటకు నిర్ణయించనైనది. ఏప్రిల్ 14 నుండి 16 వరకు సామాజిక సామరస్య దినములుగా పాటించుట, ఏప్రిల్ 17 నుండి 20 వరకు కిసాన్ సభలు నిర్వహించి, రైతు సమావేశాలు, ఆధునిక వ్యవసాయ పద్దతులు వంటి వాటిపై చర్చలు గైకొనుట మరియు ఏప్రిల్ 21వ తేది నుండి 24వ తేది వరకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించవలసి ఉంటుంది. ఈ గ్రామ సభలలో ప్రంచాయతీ ప్రతినిధులు, గ్రామస్థులు, మహిళలు, విద్యార్థులు, యువతీ యువకులందరూ పాల్గొనవలసి ఉంటుంది. గ్రామములో ప్రభాత్ బేరీ, పారిశుద్ధ్య కార్యక్రమాలు, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలతో పాటు వ్యక్తులను గ్రామసభ ద్వారా గుర్తించి వారిని సన్మానించుట వంటి కార్యక్రమములు చేపట్టవలసి ఉంటుంది. ప్రభుత్వ పథకాల గురించి చర్చలు జరగాలి. ఎక్కడ ప్రజలు అభ్యుదయ భావాలతో అందుబాటులోని వనరుల వినియోగంతో ప్రభుత్వ శాఖల సిబ్బంది సమన్వయంతో, భాగస్వామ్య పద్దతిలో ప్రణాళికా రచనలు చేసుకుని, పారదర్శకతతో, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో క్రియాశీలక పాత్ర పోషిస్తారో అక్కడ సుస్థిర అభివృద్ధి సాధ్యపడుతుంది.

**ఈ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా పంచాయతీ రాజ్ చట్టాన్ని మరింతగా సమీక్షించుకుని, స్థానిక ప్రభుత్వాల ప్రజా ప్రతినిధులు, కార్యాచరణ కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది ప్రజాసేవలో పునరంకితమై, పౌరసేవలను సమర్థవంతంగా అందించడానికి, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేయడానికి దోహదపడేలా ముందుకు తీసుకెల్లగలుగుతారని ఆశిద్దాం.**

కె. యాదయ్య గౌడు, **సంయుక్త సంచాలకులు (పరిపాలన), టిసిపార్డు**






# మరువలేని మనిషి

## స్థానిక స్వపరిపాలనా పితామహుడు

# లార్డ్ రిప్పన్

**సు**దీర్ఘ చరిత్ర, ఉన్నత నాగరికత, సిరి సంపదలు గల భారతదేశం ఇక్కడకు దాదాపు పదివేల కి.మీ దూరంలో గల ఒక చిన్నదేశం 'ఇంగ్లాండ్' పాలన క్రిందకు రావడం చరిత్రలో ఓ మరువలేని ఘట్టం. ఆ పరాయి దేశానికి చెందిన ఓ చిన్న వ్యాపారసంస్థ 'ఈస్ట్ ఇండియా కంపెనీ' వ్యాపార నెపంతో దేశంలో అడుగిడిగి ఇక్కడి పాలకుల అంత:కలహాలను ఆసరగా చేసుకుని కుట్రలు, కుతంత్రాలతో రాజ్యాధికారం సాధించడం, పాలనావ్యవస్థ నేర్పరచడం దేశ చరిత్రలో దురదృష్ట సంఘటన.

1757 ప్లాసీయుద్ధంతో బెంగాల్‌లో అధికార స్థాపన ప్రారంభించిన కంపెనీ 1857 నాటికి దేశంలో అత్యధిక భాగాన్ని తన పాలనలోకి తెచ్చుకొని రాజకీయ ఆర్థిక సాంఘిక మతపరంగా ప్రజలకు పరాయిపాలన రుచి చూపింది. కంపెనీ నిరంకుశ క్రూరపాలనకు వ్యతిరేకంగా జరిగిన సిపాయిల తిరుగుబాటు ద్వారా వెల్లడయిన భారతీయుల ఆగ్రహాన్ని మన్నించి, నాటి బ్రిటన్ పాలకురాలైన విక్టోరియా మహారాణి, కంపెనీ పాలనను రద్దుచేసి, భారతదేశ పాలనను బ్రిటీష్ ప్రభుత్వం స్వీకరించింది. అయినా భారత్‌లో పరాయిపాలకుల ఆర్థికదోపిడి, జాత్యాహంకార విధానం, నిరంకుశపాలన కొనసాగింది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కోల్పోయి, ప్రజలనేక కష్టనష్టాలకు గురై, స్వదేశంలోనే బానిసలుగా బ్రతకవలసి వచ్చింది. నాటి బ్రిటిష్ పాలకులు అత్యధికులు అవినీతిపరులు. అహంకారులు, అక్రమార్జనాపరులు. తమ తెల్లజాతి అగ్రజాతి అను అత్యున్నతమైనదని, భారతీయులు నల్లజాతి అని, అధములని వారి నాగరికత, సంస్కృతులు పాలనా విధానంలో తమకు సమానులుకారని, జాత్యహంకారం-జాతి విచక్షణ చూపిస్తూ, నిరంకుశవైఖరి ప్రదర్శించేవారు.

భారతీయుల పట్ల ప్రతి విషయంలో కఠిన వైఖరిని అవలంబించేవారు. కరువు కాటకాలు, అంటువ్యాధుల మూలంగా ప్రజలు కష్టాల పాలవుతున్నా కనికరం చూపేవారు కాదు. కంపెనీ పాలన అంతమొంది, బ్రిటిష్ ప్రభుత్వపాలన కొనసాగినా స్వదేశ ప్రజల పట్ల, పాలనపట్ల, విదేశీ పాలకులలో మార్పులు శూన్యం. అలాంటి చీకటి రోజుల్లో కాంతిరేఖల్లా మానవతావాదం, ఉదారవిధానం ప్రదర్శించిన, అరుదైన బ్రిటిష్ పాలకుల్లో ఓ మహోన్నత వ్యక్తి 'లార్డ్ రిప్పన్'.

లార్డ్ రిప్పన్ 1880 ఏప్రిల్‌లో ఇండియాలో బ్రిటిష్ రాజప్రతినిధిగా నియామకం కావడంతో దేశచరిత్రలో నూతన శకం ప్రారంభమైంది.

రిప్పన్ ఉదారవాది. శాంతి, స్వేచ్ఛావాదం, స్వయంపాలన పట్ల రిప్పన్‌కు అత్యంత విశ్వాసం, తన నాలుగు సంవత్సరాల పాలనా కాలంలో జాతి వైషమ్యాలు నిరంకుశ పాలనా విధానాలను పక్కనబెట్టి ప్రజోపయోగమైన సంస్కరణలు కార్యక్రమాలు చేపట్టి భారతీయుల మదిలో చిరస్మరణీయుడుగా నిలిచాడు. అధికారం చేపట్టగానే ఆఫ్ఘన్ యుద్ధాన్ని అంతమొందించి అక్కడి అమీర్‌తో స్నేహం నెలకొల్పాడు. బర్మాలో యుద్ధం తప్పనిసరైనా నివారించి తమ ప్రాబల్యాన్ని కొనసాగించాడు.

పరిపాలనలో ఉదార విధానాలను ప్రవేశపెట్టి అనేక ప్రజోపయోగ కార్యక్రమాలను రిప్పన్ చేపట్టాడు. ఆయన కాలంలో 1200 మైళ్ల పొడవు కాలువల త్రవ్వకం జరిగి, నూతనంగా ఒక మిలియన్ ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. రైలుమార్గాల ఆవశ్యకత గుర్తించి నూతనంగా 2000 మైళ్ల రైలు మార్గం వేయించాడు. విద్యారంగంపై శ్రద్ధ వహించి, 'హంటర్‌కమిటీ' నియమించి వారి సూచనల మేరకు ప్రాథమిక విద్యలో మార్పులు చేశాడు. ప్రభుత్వ గ్రాంట్లతో ప్రైవేటు విద్యాసంస్థలు నెలకొల్పాడు. కళాశాలలు, పాఠశాలలను ఇన్‌స్పెక్టరులతో తరుచూ తనిఖీ చేయించేవాడు. భారతీయులు విద్యావంతులుగా, రాజకీయంగా చైతన్యవంతులు కావాలని సంకల్పించాడు. పాలనలో ఖర్చు తగ్గించి పొదుపు పాటించాడు. సైనిక వ్యయం తగ్గించాడు. అనేక దిగుమతి సుంకాలు రద్దు చేసి స్వేచ్ఛా వ్యాపార విధానం ప్రోత్సహించాడు. ఉప్పుపై పన్ను తగ్గించాడు. భూస్వాముల బారి నుండి పేద రైతులకు రక్షణ కల్పించాడు.

భారతదేశంలో మొదటి ఫ్యాక్టరీ చట్టం 1881లో అమలు జరిపిన ఘనత రిప్పన్‌కు లభించింది. నాడు ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులు సరైన జీతం, విశ్రాంతి, నిర్ణీత పనిగంటలకు నోచుకోక దుర్భరజీవితం అనుభవించేవారు. పరిస్థితులను మెరుగుపరచడానికి రిప్పన్ ఫ్యాక్టరీ చట్టం చేసి పన్నెండేండ్ల వయసుకన్న తక్కువ వయసువారు వారికి అప్పగించరాదని, కార్మికులకు రోజుకు ఒక గంట విశ్రాంతి, నెలకు నాలుగురోజులు సెలవు దినాలుండాలని నిర్ణయించాడు. ప్రత్యేక అధికారులను నియమించి చట్టం ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించాడు. ఈ చట్టం ద్వారా రిప్పన్ తన మానవతావాదం నిరూపించాడు. తనకు ముందు రాజప్రతినిధిగా వ్యవహరించిన లిట్టన్ ప్రభువు కాలంలో రూపొందించిన జాతి వివక్షణ చూపే చట్టాలను రిప్పన్ తన విశాల హృదయంతో రద్దు చేశాడు. భారతీయ భాషల్లో వెలువడే పత్రికలపై అనేక నిబంధనలు విధిస్తూ పత్రికా స్వాతంత్ర్యం హరించి వేసే లిట్టన్ కాలపు దేశ భాషా పత్రికల చట్టం 1878ని రిప్పన్ రద్దు పరిచాడు. ఫలితంగా భారతీయులలో ఆయన పట్ల గౌరవం పెరిగింది. నాటి నుండి భారతీయ పత్రికలు పాతిక సంవత్సరాలు పూర్తి స్వేచ్ఛననుభవించాయి. లిట్టన్ కాలంలో రూపొందించబడిన ఆయుధాల చట్టం 1871కి సైతం రిప్పన్ సవరణలు సంకల్పించాడు.

లిట్టన్ కాలంలో బ్రిటిష్ పాలనా యంత్రాంగంలో యూరోపియనుల గుత్తాధిపత్యం కొనసాగించడానికి ఇండియన్ సివిల్ సర్వీసు పరీక్షకు హాజరయ్యే భారతీయుల వయోపరిమితిని 21 నుండి 19 సంవత్సరాలకు తగ్గిస్తూ, నిబంధనలు రూపొందించారు. భారతీయులకు సైతం ఉన్నతోద్యోగాలలో అత్యున్నత స్థానాల అవకాశం ఉండాలనే సదాశయంతో రిప్పన్ ఐసియస్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల వయోపరిమితి పెంచమని, ఆ పరీక్షలను ఇంగ్లాండ్‌తోపాటు, ఇండియాలో కూడా నిర్వహించాలని సిఫార్సు చేశాడు. కానీ ఇంగ్లాండ్‌లోని ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. విద్యావంతులైన భారతీయుల్లో ఈ చర్య తీవ్ర అసంతృప్తి రేపింది. కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రిచర్డ్ గర్త్ సెలవుపై వెళ్లగా ఆ ఖాళీలో భారతీయ న్యాయమూర్తి రమేష్ చందర్ మిట్టల్‌ను రిప్పన్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమించాడు. ఈ చర్యపట్ల కలకత్తాలోని యూరోపియన్‌లలో కలకలం రేగినా రిప్పన్ తన నిర్ణయం మార్చుకోలేదు. భారతీయులకు, బ్రిటిష్‌వారికి స్నేహసంబంధాలేర్పడితే అది బ్రిటిష్ సామ్రాజ్యానికి క్షేమమని గుర్తించాడు.

విద్యావంతులైన భారతీయుల అభీష్టం-వాంఛ గుర్తించి పాలనలో వారికి భాగస్వామ్యం కల్పించడం తన బాధ్యతగా భావించాడు. వారికి స్థానిక సంస్థల ద్వారా ప్రజాస్వామ్య విధానాలను అభ్యసింపదలచాడు. రిప్పన్ 1882లో ఆమోదించిన తీర్మానం ప్రకారం స్థానికపాలనకై నూతనంగా అనేక జిల్లా బోర్డులు, తాలుకా బోర్డులు ఏర్పాటు చేయడమైంది. మున్సిపాలిటీల అధికారాలు పెంచడమైంది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడం స్థానిక సంస్థల్లో అనధికార సభ్యుల సంఖ్యను 2/3 వంతుకు పెంచడం ద్వారా స్థానిక వ్యవహారాలు పాలన సాగాలని నిర్దేశించాడు. స్థానిక సంస్థలకు ఆర్థిక వనరులు సమకూర్చాలని ప్రాంతీయ ప్రభుత్వాలను ఆదేశించాడు. ఏ పాలనాంశాలను స్థానిక సంస్థలకు అప్పగించాలో గుర్తించాడు.

స్థానిక సంస్థల పాలనపై ప్రాంతీయ ప్రభుత్వాల జోక్యం ప్రభావం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. అధికారుల ప్రమేయం లేక పాలనలో కొద్ది పొరపాట్లు జరుగవచ్చని తెలిసినా, అచిరకాలంలో అనధికారులు ప్రజాస్వామ్య విధానంలో అనుభవం గడించి అవరోధాలను అధిగమించగలరని ఆశించాడు. ప్రభుత్వ, అజమాయిషీగాక ప్రభుత్వ సహకారం స్థానిక సంస్థలకు అవసరమని పేర్కొన్నాడు. ఎక్కడైనా స్థానిక సంస్థలు అధికార దుర్వినియోగానికి పాల్పడినా, పాలనపట్ల నిర్లక్ష్యం వహించినా ప్రాంతీయ ప్రభుత్వాలు వాటిని సస్పెండ్ చేయాలే గానీ, కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా వాటిని రద్దు చేయరాదని శాసించాడు. ఈ చర్యల ద్వారా రిప్పన్ ప్రభువు భారతదేశ చరిత్రలో 'స్థానిక సంస్థల పితామహుడు'గా కీర్తికెక్కాడు.

రిప్పన్ ప్రభువు కాలంలో 'ఇల్బర్టు బిల్లు' ప్రతిపాదన అత్యంత వివాదాంశంగా మారింది. రిప్పన్ కాలానికి అనేకమంది భారతీయ న్యాయమూర్తులు జిల్లా మెజిస్ట్రేటులుగా ఉన్నారు. కానీ భారతీయ నేరస్థులతో సమానంగా యూరోపియనులను విచారించే అధికారం 1873 నాటి క్రిమినల్ ప్రొసీజర్ కోడు ప్రకారం వారికి లేదు. న్యాయ విచారణలో ఈ జాతి విచక్షణ ఉండరాదని చట్టం ముందు అందరూ సమానులేనని రిప్పన్ భావించాడు. న్యాయ విచక్షతను తొలగిస్తూ భారతీయ న్యాయమూర్తులకు యూరోపియనులను విచారించే అధికారం ఇస్తూ తన కార్యనిర్వహణ మండలిలోని న్యాయశాఖ సభ్యుడు సి.పి.ఇల్బర్ట్‌చే ఒక బిల్లు ప్రతిపాదింపచేశాడు. రిప్పన్ చర్యలు యూరోపియన్‌లలో తీవ్ర అసంతృప్తి, అలజడి రేకెత్తించాయి.

యూరోపియన్‌ల ఆత్మగౌరవానికి 'ఇల్బర్ట్ బిల్లు గొడ్డలిపెట్టు' అని , రిప్పన్ విధానాలు తమ హక్కులు హరించేవిగా ఉన్నాయని యూరోపియన్లు రిప్పన్‌ను ప్రత్యక్షంగా పత్రికాముఖంగా విమర్శించారు. రిప్పన్‌ను సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. ఎంతో ఉదారవాదియైన గ్లాడ్‌స్టన్ కూడా ఇల్బర్ట్ బిల్లును విమర్శించారు. కలకత్తా, సిమ్లాలో యూరోపియన్

మహిళలు సైతం ఆయనను అవమానంగా దూషించారు. చివరకు భారతీయ జిల్లా జడ్జికోర్టుకు యూరోపియనుల కేసు విచారణకు వస్తే, వారిని విచారించడానికి జడ్జితో బాటు ఒక జ్యూరీ ఉండాలని ఆ జ్యూరీలో సగం మందికి తక్కువగాకుండా యూరోపియనులు ఉండాలని ఇల్బర్టు బిల్లును సవరించడమైంది. జాతి విచక్షణ రద్దుపరచడానికి రిప్పన్ ప్రభువు చేసిన ప్రయత్నం విఫలమైంది. ఈ వివాదం మూలంగా ఇంగ్లీషు వారు ప్రదర్శించిన జాతి వైషమ్యం, జాత్యహంకారం భారతీయుల్లో జాతీయోద్యమానికి స్ఫూర్తి కలిగించాయి.

పదవీ విరమణ చేసి 1884లో స్వదేశానికి మరలిన రిప్పన్ ప్రభువు పట్ల భారతీయులు చూపిన ఆదరాభిమానాలు మిన్నంటాయి. సిమ్లా నుండి బొంబాయి వరకు మార్గమధ్యం వెంట 70 మిలియన్లకుపైగా భారతీయులు ఆయనకు వీడ్కోలు పలికారు. 1915 సంవత్సరంలో కలకత్తాలో రిప్పన్ విగ్రహం నెలకొల్పదలిస్తే ఏ యూరోపియన్ కూడా ఒక్కరూపాయి కూడా విరాళం అందించకపోగా, భారతీయులే తమ స్వంత విరాళాలతో విగ్రహ ప్రతిష్టగావించి తమ అభిమానం చాటారు. చివరగా బొంబాయిలో మున్సిపల్ భవనం శంకుస్థాపన కార్యక్రమానికి రిప్పన్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, వేదిక వెండి బంగారు జ్ఞాపికలు, కుప్పలుగా పూలమాలలు, వేలాదిగా బ్యానర్లు, సన్మాన పత్రాలతో నిండిపోయింది. బొంబాయి నగరం సుందరంగా అలంకరించబడి, రిప్పన్ వెడుతున్న దారి వెంబడి వేలాది భారతీయులు ముకళితహస్తాలతో నిలబడి వీడ్కోలు పలికారు. వ్యాపారస్థులు ముత్యాలు, వజ్రాలు పొదిగిన దండలతో ఆయనను సత్కరించారు.

రిప్పన్ ప్రయాణిస్తున్న గుఱ్ఱపుబండి భులేశ్వర్, ముంబాదేవి దేవాలయాలకు సమీపంచగా అక్కడి బ్రాహ్మణులు రిప్పన్ ప్రభువుకు నొసట కుంకుమ దిద్ది, వెండిపళ్లేలలో నారికేళాలు సమర్పించి అక్షింతలతో ఆశీర్వదించారు. భారత దేశానికేతించిన మరెవరికీ లభించని గొప్ప గౌరవం రిప్పన్‌కు లభించింది.

స్థానిక సంస్థల ఏర్పాటు, వాటికి విధులు, నిధుల ఏర్పాటు, అధికారాల కేటాయింపు విషయాల్లో రిప్పన్ ప్రభువు మన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి మార్గదర్శకుడని పేర్కొనవచ్చు.

'గ్రామ స్వరాజ్యం' కలలు కన్న మహాత్మాగాంధీ, స్థానిక ప్రభుత్వాల ఏర్పాటుకు రాజ్యాంగం సవరించిన స్వర్గీయ రాజీవ్‌గాంధీల మాదిరిగానే, దేశ చరిత్రలో స్థానిక స్వపరిపాలన పితామహుడుగా రిప్పన్ ప్రభువు భారతజాతి మరువలేని మహామనిషి

**– టిసిపార్డ్**

## సామాజిక సంస్కరణల ఆద్యుడు మహాత్మా జ్యోతిరావుపూలే

**190వ జయంతి**



**భా**రతీయ సమాజంలోనున్న ఋగ్మతలను సంస్కరణల ద్వారా సంస్కరించుటకు పూనుకొన్న వాడు జ్యోతిబాపూలే సంఘంలో అవిద్యను రూపుమాపెందుకు, వితంతువుల సౌకర్యాల ఏర్పాటుకు, పేదరిక నిర్మూలనను కృషి చేయుటద్వారా మహాత్మాగా పేరుగాంచారు మహాత్మా జ్యోతిబా పూలే అని టిసిపార్డు జాయింట్ డైరెక్టర్ కె.యాదయ్యగౌడ్ అన్నారు. ఆయన టిసిపార్డునందు జరిగిన తెలంగాణ జ్యోతిబాపూలే సంస్మరణ సభ కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఆయన బడుగు బలహీనవర్గాలకు చదువు తప్పనిసరని, చదువుతోనే అన్ని రుగ్మతలు తొలగిపోతాయని, మహిళా విద్యా ప్రోత్సహించారని చెప్పారు. అదే విధంగా దేశంలోని అనాథలను, వితంతువులను ఉద్ధరించేందుకు తగిన ప్రోత్సహం ఇవ్వడానికి, సత్యశోధక్ సమాజ్ అనే సంస్థ స్థాపించి, దాని ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలను చేపట్టారు. స్త్రీ విద్యను ప్రోత్సహించేందుకు మొదటి బాలికల పాఠశాలలను స్థాపించి, సావిత్రి పూలేను ఆ దిశలో పనిచేసేందుకు ప్రోత్సహించారు. ఆ స్ఫూర్తితోనే వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించాలని సూచించాడు. నేడు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా వెనుకబడిన తరగతులకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిసిపార్డు విభాగ అధిపతులు, సిబ్బంది, తదితరులు పాల్గొని జ్యోతిబాపూలేకు ఘనంగా నివాళిని అర్పించారు.



# ఉపాధి హామీ చట్టం ఫలితాలు

**అ**నేక ఒడిదుడుకులు, ఆటంకాలు అధిగమిస్తూ దశాబ్దికాలాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం పూర్తిచేసుకున్నది. అనేక ప్రజాఉద్యమాలు, వ్యవసాయ కార్మికసంఘాలు, వామపక్షాలు చేసిన పోరాటాల ఫలితంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం 2005కు యుపిఎ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారత పార్లమెంట్ ఆమోదించింది. 2006 ఫిబ్రవరి 2న నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ అనంతపురం జిల్లా నార్పర మండలం, బండ్లవల్లి గ్రామంలో లాంఛనంగా ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం 90శాతం నిధులను ఇవ్వగా రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం మ్యాచింగ్ గ్రాంట్‌ను కల్పి దీనిని అమలుచేస్తున్నారు. ఈ పదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా 6576 బ్లాకులు/మండలాలకు ఉపాధి హామీ పనులు విస్తరించాయి. పన్నెండు కోట్ల కుటుంబాలకు ప్రతి సంవత్సరం 265 నుండి 270 కోట్ల పనిదినాలు లభిస్తున్నాయి. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ లెక్కల ప్రకారం ఈ పదేళ్ల కాలంలో రూ.3,13,844 కోట్లు ఈ పథకానికి ఖర్చు చేయగా దీనిలో 71 శాతం నిధులను కూలీల వేతనాల కింద చెల్లించబడినాయి. తెలంగాణ రాష్ట్రంలో 438 మండలాల్లో, 8826 గ్రామపంచాయితీల్లో, 21,508 ఆవాసాల్లో ఉపాధిచట్టం పనులు అమలవుతున్నాయి. 56.16 లక్షల కుటుంబాలు జాబ్‌కార్డులు కలిగివున్నాయి. 3,79,802 శ్రమశక్తి సంఘాల ద్వారా కోటీ 35 లక్షల మంది కూలీల ఉపాధిని పొందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,77,030 మంది మేట్లు, పదివేల మందికిపైగా ఫీల్డ్ అసిస్టెంట్లు దీనిని నిర్వహించుటలో కీలకపాత్రను పోషిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ 10 ఏళ్ల కాలంలో 17 వేల 111కోట్లు ఉపాధి పనులకు ఖర్చు చేయగా 11 వేల 703 కోట్లు వేతనాల కింద కూలీలకు చెల్లించారు. 25.3 శాతం దళితులు, 29.4 శాతం గిరిజనులు, 49.6 శాతం బిసిలు లబ్ధిపొందుతున్నారు. ఈ కాలంలో 39,21,945 మంది కూలీలు వందరోజుల పనిని పొందారు. కేటాయించిన నిధుల్లో 81.3 శాతం వేతనాలకు, 18.6 శాతం మెటీరియల్‌కు, ఇతర నిర్వహణలకు ఖర్చు చేశారు.

### చట్ట లక్ష్యం :

వ్యవసాయరంగంలో పనులు తగ్గిపోతున్న తరుణంలో వలసలు నివారించి ఉపాధి పనులు కల్పించడం చట్టం ప్రధాన లక్ష్యం. నాణ్యమైన శాశ్విత వనరులను, పేదల జీవనోపాధి వనరులను అభివృద్ధి చేయడం, గ్రామపంచాయతీరాజ్ వ్యవస్థలను పటిష్టపరచడం, చట్టం ఉద్దేశ్యం. ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల పని కల్పించడం, స్త్రీ, పురుషులకు సమాన వేతనం చెల్లించడం, యంత్రాలు, కాంట్రాక్టర్లు ఉపయోగించరాదు. గ్రామసభ, మండలం, జిల్లా పరిషత్‌లు ఆమోదించిన పనులను చేయడం రాజీలేని అంశాలుగా పేర్కొన్నది.

జాబ్‌కార్డు పొందడం, పనికోసం దరఖాస్తు చేసుకోవడం, పదిహేనురోజుల్లో పనిని ప్రభుత్వం చూపకుంటే నిరుద్యోగభృతిని పొందడం, చేసిన పనికి పదిహేనురోజుల్లో వేతనాలను పొందడం, పని ప్రదేశాలో నీడ, మంచినీరు, వైద్యం వంటి కనీస సౌకర్యాలను పొందడం ప్రతికూలి హక్కుగా చట్టం చెపుతుంది.

## సానుకూల అంశాలు :

ఉపాధి పనుల ద్వారా లబ్ధిపొందుతున్న వారిలో వ్యవసాయ కార్మికులే అత్యధికులుగా ఉన్నారు. భూమిలేని పేదలతోపాటు ఇతర కులాల్లో చిన్న, సన్నకారు రైతాంగం, వృత్తిదార్లు ఉన్నారు. దీనివలన కూలీల వేతనాలు పెరిగాయి. రైతువారి పనుల్లో కూలి బేరమాడే శక్తి పెరిగింది. దళితులు, ఆదివాసిల చేతల్లో ఉన్న అసైన్డ్‌మెంట్, బీడు భూములు లాంటివి వేలాది ఎకరాలు సాగులోకి వచ్చాయి. ఉపాధి హామీ ద్వారా చేపట్టే పనుల్లో 65 శాతంపైగా వ్యవసాయాభివృద్ధికి ఉపయోగపడే పనులుండటం వలన కూలీలు రైతులుగా మారారు. 2013-14లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన సర్వే ప్రకారం ఏడులక్షల ఎకరాల బీడు భూములు సాగులోకి వచ్చాయి. పేదవర్గాల ఆర్థికస్థితి, ఆత్మగౌరవం మెరుగుపడింది. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు అప్పుల కోసం భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, మైక్రోఫైనాన్స్‌ల వద్దకు వెళ్లడం తగ్గింది. పిల్లలను బడులకు పంపడం, మంచివైద్యం చేయించుకోవడానికి ఉపాధి పని ద్వారా వచ్చిన ఆదాయం తోడ్పాటునిచ్చింది.

## ఎదురవుతున్న ఆటంకాలు :

గ్రామసభల ద్వారా పనుల ఎంపిక, గ్రామ పంచాయితీ దరఖాస్తులు తీసుకోవడం, రశీదులు ఇవ్వడం, పనులు ఇవ్వడం జరగడం లేదు. ఫలితంగా నిరుద్యోగభృతి మాటే లేదు. తప్పుడు కొలతలతో కూలిపడకుండా అధికారులు తొక్కిపెడితున్నారు. ఉపాధి పనికిపోతే కూలిపడదు. చేసిన పనికి వేతనాలు రావు అనే భయాందోళనలకు కూలీలను గురిచేస్తున్నారు. 15 రోజుల్లో వేతనాల చెల్లింపు కేంద్రప్రభుత్వ లెక్కల ప్రకారమే 61.1 శాతం మంచి జరగడం లేదు. మిగిలిన బకాయిల చెల్లింపు 60 రోజుల నుండి 90 రోజులు పడుతుంది. సుప్రీంకోర్టు ఆధార్‌ను లింకు చేయవద్దని చెప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధార్‌కార్డు నెంబర్, బ్యాంకు అకౌంట్స్, ఉపాధి కార్డు నెంబరు లింకు వలన వేతన పేమెంట్స్ చెల్లింపులో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో స్మార్ట్‌కార్డు, పోస్టాఫీసు, బ్యాంకు అకౌంట్స్ అని తరుచూ మార్పులు చేయడం, థర్డ్‌పార్టీలతో పేమెంట్స్ చేయడం వలన జవాబుదారీతనం లోపించింది. సంవత్సరాలుగా చేసినపనికి వేతనాలు రాకపేదలు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది పనికోసం దరఖాస్తులిచ్చినా తీసుకోవడం లేదు. దరఖాస్తు తీసుకున్నదగ్గర పనిపెట్టడంలేదు. పనులు జరిగేదగ్గర పనిముట్లు, మంచినీరు, మెడికల్ కిట్టువంటి సౌకర్యాలు లేవు. పనికల్పనలో కులం, రాజకీయ పక్షపాతమే కీలకపాత్రను పోషిస్తున్నది. కాకతీయమిషన్ ద్వారా చెరువుల తవ్వకం లాంటి మెత్తటి పనులను యంత్రాలతో చేయిస్తూ గట్టిపనులను కూలీలతో చేయించడం వలన కూడా కూలీలకు గిట్టుబాటు వేతనం పడటం లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ నిధులను కేంద్ర నుండి తెచ్చుకోవడానికి ఎక్కువమంది పేదలకు పనులు చూపించడానికి ప్రణాళికలు రూపొందించాలి.

ఉపాధి పనుల వలన వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదు. కూలిరేట్లు పెరగడం వల్లనే వ్యవసాయ ఖర్చు పెరిగి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని భూస్వామ్య, పెత్తందార్లు దుష్ప్రచారం చేస్తున్నారు. ఉపాధిని వ్యవసాయానికి అనుసంధానం చేయాలంటున్నారు. దీనికి పాలకవర్గాలు కూడా ప్రత్యక్షంగానే వత్తాసు పలుకుతున్నాయి. వాస్తవానికి వ్యవసాయపనులు సీజన్‌లో తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా ఉపాధి పనులు జరగటం లేదు. ప్రభుత్వం క్యాలెండర్ ప్రకారమే ఏప్రిల్ నెలలో ఉపాధి పనులను ప్రారంభిస్తుంది. రైతులకు గిట్టుబాటు ధరను బ్యాంకు రుణాలు, సబ్సిడీలను కల్పించడం రుణమాఫీని చేయడంలో పాలకులు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఈ వాదనలకు ఊతం ఇస్తున్నారు. గ్రామసీమల్లో అట్టడుగు వర్గాలపై తమపట్టు సడలటాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఉపాధి అవినీతిలో తమ పేర్లు సామాజిక తనిఖీల్లో బయటపడుతుండటంతో దిక్కుతోచనిస్థితిలో ఉపాధి హామీని బలహీనపర్చాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

## పథకం ప్రకారమే చట్టం :

కేంద్రంలో అధికారం చేపట్టిన వెంటనే బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే చర్యలకు పునుకున్నది. ఉపాధికి బడ్జెట్ నిధులను రెట్టింపు చేయాల్సిందిపోయి భారీగా కుదించింది. రోజు కూలీ రూ.100 ఉన్నప్పుడు 40 వేల కోట్లు కేటాయిస్తే కూలి రేటును రూ.189 పెంచి 20-4-15 బడ్జెట్‌లో 33 వేల కోట్లకు తగ్గించారు. పెరిగిన కూలీకనుగుణంగా నిధులు పెరగలేదు. కేటాయించిన నిధుల్లో 24 వేల కోట్లు దారి మళ్లించారు. ఫలితంగా రోజు వేతనంతోపాటు పొందేపనిదినాలు దేశవ్యాప్తంగా తగ్గిపోయాయి. 2012-13లో 220 కోట్ల పనిదినాలు కల్పిస్తే 2014-15లో 146కు పడిపోయాయి. 100 రోజులు పని పొందిన కుటుంబాలు సగటున గతంలో 52 లక్షలుంటే నేడు 16 లక్షలు మాత్రమే. తెలంగాణలో 2015-16లో సగటున 43.04 శాతం మందికి మాత్రమే పని ఇవ్వగా కనీస కూలి రాష్ట్రంలో రూ.101 దాటలేదు. మరోవైపు బిజెపి ప్రభుత్వం మనుషులకు పని తగ్గించి యంత్రాలకు కాంట్రాక్టర్లకు పని అప్పగించడానికి 40 శాతంగా ఉన్న మెటీరియల్ ఖర్చును 49 శాతానికి పెంచింది. పనుల ఎంపికను జిల్లా పరిషత్ 60 శాతం అప్పగించింది. ఉపాధి పనులు అమలవుతున్న మండలాలను దేశవ్యాప్తంగా కుదించాలని పావులు కదుపుతుంది. దీనికి దేశవ్యాప్తంగా నిరసనలు ఎదురైనాయి. అయినా ప్రమాదంపోలేదు. 2016-17 బడ్జెట్‌లో 38,420 వేల కోట్లు కేటాయించి గ్రామీణ ప్రాంతాల్లో అమలైయ్యే అభివృద్ధి పనులు స్వచ్ఛభారత్ గ్రామరోడ్ల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం,ఇందిరమ్మ ఇళ్లనిర్మాణం వంటివాటితోపాటు సంక్షేమపథకాలన్నింటిని ఉపాధి ద్వారానే చేయబోతున్నట్టు ప్రకటించారు. దీనివలన సంక్షేమ ఉపాధి రెండూ దెబ్బతింటాయి. కాంట్రాక్టర్ల పెత్తనం పెరుగుతుంది. ఉపాధిహామీ చట్టాన్ని రక్షించుకోవడానికి రానున్న కాలంలో ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావడం తప్ప మరో మార్గం లేదు. రాష్ట్రవ్యాప్తంగా కరువుని ప్రకటించి ఉపాధి పనులు 200 రోజులకు పెంచాలి. మేట్ల పారితోషకం రూ.3 నుండి 6కు పెంచాలి. గుర్తింపు కార్డుల ఇవ్వాలి. పని ప్రదేశంలో టెంట్, మెడికల్ కిట్, మంచినీరు వంటి సౌకర్యాలు కల్పించాలి.

– బి.ప్రసాద్ (సీనియర్ జర్నలిస్టు)



# మానవీయ మదర్‌కు సెయింట్ హోదా

'హృదయశుద్ధిగలవారు దేవుడ్ని చూసెదరు' అన్న మాటల్ని ఆమె అక్షరాల నిజం చేసింది. 'జీవితం స్వల్పమైనది. అంతలోనే కనిపించి, అంతలోనే మాయమైపోయే అడివిగడ్డిపువ్వులాంటిది. ఈ స్వల్పమైన జీవితం మనకోసంకాక, ఇతరుల కోసం జీవించడం ప్రతిఒక్కరు అలవర్చుకోవాలి. ఎవరో ప్రేమించలేదని, పరీక్షలో ఫెయిల్ అయ్యామని, జీవితంలో ఓడిపోయామని వ్యథలో తను చాలించుకుంటున్న వారలారా ! ఒక్కక్షణం ఆగండి. దేహంలో అవయవాలు సరిగ్గా లేకపోయినా, అందవిహీనంగా వున్నా ఇంకా బతకాలనే ఆఆరాటంతో వీధుల్లో పడి బిక్షం అడుక్కుంటూ, జీవిస్తూ, హాయిగా బతుకుతున్న వీరే మీకు ఆదర్శం కాదంటారా ? జీవితం ఒక అవకాశం దాన్ని ఒక గొప్పలక్ష్యం కోసం వినియోగించు, జీవితం అందమైనది దాన్ని ఒప్పుకో. జీవితం ఒక కల దాన్ని నిజం చేసుకో, జీవితం ఒక వృత్తి దాన్ని పూర్తిచేయి, జీవితం ఒక ఆట సంపూర్ణంగా ఆడు, జీవితం ఒక ప్రమాణం దాన్ని నెరవేర్చు, జీవితం దు:ఖమయం అయినా దాన్ని జయించు, జీవితం ఒక పాట దాన్ని మనసారా పాడు, జీవితం ఒక పోరాటం దాన్ని అంగీకరించు, జీవితం ఒక విషాధం దాన్ని అధిగమించు, జీవితం ఒక సాహసం ధైర్యంగా దాన్ని ఎదుర్కో జీవితం ఒక అదృష్టం దాన్ని వరించుకో, జీవితం అమూల్యమైనది దాన్ని పాడుచేసుకోకు, జీవితమే ఒక జీవనం దానికోసం నిరంతరం పోరాడు' అంటూ నిర్భాగ్యుల జీవితంలో వెలుగును నింపేందుకు దేశంకాని దేశానికి వచ్చి, చనిపోయేంత వరకూ తన మాటల్ని నెరవేర్చుకుని, నేటికి అనేకుల మనసును దోచుకుంటున్న ప్రేమమూర్తి, అమృతవాణి మదర్‌థెరెసా. ఈమె సేవలకు నోబెల్ బహుమతి లభించడమేకాదు, వాటికన్ సిటీలో ఇటీవల సెయింట్ ఫ్రాన్సెస్ 'సెప్టెంబర్ 4వ తేదీ నుంచి మదర్‌థెరిసా ఇక నుంచి సెయింట్‌హుడ్ (పునీతహోదా)గా పిలవబడతారు' అంటూ దానికి సంబంధించిన పత్రాలపై ఆయన సంతకం చేశారు. సెప్టెంబర్ 5వ తేదీన ఆమె వర్ధంతి సందర్భంగా 4వ తేదీ నుంచి ఆమె సెయింట్‌గా పిలవబడతారు. ఈ సందర్భంగా మదర్‌చేసిన సేవల్ని ఓసారి గుర్తుకుచేసుకుందాం.

**లేతవయసులో భారమైన సేవ :**

మదర్‌థెరెసా 1910 ఆగస్టు 26వ తేదీన అల్బేనియాలోని స్కోప్‌జీ (ప్రస్తుతం ఇది మెసడోనియా రాజధానిలో ఉంది)లో జన్మించారు. మదర్ ఎనిమిది సంవత్సరాల వయసులోనే తండ్రిని కోల్పోయారు. దీంతో ఆమె తల్లి రోమన్‌క్యాథలిక్ విధానంలో మదర్‌ను పెంచారు. కొంతమంది మిషనరీలు బెంగాల్‌లో పనిచేస్తున్న విషయాన్ని థెరెసా తన చర్చిలోని పాస్టర్ల కథల ద్వారా విని, ఆమె నన్‌గా మారి, తన 18వ సంవత్సరంలో మిషనరీగా భారతదేశానికి వచ్చారు. ఇలా వచ్చిన థెరెసా మళ్లీ తన తల్లిని చూడలేకపోయారు. ఆరంభంలో థెరెసా కోల్‌కతాలోని ఒక కాన్వెంట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేశారు. ఇదే సమయంలో ఆమె తనచుట్టూ పేదరికంలో మగ్గుతున్న ప్రజల్ని గమనించేవారు. 1943వ సంవత్సరంలో కోల్‌కతాలో కరువు తాండవమాడినప్పుడు ఆ పరిస్థితులను చూసిన థెరెసా చలించిపోయారు. అంతే ఆమెలో సేవాభావం ఒక కెరటంలా మనసులో ఎగిసిపడింది. ఇదే సమయంలో ఆమె ఒకసారి కోల్‌కతా నుంచి డార్జిలింగ్‌కు రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు ప్రభువు మాట్లాడసాగాడు.



## అంతులేని సేవాకార్యక్రమాలు :

మదర్‌థెరెసా 1948వ సంవత్సరం నుంచి మిషనరీ పనిలో నిమగ్నమయ్యారు. మొదట కేవలం కొద్దికాలం నివాసం ఉండేందుకు భారత పౌరసత్వాన్ని స్వీకరించారు. పేదల్లో నిరుపేదల్ని ఆమె ఎంపిక చేసుకుని, వారి పోషణభారాన్ని స్వీకరించారు. ఇలా వీరికి సేవ చేయడం ఆరంభించారు. అతికొద్దికాలంలోనే ఈమె సేవా కార్యక్రమాలు మనదేశంలో ఉన్నతాధికారుల దృష్టిని ఆకర్షించాయి. దీంతో మనదేశం ఆమెను భారతీయ మహిళగా భావించి, శాశ్వత పౌరసత్వాన్ని ఇచ్చింది. పేదల్ని పోషించేందుకు థెరెసా ఆరంభదినాల్లో ఆహారాన్ని, ఇతర వస్తువుల్ని దాతల నుంచి అడుక్కోవాల్సి వచ్చేదని ఆమె తన డైరీలో రాసుకున్నారు. దీంతో థెరెసా 'ఇది దేవుడు నాకిచ్చిన సేవకాదు. ఒకవేళ దేవుడే ఈ పరిచర్యను నాకు ఇస్తే, ఇతరులను అడుక్కునే పరిస్థితికి వచ్చేదాన్ని కాదు' అనుకుని ఆ సేవకు గడ్‌బై చెప్పాలనుకున్నారు. కానీ దేవుడు నన్ను విడిచి పెట్టలేదు. నేను వెనక్కి వెళ్లాలనుకున్నాను. ఆ వైఫల్యమే దేవుడు నాకు విజయంగా మార్చాడు. ప్రభువుపై ఆధారపడే అనుభవాన్ని నాకు ఇచ్చాడు అంటారామే. 1950వ సంవత్సరం అక్టోబరు 7న కేవలం 13 మందితో ఆరంభమైన మదర్‌సేవ, నేటికి నాలుగువేలమందికి పైగా సిస్టర్లు అనాథల సేవలో తరిస్తున్నారంటే ఈ సంఖ్య ఎంతో ఊహించవచ్చు.

## ఉక్కిరిబిక్కిరి చేసిన కష్టాల్లో సైతం :

'నిర్మలమైన మనసు స్వేచ్ఛా మనసే, శాంతి ఒక చిరునవ్వుకు చిహ్నం' అంటూ తన డైరీలో రాసుకున్న థెరెసా ఆ శాంతి కోసం చనిపోయేంత వరకూ పోరాడారు. అనాథలకు ఆమె ఒక దేవత, తాగుబోతులకు ఆమె చేయి ఓ వెచ్చటి అప్యాయత స్పర్శ. కోల్‌కతాలో మదర్ సేవను అపార్థం చేసుకున్న ఒక తెగ ప్రజలు ఈమె మన సంస్కృతిని పాడుచేస్తున్నదని ఒక గూండాను మదర్‌పై దాడిచేసేందుకు పంపించారు. ఆమెపై దాడిచేసేందుకు మదర్ ఉన్న ఆశ్రమం తలుపువద్దకు వచ్చిన ఆ గూండా ఆ సమయంలో మదర్ తప్పతాగిన ఒక వ్యక్తి వాంతి చేసుకుంటుండగా,ఆమె తన చేతులతో ఆ వాంతిని పట్టుకుని శుభ్రం చేస్తున్న దృశ్యాన్ని చూసి చలించిపోయాడు. ఒక అద్వితీయశక్తిని చూసి పరిగెత్తుకుంటూ వెళ్లి కాళ్లపై పడి క్షమించమని అడిగాడు.

## ఆధ్యాత్మక చింతలో ఉదయించిన సేవ :

మదర్‌సేవకు రాకముందు ఆమెకు ప్రభువుపై విపరీతమైన భక్తి ఉండేది. ఆ భక్తే ఆమెను సేవ వైపుకు నడిపించింది. అందుకు ఆమె తన డైరీలో రాసుకున్న అంశాల్ని పరిశీలిస్తే తెలుస్తుంది. 'నువ్వెప్పుడు మౌనంగా ఉ ంటావో అప్పుడే దేవుడు నీతో మాట్లాడతాడు. దేవుడెప్పుడు నీతో మాట్లాడతాడో వెంటనే ఆయన చెప్పిన పని నీవు చేస్తావు' అనే మాటను థెరెసా జ్ఞాపకం చేసుకుంటూ ఉంటారు. 'నేను మిమ్మల్ని ప్రేమించినట్లే మీరు ఒకరినొకరు ప్రేమించుకోండి' అని చెప్పిన యేసు మాటకు ఆమె ఎప్పుడూ అవిధేయురాలిగా ప్రవర్తించలేదు. 'నిన్ను నీవే ప్రశ్నించుకో, ఆయనెంతగా నిన్ను ప్రేమించాడో, ఎప్పుడైతే నీవు ఈ విధంగా ప్రశ్నించుకుంటావో, వెంటనే నేనెంతగా ఇతరులను ప్రేమిస్తున్నాను అనే సందేహం నీలో ఉదయిస్తుంది' అంటారు మదర్‌థెరెసా.

## నన్ నుంచి సామాజికవేత్తగా ఎదిగిన థెరెసా :

చాలామంది మదర్‌థెరెసా అనగానే ఆమెను ఒక సామాజిక సేవకురాలిగా మాత్రమే చూస్తారు. ఇది నాణానికి ఒకవైపు మాత్రమే. రెండవవైపు ఆమె పూర్తిగా ప్రభువుకు విధేయురాలైన శిష్యురాలు. మదర్‌థెరెసా యేసుక్రీస్తును ప్రేమించకపోయి ఉంటే ఆమె 'నన్'గా మారి ఉండేవారు కారు. నన్‌గా మారిన ఆమె మొదట మిషనరీ తరఫున భారతదేశానికి వచ్చారు. సామాజిక సేవ కోసం ఈ దేశానికి రాలేదు కానీ, ఆధ్యాత్మిక చింతనతో నిండినభావంతో వచ్చారు. కోల్‌కతాలోని మురికివాడల్లో నిరుపేదలు, ఏ ఆదరణ లేక బాధపడుతున్నవారిని ప్రత్యక్షంగా చూసిన థెరెసా చలించిపోయారు. తిరిగి ఆమె తన స్వదేశానికి వెళ్లిపోయారు. కానీ భారత్‌లో ఆమె చూసిన దృశ్యాలు వెంటాడు జ్ఞాపకాలుగా ఆమెను నిలువనివ్వలేదు. ఇదే సమయంలో ప్రభువు ఆమెతో ప్రత్యక్షంగా మాట్లాడారు. అందరు ఆడపిల్లల్లా ఉద్యోగం, వివాహం, పిల్లలు వంటి ఆలోచనలతో థెరెసా ఉందని భావించిన ఆమె తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి చేయాలనుకున్నారు. కానీ థెరెసా వీటిని సున్నితంగా తిరస్కరించి, మళ్లీ మిషనరీ తరఫున కోల్‌కతాకు వచ్చారు.

1955లో మదర్ అనాథ పిల్లల కోసం 'నిర్మల్ శిశుభవన్'ను ఆరంభించారు. 1960లో కుష్టురోగులకు సంబంధించిన ఆసుపత్రులను ప్రారంభించారు. ఇదే సమయంలో వెనిజులాలో 1965వ సంవత్సరంలో ఐదుగురి సిస్టర్ల సాయంతో ప్రారంభించారు. రోమ్, టాంజానియా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఆమె అనాథాశ్రయాలను నిర్మించారు. థెరెసా గొప్ప గొప్ప ప్రసంగాలతో, ఆవేశంతో, అందరిని ఆకట్టుకునేలా ఎప్పుడూ ప్రవర్తించేవారుకాదు. నేడు ఆమె మనమధ్య లేకపోయినా ఆమె వదిలి వెళ్లిన సేవ కొనసాగుతూనే ఉంది. అదెంత నాణ్యతగా సాగుతుందో మనకు తెలియదు కానీ, ఆమె మనకు చూపినబాటలో పయనించేందుకు కష్టమైనది మాత్రం కాదు. సెప్టెంబర్ 4వ తేదీ నుంచి ఆమె సెయింట్ మదర్‌గా పిలవబడేందుకు దీనివెనుక ఆమె కృషి, శ్రమ ఎంతని అడిగితే ఒక జీవితకాలం.

**పి.వాణిపుష్ప**
**(సీనియర్ జర్నలిస్టు)**

# వేసవిలో కూరగాయలను పురుగుల నుండి రక్షించడం ఎలా

ప్రపంచ కూరగాయల ఉత్పత్తిలో మనదేశం ద్వితీయ స్థానంలో ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే మనదేశంలో సంవత్సరం పొడవునా కూరగాయలను పండించడానికి కావాలసిన వాతావరణ పరిస్థితులు అనుకూలంగా వున్నాయి. వర్షాకాలం మరియు శీతాకాలంలో కూరగాయలసాగును, వేసవిలో కూరగాయల సాగుతో పోల్చినట్టయితే వేసవిలో పెరిగే ఉష్ణోగ్రతలు, పొడివాతావరణం వలన పూత, పిందె సరిగా నిలవక, చీడపీడల బెడద ఎక్కువగా వుండటం వలన దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. దీనివల్ల మార్కెట్‌లో గిరాకిపెరిగి వినియోగదార్లకు కూరగాయల ధరలు ఆకాశాన్నంటినట్లనిపిస్తాయి. కాని రైతులు ఈ అవకాశాన్ని దృష్టిలో వుంచుకొని కొన్ని మెళకువలు పాటించినట్టయితే, నాణ్యమైన పంటను తీయడమే కాకుండా, మంచి లాభాలు కూడా గడించగలరు.

వేసవి కాలంలో పండించే కూరగాయలలో ముఖ్యమైనవి టమాట, వంగ, బెండ, మిరప, గోరు చిక్కుడు, తీగజాతి కూరగాయలైనటువంటి సొర, బీర, పొట్ల, కాకర, దొండ మరియు ఆకుకూరలైనటువంటి తోటకూర, గోంగూర వంటివి.

అధిక ఉష్ణోగ్రత వల్ల ఈ పంటలన్నింటిలోను చీడపీడల బెడద ఎక్కువగా వుంటుంది. కనుక వీటిని నివారించడానికి సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. దీనిలో భాగంగా రైతులు ఆరోగ్యవంతమైన నారును పెంచుకోవాలి. పొలంలోని పంటలలో వున్న మిత్ర పురుగులను సంరక్షించుకోవాలి. కూరగాయలలో సమగ్ర సస్యరక్షణకు పాటించవలసిన వివిధ పద్ధతుల గురించి మొదట తెలుసుకుందాం.



### సేద్యపద్ధతులు

అంటే వేసవిలో లోతుగా దున్నడం వల్ల నిద్రావస్థలో వున్న పురుగులు, శిలీంద్రాలు బయటపడి సూర్యరశ్మికి, వేడికి నాశనమవుతాయి. అంతేగాక పిట్టలు పురుగులను ఏరుకొని తింటాయి.

- పంటమార్పిడిని పాటించాలి. ముఖ్యంగా ధాన్యపు జాతి పంటలతో పంట మార్పిడి చేయాలి
- పురుగులను/తెగుళ్లను తట్టుకునే పంట రకాలను ఎన్నుకోవాలి.
- విత్తనంతోపాటు సంక్రమించే పురుగులు కానీ, తెగుళ్లుకాని రాకుండా విత్తనశుద్ధి చేయాలి.
- ఎరపంటగా ఆముదం, బంతి మొక్కలను వేసుకోవాలి.

### యాంత్రిక పద్ధతులు

- పంట మరియు ఎర పంటలపై వున్న గుడ్ల సముదాయాన్ని ఏరి నాశనం చేయాలి
- ఎదిగిన గొంగళి పురుగులను, అవి ఆశించిన భాగాలను ఏరి నాశనం చేయాలి
- కోత సమయంలో పురుగులు ఆశించిన మొక్కల భాగాలను ఏరి నాశనం చేయాలి.
- లింగాకర్షక బుట్టలు, దీపపు ఎరలను వాడి పురుగుల ఉనికిని గమనించాలి.
- వైరస్ సోకిన మొక్కలను గుర్తించి వెంటనే నాశనం చేయాలి.

### జీవ సంబంధిత ప్రక్రియలు

- మిత్ర పురుగులైన అక్షింత పురుగులు, సాలె పురుగులు, కందిరీగలు, అల్లిక రెక్కల పురుగుల సంఖ్యను పెంపొందించుకోవాలి.
- పంట నాటిన 40 రోజుల నుండి కాయ తొలుచు పురుగుల గుడ్లపై ట్రైకోగ్రమ్మ బదనికలను 10 రోజుల వ్యవధిలో 45 సార్లు విడుదల చేయాలి.
- కాయ తొలుచు పురుగులు ముఖ్యంగా శనగపచ్చ పురుగు మరియు పొగాకు లద్దె పురుగులు చిన్న దశలో వున్నప్పుడు ఎన్‌పివి ద్రావణం 250 ఎల్ఇ, రాబిన్ బ్లూతోను, కొంచెం బెల్లంతో కలిపి సాయంకాలం పిచికారి చేయాలి.
- బ్యాక్టీరియా సంబంధమైన మందులు (బిటి, హాల్ట్) 1 గ్రా/ 1 లీటరు చొప్పున వాడాలి.
- వృక్ష సంబంధిత రసాయనాలైన వేపనూనె 5 మి.లీ ఒక లీటరు నీటికి చొప్పున లేదా వేపగింజల కషాయం (ఒక లీటరు నీటిలో 50 గ్రా. వేపగింజల పొడిని కలిపి) 10 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. ఈ వేప మందుల వలన పురుగులు గుడ్లు పెట్టడానికి వెనకాడుతాయి. గుడ్లు పొదగవు. పిల్ల పురుగులు పెరగవు.

### వేసవిలో కూరగాయల సాగులో ముఖ్యమైన అంశం - నారుమళ్లలో సస్యరక్షణ

- నారుమడిలో ఎక్కువగా రసం పీల్చే పురుగులు ఆశిస్తాయి కాబట్టి ఇమిడాక్లోప్రిడ్ మందును 5 గ్రా/ ఒక కేజి విత్తనానికి పట్టించి విత్తనశుద్ధి చేయాలి. మరియు నైలాన్ తెరను కప్పి వుంచాలి.
- నారుమడి విత్తిన తరువాత 15 రోజులకు చదుపు నారుమడికి 100 గ్రా. చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలను వేయాలి.

- నారుతీసే 5 రోజుల ముందుగా పంటపై ఒక కీటక నాశిని+ఒక శిలీంద్రనాశినిని కలిపి పిచికారి చేయాలి.

**ఇక పంటల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు చూద్దాం**

**బెండ :**

- ముఖ్యంగా చిన్నదశలో రసం పీల్చే పురుగులు, తరువాత కాయ తొలుచు పురుగులు ఆశించి నష్టం చేస్తాయి.
- దీనిలో పంటమార్పిడి అవలంబించాలి. పంట చుట్టూ జొన్న లేదా మొక్కజొన్న రక్షక పంటగా వేయాలి.



- పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూడాలి.
- ఇమిడాక్లోప్రిడ్ లేదా థయోమీతోక్సామ్ 5 గ్రా/కిలో చొప్పున విత్తనశుద్ధి చేయాలి.
- కాయతొలుచు పురుగుల ఉనికిని గమనించడానికి లింగాకర్షక బుట్టలు ఎకరానికి 4 చొప్పున వుంచాలి.
- తెల్లదోమ ఉనికిని గుర్తించడానికి పసుపు రంగు డబ్బాలను 10 చొప్పున పెట్టాలి.
- కొమ్మ మరియు కాయతొలుచు పురుగులు ఆశించిన కొమ్మలను, కాయలను త్రుంచి నాశనం చేయాలి. తరువాత థయోడికార్బ్ 1 గ్రా. కాని, ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా కొరాజిన్ 0.3 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- రసం పీల్చే పురుగులు అంటే పేను బంక, తెల్లదోమ, పచ్చదోమ అంతర్వాహిక పురుగుమందులైన డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఫిప్రానిల్ 2 మి.లీ లేదా థయోమీథాక్సిమ్ 0.3 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- ఎర్రనల్లి ఉధృతి వేసవిలో ఎక్కువగా వుంటుంది. ఇవి ఆశించినప్పుడు నీటిలో కరిగే గంధకము 3 గ్రా. లేదా ప్రోపార్గైట్ 3 మి.లీ. లేదా వర్టీమోకా 0.3 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**వంగలో సమగ్ర సస్యరక్షణ :**

- అంతరపంటలుగా బంతి, ఉల్లి, వెల్లుల్లి పంటలను వేసుకోవాలి.
- పంట తొలిదశలో ఆశించే తలనత్త వున్న కొమ్మలను తుంచి నాశనం చేసిన తరువాత కార్బరిల్ 3 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లీటరు నీటిలో కలిపి వేపపిండిని వేయాలి.
- ఎకరానికి 200 కిలోల వేపపండిని వేయాలి.
- రసం పీల్చే పురుగులను సకాలంలో నివారించుకోకపోతే వెర్రితెగులనే వైరస్ తెగుళ్ళు వ్యాపించే ప్రమాదముంది. కనుక వీటికి అంతర్వాహిక మందులైన డైమిథోయేట్ 2 మి.లీ కాని ఇమిడాక్రోప్రిడ్ 0.3 మి.లీ/లీటరు నీటికి వాడి అదుపు చేయవచ్చును.



- కాయతొలుచు పురుగులు ఆశించిన కాయలను తీసివేసి కార్బరిల్ 3 గ్రా. కారి, ప్రొఫెనోఫాస్ 2 మి.లీ కాని పిచికారి చేసుకోవాలి. వీటి ఉనికిని తెలుసుకోవడానికి లింగాకర్షణ బుట్టలను ఎకరానికి 4 చొప్పున వాడాలి. ఉధృతి ఎక్కువగా వున్నప్పుడు స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా కొరాజిన్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**టమాట :**

- పంటలో ధాన్యపు పంటతోగాని బీన్స్‌తోగాని పంటమార్పిడి చేసుకోవాలి.
- పాక్షికంగా నీడనిచ్చే ఆకుపచ్చ లేదా నల్లని వలను వేసి ఎండవేడిని తగ్గించాలి.



- జొన్న కాని మొక్కజొన్న కాని ఉత్తర, దక్షిణ దిశలో ప్రతి రెండు వరుసలకి ఒకటి చొప్పున వేసుకోవాలి.
- పొలం చుట్టూ జొన్న లేదా సజ్జ పంటను వేయడం వల్ల మిత్ర పురుగుల సంఖ్య పెరుగుతుంది.
- అంతేగాక 16 వరుసల టమాటాకు 1 బంతి నిష్పత్తిలో నాటుకున్నట్లయితే కాయ తొలుచు పురుగులకు ఎర పంటగా ఉపయోగపడుతుంది. 40 రోజుల బంతినారు 25 రోజుల టమాట నారును పొలంలో నాటాలి.
- అక్కడక్కడ ఆముదం మొక్కలు వేయాలి.
- ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలు పెట్టాలి.
- కాయతొలుచు పురుగు చిన్నదశలో ఎన్‌పివి ద్రావణాన్ని సాయంత్రం పిచికారి చేయాలి. వీటి ఉధృతి ఎక్కువైతే ఎమామేక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా లేదా కొరాజిన్ 0.3 మి.లీ. చొప్పున లీటరుకు కలిపి పిచికారి చేయాలి.
- రబ్బరు పురుగు తీవ్రస్థాయికి చేరినప్పుడు విషపు ఎరను వాడాలి.
- విషపు ఎర తయారీకి 8కి, తవుడికి 1 కి. బెల్లం మరియు 1 లీ. క్లోరోపైరీఫేస్ 8 లీ. నీటి కలిపి ఉండలుగా చేసి సాయంత్రం వేళలో పొలంలో అక్కడక్కడా వుంచాలి.

**మిరప :**

- మిరపలో ముఖ్యంగా ఆశించే పురుగులు తామర పురుగులు, తెల్లనల్లి మరియు కాయతొలుచు పురుగులు, ఇమిడాక్లొప్రిడ్‌తో 8 గ్రా. చొప్పున విత్తనశుద్ధి చేయాలి.



- తామరపురుగుల వల్ల వచ్చే పై ముడతకి పిఫ్రోనిల్ 2 మి.లీ. లేదా 2 మి.లీ కాని లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- తెల్లనల్లి వల్ల కలిగే క్రింది ముడతకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. కాని ప్రొపార్గెట్‌గా 2.5 మి.లీ గాని లేదా క్లోరోఫెనోపిర్ 10 శాతం ఎన్.సి మి.లీ.గాని అబామెక్టిన్ 0.4 మి.లీ/ లీటరు నీటికి కలిపి వాడాలి.
- పైముడత మరియు కింద ముడత రెండు కనిపిస్తే కార్బరిల్, ఎసిఫేట్ వంటి మందులు మరియు సింథెటిక్ పైరిత్రోయిడ్స్ వాడకూడదు.



**గోరుచిక్కుడులో సస్యరక్షణ :**

- ఎకరానికి 100 కిలోలు చొప్పున వేపపిండి వేయాలి.
- ఇమిడాక్లోప్రిడ్‌తో 5 గ్రా. చొప్పున విత్తనశుద్ధి చేయాలి.
- వేప గింజల కషాయం 4 శాతం 10 రోజులకు ఒకసారి పూత వచ్చేంత వరకు పిచికారి చేయాలి.
- ఎకరానికి 10 చొప్పున పక్షి స్థావరాలను ఏర్పాటు చేసినట్లయితే పిల్ల పురుగులను నివారణ చేయవచ్చును.
- వేసవిలో మంచి దిగుబడులనిచ్చే రకాలైన పూసా నవబహార్ మరియు గౌరి రకాలను వేసుకోవాలి.

**తీగజాతి కూరగాయలలో సస్యరక్షణ :**

- వరితో పంటమార్పిడి చేయాలి
- ఇమిడాక్లోప్రిడ్ 5 గ్రా/కిలో విత్తనశుద్ధి చేయాలి
- కాయతొలుచు ఈగలను ఆకర్షింపచేయడానికి 20 మి.లీ. మలీథియాన్ + 500 మి.లీ. తాటికల్లుతోపాటు 2 లీ నీరు కలిపి ద్రావణాన్ని మట్టి ప్రమిదలో అక్కడక్కడా వుంచాలి.
- తొలిదశలో ఆశించే గుమ్మడి పెంకు పురుగుల నివారణకు కార్బరిల్ 3 గ్రా. లేదా క్లోరోపైరిఫాస్ 2 మి.లీ. లేదా మలాథియాన్ 2 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పూత, పిందె దశలో 10 రోజుల వ్యవధిలో కార్బరిల్ 3 గ్రా. లేదా ప్రొఫెన్‌ఫాస్ 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేసి కాయతొలుచు ఈగలను నివారించవచ్చు.
- తీగజాతి కూరగాయలపై ఎక్కువగా ఆశించే పాము పొడ పురుగును నివారించడానికి, పురుగు ఎక్కువగా ఆశించిన ఆకులను తీసివేసి, ఒక లీటరు నీటికి 2 మి.లీ. హోస్టిథియాన్ 10 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.
- పసుపురంగు డబ్బాలను 10 చొప్పున పెట్టాలి.
- తీగజాతి యాజమాన్య పద్ధతులు పాటించి, సకాలంలో సరైన సస్యరక్షణ చర్యలను చేపట్టినట్టయితే వేసవిలో కూడా నవ నవలాడే తాజా కూరగాయలను రైతన్నలు పండించగలరు.

**డాక్టర్ వి.అనిత,** శాస్త్రవేత్త ఎన్.జి.ఆర్.ఎ.యు., రాజేంద్రనగర్,
**డాక్టర్ కె.శిరీష,** శాస్త్రవేత్త, కూరగాయల విభాగం,
వైయస్ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయం



# స్థానిక ప్రభుత్వాలలో మహిళల ప్రాతినిధ్యం

73వ రాజ్యాంగ సవరణ తదనంతర కాలంలో పంచాయితీరాజ్ సంస్థలలో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగింది. దేశవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది ప్రజాప్రతినిధులు ఎన్నికవుతుండగా, వీరిలో 10 లక్షల వరకూ మహిళా ప్రజాప్రతినిధులు కావటం గమనార్హం. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో మహిళా ప్రజాప్రతినిధులు గల దేశాలలో భారతదేశమే తొలిస్థానం ఆక్రమిస్తుంది.

రాజ్యాంగంలోని 243(డి) అధికరణం ద్వారా మహిళలకు పంచాయితీరాజ్ సంస్థలలో 33 శాతం రిజర్వేషను కల్పించటం వల్ల 1994 సంవత్సరాల తరువాత దేశ రాజకీయ ముఖచిత్రంలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది. దేశవ్యాప్తంగా 10 లక్షల పైచిలుకు మహిళలు పంచాయితీరాజ్ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తుండగా, అంతకు 3 రెట్లు మహిళలు ఎన్నికల బరిలో నిల్చుంటున్న విషయాన్ని ఇక్కడ మనం గమనించాలి. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన గ్రామీణ గృహిణులు నేడు సగర్వంగా రాజకీయాలలో ప్రవేశించి గ్రామీణాభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994 అమలులోకి వచ్చిన తరువాత మన రాష్ట్రంలో గణనీయమైన సంఖ్యలో మహిళలు నాయకత్వ బాధ్యతలలోకి వచ్చారు.

తొలివిడత 1996లో జరిగిన పంచాయితీ సాధారణ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో మహిళలను పోటీకి దింపటం అన్ని రాజకీయ పార్టీలకు తలకు మించిన భారమైనప్పటికీ, రాజ్యాంగ అనివార్యతలవల్ల అప్పటికే గ్రామాలలో నాయకులుగా చలామణి అవుతున్న పురుషుల కుటుంబాలలోని మహిళలనే ఎక్కువగా ఎన్నికల బరిలోకి దింపారు.

తదనంతరకాలంలో రాష్ట్రంలో స్వయం సహాయక సంఘ భావనలు బలపడటం, రాష్ట్ర మహిళలు ఆర్థిక, సామాజిక సాధికారత దిశగా పయనించటం వల్ల 2001లో జరిగిన సాధారణ ఎన్నికలలో మహిళా అభ్యర్థుల కొరత పెద్దగా కన్పించలేదు. ఇక 2006లో జరిగిన 3వ సాధారణ ఎన్నికలలో మహిళా నాయకత్వం బలపడి, సాధారణ స్థానాల్లో సైతం మహిళలు పోటీచేసి గెలుపొందిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీనిబట్టి ఏతావాతా మనకు తెలుస్తున్నదేమంటే, సరైన అవకాశాలు కల్పించినట్లయితే మహిళలు సైతం పురుషులతో సమానంగా రాజ్యాధికారం దక్కించుకొని, పరిపాలనను ధీటుగా చేయగల్గుతారని అర్థమవుతోంది.

పంచాయితీరాజ్ సంస్థలలో మహిళల ప్రాతినిధ్యం పెరగటం వల్ల గ్రామీణాభివృద్ధి వేగవంతం అయిన సంఘటనలు పలు అధ్యాయనాల్లో వెల్లడయ్యాయి. పురుషాధిక్య సమాజంలో, పాలకుల దృష్టి కేవలం గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకే పరిమితమైనట్టు ఈ అధ్యయనాలలో తేలింది. అయితే మహిళా ప్రతినిధులు ఉత్సాహంగా పనిచేస్తున్న గ్రామాలలో ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయితీరాజ్ సంస్థల్లో ముఖ్యంగా...

- గ్రామీణాభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవడంలో, అమలులో,

సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోవటం అధికంగా ఉన్నట్టు వెల్లడైంది.

- గ్రామంలో పారిశుద్ధ్య వసతుల కల్పన, మంచినీటి సరఫరా, ప్రజారోగ్యం మెరుగవటం వంటివి అధికంగా నమోదయ్యాయి.
- విద్యారంగంలో ముఖ్యంగా బాలికల విద్య, వయోజన విద్యారంగాలలో గణనీయమైన ప్రగతి సాధించారు.
- మద్యపానరహిత గ్రామాలుగా తీర్చి దిద్దటానికి కృషి సల్పటం, మద్యపానం మానటం వల్ల ఆరోగ్యం మెరుగుపడి తద్వారా కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగవటం.
- మహిళల పట్ల వివక్ష తగ్గటం, గృహహింస తగ్గటం.
- పథకాల అమలులో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనం
- కుటుంబ సంరక్షణ బాధ్యతలను చక్కగా నిర్వర్తించే మహిళలు, పంచాయితీరాజ్ సంస్థలలో కూడా ఆర్థిక క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా వ్యవహరించగల్గుతున్నట్టు ఈ అధ్యయనంలో తేలింది.

ఐతే అన్ని గ్రామ పంచాయితీలలో ఈవిధమైన ప్రగతి కన్పించటంలేదు. ఇందుకు అనేక కారణాలు గోచరిస్తున్నాయి. వాటిలో ప్రధానంగా....

- వెనుకబడిన తరగతులు షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళా ప్రజా ప్రతినిధులలో ఎక్కువ మంది తొలిసారిగా ఈ ఎన్నికలలో గెలుపొందటం వల్ల, నాయకత్వలేమి కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.
- భర్త లేక ఇతర కుటుంబ సభ్యుల ప్రోద్బలంతో పోటీ చేసి గెలుపొందటం వల్ల వారిపై అతిగా ఆధారపడటంతో, మహిళా ప్రతినిధుల స్థానంలో పురుషులే ఆధిపత్యం చెలాయించటం.
- ప్రజలతో నేరుగా సంబంధబాంధవ్యాలు లేకపోవటం
- నిరక్షరాస్యత, ఇతర సామాజిక అవరోధాలు
- ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన లేకపోవటం
- అధికారుల నుండి సరియైన సహకారం లభించకపోవటం

పంచాయితీరాజ్ సంస్థలలో మహిళల నాయకత్వం బలపడాలంటే సంస్థలలో మహిళా ప్రజా ప్రతినిధులు పనిచేసే పరిస్థితులు కల్పించాలి. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికకావటంతోనే 'నాయకులు' కాలేరన్న విషయాన్ని వారు గ్రహించేలాగా ఒక చక్కని శిక్షణను కేరళ రాష్ట్ర తరహాలో రూపొందించాలి.

ప్రజలకు ప్రాతినిధ్యం వహించటం నాయకత్వ లక్షణాలలో కేవలం ఒక అంశం మాత్రమే. నాయకురాలిగా రాణించాలంటే అలవర్చుకోవల్సిన మెళుకువలను వారికి ప్రత్యేకంగా నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పంచాయితీరాజ్ సంస్థలలో మహిళా నాయకత్వం వెనుకబాటుతనానికి చెప్పే కారణాలలో 5 ఏళ్ల పరిమిత కాలవ్యవధితో కూడిన రిజర్వేషన్లను ప్రధానంగా పేర్కొనవచ్చు. ఎందుకంటే ఈ సంస్థలకు ప్రతినిధులను ఎన్నుకొనే స్థానాల రిజర్వేషన్లు ప్రతి 5 సంవత్సరాల కొకసారి మారుతుండటం వల్ల బలహీన వర్గాలు, ఎస్.సి, ఎస్.టి వర్గాల నుండి ఎన్నికైన ప్రజా ప్రతినిధులు తమ తొలి 5 సంవత్సరాలలో ఎంతో కొంత గడించిన అనుభవం, తదనంతర కాలంలో ఎందుకూ కొరగాకుండా పోతోంది. మరలపోటీ చేద్దామంటే, ఆ స్థానం మరొక సామాజిక వర్గానికి రిజర్వు అవటంతో, మహిళా నాయకత్వం మొగ్గదశలోనే పతనమవుతోంది.

ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని, ప్రస్తుతం అనుసరిస్తున్న 5 సంవత్సరాలకొకసారి స్థానాల రొటేషన్ పద్ధతి 10 సంవత్సరాలకొకసారి రొటేషన్ పద్ధతిని అమలులోకి తీసుకొని రావాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఇందుకు అన్ని రాష్ట్రాల సహకారం తప్పనిసరి ఏది ఏమైనప్పటికీ జవహర్‌లాల్ నెహ్రూ అన్నట్టుగా భావి దేశ నాయకులను రూపొందించే కార్యక్షేత్రాలైన పంచాయితీరాజ్ సంస్థలలో మహిళా నాయకత్వం బలపడినట్లయితే, దేశ రాజకీయాలలో కూడా భవిష్యత్‌లో సముచిత స్థానాన్ని దక్కించుకోగల్గుతారు.

– టిసిపార్డ్

## జోహార్ అంబేద్కరా...

తక్కువ కులంలో పుట్టినా
ఎక్కువగానే బాధలననుభవించావు
అన్నీ సాధించిన నువ్వు అంతకంటే
ఎక్కువ అవమానాలనే భరించావు
అయితేనేం
అందరిబాధలు నీ బాధలుగా భావించావు
అందుకనే ఎవరికీ అందనంత ఎత్తుకెదిగావు.
కులమతాల కుళ్లుకుంపట్లో కాలిపోతూ
ఛాందస సమాజానికి ఎదురీదలేకపోతున్న
దళిత జనానికి చల్లనిదారి చూపావు
అంటరానితనం అస్పృశ్యత అంటూ
అర్థంలేని ఆచారాలతో ఆంక్షలు విధించిన నాటి చిల్లరచేష్టల అల్లరిమూకల
అమానుష చర్యలను ఎదిరించి
మనిషి మనిషిగా గౌరవించండని ఎలుగెత్తిచాటావు.
అటు స్వాతంత్ర్యపోరాటంలో నీ వంతు పాత్ర పోషించి ఇటు దళితజాతుల వైతాళికుడుగా రాణించి తరతరాల అంతరాలను ఛేదించి అందరూ సమానమేనని ఎలుగెత్తిచాటావు.
ఎన్నో దశాబ్దాలుగా దశదిశలేక దిక్కుతోచక
దరిద్ర్యనారాయణుడి దత్తపుత్రులుగా
దరి కానరాక అంధకారంలో అలమటిస్తున్న
దీన జనులపాలిట దివిటీవై వెలుగుచూపావు.
అందుకే అందుకో
ఓ రాజ్యాంగ నిర్మాతాపూజ్య అంబేద్కరా
మా అభినందన చందనాలు
శతకోటి జోహార్ల పాదిభివందనాలు

డా.వి.రాజేంద్రప్రసాద్
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ

# రైజో బ్యాక్టీరియా పోషకాల లభ్యత

వ్యవసాయరంగంలో హరిత విప్లవం ద్వారా ఎంతో ప్రగతి సాధించాం. కాని అధిక మొత్తంలో రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడటం వలన భూమిలోపల, ఉపరితలంపై పర్యావరణం కలుషితమవుతుంది. దాంతోపాటు రైతుకు కూడా పెట్టుబడి భారమవుతోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయంలో సమన్వయం, సమగ్ర భూసార సంరక్షణ పద్ధతి పాటించడం ఎంతో ముఖ్యమైంది. ఇందులో భాగంగా సేంద్రియ ఎరువులతోపాటు జీవన ఎరువులు, జీవ నియంత్రికల వాడకం ఎంతో అవసరం. ఈ విధానంలో వేరు ఉపరితలంపై జీవిస్తూ వేర్లు ఉత్పత్తి చేసే వేర్లరసంలో ఉన్న వివిధ పోషకాలు, చక్కెర, విటమిన్ల మీద ఆధారపడి జీవించే సూక్ష్మజీవులు లేదా జీవరాసులను రైజోబియం లేదా వేరు బ్యాక్టీరియా అంటారు.

ఈ బ్యాక్టీరియా వేర్లు స్రవించే పదార్థాలను ఆహారంగా తీసుకుని, ప్రత్యక్షంగా, పరోక్షంగా మొక్కల పెరుగుదలకు దోహదం చేస్తాయి. ఈ బ్యాక్టీరియా పెరుగుదలను పరిశోధించినట్లయితే వేరు మండలంలో వీటి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వేరుకు దూరంగా ఉన్న మట్టికంటే...వెయ్యిరేట్లు ఎక్కువగా ఈ బ్యాక్టీరియా వేరుపై ఆధారపడి జీవిస్తుంది. ఈ బ్యాక్టీరియా మొక్కలకు లభ్యంకాని పోషకాలను లభ్యమయ్యేలా చేసి మొక్క పెరుగుదలకు తోడ్పడుతుంది.

ఉదా : రైజోబియం, సుడోమోనాస్, బ్యాలిలస్, అజిటోబ్యాక్టర్, ప్యానిబ్యాసిల్లస్ అనే వివిధ రకాల బ్యాక్టీరియాను రైజో బ్యాక్టీరియం అంటున్నారు.

ఇది మొక్క పెరుగుదలను అభివృద్ధి పరిచే జీవన ఎరువు లేదా రైజో బ్యాక్టీరియం దీనిని మిశ్రమంగా తయారుచేసి పంటపొలాల్లో వేసుకున్నట్టయితే మొక్కకు పోషకాలను అందించుటతోపాటు మొక్కలలో రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. దాంతోపాటు మొక్కలకు ఉపయోగపడే హార్మోన్లను, విటమిన్లను అందిస్తుంది.

### రైజో బ్యాక్టీరియా ప్రత్యక్ష పద్ధతి ద్వారా మొక్క పెరుగుదలకు ఏ విధంగా దోహదం చేస్తుందంటే :

- వేరురసం నుంచి స్రవించే వివిధ పోషకాలను, ఆమ్లాలను, విటమిన్లను, చక్కెర పదార్థాలను ఆహారంగా తీసుకుని మొక్కల్లో తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలను పెరగనివ్వకుండా చేసి మొక్కకు వివిధ రసాయనిక క్రియలలో తోడ్పడుతుంది.
- మొక్క పెరుగుదలకు ఉపయోగపడే సూక్ష్మ జీవులు పెరగడానికి దోహదపడుతుంది.
- రైజో బ్యాక్టీరియా వివిధ జీవ రసాయనాలను ఉత్పత్తి చేసి హాని చేసే సిలీంధ్రాలను వేరు మండలంలో పెరగకుండా తోడ్పడుతుంది.
- గాలిలో ఉన్న నత్రజనిని మొక్కల వేర్ల బుడిపెలలో స్థిరీకరిస్తుంది.
- భాస్వరం, గంధకం, సూక్ష్మ పోషకాలైన జింకు, ఇనుము, కాపర్, మ్యాంగనీస్ మొక్కకు లభ్యమయ్యేలా సహాయం పడుతుంది.
- వివిధ రకాల రైజోబ్యాక్టీరియా సేంద్రియ పదార్థాల విచ్ఛిన్నతకు తోడ్పడే ఎంజైములను విడుదల చేయుటలో ఉపయోగపడుతుంది.



- వేరు మరియు కాండం పెరుగుదలకు దోహదం చేసే ఆక్సిజన్, జిబ్బరిల్లిన్స్, ఎసిసి ఎంజైమ్ ఉత్పత్తికి తోడ్పడి మొక్క పెరుగుదలలో దోహదపడుతుంది.
- ఇలా ప్రత్యక్షంగా మొక్క పెరుగుదలకు తోడ్పడి భూమిసారాన్ని పెంచి పంట పొలాలను శిలీంధ్ర తెగుళ్ల నుంచి రక్షిస్తాయి.

### పరోక్ష పద్ధతిలో మొక్కల పెరుగుదలకు ఏ విధంగా ఉపయోగపడుతుందంటే...

- విషపూరితమైన హైడ్రోజన్ సైన్‌లు, ఫిజాజైన్స్, అమ్మోనియాలాంటి వాటిని ఉత్పత్తి చేసి నేల ద్వారా పంటకు హాని చేసే వివిధ రకాల శిలీంధ్రాలు పెరగకుండా జీవ నియంత్రకాలుగా పనిచేస్తాయి.
- ట్రైకోడెర్మా అనే రైజో బ్యాక్టీరియా కైటోనేజస్, గూకనేజస్ అనే ఎంజైములను ఉత్పత్తి చేసి వివిధ రకాల పరాన్న జీవులను చంపేస్తాయి.
- తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలకు భూమిలో ఉన్న ఇనుపధాతువులను అందకుండా చేసి మొక్కలో వేరు మండలం అభివృద్ధి చెందేలా ఉపయోగపడుతుంది.
- వివిధ రకాల పద్ధతుల్లో మొక్క యొక్క అంతర్వాహిక రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఇవి మొక్కలకు టీకాలవలె పనిచేసి మొక్కలను తెగుళ్లబారి నుండి రక్షిస్తాయి.

ఇలా వివిధ రకాలుగా మొక్కలకు ఉపయోగపడే రైజోబియం బ్యాక్టీరియాను పంటపొలాల్లో విత్తనం ద్వారా లేదా నేలలో నేరుగా వేయడం ద్వారా భూమి యొక్క భౌతిక లక్షణాల్లో మార్పులు వచ్చి భూసారం పెరుగుతుంది. తద్వారా పంటల దిగుబడి పెరగడంతోపాటు నాణ్యత పెరుగుతుంది.

**పి.లక్ష్మణరావ్, కె.రామకృష్ణ, పి.రవి, కె.దామోదరచారి, బి.సుమన్, వై.నాగరాజు, బి.ప్రసన్నకుమార్**
ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం



# గ్రామ్ ఉదయ్ సె భారత్ ఉదయ్ అభియాన్

**భా**రతదేశం పల్లెసీమలే పట్టుకొమ్మలు. ఈ దేశంలో 70% ప్రజలు పల్లెలలో జీవిస్తున్నారు పల్లెలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని కేంద్ర ప్రభుత్వం ఈసారి జాతీయ పంచాయతీ రాజ్ దివాస్ ఏప్రిల్ 24వ తేదీన గ్రామ్ ఉదయ్ సె భారత్ ఉదయ్ అభియాన్‌గా జరుపుతుంది. పంచాయతీ దివాస్ జరపడానికి ప్రధాన కారణం ఈరోజున 73వ రాజ్యాంగ సవరణ అమలులోకి వచ్చింది.

73వ రాజ్యాంగ సవరణ పంచాయతీ రాజ్ సంస్థలకు ఒక వరంలాంటిది. దీని ద్వారా పంచాయతీ రాజ్ సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా చేయడం దీని ఆశయం దీని ద్వారా మొత్తం దేశంలో 543 జిల్లా పంచాయతీలు, 6094 పంచాయతీ సమితిలు, 433,506 గ్రామపంచాయతీల యందు 28.51 లక్షల ప్రజా ప్రతినిధులు ప్రత్యక్షంగా ఎన్నుకొనే అవకాశం కలిగినది. దీనిలో 10.48 మహిళా ప్రతినిధులు షెడ్యూల్డు కులాల ప్రతినిధులు 5.41 లక్షలు షెడ్యూల్డు తెగల 3.31 లక్షల ప్రతినిధులకు అవకాశం కలిగినది.

గ్రామ్ ఉదయ్‌సె భారత్ ఉదయ్ అభియాన్ పంచాయతీ రాజ్ సంస్థల పరిధి ప్రస్తుతం విస్తృతం చేసినది.

ఈ పథకం నాలుగు బాగాలుగా వివిధ సామాజిక వర్గాలకు ఏకీక ృతం చేసే ప్రయత్నం జరుగుతుంది. అదేకాకుండా వివిధ ప్రభుత్వ శాఖలకు సమన్వయం చేసి పంచాయతీ రాజ్ సంస్థలను బలోపేతం చేసే ప్రయత్నం జరుగుతుంది.

**మొదట దశ: ఏప్రిల్ 14-16 వరకు**

సామాజిక సామరస్య దినంగా అంబేద్కర్ 125వ జన్మదినం నాడు అంబేద్కర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించడం, షెడ్యూల్డు కులాలకు ప్రభుత్వ పథకాలు వివరించడం వారి అభ్యున్నతికి అంబేద్కర్ కృషి వివరించడం జరుగుతుంది. సామాజిక సామరస్యానికి అంబేద్కర్ చేసిన సేవలు వివరించడం జరుగుతుంది. దీనిని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ వివరించడం జరుగుతుంది.

**రెండవ దశ : ఏప్రిల్ 17-19 వరకు**

కిసాన్ గ్రామాలు కిసాన్ సభలు నిర్వహించడం ముఖ్యంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, రైతు ఆత్మహత్యలు నివారించడం, వారికి భరోసా కల్పించడం రైతాంగం లాభసాటిగాచేయడం పైన వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానవనాలు దీనికి నిర్వహించారు, రైతులకు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారు.

**మూడవ దశ :**

మొదటిది 18-19 నా 10 రాష్ట్రాల పీసా రాష్ట్రాలకు చెందిన మహిళా సర్పంచ్‌లకు విజయవాడనందు పీసా అమలుపైన జాతీయ సమావేశం నిర్వహిస్తారు. దీనియందు గిరిజనుల సంస్కృతి, అభివృద్ధిపైన ప్రచారం నిర్వహిస్తారు.

**నాలుగవ దశ ఏప్రిల్ 21-24 ప్రత్యేక గ్రామసభ :-**

గతానికి భిన్నంగా ప్రతి గ్రామపంచాయతీ యందు ప్రత్యేక గ్రామసభ నిర్వహించాలి. దీనియందు ఆ గ్రామానికి వచ్చిన నిధులు వ్యయంపైన చర్చించాలి. అదేవిధంగా గ్రామ అభివృద్ధి ప్రణాళికపైన చర్చించి ఆమోదించాలి. దీని ద్వారా గ్రామసభలను బలోపేతం చేయడం. గ్రామ అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయడం ఏప్రిల్ 24 తేదీన జంషెడ్‌పూర్ నందు 3,000 పంచాయతీ రాజ్ ప్రతినిధులు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ ప్రసంగం అన్ని గ్రామసభలలో వీక్షించడానికి ఏర్పాటు చేయబడుతున్నాయి. ఈ గ్రామసభల యందు ఈ క్రింది ప్రభుత్వ పథకాలను వివరించడం జరుగుతుంది.

1. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన
2. ఉపాధి హామీ పథకం
3. ప్రధాన మంత్రి గ్రామీణ గృహ పథకం
4. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకం
5. అటల్ పెన్షన్ పథకం
6. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన
7. సుకన్య సమృద్ధి యోజన
8. సర్వశిక్ష అభియాన్
9. ఆమ్ ఆద్మీ భీమా యోజన
10. రాష్ట్రీయ స్వస్థ భీమా యోజన
11. ప్రధాన మంత్రి ముద్రా యోజన
12. ప్రధాన మంత్రి కిసాన్ వికాస్ యోజన
13. దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామ్ జ్యోతి యోజన
14. ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన
15. దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామ్ కౌసల్ యోజన
16. జతీయ గ్రామీణ ఆరోగ్య పథకం
17. సమీకృత శిశు అభివృద్ధి పథకం
18. దీన్ దయాల్ అంత్యోదయ యోజన
19. జాతీయ సామాజిక సహాయ పథకం
20. ప్రధాన మంత్రి కృషి సంచాయ్ యోజన
21. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల ప్రత్యేక పథకాలు

ఈ పథకాలను వివిధ శాఖల అధికారులు వివరించాలి.

**బి. శేషాద్రి,**
సెంటర్ హెడ్, సిడిపిఎ, టిసిపార్డ్

# సామాజిక విప్లవకారుడు మహాత్మాజ్యోతిరావు పూలే



ఆధునికభారతీయ సమాజనిర్మాతల్లో మహాత్మా జ్యోతి రావుపూలే అగ్రగణ్యులు. పూలే ఆధునిక భారతీయ జాతిపిత. సామాజిక విప్లవకారుడు. ఆధునిక పారిశ్రామిక, భారతీయ సామాజిక సమాజంలో తొలి కార్మికవర్గ ఉద్యమ నేత. మెకంజీ నారాయణ లోఖాండేతో కలిసి 'సత్యశోధక సమాజ్ స్థాపించి బొంబాయి బట్టల మిల్లు కార్మికుల 16 గంటల పని విధా నాన్ని 12 గంటలకు తగ్గించే క ృషి చేశారు. పరిశ్రమల్లో పని పరి స్థితులు మెరుగుపర్చడానికి ఎన్నో ఉద్యమాలు చేపట్టారు. కార్మిక వర్గ ఉద్యమాల్లో కులవివక్ష, వర్ణవివక్ష వ్యతిరేకంగా కృషి చేస్తూ, కార్మిక వర్గ, ద ృక్పథాన్ని స్త్రీ సమానత్వాన్ని మేళవించి తొలి కార్మిక వర్గ ఉద్యమాలను నిర్మించిన మహనీయులు పూలే, లోఖాండే సత్యశోధక సమాజ్ ఉద్యమం. ఉద్యమ నిర్మాతలైన మహాత్మ జ్యోతి రావ్ల పూలే, బావేకర్, లోఖండే కార్మిక వర్గ ఉద్యమాలతోపాటు రైతాంగ ఉద్యమాలను నడిపారు. ఇంగ్లాండులోని మాంచెస్టర్‌లో బట్టల మిల్లులు విస్తరించి సబ్సిడీపై ఇండియాకు దిగుమతి చేస్తూ, ఇండియాలోని చేనేతవృత్తిని బాగా దెబ్బతీశారు. ఈ విషయాన్ని సైమన్ కమిషన్ రౌండ్ టేబుల్ సమావేశాల్లో డా॥బి. ఆర్ అంబేద్కర్ ఎంతోవివరంగా విశ్లేషించారు. బొంబాయిలో బట్టలమిల్లులు ప్రారంభంకావడంతో తెలంగాణాలోని వేలాది మంది చేనేత వృత్తి కార్మికులు ఉన్న ఊరు, కన్నతల్లిని వదిలి మిల్లు కార్మికులుగా చేరి అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. 16గంటల ఈ విధానంతో అనారోగ్యం పాలయ్యారు. పారిశ్రామిక అభివృద్ధికోసం తమ రక్తం, చెమటను ధారపోశారు. బొంబాయి, పూణె, అహ్మద్‌నగర్, షోలాపూర్ పారిశ్రామిక అభివృద్ధికి, మహానగరాల అభివృద్ధికి తెలంగాణ నుండి వలస వెళ్లినవారి కృషి ఎంతోఉంది. ఇలా సత్యశోధక్ సమాజ్‌కు, జ్యోతిరావు పూలేకు బొంబాయికి కార్మిక ఉద్యమాలకు, తెలంగాణ ప్రజలకు మధ్య 170 ఏళ్లుగా పరస్పర సంబంధం కొనసాగుతూ వస్తున్నది.

మహాత్మాపూలే 1827 ఏప్రిల్ 11నమహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించారు. 1827లో పుట్టే నాటికి మహారాష్ట్రలో చాలా మార్పులు జరుగుతున్నాయి. ఈస్టిండియా కంపెనీతో యుద్ధాలతో మహారాష్ట్రను పాలిస్తున్న పీష్వారెండవ బాజీరావ్ల తన గడీని కోల్పోయాడు. ఎన్నో కుటుంబాలు, నిరాశ్రయమై పోయాయి. అందులో పూలే తండ్రి గోవిందు కుటుంబంఒకటి. పూలేకు ఏడాది వయస్సున్నప్పుడే అతని తల్లి చిమ్నాబాయి మరణించింది. తండ్రి గోవిందు రెండో పెళ్లి మాట తలపెట్టలేదు. పసివాడిని చూసుకోవడానికి ఏర్పాటు చేశాడు. జ్యోతిరావును విద్యావంతుని చేయాలని తండ్రి సంకల్పం. ఆ రోజుల్లో బ్రాహ్మణేతరులు విద్య నేర్చుకునే పద్ధతి లేదు. అయినా ఆయనకు ఆ ఆలోచన వచ్చింది. ఈ ఆధునిక కాలంలో వ్యవహారంలో ఉన్న విద్యాప్రణాళిక జ్యోతిరావు పుట్టే నాటికి భారత దేశంలోలేదు. అప్పటి విద్యావిధానం వేరు. అగ్రవర్ణాల వారు ఎక్కు వగా ఉన్న ప్రాంతాలలో కొందరు పండితులు గురుకులం వంటి పాఠశాలలు నడిపేవారు. అందులో సంస్క ృతం,వ్యాకరణం, తర్కం, వేదాంతం, న్యాయశాస్త్రం వంటివి బోధించేవారు. అప్పటి ఆచారం ప్రకారం జ్యోతికి పదమూడేళ్ల వయస్సులో 1840లో పెళ్లయింది. అప్పటికి సావిత్రికి ఎనిమిదేళ్లు. పూలే 1841లో పూనేలోని స్కాటి ష్ మిషన్ హైస్కూలులో చేరారు. 1847లో సెకండరీ విద్యపూర్తి చేశాక ప్రభుత్వోద్యోగంలో చేరకూడదని నిర్ణయించుకున్నారు. అప్ప టికి అతినితో స్వాతంత్ర్యోద్యమ భావాలు బలపడ్డాయి. అమెరికన్ స్వాతంత్ర్యోద్యోమ చరిత్ర అతన్ని ఉత్తేజపరిచింది. జ్యోతిరావు మంచి కసరత్తు నేర్చుకున్నాడు. అప్పటి వ్యవస్థ ప్రకారం చదువు పూర్తి కాగానే తనతండ్రి వలెనే పూలఅమ్మకం పని చేయవలసి వుండింది. 1848లో ఒక బ్రాహ్మణ మిత్రులు పెళ్లికి రమ్మంటే వెళ్లాడు పూలే. పవిత్రులైన బ్రాహ్మణులతో ఒక కిందివర్గానికి చెందిన మాలి కొడుకు పూరేగింపులో నడవడం ఎంత కండకావరం అని ఒకాయన తిట్లకు లంకించుకున్నాడు. ఊరేగింపునించి వెళ్లగొట్టారు. ఆ విషయం తండ్రి కి చెప్పి వెక్కివెక్కి ఏడ్చాడు. ఇంకా ఏమీ శిక్షించకుండా ఊరికే పంపేయడం ఔదార్యంగా భావించాడు తండ్రి. ఇలాంటి వారిని ఏను గుల చేత తొక్కించడం తండ్రికి తెలుసు. ఈ సంఘటన జ్యోతిరావు పూలే జీవితంలో గొప్ప మార్పుకు కారణమైంది. బ్రాహ్మణ ఆధిపత్య వ్యతిరేక సామాజిక ఉద్యమాలకు పూలే ఉద్యమించాడు.

సమాజంలో సమూలమైన మార్పు రావాలంటే విద్య ద్వారానే సాధ్యమని జ్యోతిరావు భావించాడు. మహిళ లేపిల్లలను తీర్చిదిద్ద డానికీ తద్వారా సామాజిక చైతన్యానికి కారకులవుతున్నారు కనుక వారి విజ్ఞానమే దేశ సౌభాగ్యం అని గాఢంగా నమ్మి బాలికల కోసం పూణెలో ఆగస్టు1848లో పాఠశాల ప్రారంభించాడు. అది ముఖ్యంగా నిమ్మజాతుల బాలికలకు ఉద్దేశించిన పాఠశాల. దేశంలో ఇలాంటి

పాఠశాల ఇదే మొదటిది. పాఠశాలలో చదువు చెప్పడానికి పూలే 1848లో భార్య సావిత్రిబాయికి చదువు నేర్పించారు. ఒక స్త్రీ, అందునా శూద్రస్త్రీ, బయటికి రావడం అదీ పంచములకు శూద్రులకు పాఠాలుచెప్పడం బ్రాహ్మణుల దృష్టిలో ఎంతో అపచారం అయింది. ఆమెను ఎన్నో అనరాని మాటలన్నారు. తండ్రిపై ఒత్తిడి తెచ్చారు. బడి నడపడం మానేస్తేనే ఇంట్లోఉండమన్నాడు. తండ్రిని, ఇంటిని వదిలేయడానికి నిర్ణయించుకున్నాడు పూలే. సావిత్రీబాయి భర్తను అనుసరించింది. నిధుల కొరతతో పాఠశాల మూతపడింది.

1851లో 8 మంది ఆడపిల్లలతో పాఠశాల పునఃప్రారంభించారు. 1851-52లో మరో రెండు బాలికల పాఠశాలలు ప్రారంభించారు. ఆ కాలంలోనే చదువుకునే ఆడపిల్లల సంఖ్య 275కి పెరిగింది. 1852-53లో నిమ్నకులాల, ముఖ్యంగా మహర్, మాంగ్‌ల బాల బాలికల కోసం పాఠశాల ప్రారంభించారు. దాదాపు పదేళ్లపాటు పూలే వీటిలో పనిచేశాడు. 1853లో వితంతు మహిళలకు పుట్టిన అనాథ శిశువుల కోసం సేవా సదనం ప్రారంభించారు. ఇలాంటి సంస్థ భారతదేశంలో ఇదే మొదటిది. ఇది ఎవరి ఊహకు అందని సేవ. 1852మే నెలలో జోతిరావు నిమ్మ జాతులలో విద్యా ప్రచారం లక్ష్యంగా ఒక సంస్థను ఏర్పాటుచేశాడు. దీనికి సదాశివరావు గోవాండే అధ్యక్షుడు. పాఠశాలల్లో బాలికలు బాలురుతో కలిసి కూర్చో వడానికి ఒప్పుకోలేదు. అంచేత వేర్వేరు పాఠశాలలు నడపవలసి వచ్చింది. పాఠశాలలను నడపడం కోసం జ్యోతిరావు పూలే కాంట్రాక్టర్లు పట్టి నిజాయితీగా పనిచేస్తే కూడా కాస్త లాభం ఉంటుందని నిరూపించారు. ఆ ఆదాయాన్ని పాఠశాలల కోసం వినియోగించారు. జ్యోతిరావు, సావిత్రి బాయి గారలు నిమ్మజాతుల పాఠశాలల కోసం సుమారు పది సంవత్సరాల పాటు కృషి చేశారు. అవి స్థిరపడ్డాయనుకున్న తర్వాత ఇతరసామాజిక, సేవా కార్యక్రమాలపై దృష్టి మళ్లించారు. ఆకాలంలో సతీసహగమనం వితంతు సమస్య, మూఢాచారాలు ప్రబలంగా ఉండేవి. ఆ పరిస్థితులను చూసి జ్యోతి రావు చలించిపోయాడు. అభాగినులైన వితంతువుల కోసం, వితంతువులకు భర్తలేకుండా పుట్టిన పిల్లల కోసం జ్యోతిరావు ఒక శరణాలయం స్థాపించాడు. గర్భవతులైన వితంతువులకు సహాయం, పురుడుపోసుకునే సౌకర్యం, పుట్టిన శిశువుల్ని అక్కడే శరణాలయంలో ఉంచే అవకాశం అందించారు. ఈ వార్తతో పూణే బ్రాహ్మణులు కోపంతో ఊగిపోయారు. జోత్యీరావు పూలే తండ్రి అంత్యక్రియలను జరపడంలో నూతన ఒరవడి ప్రారంభించారు. బ్రాహ్మణుల శాస్త్రాల ప్రకారం కాకుండా కాకులకు పిండాలు వేసి అవి తమ పూర్వీకులకు చేరతాయని నమ్మకుండా, బీదలకు, వికలాంగులకు అన్నదానం చేశాడు. పేద విద్యార్థులకు పుస్తకాలు, పలకలు పంచాడు.

మహాత్మారనడే 1871లోపూనేకు వచ్చినపుడు, జ్యోతిరావు సంఘ సంస్కరణ కార్యక్రమం చూసి ఎంతో సంతోషించాడు. పూలేనించి సూార్తిపొంది 1875లో ఆయన పండరిపూర్‌లో ఒక అనాథ శరణాలయం ప్రారంభించాడు. జ్యోతిరావు కవి,పదకర్త, గ్రంథకర్త, నిమ్మకుల అణిచివేతపై మూఢవిశ్వాసాలపై ఆయన రాసిన గేయాలు, పుస్తకాలు ముద్రితమై ఎంతో ప్రచారం పొందాయి. గులాంగిరి అనే పుస్తకం బాగా ప్రాచుర్యం పొందింది. ఇటీవల పూలే రచనలు మహారాష్ట్ర ప్రభుత్వం సంపుటాలుగా తేవడం, ఇతర రాష్ట్రాల్లో ఎక్కడిక క్కడ అనువాదాలు రావడం పెరిగింది. కార్మిక వర్గాలను, కింది జాతులను జాగృతం చేయడం కోసం 1873 సెప్టెంబర్ 24న నారాయణ మెఖంజీ లోఖండే భారతదేశ కార్మిక ఉద్యమానికి పితామహుడు. పూలే లోఖండేతో కలిసి సత్యశోధక్ సమాజ్ ఉద్యమాన్ని నిర్మించారు. పూణే మునిసిపాలిటీ సభ్యుడిగా కిందివర్గాల ఆడలలోని ప్రజల సౌకర్యం కోసం పాటుపడ్డాడు. పూనే మున్సిపాలిటీ మద్యం విక్రయించే దుకాణాల్ని పెంచడానికి 1880లో కొత్తసారా దుకాణాలకు అనుమతి ఇచ్చింది. జ్యోతిరావు మద్యపానవ్యతిరేకి. ఈ విషయమై ఆందోళన ప్రారంభించాడు. మద్యం వల్ల పేద కుటుంబాలు శిథిలమవుతున్నాయని ఆంగ్లేయులను ఒప్పించి మద్య నిషేధానికి ఒప్పించిన మహనీయుడు పూలే. గాంధీజీ మద్యపాన నిషేధం రాజ్యాంగంలో చేర్చాలని కోరడానికి స్ఫూర్తి జ్యోతిరావుపూలేయే. పూలే 1883 రైతు చేతి చెర్నాకోల పుస్తకాన్ని రచించారు. జ్యోతిరావుకు అరవైసంవత్సరాలు నిండబోతున్న సందరరేగా బొంబాయిలోని ఆయన అభిమానులు, అనుయాయులు, పెద్దఎత్తున సన్మానం తలపెట్టారు. 1988 మే 11న జరిగిన పెద్దసభలో ఆయనకు మహాత్మా బిరుదునిచ్చి సన్మానించారు. ఆ సభలో ఎందరో రాజకీయ సామాజిక రంగాల ప్రముఖులు వచ్చారు. బరోడామహారాజు సాయాజీరావు అందులో ఒకరు. దశావతారాల సిద్ధాంతాన్ని ఆర్యు లు ఈ దేశం మీదికి వచ్చిన దండయాత్రల పరిణామాన్ని తెలుపు తుందని విశ్లేషిస్తూ పూలే 1873లో గులాంరి పుస్తకం ప్రచురించారు. 1876లో పూనె పురపాలకసంఘ సభ్యుడిగా నియమించ బడ్డారు. 1877లో మహారాష్ట్ర కరువు బాధిత ప్రాంతాల్లోని అనాథ పిల్లలను సాకేందుకు మే 17వ తేదీన సత్యశోధక సమాజం ఆధ్వర్యంలో విక్టోరియా అనాథ శరణాలయం ఏర్పాటు చేశారు. 1879 లో సత్యశోధక్ సమాజ్ తరపున దీనబంధు వారపత్రికను ప్రారం భించారు. లోకమాన్య బాలగంగాధర్ తిలక్‌కు, మహాత్మా పూలేకు మధ్య పత్రికల్లో పరస్పరం ఖండించుకుంటూ వ్యాసాలు రాసు కున్నారు. పూలేను, పూలే క ృషిని వ్యతిరేకిస్తూ శూద్రులకు కూడా సమానత్వమా అని హుంకరించాడు తిలక్. పూలే పాఠశాలలు నడ పడం యావదారేతదేశంలోని విద్యారంగానికి ఒక మలుపు. గుజరాతీ, మరాఠీ, బెంగాల్ భాషల్లో బాలికలకు పాఠశాలలు ప్రారంభమైనాయి. అంతకు ముందు ఈస్టిండియా కంపెనీ బ్రిటిస్ ప్రభు త్వ పాఠశాలలో బ్రాహ్మణులకు అగ్రవర్ణాలకు మాత్రమే ప్రవేశం వుండేది. 1854లో నిమ్నజాతుల వారిని కులం పేరిట పాఠశాల ప్రవేశాన్ని నిరాకరించకూడదని ఆదేశాలిచ్చారు.

పెళ్లి మొదలైన శుభకార్యాలకు, మరణానంతర కర్మకాండలకు వ్యయం, అట్టహాసం లేకుండా ఉండటం, శ్రామికుల సంస్క ృతిని మన్నిస్తూ అందులోంచి మత సంబంధమైన అంశాల్ని వీలైనంత తగ్గించడం పోరాటకారుల్ని వారి చరిత్రను అగ్రవర్ణ భావజాలంలో సంస్మృతీకరించకుండా సామాన్యప్రజల ద ృక్పథంలోంచి వ్యాఖ్యానించడం ప్రభుత్వోద్యోగాల్లో అగ్రవర్ణ, అగ్రవర్ణ ఆధిపత్యాన్ని సర్వ త్రా ఎదుర్కోవడం అంతిమంగా శ్రామికులకు సహకరించడం పూలే చెప్పిన అంశాల్లో కొన్ని. జబ్బు పడిన జ్యోతిరావు 27.11.1890న మరణించారు. 1897లో పూనేలో ప్లేగు వ్యాధికి గురైన వారికి సేవ చేస్తూ అదే ప్లేగు వ్యాధికి గురై మరణించిన త్యాగశీలి సావిత్రీ బాయి పూలే. మొత్తం సమాజం ఆధునిక సమాజంగా మారడానికి అన్ని రంగాల్లో సంస్కరణలు అవసరమని పూనుకుని జీవితాన్ని అంకితం చేసినవాడు మహాత్మా జ్యోతిరావు పూలే. - బి.ఎన్.రాములు

# సమాజసేవే లక్ష్యంగా ముందుకు సాగిపోతున్న సోషల్ యాక్షన్ కమిటీ (SAC) సభ్యులు

సోషల్ ఎక్షన్ కమిటీ (SAC), ఇలాంటి ఒక వ్యవస్థ ఉన్నదని చాలా మందికి తెలియకపోవచ్చును. SERP (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ). ఈ సంస్థ క్రింద సమాజ సేవకై పనిచేసే సభ్యులను సోషల్ ఏక్షన్ కమిటీ అని, జెండర్ కమిటీ సభ్యులని అంటారు.

**సోషల్ ఎక్షన్ కమిటీ అనగా ఎవరు?**

1. 10–15 మహిళా సభ్యులు కమిటీగా కూడుతారు.
2. 18 సంవత్సరములు నిండిన వాళ్లు.
3. కోడళ్ళు, కూతుర్లు, అత్తలు, అమ్మలు, అక్కలు, చెల్లెలు ఇలా వివిధ రకాలైన కుటుంబ బాంధవ్యాలలో ఉన్నవారు.

**సోషల్ ఎక్షన్ కమిటీ ఏం చేస్తారు?**

వివిధ సామాజిక సమస్యలను, కోర్టు, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా తమ కౌన్సెలింగ్ ద్వారా ప్రజల ఆలోచన దోరణిలో మార్పు తెచ్చి, వివిధ రకాల సమస్యలను సావధానంగా ప్రణాళికాబద్ధంగా పరిష్కరణ చేస్తారు.

**సోషల్ ఎక్షన్ కమిటీ ఎటువంటి సమస్యలు పరిష్కరణ చేస్తారు?**

1. భార్యభర్తల పంచాయితీలు.
2. అక్రమ సంబంధం.
3. రెండవ పెళ్లి – పిల్లలు.
4. ఆస్తి మరియు మనోవర్తి.
5. బాల్య వివాహాలను అరికట్టడం.
6. మద్యపాన నిషేధం.
7. బాల కార్మిక వ్యవస్థను రూపమాపడం.
8. స్త్రీ మరియు శిశు ఆరోగ్యం మరియు పోషణపై అవగాహన కల్పించడం.
9. అత్తా – కోడళ్ళ పంచాయతీలను పరిష్కరించడం.
10. భూమి వివాదాలు.

తెలంగాణ పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థ మరియు తెలంగాణ సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పవర్టీ వారి సంయుక్త సహకారంతో, గౌరవనీయులు కమీషనర్ సెర్ప్ మరియు ముఖ్య కార్యనిర్వాహణాధికారి అయిన శ్రీమతి అనితా రామచంద్రన్ ఐఏఎస్ గారి చొరవతో 1000 మంది సోషల్ ఎక్షన్ కమిటీ సభ్యులను 9 తెలంగాణ జిల్లాల నుండి 'మహిళా రక్షణ చట్టాలు మరియు న్యాయాలపై' అవగాహన కల్పించుట కొరకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని టిసిపార్డ్‌లో మాతా మరియు శిశు సంక్షేమ సెంటర్ చేపట్టడం జరిగినది.

ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరైన సోషల్ ఎక్షన్ కమిటీ సభ్యులు తమ అనుభవాలను, తాము ఎంతో విజ్ఞతతో, వీరోచితంగా వ్యవహరించి దాదాపు 10,000 సక్సెస్ సోర్టీస్(విజయగాధలు)లను సమీకరించామని, సమస్యలను పరిష్కరించామని తెలిపిరి. అందులో కొన్ని వీర గాధలు మీ కోసం వారి మాటలలోనే:

**1. మద్యపానం చేస్తే జరిమానా:**

నమస్కారం! నా పేరు సాయవ్వ. మా వూరు యాద్‌గార్‌పూర్, కోటగిరి మండలం, నిజామాబాద్ జిల్లా. మా ఊర్లో చానా మంది తాగి ఆడపిల్లలను ఏడిపించడం, తాగి వచ్చి భార్యను కొట్టడం వంటివి జరిగేవి. అందుకే బాగా ఆలోచించినా, నేను మా కమిటీ సభ్యులం అందరం కలిసి గీ తాగుడు బంద్ చేయాలని అనుకున్నం. తాగితే రూ. 500/– ఫైన్ కట్టాలని గ్రామసభలో సర్పంచుకు చెప్పిన. ఇంటి ఇంటికి తిరిగి మేము ప్రచారం చేసినం. డబ్బుల కట్టబడత్తేదని ఊళ్లో తాగడం మానేశిండ్రు.

మా ఊళ్లో ఉన్న నీళ్ల ట్యాంకు ప్రతి వారం కడిగిండ్రా లేదా అని చెక్ చేస్తాం. 23 ఇండ్లలో టాయిలెట్లు కట్టుకొమన్ని చెప్పినాం. వాళ్లు కట్టుకున్నరు. స్కూలులో పంతుల్లు టైమ్‌కి వస్తుండ్రో లేదో చూస్తం. ఇప్పటికి నేను రోడ్డు మీద పోతుంటే తాగుబోతోల్లు గుబులైతరు. 'ఏం అక్క బాగున్నవా' అని, తనను అడుగుతారని నవ్వుతూ చెప్పింది మన సాయవ్వ.

**2. నగలు తాకట్టు పెట్టి జమానత్ ఇచ్చినాం:**

ఒక భార్య భర్తతో సక్కగా కాపురం చేయడం లేదు. వాళ్ల పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ పిల్ల అమ్మ, అన్నల చెప్పుడు మాటలు వినడం వల్ల భర్తను పట్టించుకోలేదు. ఏమని అడిగిన భర్త మరియు అత్తపై గృహహింస చట్టం తప్పుడు కేసు బనాయించి కేసు పెట్టి జైలుకు పంపింది. మా జెండర్ కమిటీ సభ్యులకు ఇదంతా అన్యాయం అనిపించినది. అందుకే ఆ భర్త, అత్తలను ముందు జమానత్ మీద విడిపించడానికి డబ్బులు అవసరమైనది. మా ఒంటి మీద ఉన్న నగలను అమ్మి 50,000 పోగు చేసి ఇచ్చినం. తరువాత పోలీస్ వాళ్ల సహాయంతో తప్పుడు కేసు అని నిరూపించినం. భార్యకి కౌన్సిలింగ్ ఇప్పించి వ్రాత పూర్వక హామీ తీసుకున్నం. ఇపుడు భార్య భర్తలిద్దరు సంతోషంగా ఉన్నారు.

**– వనజా**

**సామరస్య పరిష్కారాల్లోనూ మహిళల పాత్ర కీలకం**

రాజీకి వీలైన అన్ని రకాల మహిళల సమస్యలను పరిష్కరిస్తున్న సామాజిక సమస్యల పరిష్కార కమిటీల పనితీరు ప్రశంసనీయమైనది. ప్రస్తుతం 9 జిల్లాల్లోని 250 మండలాల్లో ఉచిత కుటుంబ సలహా కేంద్రాలను సమగ్ర, సత్వర, శాశ్వత చట్టబద్ధం చేస్తున్న పరిష్కారాల వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది. మండలానికి 10 మందిని ఎంపిక చేసి వారికి వివిధ చట్టాలపై, కౌన్సిలింగ్ విధానంపై శిక్షణ ఇప్పించటం జరుగుతున్నది. వీరు పరిష్కరించిన సమస్యలను ప్రత్యేక లోక్‌అదాలత్‌ల ద్వారా ఆయా జిల్లాల న్యాయసేవా అధికార సంస్థల ద్వారా అవార్డులు (తీర్పు) ఇప్పించే ప్రక్రియకు శ్రీకారం చుట్టాము. ఈ జెండర్ కమిటీలు న్యాయవ్యవస్థ, పోలీసు, రెవిన్యూ తదితర ప్రభుత్వ యంత్రాంగాల సమన్వయంతో పనిచేస్తున్నాయి.

టిసిపార్డ్ మహిళా మరియు శిశు సంక్షేమ విభాగం SERP వారి సౌజన్యంతో 1000 మంది SAC సభ్యులను శక్తివంతమైన శక్తులుగా తీర్చిదిద్ది సమాజ సేవలో భాగం చేయాలనే సంకల్పంతో ముందుకు సాగిపోతూ.... **– వేణుగోపాల్‌రావ్, కన్సల్టెంట్ సెర్ప్**

**– శ్రీమతి కుసుమ మాధురి,**
**సెంటర్ హెడ్, సి.డబ్ల్యు.సి.డి., టిసిపార్డ్.**



# వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల ఆవశ్యకత

ప్రస్తుత వ్యవసాయ రంగంలో పెరిగే జనాభాకు తగినంత ఆహారనిల్వలు అందించుటకు, పంటల దిగుబడి పెంచడానికి అధిక మోతాదులో కృత్రిమ వనరులైన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడటం పరిపాటి అయ్యింది. పైర్లకు పోషకాలు అందించుటలో సమతుల్యత పాటించకపోవడం వల్ల నేల ఆరోగ్యం, ఉత్పాదకత తగ్గిపోవడం జరుగుతుంది. అంతేకాక రైతులు పురుగులను, తెగళ్లును, పోషక మూలకాల లోప లక్షణాలను గుర్తించడంలో సరైన అవగాహన లేక సస్యరక్షణ మందులను విచక్షణారహితంగా వాడటం వల్ల పండించిన పంటల్లో అధిక మోతాదులో రసాయన అవశేషాలు ఉండటం మిత్రజీవులు, పరాన్నభుక్కులు నశించడం, పర్యావరణ కాలుష్యం వంటివి వాటిల్లడం జరుగుతుంది.

అంతేకాకుండా ఆరోగ్యం పర్యావరణ రక్షణపై పెరుగుతున్న శ్రద్ధ కారణంగా సేంద్రియ ఎరువులకు ప్రాముఖ్యత పెరుగుతుంది. కావున సహజ వనరులైన సేంద్రియ ఎరువులను ఉపయోగించి పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, నాణ్యమైన, అధిక దిగుబడులను పొందవచ్చు.

ఈ రకమైన ఎరువులు ముఖ్యంగా రెండు రకాలు అవి..

1. స్థూల సేంద్రియ ఎరువులు
2. చిక్కటి సేంద్రియ ఎరువులు

**1. స్థూల సేంద్రియ ఎరువులు :**

స్థూల సేంద్రియ ఎరువులలో పశువుల ఎరువు (0.5 శాతం నత్రజని, 0.4 శాతం భాస్వరం, 0.5 శాతం పొటాష్) కంపోస్టు (0.4 శాతం నత్రజని, 0.5 శాతం భాస్వరం, 1.4 శాతం పొటాష్), కోళ్ల ఎరువు (3 శాతం నత్రజని, 2.6 శాతం భాస్వరం, 1.4 శాతం పొటాష్) వీటితోపాటు అన్ని రకాల సూక్ష్మ మూలకాలు సేంద్రియ ఎరువులలో లభ్యమవుతాయి. అలా కాకుండా ఇవి నేల భౌతిక లక్షణాలను అభివృద్ధి పరచడం ప్రముఖ పోషిస్తాయి.

**2. చిక్కటి సేంద్రియ ఎరువులు :**

నూనె పంటల గింజల నుండి నూనెను తీసివేసి మిగిలిన పదార్థాన్ని ఎరువుగా వాడుకోవచ్చు. వీటినే చిక్కటి సేంద్రియ ఎరువులు అంటాం. ఇందులో వేరు శనగ పిండి (7.2 శాతం నత్రజని, 1.6 శాతం భాస్వరం, 1.4 శాతం పొటాష్), ఆవచెక్క (5.2 శాతం నత్రజని, 1.8 శాతం భాస్వరం, 1.2 శాతం పొటాష్), వేపపిండి (5.2 శాతం నత్రజని, 1 శాతం భాస్వరం, 1.3 శాతం పొటాష్), ఆముదం పిండి (4.3 శాతం నత్రజని, 1.9 శాతం భాస్వరం, 1 శాతం పొటాష్) ఉంటాయి. అయితే వీటిలో వేరుశనగ పిండి, నువ్వుల పిండి, ఆవపిండి పశువుల మేతగా, మరియు కోళ్లమేతగా వేస్తున్నారు. మిగిలినవి మాత్రమే ఎరువులుగా వాడుతున్నారు. చిక్కటి సేంద్రియ ఎరువుల్లో స్థూల సేంద్రియ ఎరువులకన్నా అధిక మోతాదులో పోషకాలు లభ్యమవుతున్నాయి. ఈ మధ్యకాలంలో వానపాములతో తయారుచేసిన ఎరువులు కూడా ప్రాముఖ్యత సంపాదించుకున్నాయి.

**సేంద్రియ ఎరువుల ప్రయోజనాలు :**

1. భౌతికస్థితులు నేలలో అభివృద్ధి చెందుతాయి.
2. సూక్ష్మజీవులు ఉత్పత్తి చేసే టోర్మోన్ల వల్ల మొక్కల పెరుగుదల జరుగుతుంది.
3. నేలలో నిల్వ ఉన్న పురుగు మందుల అవశేషాలను విచ్ఛిన్నం చేస్తాయి.
4. వాతావరణానికి ఎటువంటి హాని తలపెట్టవు
5. సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన పంటలకు అధిక మద్దతు ధర దొరుకుతుంది. నీటిని అధిక మొత్తంలో గ్రహించి ఎక్కువకాలం పంటకు అందిస్తాయి.
6. అన్ని రకాల మూలకాలను (సూక్ష్మ, స్థూల) అందిస్తాయి.
7. నేలలోని ఆమ్ల, క్షార లక్షణాలకు తగ్గించి నేలను సారవంతం చేస్తాయి.
8. బరువు నేలలు గుల్లబారి, భూమిలో వేళ్లు చక్కగా అభివృద్ధి చెందడానికి తోడ్పడతాయి.

**కె.రామకృష్ణ, పి.లక్ష్మణరావు, కె.దామోదరచారి,**
**వై.నాగరాజు, బి.ప్రసన్నకుమార్**
ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం



# 'ఆడపిల్లను చదివించండి'

## ఇది రెండు పదాల గొప్ప మంత్రం

నేడు ఈ ప్రపంచం ఇప్పుడున్న పరిస్థితులకన్నా గొప్పగా ఉంచాలంటే చేయదగ్గ ఒకే ఒక పని ఏమిటి ?

భూమి మరింత గొప్పగా భాసిల్లాలంటే ఏదో ఒక పని చేయడం వల్ల సాధ్యం కాదన్నది ఎందరో మేధావుల అభిప్రాయం.

ప్రపంచ శాంతి కోసం చేస్తున్న అనేక యుద్ధాలు, దారిద్ర్య నిర్మూలన కోసం ప్రభుత్వాలు చేసే పోరాటాలు, వ్యాధుల నిర్మూలన కోసం శాస్త్రవేత్తలు సలిపే పరిశోధనలు, అన్నీ సంక్లిష్టమైన కార్యక్రమాల సమాహారాలు. ఇన్ని శతాబ్దాలు గడిచినా ఇవేవీ కచ్చితమైన ప్రయోజనాలు సమకూర్చలేకపోయాయి అని చెప్పడంలో ఇసుమంతైనా అనుమానం లేదు. అతిశయోక్తి అంతకన్నా లేదు.

నేడు క్షీణిస్తున్న పర్యావరణాన్ని పరిరక్షించి, తరిగిపోతున్న ఆహారోత్పత్తిని పెంచి, ప్రజల ఆయురారోగ్యాలను మెరుగుపరిచి, ప్రపంచం ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను ఎదుర్కొనటానికి, అద్భుతమైన ఫలితాలను సాధించడానికి ఆశ్చర్యం గొలిపే విధంగా చేయగల ఒక ఒకే గొప్ప పని – అదే రెండు పదాల మంత్రం. 'ఆడపిల్లను చదివించండి'

ఎంతో సామన్యమైన పని ఇది. ఇంతకన్నా మానవాభివృద్ధికి తోడ్పడగల చర్యలేదు. మనందరికీ అనుభవంలోకి వచ్చిన, తెలిసిన ఒక విషయం ఉంది. "ఒక మగ పిల్లవాడిని చదివిస్తే, అది వాడికొక్కడికే ఉపయోగపడుతుంది. అదే ఓ ఆడపిల్లను చదివిస్తే, ఆ అమ్మాయి కుటుంబానికేగాక, సమాజానికి కూడా గొప్ప మేలు జరుగుతుంది".

ఈ పచ్చి నిజాన్ని నిరూపించే అనేక నిర్ధారణలు ఉన్నాయి.

- తల్లులు అభ్యసించిన విద్య ప్రభావం వారి పిల్లల ఆరోగ్యం, విద్యపైనేగాక, వారి మనవళ్లు, మనవరాళ్లపైన కూడా ప్రత్యక్షంగా ఉంటుంది.
- విద్యావంతురాలైన తల్లికి కలిగిన సంతతి 'విద్యావంతుడైన తండ్రి చదువులేని తల్లి'కి పుట్టిన పిల్లలకన్నా కూడా తెలివైన వాళ్లుగా ఉంటారు.
- పిల్లలు చదువుకున్న తల్లుల వద్ద అధిక సమయాన్ని గడుపుతారు. తల్లి నుండి అనేక విషయాలను నేర్చుకొంటారు. పద్ధతులను, నియమాలను, క్రమశిక్షణను పుణికి పుచ్చుకుంటారు.
- కనీసం ఆరు తరగతులు పాఠశాలలో చదివిన ఆడపిల్ల తన సొంత ఆరోగ్యాన్ని వినియోగించుకొంటుంది. తన పిల్లలకు అవసరమైన టీకాలను సరైన సమయంలో వేయించగలుగుతుంది. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, కాచి వడపోసిన, పరిశుభ్రమైన మంచి నీళ్లను పిల్లలకు తాగించడం వంటివి చేయగలుగుతుంది. నీటి



ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తిని అరికట్టడంలో శ్రద్ధ చూపగలుగుతుంది.

- ఆరు సంవత్సరాల చదువున్న స్త్రీకి పుట్టిన పిల్లలు అసలు చదువు సంధ్యల్లేని స్త్రీల పిల్లలకన్నా, విద్యావంతురాలైన స్త్రీకి కలిగిన సంతతి, ఎత్తు, బరువుల్లో మిన్నగా ఉండటం గమనించబడింది.
- అంతేకాదు, ఆడపిల్లకు కనీస ప్రాథమిక విద్య ఉంటే శిశుమరణాల సంఖ్య 5 శాతం నుండి 10 శాతం తగ్గుతాయి. విద్య ద్వారా ఆ అమ్మాయికి ఆరోగ్య పరిరక్షణ విషయాలు మరింతగా తెలియవస్తాయి. జాంబియాలో జరిగిన ఓ పరిశోధన ద్వారా బడికి పోని ఆడపిల్లల ద్వారా రెండు రెట్లు అధికంగా ఎయిడ్స్ వ్యాధి వ్యాపిస్తోందన్న భయంకరమైన వాస్తవం వెలుగులోకి వచ్చింది.
- చదువుకున్న ఆడపిల్లలు పెళ్లికి తొందరగా సిద్ధపడరు. బలవంతంగా చేసే పెళ్లిళ్లకు తలొగ్గరు. తమకు తగ్గ వ్యక్తిని ఎన్నుకోగల సామర్థ్యం సంపాదిస్తారు. మేనరికాల వలన కలిగే దుష్ఫలితాలను అర్థం చేసుకొంటారు. ఆ విధంగా చదువు ద్వారా కొంత వరకు పురుషుల దౌష్ట్యం నుండి కూడా తప్పించుకోగలుగుతారు.
- విద్యావంతురాలైన మహిళ తక్కువ సంతానం కని, తన విద్య, తెలివితేటలు, అవగాహన, సామాజిక స్పృహతో పుట్టే పిల్లల మధ్య అవసరమైన ఎడం సమకూర్చుకొని పిల్లలను బాగా పెంచగలుగుతుంది. చదువు చెప్పించగలుగుతుంది.
- అంతేగాక చదువు సంధ్యలు లేని ఆడవాళ్లకన్నా కనీసం 6 సంవత్సరాల చదువు ఉన్న మహిళలు తక్కువ సంఖ్యలో పిల్లలనుకంటారు. ప్రపంచబ్యాంకు లెక్కల ప్రకారం ఆడపిల్లలకు ప్రతి నాలుగు సంవత్సరాల చదువు ఇవ్వడం ద్వారా స్త్రీలలో సంతానోత్పత్తి ఒక బిడ్డ తక్కువగా ఉంటుంది. అందుకే కేరళలో సంతానోత్పత్తి రేటు జంటకు 1.7గా వుంటే, బీహార్‌లో 4 కంటే ఎక్కువగా ఉంది. కారణం అందరికీ తెలిసిందే. కేరళవాసులు బీహారీల కన్నా బాగా చదువుకొన్న వాళ్లు కావడం.
- ఎంతమంది ఆడపిల్లలు బడికిపోతుంటే, భవిష్యత్తులో కుటుంబాల ఆదాయం అంతగా అధికమవుతుంది.
- భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న సమాజాలలో పల్లెటూళ్లలోని ఆడపిల్లలు వ్యవసాయ క్షేత్రాలలో పనిచెయ్యడం తప్పనిసరి. అయితే పాఠశాల ద్వారా నేర్చుకొనే విద్య వ్యవసాయాభివృద్ధికి కూడా తోడ్పడుతుంది.
- స్త్రీలలో ఉన్న గొప్పలక్షణం చదువుకున్న తోటి స్త్రీలను చూసి నేర్చుకోవడం. అందుకే చదువురాని మహిళలు చదువుకున్న స్త్రీల నుండి త్వరగా నేర్చుకోగలుగుతారు.
- ఇంతకన్నా మరొక గొప్పలక్షణం ఏమిటంటే, స్త్రీలు తమ ఆదాయాలలో అధికభాగం తమ కుటుంబ అవసరాలకు, అభివృద్ధికి ఖర్చు చేస్తారు. అయితే పురుషులు అంత ఉదారంగాను, గొప్పగాను ఉండకపోవచ్చు. దీనికి రుజువు ఇబ్బడిముబ్బడిగా గ్రామాల్లోను 'బారు'లు బారులుగా వెలుస్తున్న కల్లు, సారా, బ్రాందీ దుకాణాలే. వాటికితోడు ఆరోగ్యాలను హరించే బీడీ, సిగరేట్, గుట్కాల వంటి పొగాకు వస్తువులు.

ఆడపిల్లలను బాగా చదవించడం వలన...

- శిశు మరణాలు బాగా తగ్గుతాయి
- తల్లి ఆరోగ్యం బాగుంటుంది
- తల్లీబిడ్డలు మంచి పోషకాహారం తీసుకోగలుగుతారు
- పిల్లల ఆరోగ్యం వృద్ధి చెందుతుంది
- జనాభా విస్ఫోటానికి ఆనకట్ట పడుతుంది
- చదువుకున్న వాళ్లు అధికమవుతారు
- నైపుణ్యం, నాణ్యత ఉన్న పనిమంతుల సంఖ్య పెరుగుతుంది
- ఎయిడ్స్ వంటి వ్యాధులు తగ్గుముఖం పడతాయి
- వ్యవసాయ ఆదాయం పెరుగుతుంది
- ఆర్థికంగా దేశం బలపడుతుంది

అందుకే, 'ఆడపిల్లను చదివించండి' ఇంతకన్నా గొప్ప మంత్రం లేదు.

వి.వి.యస్.ప్రసాద్, జిల్లా వృత్తి విద్యా శిక్షణాధికారి (విశ్రాంత)



# కులవ్యవస్థపై అలుపెరగని పోరాటం

# డా.బి.ఆర్.అంబేద్కర్

ప్రపంచదేశాల్లో ఉద్యమాలు బానిసత్వానికి, జాతి వివక్షతకు, రాజ్యకాంక్షకు వ్యతిరేకంగా జరిగితే, భారతదేశ చరిత్రలో కూడా బానిసత్వానికి, జాతివివక్షతతోపాటు, సాంఘిక దురాచారాలైన అంటరానితనం, బాల్య వివాహం, సతీసహగమనం వంటి వాటికి వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగాయి. అన్నిటిలో ఇప్పటికీ ప్రధాన సామాజిక సమస్యగా 'కులం'అనే భావనను చెప్పవచ్చు. దానికి కారణం నేటికి 'కులం' అనేది ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాలలో జరిగే ప్రక్రియలలో ప్రధాన భూమిక పోషిస్తుంది.

కుటుంబం, వివాహం, మానవసంబంధాలే కాకుండా, రాజకీయావకాశాలు, ఆర్థిక లావాదేవీలలో చాలావరకు ఇంకా కులం ప్రధానమైన పాత్ర వహిస్తున్నదనే విషయం అందరికీ తెలిసినదే. మనిషి ఆలోచనలో, ప్రక్రియలలో 'కులం' ప్రభావం లేదనడం అసత్యమే అవుతుంది. కాని దాని మనుగడ రూపాంతరం చెందుతూ, రూపాలు మార్చుకుంటూ ఉంది.

ఈ 'కుల వ్యవస్థే' భారతదేశాన్ని ప్రపంచ దేశాలనుండి వేరు చేసింది. ప్రపంచంలో ప్రాచుర్యం పొందిన సామాజిక సిద్ధాంతాలు ఈ ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించలేకపోయాయి. ఈ లోపం వల్ల పాశ్చాత్య సామాజిక సిద్ధాంతాలు, భారతీయ సామాజిక పరిణామానికి ప్రామాణికం కాలేకపోయాయి. సోక్రటీస్, అరిస్టాటిల్, కారల్‌మార్క్స్‌ల సామాజిక, ఆర్థిక, రాజకీయ సిద్ధాంతాలు పూర్తిగా భారతదేశ సామాజిక చిత్రాన్ని గుర్తించలేకపోయాయి. భారతీయ సమాజంలోని విలక్షణమైన కులసమస్యకు పరిష్కారం అందించలేకపోయాయి. కాని, భారతీయ సామాజిక సమస్యలు పరిష్కరించే సామాజిక సిద్ధాంతాలను భారతదేశంలోని మేధావులు మాత్రమే రూపొందించగలిగారు.

కుల వ్యవస్థ, అంటరానితనం ఒక 'దురాచారం' అని, 'మహాపాపం' అని, ఇది సమాజ నాశనానికి దారి తీస్తుందని సామాజిక సంఘ సంస్కర్తలు స్వామి వివేకానంద, రాజారామ్‌మోహన్‌రాయ్, గాంధీజీ, కొంతమంది గుర్తించారు. మరికొందరు ఈ దురాచారానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారు. వారు జ్యోతీరావ్‌పూలే, పెరియార్ రామస్వామి మరికొందరు.

కానీ కులవ్యవస్థ దురాచారాన్ని రూపుమాపడానికి ఒక సిద్ధాంతాన్ని, రాజ్యాంగ బద్ధంగా, ప్రజాస్వామికంగా ఒక యంత్రాంగాన్ని రూపొందించింది మాత్రం డా.బి.ఆర్.అంబేద్కర్ అని చెప్పక తప్పదు. 'కులవ్యవస్థ' తీవ్రతను, విషసంస్కృతిని, దానిలోని వివక్షను, బానిసత్వాన్ని ప్రత్యక్షంగా అనుభవించటమే ఆయనను అందరి నుండి వేరు చేసింది. ఎంతోమంది ఉద్యమాలు నిర్వహించినప్పటికీ, కుల వ్యవస్థ పునాదులను శాస్త్రీయ పద్ధతిలో పరిశోధించి, వాటిని గుర్తించింది మాత్రం డా.అంబేద్కర్. కులవ్యవస్థ ఇన్ని వేల సంవత్సరాలు, ఎన్నో వ్యతిరేక ఉద్యమాలు తట్టుకొని నిలబగలగడానికి ముఖ్యకారణాలు మొట్టమొదటిగా కనుగొన్నది, దానిని నిర్మూలించడానికి కొన్ని మౌలిక సూత్రాలుగల ఒక సిద్ధాంతాన్ని రూపొందించింది మాత్రం డా.అంబేద్కర్. ఆ సిద్ధాంతం 'కులనిర్మూలన' సిద్ధాంతం (Annhilation of caste) 1937లో రూపొందింది.

ఈ సిద్ధాంతం ప్రకారం 'కులం' అనేది ఒక భావన మాత్రమే. అది ఏ దేవుని చేత సృష్టించబడలేదు. కాని సమాజంలో ఒక వర్గం సమాజంపై వారి ఆధిపత్యం కోసం మనుషులే దీనిని సృష్టించారనేది ఒక ప్రధానమైన అంశం. దేవుడు మనుషులందర్నీ సమానంగా సృష్టించాడు అనే భావనకు ప్రక్కనే అసమాన కులవ్యవస్థ, దాని భావన ఎలా ఉండగలుగుతుంది అనేది హిందూ సామాజిక వైరుధ్యంగా చెప్పవచ్చు.

రెండవ అంశం కుల వ్యవస్థకు పునాదులు హిందూ మతం లేదా సంస్కృతిలోని వర్ణవ్యవస్థలో ఉన్నాయి. వర్ణ వ్యవస్థ హిందూ సంస్కృతికి పునాది వంటిది. ఇది కులవ్యవస్థకు తల్లివంటిది. ఈ వర్ణవ్యవస్థకు సంబంధించిన నియమాలు, ప్రామాణికాలు హిందూ మతం పవిత్ర గ్రంథాలైన వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణీకాలు, మనుధర్మశాస్త్రాలు నిర్ణయిస్తాయి. నిర్దేశిస్తాయి. అవి ప్రశ్నించ రానివిగా,

మార్చరానివిగా రూపొందించబడ్డాయి. కాబట్టి ఈ కులవ్యవస్థను నిర్మూలించాలంటే, దానికి తల్లి వంటి వర్ణవ్యవస్థను ప్రోత్సహించేవి, హిందూ సమాజం ఉన్నతమైనదిగా భావించే ఈ వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణికాలు, ధర్మశాస్త్రాలు వాటి పునాదులు మార్చడం ద్వారా కాని, అలా చేయలేనప్పుడు వాటిని సమూలంగా విసర్జించడం ద్వారా కాని, హిందూ సమాజాన్ని వివక్షత లేని సమాజంగా రూపొందించుకొనగలుగుతాము అనేది ఒక ప్రధానమైన అంశం.

ఎంతోమంది సామాజిక సంస్కర్తలు భారతదేశ చరిత్రలో ఉన్నప్పటికీ, ధైర్యంగా ఒక తప్పు ఏ స్థాయిలో ఉన్నా, దానిని ఏ స్థాయిలో ఉన్న వ్యక్తి చేస్తున్నా దానిని గుర్తించి, ప్రశ్నించి, మార్పును చూపించగలిగిన ఒక మహోన్నత వ్యక్తి డా.అంబేద్కర్. ఏ ఇతర మేధావి, ఉద్యమకారుడు, సంఘ సంస్కర్త వేదాలను, బ్రాహ్మణికాలను, ఉపనిషత్తులను, హిందూ ధర్మశాస్త్రాలను ప్రశ్నించలేక పోయారనే వాస్తవం మనం గుర్తించుకోవాలి. ఇక మూడవ అంశంగా కులవ్యవస్థను నిర్మూలించడానికి ప్రధానమైనవి సూత్రాలు. కులం అనే భావన కొందర్ని చాలా పవిత్రులుగా, చాలా ఉన్నతమైన వారిగా చేయగా, మరికొందర్ని అపవిత్రులుగా, నీచమైనవారిగాను గుర్తిస్తుంది. ఇది ఒక 'మానసికమైన భావన', ఈ భావనను పరిరక్షించేది హిందూ 'కుటుంబ వ్యవస్థ'.

మన భారతీయ కుటుంబవ్యవస్థ ప్రపంచంలో చాలా ఉత్తమమైన నియమాలు కలిగినదిగా ప్రాచుర్యం పొందింది. కాని మనది చాలా గొప్పది అనే భావన నుండి, నాది చాలా గొప్పది అనే భావన అనగా సమాజాన్ని కులాలుగా విభజించిన ఈ భావన, మళ్లీ ఒకే కులంలో కొంతమందిని ఉన్నతమైన గోత్రాలుగా గుర్తించడం, ఆ గోత్రాలలో ఉన్నతమైన కుటుంబాలు మరికొన్ని, ఆ కుటుంబాలలో ఉన్నతమైన వ్యక్తులు, ఆ వ్యక్తుల వక్తిత్వాలు, లక్షణాలు, పవిత్రత, ఉన్నతత్వం అతని రక్తంలోనే ఉంటాయని, అతని నుండి అతని కుటుంబానికి వస్తాయని, హిందూ కుటుంబవ్యవస్థ బలంగా నమ్ముతుంది.

అందుకే, ఉన్నతమైన కులం అనే భావన గలవారు అదే కులానికి చెందిన వ్యక్తులతోనే కుటుంబ వ్యవస్థను ఏర్పాటుచేస్తూ, ఒకే కులంలో వివాహాలు చేయుటం ద్వారా వారి 'ఉన్నత' భావనను నిల్పుకుంటారు. అంటే ఒక ఉన్నతమైన కులం, దానినుండి వచ్చే కుటుంబం, ఆ కుటుంబంలోని వ్యక్తుల 'రక్తం' వేరే కులాల వారిని వివాహం చేసుకోవడం అనగా కులాంతర వివాహం ద్వారా ఏర్పడిన కుటుంబం ద్వారా,ఉన్నతమైన లేదా పవిత్రమైన రక్తాన్ని, వంశాన్ని అపవిత్రం చేయడంగా 'హిందూ సమాజం', హిందూ ధర్మశాస్త్రాలు భావిస్తున్నాయి.

అందుకే ఈ 'ఉన్నతమైన', 'నీచమైన' అన్న భావనలు ఒకే కులంలో జరిగే వివాహవ్యవస్థ ద్వారా మళ్లీ 'కులవ్యవస్థ' సుస్థిరం చేస్తాయి. అనగా, ఈ కులవ్యవస్థ నిలబడడానికి కారణం, ఒకే కులం, గోత్రం, వర్గాల మధ్య మాత్రమే కుటుంబవ్యవస్థ పరిమితం కావడం వలన మాత్రమే 'కులవ్యవస్థ' నేటికి సమాజంలో ఉన్నది అనే సత్యాన్ని గుర్తించిన సిద్ధాంతం ఈ కుల నిర్మూలన సిద్ధాంతం. ఒకే కులంలో జరిగే వివాహం ద్వారా ఒక కుటుంబం ఏర్పడితే, మళ్లీ ఆ కుటుంబం, అదే కులానికి చెందినవారితోనే రెండవతరం కూడా ఒక కుటుంబంగా ఏర్పడుతూ ఈ 'కులంభావన' ఒకే కులంలో జరిగే 'వివాహం', కుటుంబ వ్యవస్థల ద్వారా ఒక తరం నుండి మరొక తరానికి అందించబడుతుంది. అందుకే, ఒకే కులంలోని సభ్యులు తాము 'ఉన్నతమైన వారు', పవిత్రులు అనే భావన తీసివేసి, వేరొక దిగువ కులంలోని సభ్యులతో కుటుంబాలను నిర్మించుట ద్వారా, కులాల మధ్య అంతరాలు తగ్గిపోయి, కులవ్యవస్థ పోతుంది అనేది ఈ సిద్ధాంతం సారాంశం.

ఒకవ్యక్తి మేధాశక్తి, జ్ఞానం, తెలివితేటలు, నాయకత్వపు లక్షణాలు ఆ వ్యక్తుల కుటుంబాల నుండి, కులాల నుండి మాత్రమే వస్తాయనే 'భావన', 'వాదన' అవాస్తమైనది.

ఉదా : ఉన్నతమైన కులం అనే వారిలో పుట్టిన వారందరూ మేధావులు కారు. తక్కువ కులం అనుకునే వారిలో పుట్టిన వారందరూ అజ్ఞానులు కారు. ఒక వ్యక్తి వ్యక్తిత్వం, జ్ఞానాలను అతను పెరిగే సామాజిక, ఆర్థిక, రాజకీయ, భౌగోళిక పరిస్థితులు కొంతమేరకు ప్రభావితం చేస్తాయి.

అదే విధంగా ప్రపంచమేధావిగా గుర్తింపుపొందిన, రాజ్యాంగ నిర్మాత డా.అంబేద్కర్ వంటి వ్యక్తులు, అదే కుటుంబం నుండి, అదే కులంలో ఎంతమంది ఉన్నారు. అంటే దానికి సమాధానం లేదు. అంటే, ఒక మేధావి కుటుంబమే మరొక మేధావిని సృష్టించలేకపోయింది. ఒక మేధావి ఏ కులం నుండి వచ్చాడో, అదే కులం మళ్లీ అంతటి మేధావిని ఇవ్వలేకపోయింది. అంటే దీనిని బట్టి మనకు అర్థం అయిందేమంటే, ఒక కులం ఉన్నతమైనది, మరొకటి నీచమైనది అనే భావన కేవలం ఊహ మాత్రమే. అది వాస్తవం కాదు. అందుకే కుల నిర్మూలనకు కులాంతర వివాహాల ద్వారా ఏర్పడిన కుటుంబ వ్యవస్థ పునాదిగా, సమసమాజాన్ని నిర్మించాలని ఈ సిద్ధాంతం భావిస్తుంది.

అంతేకాకుండా, ఈ సిద్ధాంతం భారతదేశ సామాజిక పరిణామంలో మరిచిపోయిన లేదా విడిచిపెట్టబడిన కోణాన్ని పరిశీలిస్తుంది. భారతీయ సమాజంలో ఉన్న ఎన్నో ఇతర సమస్యల పరిష్కారాలకు కావాల్సిన మూలాలను అందిస్తుంది. భారతీయ జాతీయ భావనకు, హిందూ జాతీయ భావనకు, బ్రాహ్మణవాదానికి, హిందూమతానికి, కులవాదానికి గల సున్నితమైన సంబంధానికి ఉన్నతేడాలను గుర్తించిన మొట్టమొదటి భారతీయ సామాజిక సిద్ధాంతం ఈ కులనిర్మూలన సిద్ధాంతం-1937.

మన దురదృష్టం ఏమంటే, ఇంతటి ప్రాధాన్యతగల సిద్ధాంతాన్ని విద్యావ్యవస్థ ద్వారా మన దేశ ప్రజలకు అందించలేకపోవటం. ఇప్పటికైనా ఈ సిద్ధాంతాన్ని పాఠ్యాంశాలుగా బోధించటం ద్వారా, ప్రధానమైన సామాజిక పరిణామ సిద్ధాంతంగా గుర్తించడం ద్వారా యువతలో ఉన్న కుల భావనను పోగొట్టడం ద్వారా జాతీయ భావాన్ని, ప్రజాస్వామిక దృక్పథాన్ని, సోదరభావాన్ని సమాజంలో పెంపొందించవచ్చు.

మనదేశ సమస్యలకు పరిష్కారం, ఆ సమస్యలనధిగమించి వచ్చినవారి నుండి మాత్రమే మనం పొందగలం అనేది గుర్తించి మనం కలిసి ముందుకు పోవాలి. ఇంతటి మహోన్నతమైన సామాజికాభివృద్ధి సిద్ధాంతాన్నందించిన డా.బి.ఆర్.అంబేద్కర్‌కు భారతావని తరపున శతకోటి వందనాలు.

**(ఏప్రిల్ 14, డా॥బి.ఆర్.అంబేద్కర్ జయంతి)**

**డా.బి.నాగేశ్వరరావు**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ



# బరువైన నేలలకు అనువైన శనగపంట

సాగులో వున్న పప్పుధాన్యాలలో శనగ అతి ముఖ్యమైన పంట. పోషక విలువల దృష్ట్యా శనగలో మనకు 23 శాతం ప్రొటీన్‌తోపాటు ప్రతి 100 గ్రా. శనగ విత్తనాలలో 343 మి.గ్రా భాస్వరం, 186 మి.గ్రా కాల్షియం, 141 మి.గ్రా మెగ్నీషియం, 7 మి.గ్రా ఇనుప ధాతువు మరియు 3 మి.గ్రా జింకు లభ్యమవుతాయి.

దేశంలో శనగ పంట అధిక విస్తీర్ణంలో సాగులో ఉన్నప్పటికీ, మన వార్షిక ఉత్పత్తి 5.9 మిలియన్ టన్నులు మాత్రమే. ప్రతి యేటా మనదేశ ఆహార అవసరాల దృష్ట్యా ఆస్ట్రేలియా, కెనడా, మయన్మార్, టర్కీ లాంటి దేశాల నుండి పెద్ద ఎత్తున శనగను దిగుమతి చేసుకుంటున్నాము. 2020వ సంవత్సరం నాటికి మన దేశ జనాభాకు 734 మిలియన్ టన్నుల శనగ అవసరమవుతుందని అంచనా

మన రాష్ట్రంలో కూడా శనగ విస్తీర్ణం ప్రతి యేటా పెరుగుతుంది. గత రబీ సీజన్‌లో శనగ దాదాపు 1.75 లక్షల ఎకరాలలో సాగు చేయబడింది. రైతాంగం అధిక దిగుబడినిచ్చి, బెట్టకు, చీడపీడలకు తట్టుకునే రకాలను ఎన్నుకోవడంతోపాటు సరైన యాజమాన్య పద్ధతులను ఆచరించడంలో అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అనువైన రకాలు :**

శనగలో మనకు దేశవాళీ రకాలు (దేశీ) మరియు కాబులీ రకాలు లభ్యమవుతున్నాయి.

యాజమాన్య పద్ధతులు :

విత్తు సమయం : అక్టోబర్ నవంబర్ మాసాలు

విత్తన మోతాదు : ఎకరాకు 25–30 కిలోల విత్తనం వాడాలి. చదరపు మీటరుకు 33 మొక్కలుండేట్టు విత్తుకోవాలి. అయితే రకాల గింజ బరువును బట్టి లావు రకాలైతే ఎకరాకు 40 కిలోల, మధ్యస్థ రకాలకు 30–35 కిలోల చొప్పున విత్తుకోవాలి. కాబూలీ రకాల్లో మొలక శాతాన్ని పరీక్షించుకొని, విత్తన మోతాదు నిర్ణయించుకోవాలి. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానము, నంద్యాలలో రూపొందించబడిన ట్రాక్టర్‌తో విత్తు శనగ పరికరాన్ని వాడినచో తగిన మొక్క సాంద్రత ఉంటుంది.

**విత్తన శుద్ధి :**

తెగుళ్ల నివారణకు కిలో విత్తనానికి 4–5 గ్రాముల ట్రైకోడర్మావిరిడి అనే మిత్ర శిలీంధ్రము లేదా 2.5 గ్రా థైరామ్ లేదా కాప్టాన్ లేదా కార్బెండిజిమ్ వాడి విత్తన శుద్ధి చేయాలి. రైజోబియం బ్యాక్టీరియా లేని నేలల్లో 200 గ్రా రైజోబియం మిశ్రమాన్ని 300 మిలీ 10 శాతం బెల్లం ద్రావణాన్ని ఉపయోగించి విత్తనాలపై పోసి బాగా కలిపి నీడలో ఆరబెట్టి విత్తుకొనిన దిగుబడులు పెంచుకొనవచ్చు.

**ఎరువుల యాజమాన్యం :**

ఎకరాకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 16 కిలోల గంధకము నిచ్చు ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి. అంటే ఎకరాకు 18 కిలోల యూరియా, 12 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ వేయాలి. శనగపంట దిగుబడులను పెంచడంలో గంధకము కూడా ప్రధాన పాత్ర పోషిస్తుంది. గంధకము లోపమున్న నేలల్లో ఎకరాకు 5–16 కిలోల నీటిలో కరిగే గంధకము విత్తునప్పుడు ఐరన్ లోపము గమనించినప్పుడు, లీటరు నీటికి 5 గ్రా అన్నబేధి, 1 గ్రా నిమ్మ ఉప్పు కలిపి వారం రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారి చేయాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ ప్రతి మూడు పంటలకు ఒకసారి చివరి దుక్కిలో వేసినట్లైతే అధిక దిగుబడి తీసుకోవచ్చు.

**నీటి యాజమాన్యం :**

శనగ వర్షాధారపు పంట. అయినా తేలికపాటి నీటి తడులు ముఖ్యంగా పూతదశ కంటే ముందు (విత్తిన 30–35 రోజులు) మరియు కాయ దశలో (విత్తిన 55 రోజులు) ఇచ్చి అధిక దిగుబడులు సాధించవచ్చు. నీరు పెట్టినప్పుడు పొలంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలి.

**అంతరకృషి :**

పైరు విత్తిన 30 రోజుల వరకు పొలంలో కలుపు లేకుండా చూసుకోవాలి. రసాయనిక కలుపు మందులు ఫ్లూక్లోరాలిన్ 1 లీటరు లేదా పెండిమిథాలిన్ 1–1.3 లీటరు ఒక ఎకరానికి విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు పిచికారి చేయాలి.

పంటకోత : కోతకు వచ్చి మొక్కలను పీకి ఒకవారం రోజులు కట్టుకట్టి వుంచి తరువాత మార్పిడి చేయాలి.

**సస్యరక్షణ :**

శనగపంట సాగులో పచ్చ రబ్బరు పురుగు, శనగపచ్చ పురుగు, వేరు కుళ్లు తెగులు, ఎండు తెగులు ముఖ్యమైనవి. కనుక క్రింద సూచించిన చర్యలు తీసుకుంటే తక్కువ ఖర్చుతో సకాలంలో చీడపీడలను అరికట్టి ఎక్కువ ఆదాయం పొందవచ్చు.

1. వేసవిలో లోతుదుక్కి చేయాలి
2. పైరుచుట్టూ 4–5 వరుసలు జొన్న పంటను విత్తుకోవటం ద్వారా



# టిసిపార్డు నందు 125వ డా॥బి.ఆర్.అంబేడ్కర్ జయంతి కార్యక్రమం

భారతదేశ ఐక్యతకు, నదవడికకు రాజ్యాంగం ద్వారా మార్గం చూపిన డా॥ బి.ఆర్.అంబేడ్కర్ 125వ జయంతుత్సవాన్ని టిసిపార్డు నందు జరుపుకోవడం జరిగింది. ఈ సభకు టిసిపార్డు డిప్యూటీ డైరెక్టర్ డా॥ ఆంజనేయులు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సిడబ్ల్యుఎస్ సెంటర్‌హెడ్ ఎ.నాగేశ్వరరావు హాజరై ప్రసంగించారు. బాబా సాహెబ్ చేసిన కార్యాలను ఆయన కొనియాడారు. ఈ దేశ ఐక్యతకు కొనసాగింపుకు అంబేడ్కర్ రాజ్యాంగమే ముఖ్యకారణం అన్నారు. అనంతరం టిసిపార్డు డిప్యూటీ డైరెక్టర్ శ్రీ ఆంజనేయులు మాట్లాడుతూ దేశానికి, అణగారిన వర్గాలకు డా॥బి.ఆర్.అంబేడ్కర్ చేసిన సేవలను గుర్తు చేశారు. అంబేడ్కర్ సూచించిన "చదువు, సమీకరించు, పోరాడు" ("Ecucate, Organise, Agitate") అనే విషయాన్ని ప్రాధాన్యతనిస్తు ముందుకు నడవాలని సూచించారు. ప్రభుత్వం ఢిల్లీలో జనపథ్‌రోడ్ 15లో అంబేడ్కర్ సెంటర్‌ను నిర్మించడం దేశంలోని దళిత జాతికి ఒక గుర్తింపును తెచ్చారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్స్ ఇతర టిసిపార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేనుబంక ఆశించకుండా, తద్వారా వెర్రి తెగులు రాకుండా కాపాడుకోవాలి.

3. శనగలో ఆవాలు, ధనియాలు అంతర పంటగా వేయడం ద్వారా శనగ పచ్చపురుగు ఉధృతిని తగ్గించవచ్చును. ప్రతి 24 సాళ్ల శనగ తరువాత ఆరు వరసలు ధనియాలు లేదా ఆవాలు విత్తుకోవాలి.
4. వేరుకుళ్లు తెగలు సోకిన మొక్కలు ఎండిపోయి పొలమంతా అక్కడక్కడ కనపడతాయి. ఐసిసివి 10 (భరత్) రకము కొంతవరకు ఈ తెగులును తట్టుకుంటుంది. పంటమార్పిడి పాటించాలి. ఐసిసివి 37 (క్రాంతి), ఐసిసివి 2 (శ్వేత), ఐసిసివి 10 (భరత్), జెజి -11, జెఎకిఐ- 9218, కెఎకె-2, విహార్ రకాలు ఎండు తెగులును తట్టుకుంటాయి.
5. శనగపచ్చ పురుగు ఉధృతిని లింగాకర్షక బుట్టలుపెట్టి, పురుగు ఉనికిని గమనించి సస్యరక్షణ చర్యలు పాటించాలి.
6. పైరు తొలిదశలో పురుగుల మందుల అవసరాన్ని బట్టి వాడాలి.
7. పచ్చ రబ్బరు పురుగు (స్పోడోప్టికా ఎక్సిగ్యా) ఆశించినప్పుడు క్లోరిపైరిఫాస్ 25 మి.లీ లేదా థయోడికార్బ్ 1.5 గ్రా 1 మి.లీ నొరాల్యురాన్ లేదా 1 మి.లీ లుఫెన్యురాన్ ఒక లీటర్ చొప్పున పిచికారి చేయాలి.
8. పూతదశలో 5 శాతం వేప గింజల కషాయాన్ని వాడి శనగపచ్చ పురుగు పైరును ఆశించకుండా కాపాడుకోవచ్చు.
9. ఎన్.పి.వి (ఎన్‌పివి) ద్రావణం ఎకరాకు 200 లార్వల్ రాక్విలెంట్స్ (ఎల్.ఇ) చొప్పున పిచికారి చేయవచ్చును.
10. పూత కాయదశలో చదరపు మీటరుకు 2, 3 పురుగులు కనిపించినప్పుడు లీటరు నీటికి 1 గ్రా అసిఫేట్ లేదా 2 మి.లీ ఎండోసల్ఫాన్ లేదా 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్ లేదా 2 మి.లీ క్వినాల్‌ఫాస్ లేదా 1.5 గ్రా థయోడికార్బ్ లేదా 0.4 మి.లీ. స్పైనోసాడ్ మార్చి మార్చి పిచికారి చేయాలి. ఎకరాకు 200-250 లీటర్లు మందు ద్రావణం వాడాల్సివుంటుంది.

కె.భవ్య, కె.దామోదరాచారి, జి.తిరుమల్, వై.నాగరాజు, బి.ప్రసన్నకుమార్.
మైక్రోబయాలజీ విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్500030.

# తెలంగాణ "పంచాయతీరాజ్ వ్యవస్థ" స్వరూప స్వభావాలు

దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలు...70 శాతం ప్రజలు నేటికీ గ్రామాల్లోనే నివసిస్తున్నారు. దేశ స్వరూప స్వభావాలెరిగినవాడు కనుకే, భావి భారతం పల్లెల్లోనే ఉందని, గ్రామ స్వరాజ్యమే అంతిమ లక్ష్యమని బాపూజీ చెప్పారు. గాంధీజీ తర్వాత భూదానోద్యమ సారథి ఆచార్య వినోభాబావే గ్రామీణ భారతంపై కొంత శ్రద్ధ చూపారు. గ్రామస్తుల సంఘటిత, స్వయంకృషితో అన్నాహజారే రాలేగావ్ సిద్దిని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్ది కొత్త ఆశలు రేపారు. అక్కడక్కడ ఒక రాజేందర్‌సింగ్, ఓ అరుణ్‌రాయ్‌లాంటివాళ్లు రాజస్థాన్ గ్రామాల వికాసానికి తోడ్పాటును అందించారు. కేరళ వంటి రాష్ట్రాల్లో స్థానిక చైతన్యం, వరుసగా ప్రభుత్వాలు ప్రాధాన్యతనివ్వడం వంటి కారణాల వల్ల స్థానిక సంస్థలు బలోపేతమై గ్రామం కొంత నిబ్బరంగా ఉంది. గ్రామ స్వరాజ్యం కోసం గాంధీజీకన్న కలలను నెరవేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. స్థానిక సంస్థల వ్యవస్థను పటిష్టపరిచి పారదర్శకంగా పాలన కొనసాగించేందుకు చర్యలు చేపట్టింది.

ప్రాచీన కాలంలో పనిచేస్తున్న గ్రామపాలనా వ్యవస్థ, అప్పటి సాంఘిక పరిస్థితులకు అనుగుణంగా ఐదు ప్రధాన వృత్తుల ప్రతినిధులతో పనిచేసేవి. అయితే ఇవి ఎక్కువగా అణిచివేతకు గురవయ్యేవి. బ్రిటీష్ పాలన ప్రారంభంలో అంతగా ఆదరించబడనప్పటికి గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వపరిపాలనా సంస్థలు పునరుజ్జీవనం పొందాయి. 1919 మరియు 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంతమేరకు వాటికి బలం చేకూర్చాయి.

స్వాతంత్ర్యం అనంతరం 1952లో వచ్చిన కమ్యూనిటీ అభివృద్ధి పథకం స్థానిక సంస్థల ఏర్పాటుకు నాంది పలికింది. బలవంతరాయ్ మెహతా కమిటీ ఈ పథకంలోని లోపాలను పరిశీలించి పలు సిఫార్సులు చేసింది. వీటి ఫలితంగా 1959లో మూడంచెల పంచాయితీరాజ్ వ్యవస్థ ఏర్పడింది.

భారతదేశంలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలిరాష్ట్రం రాజస్థాన్‌కాగా, 1959 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్‌లో రెండవదిగా, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలోని షాద్‌నగర్‌లో ప్రారంభమైంది. గ్రామస్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితి, జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్‌గా ఏర్పడింది. 1986లో బ్లాకుస్థాయి వ్యవస్థని మండల పరిషత్‌గా మార్చారు.

స్థానిక ప్రభుత్వాలు బలోపేతం చేయడానికి మరియు వీటి పనితీరు పరిశీలించడానికి అశోక్‌మెహతా, జివికె.రావు కమిటీలను నియమించడం జరిగింది. కాని పంచాయతీరాజ్ సంస్థలు అనుకున్నంతగా పటిష్టం కాలేదు.

స్థానిక సంస్థలకు జవసత్వాలు కలిగించే ప్రయత్నం 73వ రాజ్యాంగ సవరణ ద్వారా జరిగింది. ఈ సవరణ ద్వారా స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా నిర్ణయాలు చేసుకున్నారు. పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగపరమైన గుర్తింపు అవసరమని 1988లో పి.కె.తుంగన్ నేతృత్వంలోని సలహా సంప్రదింపుల సబ్ కమిటీ సిఫారసు చేసింది. ఆ మేరకు రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 1989 మే 15న లోక్‌సభలో బిల్లు పెట్టి ఆమోదింపజేసింది. ఈ బిల్లు రాజ్యసభలో వీగిపోయింది. 1989 నవంబర్‌లో వి.పి.సింగ్ ప్రభుత్వం వచ్చింది. 1990 సెప్టెంబరులో 74వ రాజ్యాంగ సవరణ బిల్లు (పంచాయతీలు, మున్సిపాలిటీలకు) లోక్‌సభలో ప్రవేశపెట్టింది. 1990లో వి.పి.సింగ్ సర్కార్ కూలిపోయింది. పి.వి.నరసింహారావు నేతృత్వంలో ప్రభుత్వం వచ్చాక 1991 సెప్టెంబరులో 73వ రాజ్యాంగ సవరణ తెచ్చారు. అది 1992 డిసెంబరులో పార్లమెంటు ఉభయసభల ఆమోదం పొందింది. సగానికిపైగా రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించాక 1993 ఏప్రిల్‌లో రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. దీంతో 73వ రాజ్యాంగ సవరణ చట్టం 1992, 1993, ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. ( ఈరోజునే పంచాయతీరాజ్ దినోత్సవంగా 2010వ సంవత్సరం నుండి జరుపుకుంటున్నాం)

ఈ చట్టం పంచాయతీలు స్థానిక స్వపరిపాలనా సంస్థలుగా భాసిల్లాలి అని పేర్కొంది. స్థానిక సంస్థలకు ఏ వనరులు కేటాయించాలో, సూచించటానికి ఆర్థిక కమిషన్ ఏర్పాటు చేయాలని స్పష్టంగా చెప్పింది. ఈ సవరణ ద్వారా స్థానిక సంస్థలకు పాలనాధికారాలు అప్పగించాలని నిర్ణయించడం జరిగింది.

73వ రాజ్యాంగ సవరణ 11 షెడ్యూల్ (243-జి) ప్రకారం పంచాయతీరాజ్ వ్యవస్థకు 29 అధికారాలు కల్పించాలని నిర్దేశించింది. ఈ షెడ్యూల్‌లోని 29 అంశాలు.

1.వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ 2.భూమి అభివృద్ధి, భూసార పరిరక్షణ, భూ సంస్కరణల అమలు 3.చిన్న తరహా నీటిపారుదల, నీటి వనరుల నిర్వహణ 4.పశు సంవర్ధనపాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ 5.మత్స్య పరిశ్రమ 6.సామాజిక అటవీ పెంపకం తోటల పెంపకం 7.చిన్న తరహా పరిశ్రమలు 8.చిన్న తరహా, అటవీ ఉత్పత్తి 9.ఖాదీ మరియు గ్రామీణ కుటీర పరిశ్రమలు 10.మంచినీరు 11.ఇంధనమూపశు గ్రాసము 12.గ్రామీణ గృహ నిర్మాణము 13.రహదారులు, కల్వర్టులు, వంతెనలు, కాల్వలు, జలమార్గాలు, ఇతర కమ్యూనికేషన్ విధానాలు 14.గ్రామీణ విద్యుదీకరణ, విద్యుత్ పంపిణీ 15.సాంప్రదాయేతర ఇంధన వనరులు 16.పేదరిక నిర్మూలన పథకాలు 17.విద్య ప్రాథమిక, సెకండరీ స్థాయి 18.సాంకేతిక శిక్షణావృత్తిపరమైన విద్య 19.వయోజన విద్య అనియత విద్య 20.గ్రంథాలయాలు 21.సాంస్కృతిక కార్యక్రమాలు 22.మార్కెట్టు సేవలు 23.ఆరోగ్యం, పారిశుధ్యం, ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు. 24.కుటుంబ సంక్షేమం 25.మహిళ సంక్షేమం 26.సాంఘిక సంక్షేమం, వికలాంగుల సంక్షేమం 27.బలహీనవర్గాల సంక్షేమం ముఖ్యంగా షెడ్యూల్డు కులాలు, తెగల సంక్షేమం 28.ప్రజా పంపిణీ వ్యవస్థ 29.సామాజిక ఆస్తుల నిర్వహణ.

అయితే రాజ్యాంగములో ఆర్టికల్ 243-జి ప్రకారము, ఈ అంశాలను రాష్ట్ర ప్రభుత్వాలు బదిలీ చేయవచ్చు అని పేర్కొన్నారు. అందువల్ల బదిలీ తప్పనిసరి కాలేదు.

స్థానిక సంస్థలకు అధికారాలు అప్పగింత విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పక్షాన 2004 ఏప్రిల్ 21న అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2004 జూన్ 22వ తేదిన మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఎట్టకేలకు ప్రభుత్వ విభాగాలను కట్టబెట్టాలని పది అంశాలపై పంచాయతీరాజ్ సంస్థలకు అధికారాలను కట్టబెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్తర్వులు (జీవోలు) జారీ చేసింది. అవి..

1. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (జీ.ఓ నెం-571 తేదీ : 26-12-2007)
2. పశు సంవర్థక, పాడి అభివృద్ధి (జీ.ఓ నెం-106 తేదీ : 31-12-2007)
3. మత్స్య సంపద (జీ.ఓ నెం.105 తేదీ : 31-12-2007)
4. వ్యవసాయం మరియు వ్యవసాయ విస్తరణ (జీ.ఓ.నెం.1 తేదీ : 01-01-2008)
5. ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పిహెచ్‌సిలు (జీ.ఓ.నెం.324, తేదీ : 27-9-2007)
6. మహిళా సంక్షేమం (జీ.వో.నెం.41 తేదీ : 19-11-2009)
7. తాగునీరు, పారిశుద్ధ్యం (జీ.వో.నెం.569 తేదీ : 22-12-2007)
8. బిసి సంక్షేమం (జీ.వో.నెం.35, తేదీ : 24-12-2007)
9. సాంఘిక సంక్షేమం (జి.వో నెం.138 తేదీ : 24-12-2007)
10. ప్రాథమిక, మాధ్యమిక, వయోజన విద్య (జీ.వో.నెం.2, తేదీ: 03-01-2008)

రాజ్యాంగంలోని అధికరణం 243 జి ప్రకారం గ్రామ పంచాయతీ రాజ్యాంగ సంస్థే అయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ వచ్చాయి. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలకు సంక్రమించినా 29 అధికారాల్ని బదిలీ చేయని రాష్ట్ర ప్రభుత్వాల దుర్బిద్ధి వల్ల గ్రామాల కలలు కల్లలే అయ్యాయి.

### తెలంగాణ ప్రభుత్వ చిత్తశుద్ధి

గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో జిల్లా పంచాయతీలు 9, మండల పరిషత్‌లు 438, గ్రామ పంచాయతీలు 8,695 ఉన్నాయి. పంచాయతీల జనాభా 2,26,3,946గా వుంది.

జులై 2, 2014న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, పంచాయతీరాజ్ మంత్రివర్యులుగా కల్వకుంట్ల తారక రామారావు బాధ్యతలు స్వీకరించాక పంచాయతీల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు.

తెలంగాణలోని గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. అధికారంలోకి రాగానే సమగ్ర కుటుంబసర్వే చేపట్టి గ్రామీణ కుటుంబాల సమగ్ర సమాచారం రాబట్టింది. అనేక ప్రభుత్వ పథకాలకు దీనినే ఆధారంగా చేసుకుంది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన తీరుతెన్నులను పరిశీలించేందుకు 'మన ఊరు-మన ప్రణాళిక' చేపట్టి ఒక అంచనాకు రాగలిగింది.

గ్రామాభివృద్ధి ప్రణాళికలను పంచాయతీ స్థాయిలోనే రూపొందించడం, గ్రామాల సంపూర్ణ అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములుగా చేయడమే ప్రధాన ఆశయంగా "గ్రామజ్యోతి"లాంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గ్రామాల సాధికారతకు ఏడు కీలక రంగాలలో అభివృద్ధి నిలకడగా జరగాలని ప్రభుత్వం భావిస్తోంది. తాగునీరు-పారిశుద్ధ్యం, ఆరోగ్యం-పౌష్టికాహారం, విద్య, మౌలిక సదుపాయాలు, సహజ వనరుల నిర్వహణ, సామాజిక భద్రత, పేదరికాన్ని తగ్గించడం, వ్యవసాయం....ప్రధానాంశాలుగా గల గ్రామజ్యోతికి వచ్చే నాలుగేళ్లలో ఈ కార్యక్రమం అమలుకు 25 వేల కోట్ల రూపాయలను కేటాయిస్తుంది. గ్రామజ్యోతి కార్యక్రమంలో గ్రామసభ పాత్ర చాలా విశిష్టమైంది.

'గ్రామసభ' గ్రామస్థాయిలో అత్యున్నత పార్లమెంటుస్థాయి లాంటిది. దానికి పూర్తి బాధ్యతలు కట్టబెట్టడం ద్వారా పంచాయతీలు బలోపేతం అయ్యి గ్రామస్వరాజ్యం వస్తుంది. అనే గాంధీజి మాటలు పరిగణలోకి తీసుకుని "గ్రామసభ"లను ప్రతి మూడు నెలలకు నిర్వహించేలా చర్యలు తీసుకుంది. ఈ గ్రామసభలకు గ్రామస్థాయి అధికారులు అందరూ తప్పనిసరి పాల్గొని వారి శాఖలపై చర్చించేలా ఆదేశించింది.

గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరికీ రోజుకి 100 లీటర్ల మంచినీటిని అందించే లక్ష్యంగా "మిషన్ భగీరథ" (వాటర్‌గ్రిడ్)ను చేపట్టే








త్వరితగతిన పనులు నిర్వహిస్తోంది.

తెలంగాణలో ఎంపిక చేయబడిన 150 మండలాల్లో "తెలంగాణ పల్లె ప్రగతి" అనే కార్యక్రమాన్ని ప్రపంచబ్యాంకు సహకారంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. దీనిద్వారా 1000 గ్రామ పంచాయతీలలో "పల్లె సమగ్ర సేవా కేంద్రాల" ఏర్పాటుచేసింది.

తెలంగాణలోని చెరువులను పునరుద్ధరించి గ్రామాల్లో సాగునీరు, తాగునీరు కొరత తీర్చేందుకు మరియు వాటికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు "మిషన్ కాకతీయ" ద్వారా కృషి చేస్తోంది.

హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం ఒక్కో గ్రామంలో 40వేల మొక్కలను నాటాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది.

2019 నాటికి "బహిరంగ మల విసర్జన"ను రూపుమాపాలనే ఉద్దేశ్యంతో పంచాయతీల పరిధిలో 100 శాతం మరుగుదొడ్లను నిర్మించడానికి సంకల్పించింది.

గ్రామ పంచాయతీలలో ఏళ్లుగా పేరుకుపోయిన పన్ను బకాయిలను 100 శాతం వసూళ్లకు ప్రణాళిక రూపొందించి అమలుపరుస్తోంది.

స్వంత భవనాలు లేని గ్రామ పంచాయతీలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నూతన భవనాలు నిర్మించి, సకల సదుపాయాలు కల్పిస్తోంది.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గ్రామ పంచాయతీల ద్వారా అమలుచేసి 100 శాతం కూలీలకు 100 రోజుల ఉపాధి కల్పించి, తద్వారా వారి ఆర్థికపరిస్థితి మెరుగుపరిచేందుకు దోహదపడుతుంది.

గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్డు వసతి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ప్రతి పంచాయతీ కేంద్రాన్ని తారురోడ్డుతో అనుసంధానం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.



డిజిటల్ తెలంగాణలో భాగంగా పంచాయతీల రికార్డులన్నింటినీ ఆన్‌లైన్ నమోదు చేసి "ఈ పంచాయతీ"కి శ్రీకారం చుట్టింది. తద్వారా పంచాయతీలలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తోంది.

మంచినీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం...వాననీటిని, వృధానీటిని ఒడిసిపట్టి భూగర్భ జలమట్టాన్ని పెంచేందుకు ఇంటింటికి "ఇంకుడు గుంతలు" నిర్మించాలనే పట్టుదలతో ఉంది.

గ్రామాల్లోని చెత్త సమస్యను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో "డంపింగ్ యార్డులు" నిర్మిస్తోంది.

నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేనివిధంగా రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పథకాన్ని చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో లబ్దిదారులను ఎంపిక చేస్తోంది.

ప్రభుత్వ విద్యాసంస్థలు మెరుగైన పద్ధతుల్లో నడిచేలా, విద్యార్థులకు మంచి విద్య అందించేందుకు వీటి నిర్వహణను గ్రామ పంచాయతీలకు అప్పగిస్తూ చట్టం చేస్తోంది.

గ్రామ పంచాయతీ పరిధిలో కీలకమైన సర్పంచ్ మరియు పంచాయతీ కార్యదర్శుల ఆధీనంలో గ్రామంలోని అన్ని శాఖల అధికారులు పనిచేసేలా చూస్తూ, తద్వారా పారదర్శక పాలనను అందించే ప్రయత్నం చేస్తోంది.

ప్రజాస్వామ్య పాలనలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం. ప్రజల భాగస్వామ్యంతోనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యం. ప్రభుత్వం మాది అని ప్రజలు అనుకున్నప్పుడు పరిపాలనా భాగస్వామ్య పద్ధతిలో జరుగుతుంది. పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితోపాటు, ప్రజల భాగస్వామ్యం తోడైతే 'పంచాయతీ రాజ్' మహరాజులా పరఢవిల్లుతుంది అనటంలో అతిశయోక్తి లేదు.

జై పంచాయతీరాజ్...జై జై పంచాయతీరాజ్

**కోరుకంటి మహేందర్‌రావు,**
మొబైల్ : 9951250100



# సూక్ష్మధాతు లోపాలు మరియు సవరణలు

**మనదేశంలో ప్రధాన పంటలు అయినటువంటి వరి, ప్రత్తి, చెరుకు మరియు మొక్కజన్నలలో అనేక రకాల సూక్ష్మధాతువుల లోపాలను శాస్త్రవేత్తలు గుర్తించటం జరిగింది. మొక్కలకు కావాల్సిన ప్రధాన పోషకాలు అందుబాటులో ఉన్న సూక్ష్మ పోషకాలు యొక్క లోపాలు ఉంటే మొక్కల పెరుగుదల మరియు పంటల దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. సూక్ష్మధాతువులు మొక్కల యొక్క పోషణను, వ్యాధికారక క్రిముల నుండి, రక్షణను మరియు పంట దిగుబడికి సహకరిస్తాయి. ఈ సూక్ష్మధాతువుల లోపాలు చాలా సందర్భాలలో, ప్రధాన పోషకాలు అధిక మోతాదులో వాడటం వలన సంభవిస్తుంది. సూక్ష్మధాతువుల లోప చిహ్నాలు సాధారణంగా మొక్క లేత వయసులో కనిపిస్తాయి.**

## సూక్ష్మధాతువుల ప్రాముఖ్యత :

సూక్ష్మధాతువులు మొక్కలు యొక్క మూలక్రియలో ప్రధానపాత్ర వహిస్తాయి. ఇవి స్థూల ధాతువులైన నత్రజని, భాస్వరం మరియు పొటాష్‌లను మొక్కలకు అందుబాటులోకి తీసుకుని రావటంలో క్రియాశీలకపాత్ర పోషిస్తాయి.

సూక్ష్మధాతువు అయిన ఇనుము పత్రహరితమును తయారుచేయటంలో కీలకపాత్ర పోషిస్తుంది.

సూక్ష్మధాతువులు మొక్కల యొక్క పెరుగుదలకు మరియు వాటియొక్క దిగుబడి నాణ్యతను పెంచటానికి దోహదపడతాయి.

## సూక్ష్మధాతువుల లోపాలు మరియు వాటి నివారణోపాయాలు :

### 1. మెగ్నీషియం లోపం :

దీనిలోపం పొటాషియం ఎక్కువగా ఉన్న నేలల్లో కనిపిస్తుంది. ప్రత్తిలో మెగ్నీషియం యొక్క లోపం సర్వసాధరంగా కనిపిస్తుంది. మెగ్నీషియం యొక్క లోప లక్షణాలు ముందుగా ముదురు ఆకులలో కనిపిస్తాయి. ముదురు ఆకులు అంచులనుండి మధ్య భాగానికి పసుపురంగుకి మారతాయి. ఆకుల ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉంటాయి. చివరిగా ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలిపోతాయి.

### లోప సవరణ :

మెగ్నీషియం యొక్క లోప సవరణకు లీటరు నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్‌ను పైరు వేసిన 45 నుండి 90 రోజుల వ్యవధిలో 2 లేదా 3 సార్లు అవసరాన్ని బట్టి పిచికారి చేయాలి.

### 2. జింకు లోపం :

ఈ ధాతువు యొక్క లోపం మొక్క మధ్య ఆకుల మీద కనిపిస్తుంది. ఆకుల ఈనెలు ఆకుపచ్చగా ఉండి ఈనెల మధ్యభాగం మాత్రం పసుపుపచ్చగా మారుతుంది. కొమ్మ చివరి ఆకులు చిన్నవిగా ఉండి ముడతలు పడి కణుపుల మధ్య దూరం తగ్గుతుంది.

**లోప సవరణ :**

జింకులోపం ఉన్న నేలల్లో ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్‌ను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. లేదా 0.2 శాతం (2 గ్రాములు/లీటరు నీటికి) జింకు సల్ఫేట్ ద్రావణాన్ని మొక్కల మీద లోప లక్షణాలు గమనించిన యెడల 7-10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.



**3.బోరాన్ లోపం :**

ఈ ధాతువు యొక్క లోపం వలన పూల స్వరూపం మారి ఆకర్షణ పత్రాలు చిన్నవై లోపలకు ముడుచుకుపోతాయి. ఈ లోపం బాగా ఎక్కువగా ఉన్నప్పుడు పూత మొగ్గ దశలో ఎండిపోవటం, చిన్నకాయలు రాలిపోవటంతో పాటు మొక్కలు గిడసబారి ప్రధానకాండముపై పగుళ్ల ఏర్పడతాయి. బోరాన్ యొక్క లోపం మన రాష్ట్రంలో అన్ని ప్రాంతములలో గుర్తించబడినది. ఈ ధాతువు యొక్క లోపం సున్నంపాళ్లు ఎక్కువగా ఉన్న నేలల్లో వర్షాభావ పరిస్థితులలో మరియు అధిక వర్షపాతం ఉన్నయెడల కూడా ఈ లోపం కనిపిస్తుంది.

**లోపసవరణ :**

బోరాన్ లోప నివారణకు పైరు వేసిన 60 మరియు 90 రోజులు తరువాత లీటరు నీటికి 1-1.5 గ్రాముల బోరాక్స్ వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. ప్రొద్దు తిరుగుడు మరియు వేరుశెనగ పంటలలో బోరాన్‌లోపం సర్వసాధారణం. ఈ లోపాన్ని 0.1 శాతం బోరాక్స్ ఆమ్లాన్ని (1 గ్రాము/లీటరు నీటికి కలిపి) పైరు వేసిన 30 మరియు 45 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.

**4.ఇనుములోపం :**

ఇనుము యొక్క లోపం సాధారణంగా చౌడు భూములలో కనిపిస్తుంది. మరియు ఎక్కువగా నీరు నిల్వ ఉండే నేలల్లో లేదా ఎక్కువ రసాయన ఎరువులు వాడే భూములలో కనిపిస్తుంది. ఇనుము ధాతువు ప్రధానంగా పత్రహరితంను తయారుచేయటంలో కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఈ ధాతువు యొక్క లోపం వలన ఆకులు పసుపురంగులోకి మారతాయి. లేదా ఆకుల అంచులు బూడిదరంగులోకి మారి ఈనెలు మాత్రం పచ్చగా ఉంటాయి. ఈ ధాతువు లోపం వలన పండ్లు చిన్నవిగా మారి, రసం తక్కువగా ఉంటాయి.

**లోప సవరణ :**

ఇనుము లోపం గుర్తించిన యెడల మొదటగా నేల యొక్క ఆమ్లశాతం పరిశీలించాలి. ఒకవేళ నేల యొక్క ఆమ్లశాతం ఎక్కువగా ఉన్న యెడల బాగా మాగిన పశువుల ఎరువును లేదా వానపాముల ఎరువును వాడాలి లేదా రసాయనిక ఎరువు అయినటువంటి అమ్మోనియం సల్ఫేట్‌ను వాడిన యెడల లాభం ఉంటుంది. ఆరుతడి వరిలో (వర్షాధారపు) ఇనుము లోపం తరుచుగా కనిపిస్తుంది. దీనికి గల కారణము తడి మరియు బెట్ట వెంటనే కలుగుట వలన లోప సవరణకు లీటరు నీటికి 2 గ్రాముల అన్నభేది వారం వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారి చేయాలి.

**5.మాంగనీసులోపం :**

మాంగనీసు యొక్కలోపం మరియు ఇనుము యొక్క లోప లక్షణాలు దగ్గర దగ్గరగా ఉంటాయి. మాంగనీసు యొక్క లోపం నీరు సరిగా ప్రవహించని నేలల్లో మరియు సేంద్రీయ పదార్థం ఎక్కువగా ఉన్న నేలల్లో కనిపిస్తుంది. మాంగనీసు లోపం ఆమ్లశాతం ఎక్కువగా ఉన్న నేలల్లో అధికంగా కనిపిస్తుంది. మాంగనీసు లోపం వలన ముదురు ఆకులు పసుపుగా మారి ఆకులు, ఈనెలు మాత్రం పచ్చగా ఉంటాయి. లేత ఆకులు మీద మాంగనీసు లోపం కనిపించదు.

**లోపసవరణ :**

మాంగనీసు సల్ఫేట్‌ను 2 లేదా 3 సార్లు 0.5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసి ఈ లోపాన్ని నివారించవచ్చును.

**6.మాలిబ్డినం లోపం :**

ఈ ధాతువు యొక్కలోపం క్షారశాతం ఎక్కువగా ఉన్న నేలల్లో మరియు సముద్రపు ఒడ్డున ఉన్న నేలల్లో సాధారణంగా కనిపిస్తుంది. మాలిబ్డినం యొక్క లోపం వలన మొక్కలు పొట్టిగా ఉండి లేత పసుపుపచ్చ రంగు ఆకులను కలిగివుంటాయి. ఈ ధాతువు లోపం వలన ఆకుల యొక్క చివరలు చనిపోతాయి. మాలిబ్డినం లోపం ఎక్కువగా ముదురు ఆకులలో కనిపిస్తుంది.

**లోప సవరణ :**

మాలిబ్డినం యొక్క లోప సవరణకు సున్నము లేదా డోలమైట్‌న పైరునుబట్టి లేదా నేలయొక్క క్షారతను బట్టి 2 నుంచి 8 టన్నులు ఒక హెక్టారు భూమికి వాడాలి. లేదా 75 గ్రాముల నుండి 1 కిలో ఒక హెక్టారుకు మాలిబ్డినం పొడిని పిచికారి చేయాలి.

**డా. యస్.త్రివేణి, వై.నాగరాజు, జి.ప్రసన్నకుమార్, జి.తిరుమల్, యస్.వినోద్‌బాబు, కె.భవ్య**
మైక్రోబయాలజి విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్.




# జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ పంచాయతీ రాజ్ సంస్థలతో సమన్వయం

గ్రామాలలో నివసించే ప్రజలలో జీవనోపాధులు సరిగ్గాలేనందు వలన వలసలు పోవుట, బలవన్మరణాలకు బలి అగుచున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రజల స్థితిగతులు గమనించి, పేద ప్రజలకు ఉపాధి కల్పించుట ద్వారా పేదరికం నుండి బయటపడుటకు వీలు ఉంటుందని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ, ప్రజలతో సంబంధాలు ఉన్న పంచాయతీరాజ్ సంస్థలతో సమన్వయం చేయుటవలన, పేద ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందని సమన్వయం చేయుట జరిగినది.

'కేంద్రంలో ఇరవై మంది కూర్చొని శాసించే పద్ధతి అసలైన ప్రజాస్వామ్యం కాదు, ప్రతి గ్రామంలో ప్రజలస్థాయి నుంచి నడిపేదే ప్రజాస్వామ్యం అవుతుందని' మహాత్మాగాంధీ అన్నారు. అందువలన ప్రజలచే పరిపాలించబడే పంచాయతీ రాజ్ సంస్థలు దీనికి అనుగుణంగా ఉన్నాయని చెప్పుటలో అతిశయోక్తి లేదు.

### స్వపరిపాలన సంస్థలుగా పంచాయతీరాజ్ సంస్థలు

ప్రజల భాగస్వామ్యాన్ని పరిపాలనలో మిళితం చేయు విధంగా పంచాయతీరాజ్ సంస్థ ఏర్పాటు చేయుటం జరిగినది. గ్రామీణాభివృద్ధిలో ఈ సంస్థలు మంచి సాధనాలుగా ఉంటాయని, వ్యక్తిగత స్పృశ్చను పెంపొందిస్తాయని స్థానిక ప్రభుత్వాలతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని 'బలవంతరాయ్ కమిటీ' 1959 సం॥ సిఫార్సుల ఆధారంగా ఈ పంచాయతీ రాజ్ సంస్థలు ఏర్పాటు చేయుట జరిగినది.

చాలా మార్పులు జరిగిన తరువాత 73 రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం 29 అంశాలు గ్రామపంచాయతీ సంస్థలను బదిలీ చేయాలని నిర్ణయించటమైనది. పంచాయతీరాజ్ సంస్థలు ఈ విధంగా ఏర్పాటు చేయుట జరిగింది. గ్రామపంచాయతీ, మండల ప్రజాపరిషత్, జిల్లా పరిషత్, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఈ విధంగా ప్రజలకు చేరువకావటానికి, వికేంద్రీకరణ చేసి మంచి పాలనా వ్యవస్థ రూపొందించుట జరిగినది.

### పంచాయతీరాజ్ సంస్థల ప్రాముఖ్యత

రాజ్యాంగ 73వ సవరణ చట్టానికి అనుగుణంగా దేశం అంతా ఒకే రకమైన పంచాయతీ పాలన ఏర్పాటు కావాలి. కనుక మన రాష్ట్రంలో కూడా పాత చట్టాన్ని మార్పు చేశారు. ఇంతకుముందు మన రాష్ట్రంలో గ్రామపంచాయతీలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ గ్రామపంచాయతీల చట్టం 1964, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు మరియు జిల్లా ప్రణాళిక, అభివృద్ధి సమీక్షా మండల చట్టం 1986, ఎన్నికలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల సంస్కరణల చట్టం 1986 అమలులో ఉండేది. రాజ్యాంగ 73వ సవరణ తరువాత ఈ మూడు చట్టాల స్థానంలో క్రొత్తగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 30.5.1994 నుండి అమలులోనికి వచ్చినది. రాజ్యాంగం 73వ సవరణ ప్రకారం చట్టంలో పొందుపరచిన కొన్ని ముఖ్యమైన అంశాలను తెలియజేయుటమైనది.

**1. మూడంచల పద్ధతి:**

1. గ్రామపంచాయతీ, 2. మండల పరిషత్, 3. జిల్లా పరిషత్ (సెక్షన్ 4, 148, 177)లు.
2. గ్రామసభ ఏర్పాటు.
3. రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటు.
4. రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటు.
5. స్త్రీలకు, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు రిజర్వేషన్‌లు.
6. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో ప్రాదేశిక నియోజక వర్గాల ఏర్పాటు (ఎంపిటీసీ, జెడ్పిటీసీ)లు.

**రాష్ట్ర స్వయం నిర్ణయాలకు వదలిన అంశాలలో ఎపిపిఆర్ యాక్ట్‌లో చేర్చిన అంశాలు**

1. సర్పంచ్‌లను నేరుగా ఎన్నికల నిర్వహణ.
2. 30.05.1995 తరువాత ఇద్దరు పిల్లలు మించి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి లేదా పదవిలో కొనసాగటానికి అనర్హులు.
3. వెనుకబడిన వర్గాలకు కనీసం 34% రిజర్వేషన్.
4. ఉపసర్పంచ్‌లు, మండల, జిల్లా ఉపాధ్యక్షులు మరియు అధ్యక్షులపై 2 సం॥ల వరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టకుండా చట్టంలో ఏర్పాటు చేసి పొందుపరచిరి. (ప్రస్తుతం ఇది 4 సం॥లకు సడలించుట జరిగినది).
5. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీరహితంగా, మండల, జిల్లా పరిషత్‌లలో పార్టీపరంగా ఎన్నికలు జరుగుతాయి.

**గ్రామసభ:**

గ్రామస్థాయి ప్రజాస్వామ్యానికి గ్రామసభ మూలాధారము. గ్రామపంచాయతీలలో ముఖ్యంగా గ్రామంలోని 18 సం॥లు పై బడిన వారందరూ పాల్గొనే కార్యక్రమం గ్రామసభ.

1. 73, 74వ రాజ్యాంగ సవరణలు చట్టబద్ధత కల్పించాయి.
2. రాజ్యాంగంలోని 243(డి) అధికరణ గ్రామసభ ఏర్పాటు గూర్చి తెలియజేస్తుంది.

తెలంగాణ వి.ఆర్.ఎం.నిబంధనలను అనుసరించి గ్రామసభల నిర్వహణకు సంబంధించిన నియమాలను ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 367 తేది:28.8.1998 ద్వారా రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ జారీ చేసినది. 18 సం॥లు పైబడిన వయస్సు కలిగిన వారందరూ గ్రామసభ సభ్యులు. వారు గ్రామసభ బహిరంగ ప్రదేశంలో సూర్యోదయం, సూర్యాస్థమయాల మధ్య జరగాలి. సెక్రటరీ గ్రామసభ ఏర్పాటు చేయాలి. పంచాయతీ సర్పంచ్ అధ్యక్షతన జరుపవలయును.

**సభ:**

గ్రామసభ్యులలో 10% సభ్యులు గానీ, 50 మంది గానీ వ్రాత పూర్వకంగా అభ్యర్థించిన సర్పంచ్ గ్రామసభ సమావేశం జరపాలి. గ్రామసభ ఎలా జరపాలో మూడు రకాలుగా తెలియజేయాలి.

1. దండోరా,
2. కూడలిలో నోటీసులు అంటించటం,
3. గ్రామపంచాయతీలో నోటీసులు అంటించటం చేయాలి.

**జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ ప్రాముఖ్యత**

జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ భారత ప్రభుత్వంచే ప్రారంభించబడినది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద పేదరిక నిర్మూలన కార్యక్రమం. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన కార్యక్రమం. ఇది మహిళలకు సంబంధించిన కార్యక్రమంలోనే అతి పెద్దది. ఈ కార్యక్రమాన్ని జూన్ 3, 2011వ సంవత్సరం రాజస్థాన్‌లోని బన్స్‌వారంలో అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమం ప్రపంచ బ్యాంక్ సహాయంతో నడుపబడుచున్నది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలు చేయబడుచున్నది.

ఈ కార్యక్రమం స్వర్ణజయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన కార్యక్రమాన్ని పునరాకృతి చేసి, జాతీయ జీవనోపాదుల మిషన్‌గా మార్చివేయాలనుకున్నప్పుడు భారత ప్రభుత్వం అన్ని స్థాయిలలోని భాగస్వాముల వారితోనూ, రాష్ట్ర ప్రభుత్వాలతోను, బ్యాంకర్స్‌తోనూ, విద్యావేత్తలతోను చర్చలు జరిపిన తరువాత, దాని ద్వారా వచ్చిన సిఫార్సులను ఆంధ్రప్రదేశ్‌లోని ఇందిరాక్రాంతి పథకం కేరళలోని కుటుంబశ్రీ లాంటివి ఇంతకు ముందు విజయవంతమైన ప్రాజెక్టుల నుండి నేర్చుకున్న పాఠాల ద్వారా ఈ కార్యక్రమాన్ని రూపొందించుట జరిగినది.

పేదలను పేదరికం నుండి బయటపడేయాలనే బలమైన కోరికను స్వశక్తితో నడిచే పేదల సంస్థలపై ప్రభుత్వం పెట్టుబడి పెట్టినప్పుడు వాటి పై స్థాయి సమాఖ్యాలుగా తయారవడానికి వారికి మద్దతు ఇచ్చినప్పుడు పేదరిక నిర్మూలనకు సులభమైన మార్గం ఏర్పడినట్లే అన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఈ పేదల సంస్థలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల నుండి వనరులను పొందటానికి వారి సమస్యలు సమిష్టిగా ఎదుర్కొని పరిష్కారాలు కనుగొనడానికి ప్లాట్ ఫారంలుగా ఉపయోగపడతాయి. దీని వలన పేదల ప్రస్తుతం వారి జీవిస్తున్న విధానం కంటే ఎంతో మెరుగైన, ఆదాయం సమకూర్చుకోగలిగి, ఆస్తులను ఏర్పరచుకోగలిగి కొత్త సుస్థిర జీవనోపాధులు పొందగలుగుతారు.

**పంచాయతీరాజ్ సంస్థల పాత్ర - జాతీయ జీవనోపాధుల మిషన్**

1. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తూ, పేద నిరుపేద మహిళలు, మహిళలచే నడుపబడుతున్న కుటుంబాలలోని వారు, కనుమరుగవుతున్న వృత్తులలో వున్న కుటుంబాలలోని మహిళలను సమీకరించి, వారిని స్వయం సహాయక సంఘాలలో చేర్పించటము.
2. గ్రామస్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి, సమాఖ్యలను ప్రోత్సహించి వారికి సొంత భవనాలు సమకూర్చడంలో సహకరించుట.
3. వివిధ శాఖలతో సంఘాలను, సమాఖ్యలను సమన్వయం చేయించటంలో సహకరించుట.
4. ప్రణాళికలను తయారు చేసేటప్పుడు, లబ్ధిదారుల ఎంపికలోను, పేదల సంస్థల సహకారం తీసుకోవటము.

పై ఫలితాలు తీసుకురావాలంటే, పంచాయతీరాజ్ సంస్థలకు మరియు పేదల సంస్థలకు శిక్షణా కార్యక్రమముల ద్వారా సానుకూలత కల్పించడం ఎంతో అవసరం.

**పంచాయతీరాజ్ సంస్థలతో జీవనోపాధుల మిషన్ సమన్వయం మరియు ఏకీకృతము చేయుట**

గ్రామస్థాయిలో ఆర్థికాభివృద్ధి, సాంఘిక న్యాయం సాధించటంలో పంచాయతీరాజ్ సంస్థల పాత్ర రాజ్యాంగపరమైనది. నిజమైన

ప్రజాస్వామ్యం ఉండాలంటే పంచాయతీరాజ్ మరియు పేదల సంస్థల మధ్య మంచి సంబంధాల ఉండాలి. కావున గ్రామీణాభివృద్ధిలో పంచాయతీరాజ్ సంస్థల రాజ్యాంగపరమైన ఆధిపత్యాన్ని దెబ్బతీయకుండా అలాగే పేదల సంస్థల యొక్క స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీయకుండా రెండింటి మధ్యన సమన్వయం ఉండాలి. పేదల సంస్థలు బలోపేతం కావాలంటే వారికి అన్ని సంస్థలతోను మంచి సంబంధాలు ఉండాలి. సంఘర్షణాపూరిత వాతావరణం ఉండకూడదు. ఒకరినొకరు వనరుల వాడకంలో సహకరించుకుంటూ, సపోర్టు చేసుకుంటూ, గైడెన్సు తీసుకొంటూ, ఇరువురి సహకారంతో ఎదగాలి.

**ప్రజా సంఘాల పాత్ర**

1. గ్రామసభలలో క్రియాశీలకంగా పాల్గొనవలెను.
2. పంచాయతీరాజ్ సంస్థల కార్యక్రమాలలో పాలుపంచుకోవటం మరియు వాటిపై అభిప్రాయాలను తెలియపర్చుట.
3. పంచాయతీరాజ్ సంస్థల వివిధ ప్రణాళికలు తయారు చేయుటలో, వారితో భాగస్వాములు కావలెను.

**పై రెండు సంస్థల మధ్య సంబంధాలు మెరుగుపడినప్పుడు ఈ క్రింది కార్యక్రమంలో పాలుపంచుకోవచ్చును:**

1. చేపల చెరువులు, కుంటలు, మార్కెట్ యార్డులు, లీజుకు తీసుకోవటము. వివిధ ప్రభుత్వ భవనాలను నిర్వహణ చేయుట.
2. కొంత మొత్తం కమీషన్ ఇవ్వటం ద్వారా పంచాయతీ ఆదాయ వనరులైన ఇంటి పన్ను వసూలులాంటివి స్వయం సహాయక సంఘాలకు అప్పగించవలయును.
3. గ్రామస్థాయి, పౌరుల సదుపాయాలైన, త్రాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణ, మరియు భవనాల నిర్మాణం పనులు మొదలగునవి స్వయం సహాయ సంఘాలకు అప్పగించావలయును.
4. పంచాయతీరాజ్ సంస్థల తరుపున పలు ప్రభుత్వ సౌకర్యాలను పంపిణీ చేసే యంత్రాంగంగా సమాఖ్యాలు పని చేయవచ్చును.

ఉదాహరణకు, పెన్షన్ల పంపిణీ, ఇంటి బిల్లుల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం మొదలగునవి ఇచ్చుట వలన సమన్వయం ద్వారా పేద ప్రజలను మేలు చేయవచ్చును.

పై విధముగా పంచాయతీరాజ్ సంస్థల ద్వారా జాతీయ జీవనోపాధుల మిషన్ సమన్వయం వలన అనేకమైన పేదరిక నిర్మూలన కార్యక్రమాలతో పాటు, గ్రామీణాభివృద్ధి సాధించి, జాతి పిత మహాత్మాగాంధీ కలలు నిజం చేయవచ్చును.

**– టి.యం.కె.గాంధీ,** జె.ఆర్.పి.
సి.ఎన్.ఆర్.ఎమ్., టిఎస్ఐపిఎఆర్డి



# ప్రత్యేక గ్రామసభ - జాతీయ పంచాయితీ దినోత్సవం

దేశవ్యాప్తంగా పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి ప్రజలలో అవగాహన, స్ఫూర్తి, సమస్యల పరిష్కారంకు కృషి చేయవలసిన అవసరం ఉందని సిడిపిఏ సెంటర్ హెడ్ బి.శేషాద్రి అన్నారు. టిసిపార్డ్‌లో నిర్వహించిన గ్రామసభల నిర్వహణా పంచాయితీరాజ్ ప్రాముఖ్యతపై మూడురోజుల శిక్షణ ముగింపు సమావేశంలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల ప్రకారం గ్రామసభలు నిర్వహించి గ్రామ సమస్యలైన తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం మొదలగు పనులు కల్పించడంపై పంచాయతీరాజ్ శాఖ శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఏఏ పనులు చేయాలి ? అనే అంశాలపై శిక్షకులకు ప్రత్యేక నిపుణులతో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 9 జిల్లాల నుండి వచ్చిన వివిధ శాఖల నిపుణులు శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టిసిపార్డ్ జెడి కె.యాదయ్యగౌడ్, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.



# " జల నిర్వహణలో ప్రజల పాత్ర"

**జీ**వకోటి మనుగడకు నీరే ప్రధాన ఆధారం. ప్రకృతి ప్రసాదించిన గొప్ప వరం నీరు. అడవుల నరికివేత, అభివృద్ధిలో అసమతుల్యాలు, నగరాభివృద్ధి కారణాల వల్ల నదులు ఎండిపోతున్నాయి. చెరువులు క్రుంగిపోతున్నాయి. దీనితో దేశంలో భూగర్భ జలాలు నానాటికి అడుగంటిపోతున్నాయి. సమిష్టి కృషితో ఈ జలగండాన్ని అధిగమించకపోతే భవిష్యత్‌లో మనల్ని ఎవరు కాపాడలేరు.

నీరు లేని భూమిని ఒకసారి ఊహించుకొండి. పచ్చని చెట్లు, పారేనదులు, జీవులు, మహాసముద్రాలు ఏమి ఉండవు. మానవుడి జాతి మనుగడ మొత్తం నీటి మీదే ఆధారపడి ఉంది. మానవ మనుగడకు అతి ముఖ్యమైన నీటి లభ్యత రోజు రోజుకి తగ్గిపోతుంది. సామాజిక అవసరాలకు, పారిశ్రామిక అవసరాలకు, ప్రజల నిత్యవసరాలకు నీరు అందుబాటులో ఉండని గడ్డు పరిస్థితి ఏర్పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ పరిస్థితులు ఇలాగే ఉంటే గుక్కెడు నీటి కోసం అనేక కష్టాలు పడే దుస్థితి ఏర్పడుతుంది. ప్రజలకు మంచి నీరు అందించడం చాలా దేశాల్లో పెనుసవాలుగా మారింది.

దేశంలో నేడు 85 శాతం మంది ప్రజలు త్రాగునీటి కోసం భూగర్భ జలాలపైనే ఆధారపడుతున్నారు. 65 శాతం ప్రజలు సాగు నీటి అవసరాల కోసం భూగర్భ వనరులపైనే ఆధారపడవాల్సి వస్తుంది. నీటి పరిరక్షణయే లేనట్లయితే దేశం ఆర్థిక సామాజిక, సాంస్కృతిక మొదలగు రంగాలలో అభివృద్ధి కుంటుపడుతుంది.

వాస్తవంగా దేశవ్యాప్తంగా 1951లో తలసరి వార్షిక నీటి లభ్యత 5177 ఘనపు మీటర్లు. 2001 నాటికి 1820 ఘనపు మీటర్లకు పడిపోయినట్లుగా, దేశంలో ఈ రెండు దశాబ్దాల కాలంలో దాదాపు 300 జిల్లాల్లో నాలుగు మీటర్లకు పైగా భూగర్భ జలమట్టలు పడిపోయినట్లుగా వివిధ సర్వేలు వెల్లడిస్తున్నాయి.

ప్రపంచంలోని నీటిలో ఒక్క శాతం కంటే తక్కువగా అనగా 0.007 శాతం నీరు మాత్రమే మానవునికి ఉపయోగించుకునేందుకు అందుబాటులో ఉంది. క్రొత్త నీటి వనరులను అభివృద్ధి పరచడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తుంది. నీటి వనరుల పరిరక్షణకు సమీకృత పక్రియలు చాలా అవసరం. నీటి అవసరాల నిర్వహణతోపాటు నీటి నాణ్యత భూ ఉపరితల భూగర్భ జలాల్లో సంయుక్త యాజమాన్య విధానాలు ముఖ్యమైనవి.

నీటిని సమర్ధవంతంగా పొదుపుగా వాడలంటే, జల వినియోగంపై రైతులకు శిక్షణ ఇవ్వాలి. సాగునీటి ఇంజనీర్లు, రైతుల మధ్య పరస్పర సహకారం ఉండాలి. అవసరాలు అపారం అందుబాటులోకి నీరు పరిమితం. దాన్ని ఎంత మాత్రం వృధా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవడానికి అన్ని దశలల్లోను సాగునీరు, త్రాగునీరు, పొదుపు విధానాలను ఇంజనీర్లు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, సామాజికవేత్తలు, సంబంధిత అధికారుల అవసరం ఎంతైనా ఉంది.

మరో దశాబ్ధ కాలంలో పెరగనున్న జనాభా తగ్గుతున్న తలసరి వార్షిక నీటి లభ్యత వంటి వాటిని పరిగణలోకి తీసుకుంటే మనదేశం భారీ నీటి ఒత్తిడిని ఎదుర్కొబోతున్నది. ఇది సుస్పష్టం. ఆహార ఉత్పత్తులపైనా ప్రతికూల ప్రభావం తప్పదు.

అంతరించిపోతున్న నీటి వనరులు ఆందోళనకరంగా పరిణమించాయి. వర్షభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలమట్టాలు గరిష్టస్థాయిలో పతనం కావడం వల్ల సాగునీరు, త్రాగునీరు అవసరాల కోసం అల్లాడిపోయే పరిస్థితి దాపురించింది. ఇంతటి అమూల్యమైన వనరులను మనం కాపాడుకోకపోతే భవిష్యత్ అంధకారమైపోతుంది. కాబట్టి ప్రతినీటి బొట్టును తగు పద్ధతుల ద్వారా కాపాడుకోవాలి.

విచక్షణరహితంగా ఎడాపెడా బోరుబావులను త్రవ్వడం, పట్టణీకరణ అభివృద్ధి పేరిట వర్షపు నీటిని భూమిలోకి ఇంకిపోయే మార్గమే లేకుండా భూభాగాన్ని అంతా కాంక్రిట్ మయం చేస్తున్నారు. ప్రతి వర్షాకాలంలో ప్రకృతి మనకు సరిపడు నీటిని ఇస్తుంది. కొంత ముందు చూపుతో ఆ నీటిని ఒక పద్ధతి ప్రకారం వాడుకుంటే నీటి సమస్యను కొంత వరకు అధిగమించవచ్చు. అంటే వర్షపు నీటిని

సాధ్యమైనంత వరకు భూగర్భజలంగా మార్చుకోవాలి. వర్షకాలంలో పడే వాన నీటిని భూగర్భంలోకి మరియు చెరువుల్లో, కుంటల్లోకి మళ్ళించాలి. దీనితో మనం 15-20 శాతం నీటిని పొదుపు చేసినవారవుతం.

### జల నిర్వహణలో యువత పాత్ర

జల సంరక్షణకై ప్రభుత్వ యంత్రాంగంతోపాటు యువత కూడ నడుం బిగించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.

- ★ నీటి సంరక్షణకు యువకులంతా సమిష్టిగా విధివిధానాలను రూపొందించుకోవాలి. నీటి సంఘాలను ఏర్పాటు చేసుకోవాలి.
- ★ యువకులు తమ తమ గ్రామ, పట్టణాలలో ప్రజలకు నీటి సంరక్షణకై పూర్తి అవగాహన కల్పించాలి.
- ★ ప్రభుత్వం సహాయంతో గ్రామాలలో వాటర్‌షెడ్లను, నీటి గుంతలు, చెక్‌డ్యామ్‌లు విరివిగా నిర్మించుకోవాలి.
- ★ వాల్ట చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలుపరిచే విధంగా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలి.
- ★ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శక సూత్రాలను కొత్త ప్రభుత్వాలు తు.చ. తప్పకుండా అనుసరించి సంరక్షణ చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.
- ★ ప్రతి ఇంటి నిర్మాణంలో ఇంకుడు గుంతలు నిర్మాణం జరిగే విధంగా ప్రభుత్వం నియమనింబధనలను విధించి వాటిని పర్యవేక్షించాలి.
- ★ కాలువలు, చెరువులు అక్రమణకు గురికాకుండా చూడాలి. కాలువలు, చెరువుల్లో పూడిక తీయాలి.
- ★ పైపుల లికేజి, మరమ్మత్తులు ఉన్నట్లయితే తక్షణమే బాగు చేయించే విధంగా తగు చర్యలు తీసుకోవాలి.
- ★ పైప్‌లైన్ నుండి గాలి బయటకు వెళ్ళడానికి ప్రతి కిలోమీటరు నుండి కిలో మీటరున్నర దూరంలో తప్పకుండా ఎయిర్‌వాల్స్‌ను బిగించే విధంగా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలి.
- ★ వర్షపాతం పెంచే విధంగా భారీగా చెట్లను పెంచే విధంగా గ్రామాలలో, పట్టణాలలో వన సంరక్షణ సమితులను ఏర్పాటు చేసుకోవాలి.
- ★ వ్యవసాయానికి సూక్ష్మ, బిందు, తుంపర సేద్య విధానంను ప్రోత్సహించే విధంగా, ప్రభుత్వం వివిధ వర్గాలకు ప్రోత్సహకాలు ఇచ్చే విధంగా కృషి చేయాలి.
- ★ వ్యవసాయానికి ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పోసినట్లుయితే అవిరయ్యే సమస్య తక్కువగా ఉంటుంది. దీనిపై రైతులలో అవగాహన కల్పించాలి.
- ★ అభివృద్ధి చెందిన దేశాలు, రాష్ట్రాలు అమలు పరుస్తున్న, నీటి రిసైక్లింగ్ విధానాన్ని దేశమంతటా అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.
- ★ భూగర్భ జలాల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణకి కృషి చేసి వారికి ఇంటి పన్ను, నీటిపన్ను, విద్యుత్ బిల్లులలో రాయితీలు కల్పించడం మొదలగు ప్రోత్సహకాలు ఇవ్వడం వల్ల ప్రజలలో అవగాహన కల్పించాలి.
- ★ జలసంరక్షణలో ప్రభుత్వ యంత్రాంగంతోపాటు ప్రజలు, యువత సహాయ సహకారాలతో నీరును వృధాగా పోకుండా కాపాడుదాం. పరిగెత్తే నీటిని నిలబడెదాం అని ప్రతి ఒక్కరు ధృఢ సంకల్పంతో ఉన్నప్పుడే నీటికి కటకటలాడే పరిస్థితి నుంచి ఆరోగ్యకరమైన ఒక మంచి అడుగు ముందుకుపడి మనదేశం నవచైతన్యంతో వెల్లివిరుస్తుందని సాహసంగా చెప్పగలం.

**డి.కుమార్,** జోకల్, శంషాబాద్.





# (వాల్మీకీ) బోయల చరిత్ర

## గిరిజన బోయల స్థితిగతులపై సంక్షిప్త నివేదిక

**అ**డవిని ఆధారంగా చేసుకుని జీవనం సాగించిన మొదటి ఆటవిక ఆదిమజాతి బోయలు. వేటను ప్రధానవృత్తిగా ఎంపిక చేసుకొని జీవనం సాగించే క్రమంలో విల్లు ఎక్కుపెట్టి వేటాడిన మొదటివారు బోయలే. ఆహారసేకరణ దశ నుంచి ఉత్పత్తి దశ వరకు మరలిన క్రమమే నాగరికతకు నాంది అంటాడు ప్రఖ్యాత చరిత్రకారుడు గార్డెన్‌చైల్డ్. వేటను ప్రధానవృత్తిగా ఎంచుకొని కర్నాటక, తెలంగాణ, మరట్వాడ ప్రాంతాలలో నివసిస్తూ గిరిజన తెగలుగా గుర్తించబడినారు బోయ కులస్తులు. బోయలు మరట్వాడ ప్రాంతంలో రామోసీలుగా పిలవబడుతున్నారు. బేదర్, బెండార్, బేరాడ్‌లుగా పిలువబడిన బోయలు కనాయంకుల, దోరిమికుల, వాల్మీకి క్షత్రీయులుగా గుర్తింపుపొందారు. అడవిలో సంచార జీవనం గడుపుతు జీవనం సాగించేక్రమంలోనే వేటగాడిగా వాల్మీకి ప్రస్థానం ప్రారంభమైంది. ఒక పురాణపురుషునికి ఇద్దరు భార్యలు వారిలో ఒకరి సంతతి బోయలు. మరొకరి సంతతి ఎరుకల అని ఒక కథ ప్రచారంలో వుంది. వేటాడే క్రమంలో వాల్మీకికి ఎదురైన ఒక సంఘటన తనని మహర్షిగా మార్చివేసింది. తర్వాతే బోయ కులానికి చెందిన వాల్మీకి మహామునిగా ప్రసిద్ధుడై రామాయణ మహాకావ్యాన్ని రచించాడు. అందుకే బోయలకు వాల్మీకి ఆదిగురువుగా మారాడు.

బోయలకు నేడు కులవృత్తి లేదు కావున 'తెగ' కులవృత్తి లేనివన్ని తెగలు కావున బోయల వృత్తి వేట. అది నేటి సమాజంలో నిషేధించబడింది.

ఉదా : గంగిరెద్దుల వాళ్లు, బాలసంతవారు, వీరికి కులవృత్తి ఉంది. వీరు సంచారజీవనం 6 నెలలు వృత్తి ఉంటుంది. ఆరు నెలలు ఉండదు.

### బోయలు లేదా బేదార్‌ల పుట్టుక

బేదార్ అనే పదం బేదారస్ అనే పదం నుంచి పుట్టింది. ఈ తెగ పుట్టుకకు సంబంధించి అనేక అంశాలు ప్రచారంలో వున్నాయి. బసవన్నకు కుడి, ఎడమ కళ్లుగా వున్న కన్నయ్య మరియు కనకవ్వ అనే గిరిజన జంట కూడా బేదార్ తెగకు చెందినట్టుగా ఒక కథ ప్రచారంలో ఉంది. పురాణ ప్రాశస్త్యం కలిగిన వాల్మీకి మహాముని బెడార్ తెగకు ఆద్యుడుగా భావిస్తున్నారు. క్రీ.శ.16వ శతాబ్దంలో కాలప్ప నాయకత్వంలో దక్షిణ భారతదేశంలో బేదార్‌లు గిరిజన తెగగా గుర్తించబడినారు. రాయచూర్ దోఆబ్‌లోని ఆదోని, దంబాల ఏరియాలలోని అటవీప్రాంతంలో స్థిరపడిన బోయలు విజయనగర రాజైన శ్రీకృష్ణదేవరాయలు, బీజాపూర్ సుల్తాన్ ఇస్మాయిల్ అదిల్‌షా పాలనలో స్థానిక గ్రామ రక్షకులుగా కావలి సేవకులుగా పనిచేసి రాజ్యరక్షణకోసం బలమైన పునాదులు నిర్మించింది బెడార్ తెగ, బ్రిటీష్ వలస విస్తరణ జరుగుతున్న సమయంలో షోరాపూర్‌కు పశ్చిమభాగంలో రెండు మైళ్ల దూరంలో వాకినగర్‌ను రాజధాని కేంద్రంగా చేసుకొని బెడార్ తెగ నాయకుడైన పామునాయక్-1 (క్రీ.శ.1674-1695) నాయకత్వంలో స్థానిక నూతన తెగ రాజ్యమును స్థాపించాడు. ధైర్యసాహసాలు కలిగిన పామునాయక్ చివరి బీజాపూర్ పాలకుడైన సికిందర్ఆదిల్‌షాతో కలిసి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సైనికపటాలంపై దాడి చేశాడు. దీనికి ప్రతిఫలంగా కొంత జాగీర్‌ను సంపాదించాడు. పామునాయక్ స్వతంత్ర తెగ రాజ్య నిర్వహణలో భాగంగా రాజ్యాన్ని ప్రావిన్స్‌లుగా విభజించి సుబేధార్ అనే అధికారులను నియమించాడు. రాజ్యంలో నూతన కోటలు, రహదారులు, దేవాలయాలు, చెరువులను నిర్మించాడు. ఇతని పాలనాకాలంలో బీజాపూర్, గోల్కొండ రాజ్యాలు మొఘల్ పాలకుడైన ఔరంగజేబు ఆధీనంలోకి వచ్చాయి. పామునాయక్ అనంతరం బేదార్ రాజ్యానికి పిడ్‌నాయక్ బిహారీ (1695-1725) పగ్గాలు చేపట్టి ఔరంగజేబును ధీటుగా ఎదుర్కొన్నాడు. ఔరంగజేబు సేనాధిపతి జుల్ఫీకర్‌ఖాన్ చేతిలో పిడ్‌నాయక్ ఓడిపోవడంతో వాకింగర్ నుంచి షోలాపూర్‌కు మార్చి అనేక నూతన సంస్కరణలు అమలు చేశాడు. క్రీ.శ.1726లో పిడ్‌నాయక్ మరణానంతరం షోరాపూర్ రాజ్యం హైద్రాబాద్ నిజాం పాలకులకు సాలుకు రూ.1,45,000 కప్పం చెల్లించి సామంతులుగా ఉండేందుకు అంగీకరించారు. ఒకవైపు నిజాం రాజ్యం మరోవైపు మరాఠా రాజ్యం మధ్య బేదర్ తెగ తమ ప్రాధాన్యం కోల్పోవడంతో బ్రిటీష్ వలస పాలనలో బోయలు అడవులకు పరిమితమై వేటాడే సంచారజాతిగా జీవనం కొనసాగించారు. తెలంగాణ ప్రాంతంలో నిజాంకు సామంతులుగా మారిన తర్వాత నుంచి మొదలుకొని నేటివరకు బోయ కులస్తులు ఆటవిక తెగగానే జీవిస్తున్నారు.



## బోయల అంతర్గత నిర్మాణం

బేదర్ తెగ అంతర్గత నిర్మాణం చాలా వివాదాస్పదంగా కనిపిస్తుంది. విశాలమైన ప్రాంతంలో బేదర్ తెగలు విస్తరించి ఉండటంతో వారి సామాజిక స్థితిగతులు కూడా విభిన్న రకాలుగా కనిపిస్తున్నాయి. బేదర్‌లలో ఉప కులమైన రాజాస్ భూస్వాములుగా గుర్తించబడినారు. బేదర్‌లలో పిల్లి, ఉడుత, పశుమాంసమును భక్షిస్తూ అడవిలో వేటాడేవారిని తక్కువ ప్రాధాన్యత కలిగిన వర్గంగా గుర్తించబడినారు. బేదార్‌లలో వివిధ తెగలకు చెందిన వారిగా ఉన్నట్టుగా తెలుస్తుంది. వారి వివరాలు...

1. సారద్ లేదా నాయకులు (వాల్మీక) బేదార్‌లు.
2. లాసర బేదార్‌లు
3. మంగల బేదార్‌లు
4. చాకల బేదార్‌లు
5. నీచ బేదార్‌లు
6. బసవి బేదార్‌లు
7. రామోసీ బేదార్‌లు
8. జాస్ బేదార్‌లు

పైన చెప్పిన విధంగా ఉన్న తెగలలో నాయకబేదార్‌లు ఉన్నతస్థానం కలిగి మిగిలిన ఉపబేదార్‌లు తెగల వారితో వివాహం తదితర సంబంధాలను కలిగిఉన్నారు. మంగల బేదార్‌లు క్షురకులుగాను, చాకలి బేదార్‌లు పరిశుభ్రకులుగాను యితర వృత్తులు చేపట్టి ప్రత్యేక వర్గాల వారుగాను స్థిరపడినారు. నీచబేదార్‌లు మాంసాహారులుగా షెండీ మద్యం సేవిస్తూ సంచారజీవనం గడిపారు. బసివి బేదార్‌ల తెగకు చెందిన మహిళలు దేవుడుకి అంకితం గావించబడి బసివినిగా పిలువబడినారు. బసివినులు వేశ్యలుగా గుర్తించబడినారు. బసివి తెగలలో బసివినికి పుట్టిన కొడుకులు, బిడ్డలకు అదే తెగలకు చెందిన వారిని భర్తలుగా అంగీకరించేవారుకాదు. బసివి తెగకు చెందిన బసివిని మహిళను దేవాలయంలో ఏదో ఒక ప్రత్యేకమైన రోజు దేవుడికి అంకితమిస్తూ ఖడ్గంతో వివాహం చేసి బసివిని మెడలో తాళి (మంగళసూత్రం)ని మెడలో వేసే ఆచారం కొనసాగించారు. (బసివినితో కలిసే ఏ వ్యక్తి తన కంటే ఉన్నతకులానికి చెందినవాడుగా పరిగణించి అత్యంత నీచమైన తెగకు చెందినదానిగా భావించి బసవన్నకు అంకితంకాబడిన మహిళగా బసివి బేదార్ మహిళలు దుర్భరమైన జీవితాన్ని కొనసాగించారు). ఇదే దురాచారం క్రీ.శ. 20వ శతాబ్దంలో ఆరంభమై నేటికి కూడా బసివిని, జోగిని దేవదాసి వ్యవస్థలు కొనసాగుతున్నాయి.

రామోసీ బేదార్‌లు మహారాష్ట్రలోని మరట్వాడా జిల్లాలో అత్యధికంగా ఉన్నారు. తర్వాత మరట్వాడా నుంచి కర్నాటక ప్రాంతానికి వలస వచ్చారు. రామోసీలు అనగా రాముడికి విశ్వాసపాత్రులుగా భావించుకొని అడవులలో నివసించే తెగ అని అర్థం. మహారాష్ట్రలోని కాలప్ప నాయకుడికి ఐదుగురు కొడుకులు పుట్టగా వారే మహారాష్ట్ర కర్నాటక ప్రాంతంలో ఒక్కోచోట ఒక్కొక్క ఆటవిక తెగగా స్థిరపడినారు. ఆటవికులుగా క్రూరమైన స్వభావం కలిగి వేటాడే తెగగా ఉన్న రామోసీలు మహారాష్ట్రలో శివాజీ మహరాజ్ సాధించిన విజయాలలో కీలకభూమిక పోషించారు. శివాజీ సైనికదళంలో సైనికులుగా చేరారు. బ్రిటీష్ పాలన చివరి దశలో వారి పారిశ్రామిక విస్తరణ కోసం రామోసీ తెగలను విరివిగా వినియోగించుకున్నారు. మహారాష్ట్రలో వారి సామాజికస్థితిని బట్టి రామోసీలను తదనంతర కాలంలో మరాఠా తెగగా పిలిచారు. ఈ తెగ నేటికి మహారాష్ట్రలో అత్యంత దిగువకులంగా గుర్తింపులో ఉంది.

## తెలంగాణలో బోయలు

తెలంగాణలో బోయలను ప్రధానంగా సాదర్‌బోయ, బోయ అనే రెండు తెగలుగా వర్గీకరించారు. సాదర్‌బోయలను న్యాస బేదార్‌లు లేదా బోయలు, గుగారు బోయలు అనే రెండు వర్గాలుగా విభజించారు. బేదార్ బోయలను మళ్లీ తిరిగి 101 బోయలుగా విభజించారు. బేదార్ తెగలలో ఇద్దరు అక్క, చెల్లెళ్లు ఒకే వ్యక్తిని భర్తగా అంగీకరించడం, ముందుగా అక్క వివాహం చేసుకోవడానికి కులకట్టుబాట్లు

అనుమతించాయి.

ఉన్నతకులానికి చెందినవారు బేడార్ తెగలలో చేరాలంటే ముందుగా బేడార్‌లు తెగపంచాయితీ నిర్వహించిన తర్వాత వారికి కొంత జరిమాన విధించి బేడార్ కులానికి విందు ఏర్పాటు చేసిన తర్వాతనే వారిని బేడార్ తెగలోకి అనుమతించేవారు. ఇలా బేడార్ కుల కట్టుబాట్లు, సామాజిక స్థితిగతులను బట్టి తెగలుగా చెప్పవచ్చు. బేడార్ తెగలు వివాహం విషయంలో బిడ్డలను పెళ్లిచేసుకునే సంప్రదాయం అమలులో ఉంది. వివాహం ముందు వరకు లైంగిక వాంఛలను తీర్చుకోవచ్చు. ఒకవేళ గర్భం దాల్చితే మాత్రం అతడిని తప్పకుండా వివాహమాడాలి. బహుభార్యత్వానికి అనుమతి ఉంది. బేడార్ తెగల్లో ఒక వ్యక్తి ఎక్కువమంది భార్యలను ఉంచుకోవడానికి అనుమతి ఉంది. ఇలాంటి కట్టుబాట్లు నియమాలను బట్టి బేడార్ కుల మహిళలు అనాగరిక తెగ జీవనం గడిపినట్టుగా చరిత్ర చెబుతుంది.

బేడార్‌లలో వివాహాన్ని ఉత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహిస్తారు. పెళ్లికూతురుకు ఇంటివద్ద ఐదుస్తంభాలతో నిర్మించిన పెళ్లిమండపంలో స్థానికంగా ఉండే కులాలవారిని ఆహ్వానించి జరుపుకుంటారు. ఐదురోజులపాటు బేడార్ తెగ కట్టుబాట్ల ప్రకారం వివాహం జరుగుతుంది. వివాహ క్రతువులో భాగంగా మూడోరోజు నిర్వహించే భూమా, నాల్గోరోజు జరిపే దాండియా కార్యక్రమాలు సైతం నేడు అడవుల్లో నివాసం ఉంటున్న ఆదివాసీల ఆచారాలను పోలివున్నాయి. బేడార్ తెగలో వితంతువులు మళ్లీ తిరిగి వివాహం చేసుకునేందుకు అనుమతి ఉంది. విధవ వివాహం చేసుకోవడానికి తల్లిదండ్రులకు రూ. 12 చెల్లించుకోవలసి ఉంటుంది. విధవ వివాహానికి ఎలాంటి ఆడంబరం నిర్వహించకుండా సాధారణంగా హనుమాన్ దేవాలయంలో వివాహం జరుపుతారు. తర్వాత రోజు తెగ సభ్యులకు విందు భోజనం ఏర్పాటుచేస్తారు. వివాహిత మహిళ విడాకులు తీసుకొని తిరిగి వివాహం చేసుకునే వెసులుబాటు కూడా వీరి కులంలో ఉంది.

## బేడార్ (బోయ) కులస్తులు అనుసరించిన మతం

బేడార్‌లు వైష్ణవ, శైవ మత శాఖలను విశ్వసించారు. వైష్ణవాన్ని విశ్వసించిన బేడార్‌లు రామ, శ్రీ వెంకటేశ్వరస్వామిలను ఆరాధించగా, శైవ బేడార్‌లు పరమశివుడ్ని కొలిచారు. బేడార్‌లలోని మరొక తెగ లింగాయితిజంను విశ్వసించి బసవను ఆరాధించారు. వైష్ణవ, శైవ మత శాఖలను విశ్వసించినప్పటికీ ప్రత్యేకంగా తెగ సంతతికి చెందిన హనుమ, ఎల్లమ్మలను పూజించారు. మరణానంతరం వైష్ణవ బేడార్‌లను కాల్చడం, శైవబేడార్‌లను తూర్పు దిశలో తలపెట్టి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. చనిపోయిన తర్వాత 12 మరియు 13వ రోజునాడు శ్రాద్ధ కర్మలను పురోహితులతో నిర్వహిస్తారు.

## బోయల సాంఘీకహోదా

బేడారుల (బోయ) సామాజిక హోదాను నిర్వహించడం అంత సులభమైన అంశం మాత్రం కాదు. జమీందార్లపై తిరుగుబాటు చేసిన కాలప్పు మహారాష్ట్రలో రాజ్యాన్ని స్థాపించినప్పటికీ సామాజికంగా ఆ కులస్తులను అపరిశుభ్రత కలిగినవారిగా (మాత్రమే) అంటే అంటరాని వారుగానే నాటి నుంచి నేటివరకు అదే హోదాను కలిగివున్నారు. ఇక బేడార్‌ల ఆహారపు అలవాట్లను పరిశీలిస్తే పంది, కుక్క, నక్క, ఎలుక, బల్లి తదితర చిన్న చిన్న జంతువుల మాంసాన్ని భుజించి సంచార ఆటవిక తెగగానే జీవనం గడుపుతున్నారు.

బేడార్‌లు ప్రధానంగా వేటాడటం, మిలిటరీ సేవలందించడం తమ వృత్తిగా ఎంచుకున్నారు. గ్రామ సంరక్షకులుగా భూస్వాములు, జాగీర్దార్ల వద్ద కొద్దిమంది భూమిలేని కార్మికులుగా కొనసాగుతుండగా మరికొందరు బోయలు వ్యవసాయం చేసుకుంటూ జాగీర్దారులుగా స్థిరపడినారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రాంతంలోని బోయలు అధికంగా జాగీర్దార్లకు పల్లకీలు మోసే వారుగానే జీవనం సాగించారు. బోయల మత, సాంఘీక అంశాలపై చర్చించేందుకు పంచాయితీలు చెప్పడానికి కట్టను వేదికగా ఎంచుకున్నారు.

దక్షిణభారతదేశంలో కాకతీయుల కాలం నుంచి శాసనాలలో బోయల ప్రస్తావన కనిపిస్తోంది. పల్లవ, చోళ రాజ్యాలలో కూడా సైనికులుగానే క్రియాశీల పాత్ర పోషించారు. నెల్లూరులోని బోయకొట్టాలు దీనికి ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. విజయనగర రాజుల కాలంలో బోయలు సైనికుల నుంచి దళపతులు, సేనా నాయకుల వరకు పనిచేసినట్టుగా చరిత్రలో ఆధారాలున్నాయి. గోల్కొండ నవాబుల కాలంలో కొందరు సేనానులుగా చాలామంది వ్యవసాయ కూలీలుగా ఉండిపోయారు. క్రీ.శ. 1724లో దక్కన్‌లో స్థాపించబడిన నిజాం రాజ్యంలో బోయల స్థితిగతులలో చాలా మార్పులు సంభవించాయి. బోయలు ధైర్యసాహసాలకు, నిజాయితీకి మారుపేరుగా జీవనం సాగించారు. హైద్రాబాద్ రాజ్యంలో బోయలు సుంకరి, నీరడి అనే గ్రామసేవకులుగా పనిచేశారు. కర్నాటక, మహారాష్ట్రలలో షెడ్యూల్ తెగలుగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి.

బ్రిటీష్ వలస పాలనలో బోయలు తమ స్వతంత్ర్యాన్ని కోల్పోవడంతో హైద్రాబాద్, ఆర్కాట్ రాజ్యాల సరిహద్దు అడవుల్లో ఆటవిక సంచారజాతిగా కొనసాగిన బోయలను గురించి బ్రిటీష్ చరిత్రకారుడు థర్‌స్టన్, హైద్రాబాద్ రాజ్యంలోని స్థితిగతులను గురించి సిరాజ్-ఉల్-హసన్ అనే చరిత్రకారులు తమ రచనల్లో ఎన్నో అంశాలను ప్రస్తావించారు. బోయలను షెడ్యూల్ తెగలుగానే గుర్తించారు.

**ముగింపు :**

బేడార్‌లు లేదా బోయల పుట్టుకవారి సాంఘీక స్థితిగతులు, సాంఘీక హోదా, జీవన విధానాన్ని పరిశీలించిన పిమ్మట బోయలు ఒక ఆటవిక సంచార తెగలుగా మైసూర్, మరట్వాడా, నిజాం సంస్థానంతోపాటు యితర ప్రాంతాలలో తెగలుగా స్థిరపడినట్టు అవగతమవుతుంది. నేడు వివిధ రాష్ట్రాల్లో బోయలు వివిధ పేర్లతో పిలవబడుతున్నప్పటికీ ఆయా తెగల కట్టుబాట్లు, సంస్కృతి ఆచార వ్యవహారాలలో సారూప్యత కనిపిస్తోంది. మహారాష్ట్రలో ఇప్పటికే రామోసీ బోయలను షెడ్యూల్ తెగలుగా అక్కడ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఆటవిక సంచార తెగలకు చెందిన బోయలు తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో అధికసంఖ్యలో మిగిలిన జిల్లాలో పాక్షిక జన సంఖ్యను కలిగివున్నారు.

60 ఏళ్ల ప్రజాస్వామిక పార్లమెంటరీ తరహాపాలనలో బోయలు సంచార తెగస్థితి నుంచి అడవిని కేంద్రంగా చేసుకొని చుట్టుపక్కల ఉండే మైదాన ప్రాంతాలలో స్థిరనివాసం ఏర్పాటుచేసుకొని నాగరిక జీవనంలో మమేకం అవుతున్నారు. హైద్రాబాద్ రాజ్యంలో తెగలుగా గుర్తించబడిన బోయలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలనలో బోయలను బీసీ-ఏ జాబితాలో చేర్చడంతో తెలంగాణ రాష్ట్రంలోని బోయ కులస్తులు తీవ్ర అన్యాయానికి గురయ్యారు. చారిత్రకంగా బోయల చరిత్రను వారి సాంఘీక స్థితిగతులను లోతుగా పరిశీలించి తెలంగాణ రాష్ట్రంలో బోయలను షెడ్యూల్ తెగల జాబితాలో చేర్చేందుకు చెల్లప్ప కమీషన్ తగు సిఫార్సులు చేసి వాల్మీకి బోయకులస్తులకు న్యాయం చేయాలని మనవి చేస్తున్నాం.

**డా॥సాంబయ్య,**
సికెఎం కాలేజ్, వరంగల్

# దళిత ప్రజల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్



పరాయి దేశ పాలన. అణగారిన నిరుపేద దళిత వర్గం. చుట్టూ పేదరికం నిండిన బడుగు జీవులు. మరో పక్క భారతమాతకు బానిసత్వ శృంఖాలాల నుంచి విముక్తి కలిగించాలన్న ఏకైక దీక్షతో ప్రాణాలను బలిపీఠం ఎక్కిస్తున్న యువ తరంగాలు.

అది 1905 నాటి పరిస్థితి. అలాంటి సంక్లిష్ట దశలో దళితజనోద్ధరణకు ఉదయించిన ఆశాకిరణం బాబూ జగ్జీవన్‌రామ్. కరుడుకట్టిన స్వేచ్ఛావాది. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు. తనలాంటి బడుగు బలహీన దళిత ప్రజల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సంఘ సంస్కర్త. స్వాతంత్ర భారతావనిలో అత్యున్నత పీఠం వరకు అంచెలంచెలుగా ఎదిగి తనదంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న రాజకీయ నాయకుడు. చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చిన మేధావి. ప్రజా సేవకుడు. ఇన్ని మాటలు అనవసరం. ఆయన గురించి చెప్పాలంటే ఒక్క మాట చాలు. మన దేశ రాజ్యాంగ రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషించిన మహనీయుడు డాక్టర్ భీమ్‌రావు అంబేద్కర్ తరువాత దేశంలోని అన్ని ప్రాంతాల దళితులకు ఆశాజ్యోతిగా నిలిచిన ఏకైక నాయకుడు బాబూ జగ్జీవన్‌రామ్.

అందరి ప్రేమను సొంతం చేసుకుని అభిమానులందరి చేత 'బాబూజి' అని పిలిపించుకున్న జగ్జీవన్‌రామ్ 1908 ఏప్రిల్ 5న బీహర్ రాష్ట్రం షాహాబాద్ జిల్లాలోని మారుమూల కుగ్రామమైన చాంద్వాలో (ఇప్పుడు భోజ్‌పూర్ అని వ్యవహరిస్తున్నారు) జన్మించారు. తండ్రి శోభీరామ్ కొంతకాలం బ్రిటిష్ సైన్యంలో పనిచేశారు. ఆ సమయంలోనే ఇంగ్లీషు కూడా ఆయన నేర్చుకున్నాడు. పెషావర్‌లో బ్రిటిష్ సేవలో ఉండగా, వారితో విభేదాల కారణంగా ఉద్యోగం వదులుకుని స్వస్థలం చేరుకుని వ్యవసాయం చేపట్టారు. కాలక్రమంలో ఆధ్యాత్మిక మార్గం పట్టారు.

బాల జగ్జీవన్ ఆరేళ్ల వయసులో పాఠశాలలో అడుగుపెట్టిన కొద్ది కాలానికే తండ్రి మరణం ఆయనను మరింత పేదరికంలోకి నెట్టింది. కాని తల్లి వాసంతీ దేవి శిక్షణలో ఆత్మవిశ్వాసాన్ని, పోరాట పటిమను అలవర్చుకున్నాడు. చదువులో చిన్నతనం నుంచి అద్భుతమైన ప్రతిభ చూపేవాడు. గురువుల అభిమానాన్ని సొంతం చేసుకునేవాడు. ఉన్నత పాఠశాల విద్యను అర్రా పట్టణంలో పూర్తిచేశాడు. ఆంగ్లభాషపై పట్టు సాధించాడు. తోటి విద్యార్థులందరికీ ఆ వయసులోనే నాయకుడుగా మసలుకునేవాడు. ఆ సమయంలో హరిజనులకు ఉపకార వేతనాలను ఇచ్చే అవకాశం ఉపయోగించుకుని ఉన్నత చదువులు పూర్తిచేయాలని ఆయనకు ఎందరో సలహా ఇచ్చారు. కాని తన సామర్థ్యం మీద అపారమైన నమ్మకం ఉన్న జగ్జీవన్ అగ్రవర్ణాల వారితో పోటీపడి మెరిట్ స్కాలర్‌షిప్పు సాధించుకున్నాడు. ఆయన స్వాభిమానానికి ఇంతకన్నా వేరే ఉదాహరణ అక్కరలేదు.

తనలాంటి అట్టడుగు దళితులకు అగ్రవర్ణాల వారి నుంచి ఎదురవుతున్న వివక్ష, అవమానాలు, అత్యాచారాలు చిన్నతనంలోనే అనుభవంలోకి వచ్చాయి. వారి పాఠశాలలో ముస్లింలు, ఇతర దళితుల కోసం ఒక మంచి నీటి కుండ, అగ్రవర్ణాల వారి కోసం విడిగా వేరే కుండ ఉండేవి. ఒకసారి జగ్జీవన్‌రామ్ అగ్రవర్ణాలకు చెందిన కుండను ముట్టుకున్నాడని, వారంతా అందులోని నీటిని తాగేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. దాంతో షెడ్యూల్డు కులాల వారి కోసం మరో కుండను ఏర్పాటుచేశారు. అది జగ్జీవన్‌కు చాలా ఆగ్రహం తెప్పించింది. దాన్ని పగులకొట్టాడు. మరోటి పెడితే దాన్నీ పగులకొట్టాడు. జగ్జీవన్ నిరసనను గుర్తించిన స్కూలు ప్రధానోపాధ్యాయుడు అందరికీ ఒకటే కుండ ఉండాలని ఆదేశాలు జారీ చేశాడు. అప్పుడు శాంతించాడు జగ్జీవన్.

1925లో అనుకోకుండా ఆ స్కూలును సందర్శించిన పండిట్ మదన్ మోహన్ మాలవీయ, జగ్జీవన్ చూపిన ఆంగ్లభాషా నైపుణ్యానికి ముచ్చటపడి కాశీ పట్టణంలో తాను నెలకొల్పిన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో విద్యార్జనకు ఆహ్వానించాడు. అనుకోకుండా అప్పుడే చాంద్వాలోని క్రిస్టియన్ మిషనరీ స్కూలు వారు కూడా జగ్జీవన్ లక్నోలోని తమ స్కూలులో చేరితే అమెరికా చదువుల వరకు ఉచితంగా చదివిస్తామని ఆహ్వానించారు. తల్లి వాసంతీ దేవి ఎంతో ఆలోచించి కొడుకును బెనారస్ విశ్వవిద్యాలయంలో చదువులకే ప్రోత్సహించింది. దళితుల అభ్యున్నతికి మతం మార్చుకోవడం సరైన పరిష్కారం కాదని ఆమె భావించడమే అందుకు కారణం. అంతటి మహా విద్యాలయంలో కూడా ఆయనకు కొన్ని అవమానాలు తప్పలేదు. అక్కడి పనివారు ఆయనకు భోజనం వడ్డించడానికి, ఆయన భోజనం చేసిన కంచం కడగడానికి నిరాకరించారు. అయితే ఆయన వ్యక్తిత్వం అప్పటికే అక్కడి ఇతర విద్యార్థుల అభిమానాన్ని సంపాదించుకుంది. వారంతా ఆయనకు అండగా నిలబడ్డారు. ఎవరి ప్లేట్లు వాళ్లే కడుక్కోవాలని ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నారు.

బాబూజీని 1936వ సంవత్సరంలో నిమ్నజాతుల ప్రతినిధిగా బీహార్ విధాన పరిషత్‌కు ఎంపిక చేశారు. బాబూజీ 1942 ఆగస్టు 7వ తేదీ నాడు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు అఖిల భారత డిప్రెస్ట్ క్లాసెస్ లీగ్‌ను బ్రిటీష్ ప్రభుత్వం రద్దు చేసింది. 1946లో బ్రిటీష్ కేబినెట్ మిషన్ భారతదేశాన్ని సందర్శించినప్పుడు నిమ్నజాతుల తరుపున మహాజరు సమర్పించి, వెంటనే భారతదేశానికి స్వాతంత్రం ప్రకటించాలని బాబూజీ కోరటం జరిగింది.

బాబూజీ 1946లో కేంద్ర ప్రభుత్వంలో 38 ఏళ్ల అతి చిన్న వయస్సులోనే జవహర్‌లాల్ నెహ్రూ గారి కేబినెట్‌లో కేంద్రమంత్రిగా చేరటం జరిగింది. తరువాత 1947లో రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయటానికి, 1963లో ఆయనకు పార్టీ భాద్యతలు అప్పజెప్పారు. 1966లో అఖిల భారత కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు బాబూజీ. 1946 నుండి 1963 వరకు కేంద్ర కేబినెట్‌లో వివిధ శాఖలను సమర్థవంతంగా నిర్వహించారు.

బీహారులోని ససారాం పార్లమెంటరీ నియోజకవర్గం నుండి 1952

నుండి చనిపోయే వరకు ఓటమిని ఎరుగని రాజకీయ దురంధరుడు బాబూజీ. కేంద్ర ప్రభుత్వంలో కార్మిక, ఆహారం, ఉపాధి, పునరావాసం, రవాణా, తంతి, తపాలా, రైల్వే, సమాచార శాఖలను సమర్థవంతంగా నిర్వహించారు. కేంద్ర రక్షణ శాఖా మంత్రిగా ఉన్నప్పుడు బంగ్లాదేశ్ సమస్యపై పాకిస్తాన్‌తో చేసిన యుద్ధంలో పాకిస్తాన్‌పై విజయం సాధించి, దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసే విజయాన్ని సాధించారు బాబూజీ. ఆ తరువాత దేశం ఆహార సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో వ్యవసాయ శాఖను సమర్థవంతంగా నిర్వహించడానికి ఆయనను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా నియమించటం జరిగింది. బాబూజీ ఏ శాఖను నిర్వహించినా సమర్థవంతంగా నిర్వహించటమే కాక, షెడ్యూల్డు కులాలు మరియు తెగలకు రాజ్యాంగంలో పొందుపరిచిన రక్షణలు, హక్కులు, రిజర్వేషన్లు, ఇతర సదుపాయాలను వారు పొందడానికి, అనుభవించటానికి రాజీలేని పోరాటం చేశారు.

1946 నుండి అఖిల భారత కాంగ్రెస్‌ను ప్రభావితం చేస్తూ, భారతదేశ రాజకీయాలను శాసిస్తూ, అతి ముఖ్యమైన నాయకులలో ఒకరిగాను, కాంగ్రెస్ పార్టీకి మూలస్తంభంగా ఉంటూ వచ్చిన బాబూజీ, 1977లో అత్యవసర పరిస్థితి విధింపును వ్యతిరేకిస్తూ కేంద్ర మంత్రి మండలికి రాజీనామా చేసి అదే సంవత్సరంలో కాంగ్రెస్ ఫర్ డెమోక్రసి పేరుతో కొత్త రాజకీయ పార్టీని స్థాపించి, ఎన్నికలలో జనతా పార్టీతో ఎన్నికల పొత్తు పెట్టుకొని విజయం సాధించారు. ఆ పార్టీని తరువాత జనతా పార్టీలో విలీనం చేసి షెడ్యూల్డు కులాల నుండి మొదటి ఉప ప్రధానిగా ఉంటూ రక్షణ శాఖ బాధ్యతలను నిర్వహించారు. జనతా పార్టీ అంత:కలహాల కారణంగా ప్రభుత్వం పడిపోవటంతో 1980లో కాంగ్రెస్ (జె)ను స్థాపించారు. జనతాపార్టీ ప్రభుత్వం పడిపోయినప్పుడు, బాబూజీకి దేశ ప్రధాని అవడానికి అవకాశం ఉన్ననూ, ఆ ఉన్నత పదవిని ఆయన పొందలేకపోయారు.

దేశ శ్రేయస్సే లక్ష్యంగా, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం, జీవితాంతం పోరాడిన బాబూజీ జూలై 6, 1986 సంవత్సరంలో మరణించారు. భారతదేశం గొప్ప రాజకీయవాది, పరిపాలనాదక్షుడు, ఆకళింకిత దేశభక్తుడు, పరిపాలనా దురంధరుడిని కోల్పోయింది. బాబూజీ తన అనుయాములను, అభిమానులను శోక సముద్రంలో ముంచి వెళ్లిపోయారు. కేంద్రస్థాయిలో బడుగులకు ఉన్న ఏకైక నాయకుడిని వారు కోల్పోయారు. ఆ స్థానాన్ని ఆక్రమించే దళిత నాయకుడు భవిష్యత్తులో వస్తాడని ఆశిద్దాం.

దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవకు, ఆకళంకిత దేశభక్తికి, బాబూజీకి దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్న ఇచ్చి గౌరవించవలసి ఉన్నది. (ఏప్రిల్ 5, బాబు జగ్జీవన్‌రామ్ జయంతి)

**రామశేషు**



# మహిళల హక్కులు సంరక్షణ, న్యాయపరమైన చట్టాలు అవగాహన పై టిసిపార్డులో శిక్షణ

మహిళలు హక్కులు, మహిళల సంరక్షణ, వారు తీసుకోవలసిన చట్టాలు, న్యాయపరమైన చర్యలు మొదలగు అంశాలుపై తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి (టిసిపార్డు)లో సెర్ప్ మహిళలకు మూడు రోజులపాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని టిసిపార్డు జాయింట్ డైరెక్టర్ శ్రీ కె.యాదయ్యగౌడ్ ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ జీవితంలో అనేక పాత్రలు పోషిస్తుందన్నారు. కుటుంబ నేపథ్యంలో మంచి కుమార్తెగా, భార్యగా, తల్లిగా, అమ్మమ్మగా మొదలగు ఎన్నో రకాలైన పాత్రలును పోషిస్తూ కుటుంబ ఆర్థిక, సామాజిక, ఆరోగ్యకరమైన సమస్యలును ఎదుర్కొంటుందన్నారు. అంతేకాక నేడు మహిళ గృహసీమ నుండి గగనతలం వరకూ ఎంతో కృషితో పట్టుదలతో ఓర్పు, నేర్పుతో ముందుకు సాగిపోతుందని నేటి మహిళ అని కొనియాడారు.

ఇన్ని విజయాలు సాధించిన మహిళ నేటి సమాజంలో ఇప్పటికే పురుషాధిపత్యంకు గురై ఇబ్బంది పడుతూనే ఉంది. ఇటువంటి ఇబ్బందులు సమస్యలు వచ్చినప్పుడు వెనకడుగు వేయకుండా సమస్యలతో పోరాడి తమను తాము కాపాడుకోవలసిన అవసరం ఉందన్నారు. మహిళలు, పిల్లలు సమాజంలో అనేక సామాజిక, సమస్యలను ఎదుర్కొంటున్న సంగతి మనకు తెలిసిందే. స్వయం సహాయక సంఘం, మహిళా సమాఖ్య, సోషల్ యాక్షన్ సభ్యులుగా మేము అనేక సమస్యలను పరిష్కరించవలసి వుంటుంది. అందుకుగాను మహిళలందరికీ, రాజ్యాంగపు హక్కులు, బాధతలు, చట్టాలపై పూర్తి అవగాహన అవసరం. ఈ శిక్షణ ద్వారా మీకు పూర్తిస్థాయిలో అవగాహన కల్గుతుందన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాల గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి టిసిపార్డు మహిళా విభాగధిపతి శ్రీమతి కుసుమ మాధురి అధ్యక్షత వహించారు.



# సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

**ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్‌రావు**

భగవంతుడు ఎలా మనసు కలిగించాడో తెల్వదుగానీ కాకతీయ రాజులు గొలుసుకట్టు చెరువులు కట్టారు. ఇట్లా 75వేల పైచిలుకు చెరువులు తెలంగాణలోని మేజర్ గ్రామాల్లో నిర్మించారు. ప్రతి చెరువు కట్టమీద పోచమ్మో మైసమ్మో గుడి దాని ముందు కాకతీయ రెడ్డి రాజుల శిలాశాసనాలు కనిపిస్తాయి. కుతుబ్‌షాహీలు ఆ సంప్రదాయాన్ని కొనసాగించారు. అసఫ్‌జాహీలు ఇంకో అడుగు ముందుకేశారు. 1956 నాటికే 20 లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం ఉంది.

తెలంగాణ సాగునీటి కథ రాసుకుంటే రామాయణమంత.. వింటే భారతమంత. కాకతీయ రాజులు, కులీకుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీలు నిర్మించిన చెరువులు ధ్వంసమయ్యాయి. అప్పర్‌మానేర్, కోయిల్‌సాగర్, ఎస్సెల్బీసీ వట్టిపోయాయి. ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టకపోవడం, కరెంటు కోతలు, బిల్లుల మోతలతో రైతు బతుకు దుర్భరంగా మారింది. తెలంగాణ ప్రజలకు నీరు ఇవ్వవలిసిన బాధ్యత మా ప్రభుత్వం మీద ఉంది. ఎవరు అవునన్నా కాదన్నా వంద శాతం ఆ దిశగా మా ప్రస్థానం కొనసాగుతుంది. తెలంగాణ ఉద్యమం మెయిన్ ట్యాగ్‌లైన్ నిధులు, నియామకాలు.. నీళ్లు. రాష్ట్రం ఏర్పడింది కనుక రెండు ఇప్పటికే సాధించుకున్నాం. కావాల్సింది నీళ్ల సమస్యకు పరిష్కారం.

అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా గతం, వర్తమానం , భవిష్యత్‌పై తెలంగాణ సమగ్ర జలదృశ్యం.. యావత్ ప్రజానీకానికి అవగతమయ్యింది! ఏ నది ఎక్కడినుంచి.. ఎక్కడికి పారుతున్నదో.. ఆనకట్టలెక్కడున్నయో.. బరాజ్‌లెన్ని ఉన్న యో.. ఎవరెంత నీటిని తరలించుకున్నారో..! ఒక్కొక్క చుక్క నీటికీ లెక్క చెప్తూ.. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేసిన అపూర్వ ప్రయోగం.. మహాద్భుతాన్ని ఆవిష్కరించింది! తెలంగాణకున్న నీటి వనరుల గొప్పతనంతోపాటే.. ఆరు దశాబ్దాల సమైక్యపాలనలో జరిగిన అన్యాయం లోతెంతో తెలిసింది! ఏ ప్రాజెక్టు వెనుక ఎంతటి కుట్రదాగుందో తేటతెల్లమయ్యింది! రాష్ట్రంలో నిత్యం కరువుకు కారణమేందో కండ్ల ముందు కదలాడింది! అదే సమయంలో.. తెలంగాణ నీటిపారుదలరంగ స్థితిగతులు..

ప్రాజెక్టుల రీడిజైనింగ్ ఆవశ్యకతను ఒక ఉపాధ్యాయుడిలా.. సాగునీటిరంగ మేధావిలా వివరించిన తీరు భవిష్యత్‌పై నమ్మకాన్ని కలిగించింది! త్యాగాల పునాదులపై ఆవిర్భవించిన తెలంగాణ.. బంగారు తెలంగాణ కావాలన్న ఆర్తి ఉన్న మనలో ఒకడిగా.. మన బిడ్డగా.. మన ఇంటి పెద్దగా.. దాదాపు మూడు గంటలపాటు ఏకధాటిగా ముఖ్యమంత్రి విడమర్చిన తీరుతో.. తెలంగాణ మాగాణం కోటి ఎకరాల్లో పసిడి పంటలు పండించనున్న భావి దృశ్యం గోచరించింది! ప్రతి

మాటలోనూ మన హక్కు మేరకు ప్రతి నీటి బొట్టునూ నిలుపుకోవాలనే తపన! ఎండి.. బీటలువారిన తెలంగాణ మాగాణాన్ని పునరుజ్జీవింపజేసేందుకు చేయబోయే కృషిని వివరించడమేకాకుండా.. ఉత్త కాలువలు తవ్వడం కాకుండా.. వరద వచ్చినప్పుడు ఒడిసిపట్టుకునేందుకు ఎక్కడెక్కడ బరాజులు.. రిజర్వాయర్లు కట్టబోతున్నదీ పూస గుచ్చినట్టు వివరిస్తున్న ప్రతి సందర్భంలోనూ తెలంగాణను డెల్టాలా మార్చివేయాలన్న ఆకాంక్ష! అలా చేయగలమన్న విశ్వాసం! వాటర్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ అవతారమెత్తి..

నిండైన తెరలపై.. అధునాతన పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని విహంగవీక్షణం చేయించినట్టు.. ముఖ్యమంత్రి పవర్‌ఫుల్‌గా.. పాయింట్‌లవారీగా ఇచ్చిన ప్రజెంటేషన్.. రానున్న రోజుల్లో చేస్తే.. వ్యవసాయమే చేయాలి అనిపించేంత భరోసానిచ్చింది! కేంద్ర జలసంఘానికి సైతం తెలియని అంశాలను.. పొరుగు రాష్ట్రాలకు సైతం అంతుచిక్కని సంగతులను ల్యాప్‌టాప్‌ముందు కూర్చొని.. గూగుల్ మ్యాప్‌లతో గుట్టువిప్పిన చంద్రశేఖరుడి మేధస్సుకు అఖిల భారతం సెభాషన్నది! రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రజెంటేషన్.. న భూతో న భవిష్యతి అన్న తీరున విఖ్యాతి పొందింది! తెలంగాణ నేలను అడుగడుగూ అధ్యయనం చేసి.. నీటి వాలు, సాలు గురించి అనర్గళంగా.. పొల్లుపోకుండా వివరించగలిగిన అరుదైన ముఖ్యమంత్రిని దేశం తొలిసారి చూసింది!

### కోటి ఎకరాల లెక్క ఇది..

- ఖమ్మం సీతారామ ప్రాజెక్టు ద్వారా 6 లక్షల ఎకరాలు
- దేవాదుల కింద వరంగల్‌లో 6 లక్షలు
- తమ్మిడిహట్టి ద్వారా 2 లక్షల ఎకరాలు
- కాళేశ్వరం ప్రాజెక్టుతో 26 లక్షల ఎకరాలు
- లోయర్ పెనుగంగ ద్వారా 60వేల ఎకరాలు
- పాలమూరు-రంగారెడ్డి ద్వారా 15 లక్షల ఎకరాలు
- ఎస్సెల్బీసీ ద్వారా నల్లగొండలో లక్ష ఎకరాలు
- మహబూబ్‌నగర్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల ద్వారా 8 లక్షల ఎకరాలు
- ఎస్సారెస్పీ స్టేజ్-2లో మిడ్‌మానేరును కాళేశ్వరంతో కనెక్ట్ చేసి నింపుకొంటే 9 లక్షలు, వరద కాల్వ ద్వారా 2 లక్షల ఎకరాలు
- ఆదిలాబాద్ మీడియం ప్రాజెక్టు ద్వారా 1.75 లక్షలు
- నిజాంసాగర్ కింద మరో 2 లక్షల ఎకరాలు
- మొత్తం 96 లక్షల ఎకరాలకు నీళ్లు తీసుకువస్తం.
- ఇప్పటికే 20 లక్షల ఎకరాలకు సాగునీరు

తెలంగాణలో కోటి ఎకరాలకు నీరందించి తీరుతామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. తెలంగాణ ప్రజలకు నీరు ఇవ్వవలిసిన బాధ్యత తమ ప్రభుత్వం మీద ఉందని, వంద శాతం ఆ దిశగా తమ ప్రస్థానం కొనసాగుతుందన్నారు. తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నట్లు కోటి ఎకరాలకు నీళ్లు రావాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ నీళ్లు తెచ్చి తీరుతం. నా తెలంగాణ కోటి ఎకరాల వీణ కావాలి.

ప్రాణం పోయినా సరే... రాజీ పడకుండా నీళ్లు తెస్తం అని సీఎం తెలంగాణ సమాజానికి భరోసా ఇచ్చారు. ప్రతిపాదించిన ప్రాజెక్టులన్నీ ఐదేండ్లలో పూర్తి చేసి రైతన్నల కన్నీరు తుడిచి ఆకుపచ్చ తెలంగాణ సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. శాసనసభలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలంగాణ సాగునీటి రంగాన్ని ఆవిష్కరించిన కేసీఆర్...సాగునీటిరంగం చరిత్రనుంచి ప్రారంభించి, తాజా ప్రాజెక్టుల పరిస్థితి, తెలంగాణ సర్కారు రీ డిజైనింగ్ ద్వారా ఏం సాధించనుంది... అనే అంశాలపై ఉద్వేగభరితంగా మాట్లాడారు. ఆయన ప్రసంగం ఆయన మాటల్లోనే...

### నిధులు, నియామకాలు సాధించుకున్నాం... నీళ్లే మిగిలాయి

మా ప్రభుత్వం మొయిన్ ట్యాగ్‌లైన్ నిధులు, నీళ్లు, నియమకాలు. వీటిలో రెండింటిని ఇప్పటికే సాధించుకున్నాం. నిధులు మన పరిధిలోనే ఉంటాయి కనుక అవి మన ప్రజల వికాసం కోసం ఖర్చు అవుతాయి. నియమకాలు కూడా స్వయం ప్రతిపత్తి కలిగిన రాష్ట్రం కనుక అన్ని రాష్ట్రాల మాదిరిగానే ఉద్యోగాలు ఇక్కడి యువకులకే దక్కుతాయి. ఖాళీలు భర్తీ కావాల్సి ఉంది. ఈ టర్మ్‌లో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం. పరిష్కారం కావాల్సింది నీళ్ల సమస్య. ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వారు మన ముందు పెడుతున్న సమస్య నీళ్లు. ఖమ్మం పోయినా.. నిజామాబాద్ పోయినా అదే ప్రశ్న. తాగునీరు, సాగునీరు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సోదరులు, వ్యవసాయ ఆధారిత జీవితం గడుపుతున్న వారు తెలంగాణకు నీళ్లు ఎప్పుడు వస్తాయి.. ఎలా వస్తాయని ఎంతో ఆసక్తిగా అడుగుతున్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత పరిశ్రమలు, ఐటీ, సంక్షేమం, అత్యంత ప్రాధాన్యమైన ఇరిగేషన్‌లో మన విధానం ఎలా ఉండాలనేది సాకల్యంగా సమీక్ష చేశాం.

### అంతా కుట్రలే..

చివరికి రాష్ట్రం సిద్ధించిన తర్వాత జల విధానంపై సమీక్షిస్తే బయటపడ్డ విషయాలు దారుణం. తెలంగాణ ప్రాజెక్టులంటే అంతరాష్ట్ర వివాదాల్లో పెడతారు. అలాంటి ప్రాజెక్టు ఇచ్చంపల్లి. బీజేపీ నాయకులు, నేటి మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే లక్ష్మణ్, ఇతర నాయకులు గోదావరి జలయాత్ర కూడా చేశారు. అంతరాష్ట్ర వివాదం పేరుతో దీనిని చేపట్టలేదు. అంతర్రాష్ట్ర వివాదాల్లో కూరుకుపోయేలా చేయడం ఒక ఎత్తుగడ అయితే, పర్యావరణ నెపంతో ఆపడం రెండో ఎత్తుగడ. వన్యప్రాణుల పేరుతో ఆపడం ఇంకో ఎత్తుగడ. 2001లో ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2ను అనుమతులు లేవని పెండింగ్‌లో పెట్టారు. టీఆర్ఎస్ పెట్టిన తరువాత దానిపై పోరాటం చేస్తే ఆనాటి ప్రభుత్వం ఉరుకులు పరుగులతో దాన్ని పూర్తిచేశారు.

### రావాల్సింది 1071టీఎంసీల నీరు..

కాగితాల మీద, ఫైళ్లమీద తెలంగాణకు నీటి కేటాయింపులు స్పష్టంగా ఉన్నాయి. గోదావరి, కృష్ణా? నదుల్లో సమైక్య రాష్ట్రంలో ఆనాటి ప్రభుత్వాలు నీటి కేటాయింపులు చేశాయి. దీనిపై మేం సుప్రీంలో కొట్లాడుతున్నాం. ఇదేమాసంలో ట్రిబ్యునల్ వద్ద వాదనలున్నాయి. గోదావరిలో 954టీఎంసీల నీళ్లు ఆనాటి ప్రభుత్వాలే కేటాయించి, సీడబ్ల్యూసీ అనుమతులు తెచ్చారు. కృష్ణాలో 299టీఎంసీల నికర జలాలు, 77 టీఎంసీల మిగులు జలాలు చూపారు. కల్వకుర్తి, నెట్టెంపాడుకు మిగులు జలాలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. మొత్తంగా కృష్ణాలో 376టీఎంసీలు కేటాయించారు. 259 టీఎంసీలు మైనర్ ఇరిగేషన్‌లో రెండు నదులపై చూపారు. ఇందలో 170 టీఎంసీలు గోదావరిలో,

89 టీఎంసీలు కృష్ణాలో చూపారు. మీడియం, మేజర్ ఇరిగేషన్‌లో 1071 టీఎంసీలు కేటాయించినట్లు చూపారు. తెలంగాణలో అడవులు, పట్టణాలు, ఇతరాలు పోను వ్యవసాయం చేసుకునే భూమి 1.65కోట్ల ఎకరాలు ఉంది. ఇంకో లెక్క ప్రకారం 1.11కోట్ల ఎకరాల వ్యవసాయ భూమి ఉందని తేలింది. 1071టీఎంసీల నీరు తెలంగాణకు కేటాయిస్తే కోటిఎకరాల పైచిలుకు భూమి ఎందుకు పారదు?

## దుమ్ముగూడెం టెయిల్‌పాండ్

మనది కానటువంటి, మనకు పనికిరాని భయంకరమైన దగా ప్రాజెక్టు దుమ్ముగూడెం టెయిల్‌పాండ్. వాళ్లు చెప్పేది ఒకటి. ముసుగులో ఒకటి. ఈ ప్రాజెక్టు ద్వారా 1060 టీఎంసీల గోదావరిజలాల్ని టెయిల్‌పాండ్‌లో పోస్తరు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా ఖమ్మంకు గ్రావిటీ ద్వారా వచ్చే నీళ్లను బంద్ పెడతరు. అంటే ఉన్న హక్కును తెలంగాణ కోల్పోవాలి. గ్రావిటీ ద్వారా వచ్చే నీళ్లను బంద్‌పెట్టి, టెయిల్‌పాండ్ ద్వారా వచ్చే నీటిని లిఫ్టు చేసి పాలేరులో పోసుకొని పారించుకోవాలి. దటీజ్ దుమ్ముగూడెం టెయిల్‌పాండ్. అది తెలంగాణ కోసం కట్టిన ప్రాజెక్టు కాదు. ఈప్రాజెక్టుతో ఖమ్మం జిల్లాలో 4500 ఎకరాల అటవీ, 16వేల ఎకరాల రైతుల సాగు భూమిని కోల్పోవాలి. దుమ్ముగూడెం టెయిల్‌పాండ్ ద్వారా ఖమ్మం జిల్లాకు గ్రావిటీ ద్వారా వచ్చే నీళ్లను వదులుకొని లిఫ్టు ద్వారా కరెంటు బిల్లులు కట్టుకొని నీళ్లు తీసుకోవాలె. మరి ఈ ప్రాజెక్టును ఉంచాల్నా? తీసేయాల్నా?

## 450 బాబ్లీలు కట్టారు..

ప్రతిపాదించిన ప్రాజెక్టుల్లో ఇలాంటి ఇబ్బందులు ఉంటే... మనకో పెద్ద ఉత్పాతం వచ్చి పడింది. కొంతమంది నాయకులు మహారాష్ట్ర బాబ్లీ ప్రాజెక్టు కడుతుంద్రంటూ గొడవ పెట్టినరు. చెప్తే భయానకం.. ఇప్పుడు ఏపీ, తెలంగాణ రెండూ ప్రమాదంలో ఉన్నయి. కృష్ణా, గోదావరి నదులపై మహారాష్ట్ర కర్ణాటకలు 450 బాబ్లీలను నిర్మించినవి. ఫలితంగా 35 ఏండ్ల చరిత్రలో ఒక చుక్క నీరు రాకుండా సింగూరు ఎండిపోయింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఒక్క చుక్క నీరు రాలేదు. మరి ఏం చేయాలి? ఎట్ల ముందుకుపోవాలి? ఎట్ల నీళ్లు తెచ్చుకోవాలి?

## నీళ్లిచ్చే ప్రయత్నానికి మోకాలడ్డు...

మంత్రి హరీశ్‌రావు, సలహాదారు విద్యాసాగర్‌రావు, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఆధ్వర్యంలో రెండు హెలికాప్టర్ల ద్వారా కృష్ణా, గోదావరి బేసిన్లలో మొత్తం తిప్పి పరిశీలన చేయించినం. అనేక విషయాలు అధ్యయనం, అవగాహన చేసుకున్న తర్వాత స్థిరమైన నిర్ణయం ఎట్ల తీసుకుంటే తెలంగాణ బాగుపడతది? ఏ పద్ధతుల్లో చేస్తే ప్రాజెక్టులు సత్వరం పూర్తవుతయి.

## కిన్నెరసాని

ఈ ప్రాజెక్టును 1960 లో చేపట్టినరు. ఈ ప్రాజెక్టు ద్వారా తమకు 10-15వేల ఎకరాలకు సాగునీరు వస్తదని కిన్నెరసాని కింద ఉన్న ఆదివాసీలు ఆశపడినరు. అది కేటీపీఎస్ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు తప్ప సాగునీరు ఇచ్చే ప్రసక్తే లేదన్నరు. ఎందుకు? ఇక్కడ పొంగిపొర్లే నీళ్లు ధవళేశ్వరం పోవాలని, కేటీపీఎస్ ఉత్పత్తి ద్వారా జనరేటెడ్ వాటర్ కిందకు పోవాలని. దానికోసం కిన్నెరసాని ప్రాజెక్టును మానవ సంచారంలేని జోన్‌లోకి పెట్టారు. 1996-99లో దీనిని వైల్డ్‌లైఫ్ సాంక్చురీ కింద గుర్తించాలని కేంద్రానికి ప్రతిపాదించారు. ఎక్కడన్నా వన్యప్రాణి కేంద్రం అంటే ఎకో జోన్ 100, 200 మీటర్లు లేకుంటే కిలోమీటర్ ఉంటది. కిన్నెరసాని ప్రాజెక్టు ప్రాంతాన్ని ఎకో జోన్ కింద 10 కిలోమీటర్లగా డిక్లేర్ చేసినరు.

అంటే ఆ పరిధిలో మానవ సంచారం ఉండొద్దు. రాజీవ్‌సాగర్-దుమ్ముగూడెం ప్రాజెక్టు కాలువను కూడా అక్కడినుంచి ప్రతిపాదించారు. అక్కడినుంచి కాలువ 40 కిలోమీటర్లు పోవాలె. అందులో వన్యప్రాణి సంరక్షణ కింద 28 కిలోమీటర్లు అడవుల్లో నుంచి, 18 కిలోమీటర్లు ఈ వన్యప్రాణి ప్రాంతంలో నుంచి ఉంటది.

## పూరా? నదిపైనా అదే పరిస్థితి...

మహారాష్ట్ర ఒక్క నదినీ వదల్లేదు. పూరా? నది(ఇదీ గోదావరికి ఉపనది.) మీద కూడా ఇదే పరిస్థితి. నల్ల నల్ల మార్కులున్నవి... మీడియం, మేజర్ ప్రాజెక్టులు. ఒక్కటికాదు...పూర్ణ, ప్రవర, ముంబ. కృష్ణా, భీమా, పంచగంగ... అన్నీ కలిసి... 450 వరకు బ్యారేజీలు నిర్మించినరు. ఇవన్నీ వివరాలు కేంద్ర జల సంఘంలో ఉండవు. సంవత్సరాల తరబడి కట్టుకుంటూ పోయినరు. ఇప్పుడు మనం అక్కడ పోయి పేచీలు పెడితే రక్తపాతాలు తప్ప పరిష్కారం కావు.

## 1300 టీఎంసీలు ట్యాప్ చేస్తున్న ఎగువ రాష్ట్రాలు..

ఇక నాసిక్.. దాని పక్కన త్రయంబకం. అక్కడే గోదావరి పుడుతుంది. పక్కన నది ప్రవర దాని ఉపనది. దాని ఉప నదులు.. ఎక్కడ చూసినా... ఎక్కడ తెరిచినా... సిరీస్ ఆఫ్ బ్యారేజీలు. ఒకటికొకటి షేక్‌హ్యాండ్ ఇచ్చుకునేటట్లు బ్యారేజీలు నిర్మించినరు. ఒక బ్యారేజీ నీళ్లు ఇంకో బ్యారేజీకి తగులుతయి. అట్ల నది ఎప్పుడూ లైవ్(ఎండిపోకుండా)గా ఉంటది. ఇవన్నీ వాస్తవాలు. గూగుల్ ద్వారా చూస్తే సభ్యులకు అవగాహన ఉంటదని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ కోసం అనుమతి కోరాం. విషయం అర్థం కావాలని ప్రజంటేషన్ తప్ప ఇందుల వేరే ఉద్దేశం కాదు. మహారాష్ట్రలో మన నాగార్జునసాగర్‌లాంటి ప్రాజెక్టు నార్త్‌సాగర్ అంటే మనం జైక్వాడ్ అంటం. దీని సామర్థ్యం 102 టీఎంసీలు.

అంటే నాసిక్‌నుంచి మొదలుకుని ఉపనదులనుంచి వచ్చే నీరు అక్కడ చెరువులు కుంటలు నిండి మైనర్, మీడియం, మేజర్ అన్నీ నిండి... ఆ తర్వాత నదీ మార్గంలోని బ్యారేజీలు నిండిన తర్వాత వచ్చే నీళ్లు జైక్వాడ్‌కు చేరుతయ్. అక్కడ 102 టీఎంసీలు నిండి.. అప్పటికీ వర్షం కురిస్తే తప్ప మనకు నీళ్లు రావు. అందుకే ఈ ఏడాది మంజీరా, ఎస్సారెస్పీ, శ్రీశైలంలకు చుక్కరాలేదు. ఇక బాబ్లీ.. ఇది గోదావరి మీద మహారాష్ట్ర కట్టిన ఆఖరి బ్యారేజీ. చూస్తే ఇక్కడ కూడా నది లైవ్‌గా ఉంటది. అంటే నాసిక్‌నుంచి మొదలు పెట్టి బాబ్లీ దాకా ఇదే స్థితి.

## ఎస్సారెస్పీ నీళ్లు ఇక రావు..

ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు ఆశించిన తెలంగాణ ఇవ్వాలి. ఇక ముందు ఎస్సారెస్పీ నీళ్లు రావు. ఆశలు అడుగంటినవి. పైవన్నీ నిండి.. దేవుడు కరుణించి భారీ వర్షాలొస్తే మనకు నీళొస్తయి. సింగూరు ఎండిపోయినది ప్రత్యక్షంగా ఈ సంవత్సరం మనం చూస్తున్నం. గోదావరి నీళ్లు తెచ్చుకోకుంటే హైదరాబాద్ బతుకుతుండెనా? హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్, సింగూరు, మంజీర పూర్తిగ ఎండిపోయినయి.

గోదావరి నీళ్లు వచ్చినవి కాబట్టి హైదరాబాద్‌ను కాపాడుకుంటున్నం. ఇలాంటి విపత్కర పరిస్థితి. ఈ సందర్భంలో తెలంగాణ ప్రాజెక్టులు కట్టుకోవాలంటే రీడిజైనింగ్ చేయాలా? వద్దా?

### తెలంగాణ బార్డర్ ఆనుకుని బ్యారేజీలు...

మహారాష్ట్ర, కర్నాటకలు ఎంత భయంకరంగా బ్యారేజీలు కట్టుకున్నరంటే.. మనకు రెండు చిన్న ప్రాజెక్టులున్నయి. ఒకటి మెదక్ జిల్లాలోని నల్లవరం, రెండోది కౌలాస్ నాలా. ఇది నిజామాబాద్‌లో ఉంది. ఒక్క టీఎంసీ ప్రాజెక్టు. జుక్కల్ నియోజకవర్గంలో 6-7వేల ఎకరాలకు నీళ్లొస్తయి. ఈ ప్రాజెక్టు నెత్తిమీదనే. మహారాష్ట్ర రెండు బ్యారేజీలు కట్టుకుంది. మన తెలంగాణ బార్డర్‌కు ఆనించి కట్టుకున్నరు. అందుకే మనం ప్రమాదకర పరిస్థితుల్లోకి పోతున్నం.

### లిఫ్టులతో తోడేస్తున్నరు..

కృష్ణా నదిపై మహారాష్ట్ర, కర్ణాటక ఇబ్బడిముబ్బడిగా బ్యారేజీలు కట్టుకున్నవి. బ్యారేజీ కట్టడం.. దాని పక్కన లిఫ్టులు పెట్టుకోవడం. అందుకే అక్కడ నది లైవ్‌గా ఉంటది. బ్యారేజీ టు బ్యారేజీ. వాళ్లు అదృష్టవంతులు. అందుకే అట్ల చేసుకున్నరు. లెక్క తీస్తే 450 బ్యారేజీలు. పరిశోధిస్తే ఇవి దొరికినవి. ఏ అధికారులు ఇచ్చినవి కావు. అడిగితే ఇయ్యను కూడా ఇవ్వరు. గూగుల్ మ్యాపులు పరిశోధించి పట్టుకున్నవి. ఈ విధంగా కృష్ణా, గోదావరి, వీటన్నింటిపైనా బ్యారేజీలు కట్టిన మూలంగా దుర్భర పరిస్థితి నెలకొంది.

### ధవళేశ్వరం నీళ్ల కోసం సమైక్య కుట్రలు..

ఇక ఖమ్మం జిల్లా. ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ రెండు ప్రాజెక్టులు గత ప్రభుత్వం తీసుకున్నవి. ఏపీలో కలిసిన ఏడు మండలాలు గతంలో తెలంగాణలో ఉండేవి. అప్పట్లో రుద్రమకోట అనే ప్రాంతంలో ఇందిరాసాగర్ ప్రాజెక్టు హెడ్‌వర్క్స్,ఇన్‌టేక్ లెవల్ పాయింట్ పెట్టారు. ఇపుడు అవి ఏపీలోకి పోయినయి. నీళ్లు కావాలంటే అక్కడ పంపుహౌజ్ పెట్టి నీళ్లు తెచ్చుకోవాలె. అదంతా ఆంధ్రప్రదేశ్‌లోకి పోయిన దరిమిలా నీళ్లు తెచ్చుకోలేం. అది మన చేతుల ఉండదు. మరి ఈ ప్రాజెక్టుకు రీడిజైనింగ్ చేయాలా? వద్దా? తెలంగాణకు నీళ్లు రావాలి... అది ఎట్ల?

### పెనుగంగపైనే 80-100 టీఎంసీల స్టోరేజీ...

గూగుల్ మ్యాప్‌ను చూపిస్తూ..పచ్చ మార్కు తెలంగాణ రాష్ట్ర పరిధి. పక్కకు కనిపించే రెడ్‌మార్కులు ప్రమాదకరమైనవి. పెన్‌గంగ(గోదావరి ఉపనది)తో ప్రారంభిస్తున్న. 31బ్యారేజీలు కట్టారు.. మరో 9 నిర్మాణంలో ఉన్నవి. పెనుగంగపై ఉన్న ఈ బ్యారేజీల వివరాలు కేంద్ర జల సంఘంలో ఉండవు. మహారాష్ట్ర ఎప్పుడు ఎవరు అడిగినా, ఇతర రాష్ట్రాలు, కేంద్ర జల సంఘం అడిగినా ఒకే సమాధానం చెప్తది. అదేందంటే... మాకు కేటాయించిన నీళ్ల పరిమితలోనే ఉన్నం అంటరేగానీ ఈ వివరాలు సమర్పించరు. అసలు ఏంది కథ అని ఒక సందర్భంలో రాత్రి 2-3 గంటల వరకు నేను వ్యక్తిగతంగా, సహాయకులతో గూగుల్ మ్యాపులు అంగుళం అంగుళం పరిశోధన చేసి తీసిన సమాచారం ఇది. గూగుల్ మ్యాపుల ద్వారా వందల గంటలు శ్రమించి ఈ వివరాలు తెలుసుకున్నం.

ఈ కట్టిన బ్యారేజీలన్నీ షేక్ హ్యాండ్ బ్యారేజీలు(ఒక బ్యారేజీ నుంచి రెండో బ్యారేజీదాక నిండుగా నీళ్లు ఉంటాయి. కింది బ్యారేజీ నీరు పై బ్యారేజీని తాకుతూ ఉంటుంది.) మ్యాప్‌లో కనిపించే రెడ్ మార్కులన్నీ బ్యారేజీలే. వీటి ఫలితం ఏమిటి? పెన్‌గంగ నుంచి ప్రవాహం ద్వారా మనకు వస్తయనుకున్న నీళ్లు రావు. ఈ 40 బ్యారేజీలు ఒక్కోటి 1, 2, 3 టీఎంసీల సామర్థ్యం సరాసరి 2-2.5 టీఎంసీలు అనుకున్నా 80-100 టీఎంసీల నీళ్లు బ్యారేజీల దగ్గర ఆగుతయి. అంటే అక్కడ భారీ వర్షాలు పడి వారి చెరువులు నిండాలి. ఉపనదులు, వాగులు వంకలు దాటి మీడియం ప్రాజెక్టులు నిండాలి. అవన్నీ సర్‌ప్లస్ కావాలి. ఆతర్వాత ప్రవహించి మేజర్ ప్రాజెక్టులు నిండాలి. మళ్లీ వర్షాలు కురవాలి. బ్యారేజీలు నిండాలి. ఆతర్వాత మళ్లీ వర్షం కురిస్తే మనకు నీళ్లు. లేకుంటే రావు. అది ఈ బ్యారేజీల వల్ల పరిణామం. రెడ్ మార్కు ఉన్న చోట్ల బ్యారేజీలున్నాయి. దానికి ముందు లిఫ్టులు. ఇట్లా ప్రతిచోటా కట్టినరు. బ్యారేజీలు కట్టే అవకాశంలేని చోట కూడా డైరెక్ట్‌గా లిఫ్టు పెట్టుకున్నరు. ఇదీ పరిస్థితి.

### దేవాదుల గాథ ఇది..

నేను స్వయంగా అక్కడికి పోయిన. అక్కడ ప్రజా సంఘాలతో, ఆదివాసి నాయకులతో మాట్లాడిన. మేమే మునగాల్నా అని వారంటారు. అక్కడా అంతర్రాష్ట్ర వివాదం. యథావిధిగా నీళ్లు ధవళేశ్వరం పోవాలి. ఏ ప్రాజెక్టు చూసిన ఇదే పద్ధతి. ఇపుడ దేవాదులను రక్షించుకోవాలి.. వరంగల్ జిల్లాకు నీళ్లు తెచ్చుకోవాలి. ఛత్తీస్‌గఢ్‌తో వివాదం లేకుండా ఖమ్మం జిల్లా, వరంగల్ జిల్లాల మధ్య తుపాకుల గూడెం వద్ద బ్యారేజీ నిర్మిస్తున్నాం. ఇక్కడ రెండువైపులా తెలంగాణ రాష్ట్రమే ఉంటుంది. 11,500 ఆదివాసీల భూముల ముంపు లేకుండా పొలాలకు నీళ్లు పారుతాయి. ఇది ప్రజలకు నష్టమా..? తెలంగాణకు ప్రమాదమా? సభ్యులు చెప్పాలి.

### మంచి సూచనలు చేయండి

రైతుల కన్నీళ్లు చూసి తెలంగాణలో శాశ్వత కరువు లేకుండా చేద్దామని అనుకుంటున్నాము. మనకు కావాల్సింది.. మహారాష్ట్రతో పంచాయితీనా? మన పొలాల్లోకి నీళ్లా? ప్రభుత్వం పంచాయితీలకు పోదు. భేషజాలకు పోయి పిచ్చి పంచాయితీలు పెట్టుకోదలచుకోలేదు. మహారాష్ట్రతో సయోధ్య కొనసాగిస్తాం. ఆ రాష్ట్ర సీఎంను రప్పించి కాళేశ్వరం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తం. ఆఘమేఘాల మీద పనులు చేపడతం. కలిసి వచ్చే వాళ్లు కలిసిరండి. మంచి సూచనలు చేయండి.

### ఇదీ మన జలవనరుల చరిత్ర..

మన కాకతీయ, రెడ్డి రాజులు వాటర్‌షెడ్‌ను చేపట్టి ప్రపంచానికి చూపారు. 75 వేల పైచిలుకు గొలుసుకట్టు చెరువులు కట్టారు. కులీకుత్‌బ్‌షాహీ రాజులు వేటకు పోయి నౌబత్‌పహాడ్ ఎక్కినప్పుడు కనిపించిన సరస్సు హుస్సేన్‌సాగర్. ఇంతమంచి జలవనరును తటాకంగా ఎందుకు మార్చకూడదు.. అని హుస్సేనీశావలికి నిర్మాణ బాధ్యత అప్పగిస్తే దాన్ని పూర్తిచేశారు. అసఫ్‌జాహీలు ఇంకో అడుగు ముందుకేశారు. కాకతీయుల కాలంలో కట్టిన లక్నవరం, రామప్ప, పాకాల, గణపురం చెరువులు 50వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాయి. నిజాం ఫ్రాన్స్ టెక్నాలజీతో నిజాంసాగర్ ప్రాజెక్టును నిర్మించారు. ప్రపంచంలో తొలి అతిపెద్ద మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఇది. 2.5లక్షల ఎకరాలకు నీరు అందించారు. గణపురం, అప్పర్‌మానేరు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను అసఫ్‌జాహీలు కట్టించారు. ఇదంతా చరిత్ర. ఇవన్నీ వాస్తవాలు. ఎవర్నో విమర్శించడానికో, నిందించడానికో కాదు.

పొరుగు రాష్ట్రంగా ఇచ్చిపుచ్చుకోవాలని చంద్రబాబుకు చెప్పిన. కలహించుకోవడం మంచిది కాదు. కృష్ణా, గోదావరి నీటిని అందుబాటులో ఉన్నంత వరకు కలిసి వాడుకుందాం. ఈసభ ద్వారా ఏపి సిఎం చంద్రబాబుకు అప్పీల్ చేస్తున్నా.

**ఐ & పిఆర్, తెలంగాణ**



# ఆరోగ్య తెలంగాణ దిశగా అడుగులు

సీఎం కేసీఆర్ చెబుతున్న బంగారు తెలంగాణ అంటే ఆరోగ్య తెలంగాణ అని ఆచరణలో రుజువు చేస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాలతో, పథకాలతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు, సంస్కరణలు తెస్తున్న సీఎం కృషికి వైద్య ఆరోగ్య సిబ్బంది అంతా అండగా నిలుస్తుంది.

ప్రజారోగ్యం అనేది కేవలం డాక్టర్లు, దవాఖాన ల సమస్య కాదు. అది సామాజిక న్యాయానికి సంబంధించిన సమస్య అని సీఈఏ విన్స్లో అన్నా రు. సరిగ్గా ఈ విధంగానే.. ప్రజారోగ్యాన్ని గురించి, దాని ప్రాధాన్యం గురించి గుర్తెరిగిన కేసీఆర్ ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. ఆరోగ్య తెలంగాణతోనే బంగారు తెలంగాణ సాధ్యమని చాటి చెబుతున్నా రు. అయితే ముప్పై ఏళ్లుగా రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థ తీవ్ర నిర్లక్ష్యానికి, వివక్షకు బలైంది. ప్రభుత్వ హాస్పిటళ్లు నిర్లక్ష్యానికి బలైపోయాయి. గత ప్రభుత్వాల తీరు చూస్తే.. 1994-2004దాకా ప్రభుత్వ ఆస్పత్రులన్నీ తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొన్నాయి. సరిపోయినన్ని నిధులు అనేక విధాలుగా సతమతమయ్యా యి. రోగులకు కనీస సేవలనూ అందించలేకపోయాయి. ఈ పరిస్థితులన్నీ ప్రభు త్వ ఆస్పత్రుల వ్యవస్థ అనేదే ప్రజల విశాసాన్ని కోల్పోయింది. 2004-06ల మధ్య అప్పటి పాలకులు ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా మరో పోటీ ప్రైవేటు వ్యవస్థను ప్రోత్సహించాయి.

వివాదాస్పద ఆరోగ్యశ్రీపథకాన్ని 2007 ఏప్రిల్‌లో ప్రారంభించారు. దీంతో ప్రజల సొమ్మంతా కార్పొరేట్ హాస్పిటల్స్‌కు చేరిందనే విమర్శలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఆస్పత్రులన్నీ అన్నివిధాలుగా కూనారిల్లిపోయాయి. సరైన పరికరాలు, వైద్య సదుపాయాలు, వసతులు.. చివరికి భవనాలు, పరిశుభ్రతకు కూడా నోచుకోలేదు. దీంతో ఒక రకం గా ప్రభుత్వ ఆసుపత్రులన్నీ నిర్వీర్యమైపోయాయి. అనేక హెల్త్ సర్వేలు చెప్పిందేమంటే.. ప్రజారోగ్య వ్యవస్థ కనిష్ట స్థాయిలో ఉన్నది. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులు అవసాన దశకు చేరుకున్నాయి.

సరిగ్గా ఈ పరిస్థితిలో తెలంగాణ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పూర్వవైభవం తెచ్చేందుకు పూనుకున్నది. ముఖ్యమంత్రి ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసి బడ్జెట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా కేటాయించారు. ప్రభుత్వ ఆసుపత్రులన్నింటిలో.. పీహెచ్‌సీల నుంచి నిమ్స్ దాకా సకల సదుపాయాలు కల్పించి పేదలకు ఆరోగ్య సేవలు అందేలా చర్యలు చేపట్టారు. 1957 నుంచి హైదరాబాద్‌లో ఒక్క మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కూడా ఏర్పాటు చేయలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పడ్డనాడు ఏడు లక్షల జనాభా ఉన్నది నేడు కోటికి చేరుకున్నది. ఇంత జనాభాకు ఉస్మానియా, గాంధీ హాస్పిటళ్లే సేవలు అందించాలంటే ఎంత సంక్లిష్టమో చెప్పనక్కరలేదు. ఈ పరిస్థితుల్లో సీఎం కేసీఆర్ నగరంలో నాలుగు దిక్కులా నాలుగు సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లు నెదర్లాండ్ నిధుల సాయంతో నిర్మించాలని తలపెట్టారు. దీనిద్వారా పేద, మధ్య తరగతి ప్రజానీకానికి వైద్య సేవలు అందుబాటులోకి తెవడానికి కృషి చేస్తున్నారు. అలాగే కాలేయ మార్పిడి లాంటి చికిత్సలు ఉస్మానియా, గాంధీలలో నిర్వహించి కార్పొరేట్ హాస్పిటళ్ల కన్నా తామేమీ తక్కువ కాదని చాటిచెప్పాయి. అలాగే జిల్లా స్థాయి ఆస్పత్రులన్నింటిలో ఇంటెన్సివ్‌కేర్ యూనిట్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కార్పొరేట్ హాస్పిటళ్లపై ఆధారపడటం తగ్గి ప్రజలకు ఎంతో భారం తగ్గుతుంది.

గతంలో చూస్తే.. 2013-14 బడ్జెట్‌లో ఆరోగ్యానికి 6482కోట్లు కేటాయించా రు. ఈ బడ్జెట్ మొత్తాన్ని జనాభా నిష్పత్తి (58:42)ప్రకారం పంచితే తెలంగాణకు దక్కింది 2722 కోట్లు మాత్రమే. తెలంగాణ





వచ్చిన తర్వాత మన పాలనలో ఆరోగ్యానికి రెండింతలు అంటే 5,967కోట్లు కేటాయించింది. దీంతో మందుల కోసమే 225 కోట్లు కేటాయించారు. దీంతో పేద వర్గాలు ఇక నుంచి తమ సంపాదన నుంచి మందుల కోసం వెచ్చించాల్సిన అవసరం ఉండదు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరికరాల కోసం 600 కోట్లు కేటాయించారు. ఇన్నాళ్లూ సరైన వైద్య పరికరాలు లేక ప్రభుత్వ దవాఖానలు రోగులకు వైద్య సేవలు అందించడంలో వైఫల్యం చెందాయి. 30–40 ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

వైద్య పరికరాల కోసం మరో 230 కోట్లు కేటాయించారు. ఇది గతంలో కన్నా 225శాతం ఎక్కువ. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాగ్నోసిస్‌వ్యై పరీక్షల కోసం కూడా 300 కోట్లు కేటాయించారు. దీంతో రోగులు ప్రతి పరీక్ష కోసం ప్రైవేటు హాస్పిటళ్లకు, డయాగ్నోస్టిక్ సెంటర్లకు పరుగెత్తే పరిస్థితి ఉండదు. అంతే కాకుండా.. ఆపదలో ఆదుకునే 104,108 సర్వీసుల కోసం మరో 104 కోట్లు కేటాయించారు. ఇది గ్రామ స్థాయి నుంచి పేద,మధ్య తరగతి ప్రజలందరికీ ఉచిత అత్యవసర సేవలు అందుబాటులోకి వస్తాయి. అలాగే చరిత్రలో మొదటి సారి పరిశుభ్రత కోసం వంద కోట్లు కేటాయించడం జరిగింది. గతంలో ప్రభుత్వ ఆస్పత్రులంటే.. అపరిశుభ్రతకు ఆలవాలంగా ఉండేవి. ప్రభుత్వ దవాఖాన అంటేనే.. సరైన పారిశుధ్యానికి నోచుకోక సకల రోగాలకు నెలవుగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితి దూరం కానున్నది.

తెలంగాణ ప్రజలందరికీ అన్నిరకాల వైద్య పరీక్షల అందుబాటులో ఉంచేందుకు 40 వైద్య పరీక్షా (డయాగ్నోస్టిక్ సెంటర్లు) కేంద్రాలను జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇవి కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నారు. అలాగే 40 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజలందరికీ అందుబాటులో ఉండేట్లు చూస్తున్నారు. దీంతో కిడ్నీ రోగులకు ఎంతో ఊరట కలుగుతుంది. అన్నింటి కన్నా ముఖ్యంగా.. పేదల సాయం కోసం ఎమర్జెన్సీ కాంటిజెన్సీ ఫండ్ కూడా 56 కోట్లు ఏర్పాటు చేశారు. ఈ నిధులు ఆయా ఆస్పత్రుల సూపరింటెంట్లు, డీఎంఈ/డీపీహెచ్‌ల ఆధ్వర్యంలో ఉండి అవసరమైన వారికి అందుబాటులో ఉంటాయి. గతంలో ఆస్పత్రుల్లో ఏ చిన్న పరికరం చెడిపోయినా, అవసరం ఉన్నా దాని కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. అత్యవసరాలకు ఎప్పుడూ అందుబాటులో నిధులు ఉండటం మూలంగా రోగులకు వైద్యసేవలు సరైన రీతిలో, సరైన సమయంలో అందుతాయి.

అప్పుడే పుట్టిన పిల్లల సంరక్షణ కోసం న్యూ బార్న్ కిట్స్ కు మూడు కోట్లు కేటాయించారు. దీంతో శిశు మరణాలు గణనీయంగా తగ్గిపోతాయి. అలాగే తెలంగాణ ప్రభుత్వం జిల్లాల్లోనే ఏడు పీహెచ్‌సీలను 24 గంటలు వైద్య సేవలు అందించే ఆస్పత్రులుగా అభివృద్ధి చేస్తున్నది. వీటి కోసం రెండు కోట్లు కేటాయించింది. దీంతో వైద్య పరిశోధనల కోసం ప్రభుత్వం 12 కోట్లు కేటాయించింది. దీంతో వైద్య పరిశోధనల్లో కొత్త శకం ఆరంభం కానుంది. అలాగే పేద వర్గాలకు అండ గా నిలిచేందుకు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొం దుతూ చనిపోతే.. వారిని ఊరి దాకా చేర్చేందుకు వాహన సౌకర్యమూ అందుబాటులోకి తెచ్చింది.

ఈ బడ్జెట్ కేటాయింపులతోనే మన ముఖ్యమంత్రి వైద్యానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని చెప్పుకోవచ్చు. చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా ఇత ర రాష్ట్రాల్లో మెరుగైన వైద్య సేవలు ఏ రూపంలో అందుతున్నాయి, వాటి నిర్వాహణ ఎలా ఉన్నదనేది అధ్యయనం చేయడం కోసం కేరళ, తమిళనాడు రాష్ట్రాలను సందర్శించారు. ఆరోగ్యమంత్రి తమిళనాడు, శ్రీలంక దేశాన్ని సందర్శించి అక్కడి వైద్య విధానాలను అధ్యయనం చేశారు. మనకంటే మెరుగైన రీతిలో వైద్యసేవలు అందిస్తున్న కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలను సందర్శించి అక్కడి ప్రజారోగ్య విధానాలను అధ్యయనం చేశారు. ఈ అధ్యయనాల పునాదిగా రాబోయే కాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

మెరుగైన వైద్య సేవలు, సౌకర్యాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న మిషన్ కాకతీయ, అందుబాటులోకి వస్తున్న కృష్ణ, గోదావరి నదీజలాలు ప్రజల దాహార్తి ని తీర్చడంతో పాటు కరువును పారదొలుతున్నాయి. తెలంగాణ అంతా సస్యశ్యామలమై సమ ృద్ధిగా పండే ఆహారపంటలతో బలవర్ధకమైన ఆహారంతో ఆరోగ్య తెలంగాణ విష్కృతమవుతుంది. సీఎం కేసీఆర్ చెబుతున్న బంగారు తెలంగాణ అంటే ఆరోగ్య తెలంగాణ అని ఆచరణలో రుజువు చేస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాలతో, పథకాలతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు, సంస్కరణలు తెస్తు న్న సీఎం క ృషికి వైద్య ఆరోగ్య సిబ్బంది అంతా అండగా నిస్తుంది. ప్రభుత్వ ఆశయాన్ని నిజం చేయడంలో తమ వంతు కర్తవ్యాన్ని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది తమ వంతు కర్తవ్యాలను నెరవేరుస్తుంది.

**డాక్టర్ పుట్ట శ్రీనివాస్**

–(రచయిత: తెలంగాణ మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్,
– కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్)



# దళిత బహుజనుల ఆశాకిరణం డా॥బి.ఆర్.అంబేద్కర్ (1891-1956)

**డా**క్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు వింటేనే మనకు స్ఫురణకు వచ్చేది బహుజన ఉద్ధరణ, బహుముఖ ప్రజ్ఞాశీలత. అభాగ్యులంతా ఏకమైన తమదైన సంక్షేమరాజ్యం స్థాపించాలన్న తపన. శతాబ్దాలుగా పాతుకుపోయిన నిమ్నజాతుల నిరాశా నిస్పృహలను పటాపంచలు చేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని పాదుకొలిపిన ఆ మహనీయుని జీవితమే ఒక పోరాటం.

**'కులగొట్టుడు కులమత కుటిలతలను**
**సమము చేయుడు మానవ సామ్యములను**
**పీడిత జనమ్ము న్యాయము వేడెనేని**
**మకర కుండలములు మిమ్ము మనుపగలవె"** – బోయి భీమన్న

బహుజనుల హక్కుల కోసం పోరాడిన అమరుడు. శ్రామిక జీవుల పక్షపాతి. పీడితులను జాగృతం చేసిన ఉద్యమశీలి. రాజ్యాంగ నిర్మాణంలో కీలక భూమిక నిర్వహించి, మేధోవర్గ ప్రతినిధిగా ప్రాచుర్యం పొందిన అంబేద్కర్ మానవీయ విలువల పరిరక్షణకు, మానవ హక్కుల సముద్ధరణకు అశేష కృషి చేశారు. బాబాసాహెబ్ – అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14వ తేదీన రాంజీ, భీమాబాయి దంపతులకు జన్మించాడు. తల్లిదండ్రులు అతనికి పెట్టిన పేరు భీమారావు. గ్రామనామాన్ని బట్టి స్కూల్లో అతని ఇంటిపేరు అంబావదేకర్ తరువాత ఇతనిని అమితంగా అభిమానించే ఒక ఉపాధ్యాయుడు ఆ పేరును తన ఇంటిపేరు మీదుగా అంబేద్కర్‌గా మార్పించాడు. ఆ పేరుతోనే అంబేద్కర్ ప్రసిద్ధుడైనాడు.

రాంజీ పూర్వీకులు కొంకణ ప్రాంతానికి చెందినవారు. రత్నగిరి జిల్లాలోని మంజెన్‌గడ్‌కు అయిదు మైళ్ల దూరంలో ఉన్న 'అంబావదే' రాంజీ వంశీయుల స్వగ్రామం. వీరి కుటుంబానికి ఆ గ్రామంలో ఒక ప్రత్యేక గౌరవం ఉండేది. అంబేద్కర్ తాతగారైన మాలోజీ సక్‌పాల్ మహర్ కులానికి చెందినవాడు. నిమ్నజాతి కులాలన్నింటిలోను మహర్లు కొంత సాహసవంతులుగాను, బుద్ధిబలం, వివేకం, ఉత్సాహం కలవారుగాను కనిపిస్తారు. రాంజీసక్‌పాల్‌కు పద్నాలుగుమంది సంతానం. వారిలో అంబేద్కర్ పద్నాల్గవవాడు. అంబేద్కర్‌కు ఆరేళ్ల వయస్సునాటికి తల్లి భీమాబాయి మరణించింది. తల్లి మరణం తరువాత తండ్రి రెండో వివాహం చేసుకోవడం ఇష్టంలేక ఒక విధమైన ఆగ్రహం, ఉద్వేగం అతనిని చుట్టుముట్టాయి. ఆ ఆవేశంతో ఇంట్లో ఉండకూడదనీ, తండ్రిపై ఆధారపడకూడదనీ నిశ్చయించుకున్నాడు. బాగా చదువుకోవాలనీ నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయమే అతని జీవన విధానాన్నే కాదు, భారతదేశంలో దళిత వర్గాల జీవితాలనే మార్చివేసింది.

విద్య ద్వారానే ఆలోచన పెరుగుతుందని, ఆలోచనాపరుడు మంచి చెడుల సమన్వయాన్ని సులభంగా అర్థం చేసుకోగలడని విశ్వసించిన అంబేద్కర్ తన జాతి జనులను అవిద్య నుంచి దూరం చేసేందుకు చాలానే కృషి చేశారు. హక్కులను, బాధ్యతలను సమానంగా పొందుపరిచి భారత రాజ్యాంగంలో వాటి ఆచరణను సాకారం చేసే విధానాలను విస్తృతంగా ప్రచారం చేశారాయన. అంటరానితనం మానవజాతికి పట్టిన పీడలా భావించిన అంబేద్కర్ దాని నిర్మూలన కోసం అనేక విధాలుగా ప్రయత్నం చేశారు. రాజ్యాధికారం ద్వారానే ఏ జాతి జనులైనా పూర్తి స్వేచ్ఛను అనుభవించగలమని నమ్మిన బాబాసాహెబ్ అయిష్టంగానే రాజకీయ రంగ ప్రవేశం చేశారు.

**'విద్య, అభిరుచి, గుణము, ప్రవృత్తి, వృత్తి**
**నిర్ణయించును నరుని సాంఘికపు విలువ;**

**రాదు జన్మను బట్టి అర్హత ఎవనికి;**
**అర్హతమపేక్ష చేయుట ఆత్మహత్య** – బోయిభీమన్న

విదేశాలకు వెళ్లి, బారిస్టరుగా ఉన్నత విద్యనభ్యసించి భారతదేశానికి తిరిగి వచ్చాడు. వచ్చిన వెంటనే ఆయన చేసిన పని 'ముక్‌నాయక్' (నిశ్శబ్దవీరుడు) అనే పత్రికను 1920 జనవరి 31న స్థాపించటం. ఆ పత్రికలో కులవ్యవస్థను గురించి విమర్శనాత్మకమైన రచనలు చేశాడు అంబేద్కర్. ఒక వ్యాసంలో ఈ దేశంలోని వర్ణవ్యవస్థను బహుళ అంతస్తులున్న భవనంతో ఆయన పోల్చాడు. ఆ భవనంలోని ప్రతి అంతస్తూ ఒక్కొక్క వర్ణానికి ప్రతీకగా ఉంటుందని, అయితే ఆ అంతస్తులను కలపటానికి మెట్లు మాత్రం వుండవనీ అంబేద్కర్ వర్ణించాడు. ఈ విధమైన వర్ణవ్యవస్థలో పరస్పర సంబంధాలకు తావే ఉండదు.

అస్పృశ్యకులాల సంక్షేమం కోసం 'బహిష్కృతహితకారిణి సభ' అనే సంస్థను కూడా అంబేద్కర్ స్థాపించాడు. అంబేద్కర్ నిర్వహించిన మొట్టమొదటి ప్రజాపోరాటం మహద్‌లోని చెరువు నీళ్ళను వాడుకునేందుకు అస్పృశ్యకులాలకు హక్కు కావాలన్న డిమాండ్‌తో జరిగింది. దాంతో అగ్రవర్ణాల వాళ్ళు అస్పృశ్యకుల మీద దాడికి దిగారు. ఐనప్పటికి దళితులు పోరాట చైతన్యంతో సంఘటితమై నిలబడ్డారు. వర్ణవ్యవస్థను సాధికారతను కల్పిస్తున్న మత గ్రంథాల ప్రభావం నుంచి ప్రజలను తప్పించటం అవసరమని అంబేద్కర్ భావించారు. ఆ ప్రయత్నంలో భాగంగా ఒక బహిరంగ సభలో మనుస్మృతి గ్రంథాన్ని తగలబెట్టి నిరసనను తెలియజేశారు. ఈ ప్రయత్నాలు దళితులను చైతన్యవంతం చేశాయి. హిందూదేవాలయాల్లో ప్రవేశం కోసం కూడా దళితులు ఉద్యమించారు. హిందూమతం నిర్మించిన పవిత్ర – అపవిత్ర ప్రాంతాల మధ్యనున్న అడ్డుగోడలను కూలగొట్టాలని చెప్పే ప్రతీకాత్మక చర్యగా ఈ దేవాలయ ప్రవేశాన్ని రూపొందించారు. ఈ ఉద్యమంలో ముందుగా నాసిక్‌లో కాలారామ్ ఆలయాన్ని ఎన్నుకుని తమ ప్రయత్నాలను కొనసాగించారు.

**'వాని రెక్కల కష్టంబు లేనివాడు**
**సన్యరమ పండి పులకింప సంశయించు**
**వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు**
**భోజనము పెట్టు వానికి భుక్తిలేదు'** – జాషువా

అంబేద్కర్ సారథ్యంలో దళితులకు సాంఘిక సమానత్వం కోసం సాగుతున్న ఉద్యమం అగ్రవర్ణాల్లో అగ్రహాన్ని రగిలించింది. వర్ణవ్యవస్థ పునాదిపై నిర్మితమైన హిందూమతాన్ని వదిలి ఇతర మతాన్ని స్వీకరించడం ద్వారా దళితుల మీదుండే ఆధిపత్యాన్ని సడలించవచ్చని అంబేద్కర్ నమ్మాడు. అలాగే అగ్రవర్ణాల రాజకీయాధిపత్యం నుంచి బయటపడేందుకు దళితులకు ప్రత్యేకమైన నియోజకవర్గాలను కేటాయించాలని కూడా ఆయన డిమాండ్ చేశాడు. ఈ ప్రతిపాదన మెక్‌డొనాల్డ్ 'కమ్యూనల్ అవార్డు' ఆమోదాన్ని కూడా పొందగలిగింది. దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలివ్వటాన్ని వ్యతిరేకిస్తూ గాంధీ – ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నాడు. దాంతో తప్పనిసరి పరిస్థితులలో అంబేద్కర్ తన డిమాండ్‌ను ఒదులుకుని పూనా ఒప్పందంలో సంతకం చేశాడు.

దళిత చైతన్యం అభివృద్ధి చెందుతూ ఉన్న క్రమంలో అస్పృశ్యుతా ఇతర కులాల వాళ్లలో అత్యధిక శాతం ప్రజలు శ్రామికులుగానే ఉన్నారన్న వాస్తవాన్ని అంబేద్కర్ గుర్తించాడు. అందువల్ల దళితుల రాజకీయాకాంక్షలను వ్యక్తీకరించే సంస్థగా 'ఇండిపెండెంట్ లేబర్ పార్టీ'ని స్థాపించాడు. ఈ సంస్థ తన రాజకీయ ఎజెండాలో ప్రధానాంశాలుగా ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, కనీసవేతనాల అమలు, భూసంస్కరణలు అనే అంశాలను ప్రకటించింది. దళితులను 'హరిజనులు' (దేవుడి బిడ్డలు) అనే పేరుతో పిలవటాన్ని ఆయన వ్యతిరేకించాడు. 1942లో షెడ్యూల్డు కులాల ఫెడరేషన్‌ను నెలకొల్పాడు. షెడ్యూల్డు కులాల ప్రత్యేక నియోజకవర్గాలు పరిమిత సంఖ్యలో ఉండటం వల్ల ఎన్నికల్లో కొన్ని స్థానాలను మాత్రమే షెడ్యూల్డు కులాల ఫెడరేషన్‌ను గెలుచుకోగలిగింది. నెహ్రూ క్యాబినెట్‌లో న్యాయశాఖామాత్యుడిగా అంబేద్కర్ నియమితుడైనాడు. దీని వల్ల స్వతంత్ర భారతదేశపు రాజ్యాంగ రచనకు ఏర్పాటయిన కమిటీకి ఛైర్మన్‌గా కూడా వ్యవహరించాడు. అంబేద్కర్ చేసిన కృషిలో అత్యంత ప్రధానమైందిగా గుర్తించదగినది హిందూకోడ్ బిల్ రూపకల్పన. ఈ బిల్లు ద్వారా సామాజిక సంస్కరణలను వేగవంతం చేసి, వాటికి చట్టబద్ధతను కల్పించాలని అంబేద్కర్ ఆశించారు. హిందూమతాన్ని, సంస్కరించి సామాజిక న్యాయాన్ని నెలకొల్పటానికి అంబేద్కర్ చేసిన ప్రయత్నాలకు విభిన్నమైన ప్రతిస్పందనలు ఎదురయ్యాయి. ఒక వైపున దళితుల్లో ఆత్మగౌరవ చైతన్యం అభివృద్ధి చెందినా, హిందూ ఉన్నత వర్గాల నుంచి 'రాయతీ'లు పొందటానికి ప్రయత్నించటమనేది వృథా ప్రయాసేనని అంబేద్కర్‌కు అర్థమయింది. ఆ అవగాహనతోనే ఆయన 1935లో 'నేను హిందువుగా పుట్టినప్పటికీ, హిందువుగా మరణించటానికి ఎంత మాత్రమూ అంగీకరించను' అనే నిర్ణయానికొచ్చాడు. 1956 అక్టోబర్ 14న వేలాది సహచరులతో అంబేద్కర్ బౌద్ధధర్మాన్ని స్వీకరించాడు. అంబేద్కర్ కృషి ఫలితంగా ఇవాళ దళిత ప్రజల్లో అత్యధిక సంఖ్యాకులకు తమ హక్కుల గురించి, ఆత్మగౌరవాన్ని గురించి స్పష్టత ఏర్పడింది. దళితులకు రిజర్వేషన్లు ఏర్పాటు చేయటం ద్వారా వాళ్లలో ఆత్మగౌరవాన్ని పెంచవచ్చని అంబేద్కర్ విశ్వసించాడు. రాజ్యాంగ రచనకు ముందు కూడా ఆయన దళితులకు ప్రభుత్వోద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తూనే ఉన్నారు. తరువాత కాలంలో రిజర్వేషన్ సౌకర్యాన్ని రాజ్యాంగ బద్ధమైన హక్కుగా అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత అంబేద్కర్‌దే.

'భారతదేశం కేవలం స్వాతంత్ర్యం సంపాదిస్తే సరిపోదు. దేశపౌరులందరికి మతం విషయంలోనూ, సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సమాన భాగస్వామ్యం లభిస్తేనే స్వాతంత్ర్యానికి అర్థం సిద్ధిస్తుంది. అలాగే దేశంలోని ప్రతిపౌరుడు సహజవనరులకు సౌకర్యాలకు వినియోగించుకునే వాతావరణం ఏర్పడాలి. అదే నిజమైన స్వాతంత్ర్యం'. రాజకీయంలో సమానత్వం ఉన్నప్పటికీ, ఆర్థిక సామాజిక రంగాల్లో అసమానతలు ఉంటే రాజ్యాధికారం నేతి బీరకాయ చందమే. సామాజిక న్యాయాన్ని ఇంత నిర్భీతిగా నిర్వహించడం ఒక్క అంబేద్కర్‌కే చెల్లిందేమో.

బహుజనుల అభ్యున్నతిని ఆద్యంతం ఆశించిన అంబేద్కర్ 1956న డిసెంబర్ 6 తుదిశ్వాస విడిచారు.

మేధావిగా, రాజ్యాంగ రచయితగా, న్యాయకోవిదుడిగా, రాజకీయవేత్తగా ఉద్యమ నెలబాలుడిగా, సంస్కరణవాదిగా, సంస్కారం ఉన్నవాడిగా... ఇలా ఎన్నో కోణాల్లో జగమెరిగిన అంబేద్కర్ అక్షరాయుధాలు 'సంధించిన' జర్నలిస్టుగా అతి కొద్దిమందికే తెలుసు. 'జర్నలిజం చరిత్ర'లోను బాబాసాహెబ్‌ను అంటరానితనమే వెంటాడిందేమో!?

**– సి. హెచ్. రామకృష్ణ,**
**తెలుగు అకాడమీ**

మన
సినిమా
1



# తెలంగాణ సినిమా రాశిలో కన్నా వాసిలో ఘనం



**భా**రతదేశంలో చలనచిత్ర పరిశ్రమ మ్యాజిక్ లాంతర్‌తో శ్రీకారం చుట్టుకుని మూకీలతో ప్రాణం పోసుకుని టాకీలతో దేశవ్యాప్తమై జన సామాన్యానికి చేరువైంది. దాదాసాహెబ్ ఫాల్కే "రాజా హరిశ్చంద్ర" (1913)తొలి మూకీ తీశాక బొంబాయి, కలకత్తా, నాసిక్, షోలాపూర్, మదరాసులతో బాటు హైదరాబాద్‌లో కూడా మూకీల నిర్మాణం జరిగింది. ఈ హైదరాబాదు మూకీల సంగతులన్నీ ఇప్పటికీ తెలుగు సినిమా చరిత్రలో ఒక భాగంగా పొడిగా రాసుకోవడం, చదువుకోవడం జరిగింది. ఐతే ఇప్పుడు నూతన తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది కనుక హైదరాబాదులో జరిగిన మూకీల నిర్మాణాన్ని తెలంగాణ సినిమా చరిత్రకు బీజవాపన చెప్పుకోవాలి. మద్రాసులో జరిగిన మూకీల నిర్మాణాల సంగతులు తెలుగు సినిమా చరిత్రకు తొలిరోజులైనప్పుడు హైదరాబాద్ మూకీల విషయాలను విడిగా తెలంగాణ సినిమాకు తొలినాళ్ళకు చెందినవిగా పరిశ్రమ వర్గాలు, సినీచరిత్రకారులు అంగీకరించాలి.

పైన చెప్పిన విధంగా తెలంగాణ సినిమా రంగానికి హైదరాబాదులో అంకురార్పణ జరిగితే దానికి ఆద్యుడు బెంగాలీ అయిన ధీరేన్ గంగూలీ. ఇంతకీ ఈ ధీరేన్ గంగూలీ ఎవరో, ఎక్కడి వాడో తెలుసుకుంటే హైదరాబాదులో తొలినాళ్ల మూకీల సంగతులు తెలుస్తాయి. ఈ ధీరేన్ గంగూలీ బెంగాలీ చిత్ర సీమకు ఆద్యులైన జె.ఎఫ్.మదన్, హీరాలాల్ సేన్‌ల పరంపరలో మూకీల కాలంలో పని చేసిన వారిలో ఒకరుగా చరిత్రకెక్కారు.

ధీరేన్ గంగూలీ పూర్తి పేరు ధీరేంద్రనాథ్ గంగోపాధ్యాయ. నేటి బంగ్లా దేశంలోని బారిసాల్‌లో సాంప్రదాయ ఉన్నత కుటుంబంలో 1893 మార్చి 26న జన్మించిన ధీరేన్ గంగూలీ బాల్యంలో సహజంగానే రంగస్థల నాటకం, లలితకళల పట్ల ఆకర్షితులయ్యారు. ఫలితంగా రవీంద్రనాథునితో పరిచయం కలగడానికి ఎంతోకాలం పట్టలేదు. కలకత్తాలోని శాంతినికేతన్‌లో విద్యార్థిగా చేరారు. రవీంద్రుని శిష్యరికంలో ధీరేన్ సంగీతం, నాటకం, కవిత్వం, నృత్యం, చిత్రలేఖనం వంటి కళలపై మంచి పట్టు సాధించారు. ఆయనకు అతి సన్నిహితునిగా మెలిగారు. ఠాగూర్ రాసిన 'వాల్మీకి', 'రాజ్ అండ్ థాక్ ఘర్' వంటి నాటకాల్లో నటించడమే గాక వాటిని ప్రదర్శించారు కూడా. శాంతినికేతన్‌లో చదువు పూర్తయ్యాక 1910లో ధీరేన్ స్కాటిష్ చర్చి కాలేజీలో చేరి ఆరు నెల్ల తర్వాత జూబిలీ ఆర్ట్స్ అకాడమి, గవర్నమెంట్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చదివి 1912లో డిస్టింక్షన్ లో పాసయ్యారు.

చదువు పూర్తవగానే చిత్రకారుడిగా నాటక ప్రయోక్తగా కళారంగంలోకి ప్రవేశించిన ధీరేన్ పేయింటింగ్స్ ప్రదర్శనలు నిర్వహించారు. అవి అమ్ముడవటమే గాదు చాలా పత్రికలలో ముద్రితమయినవి కూడా. ఇవి గాక శాంతినికేతన్ ద్వారా కలకత్తా పోలీసులకు మారు వేషలు వేసుకునే పద్ధతులు నేర్పే ఉద్యోగం వొకటి కూడా చేశారు. ఇవన్నీ చేస్తూనే ఫొటోగ్రఫీలో ఆసక్తిని పెంచుకుని ఆ రంగంలో ప్రయోగాలు చేయడం ప్రారంభించారు. తానే వివిధ వేషధారణలతో కూడిన ఫొటోలు దిగి ఒక పుస్తకంగా తయారు చేశారు. దాని పేరు 'భనవేర్ అభివ్యక్త్'. భావవ్యక్తీకరణకు వివిధ సందర్భాలలో ఎన్ని రూపాలుగా ఉంటుందో తెలుపడమే ఈ ఫొటో సంకలనం ఉద్దేశ్యం. సమకాలీన సమాజంపై వ్యంగ్యంగా ఉండటం వీటి ప్రత్యేకత. ఒకే ఫొటోలో ఇద్దరు, ముగ్గురు అన్నీ ధీరేన్ వివిధ రూపాల్లో కనిపించడం ఈ సంకలనం మరో ప్రత్యేకత. ఫొటోగ్రఫీలో ధీరేన్ ప్రతిభను తెలుసుకున్న నిజాం ప్రభువు వెంటనే తన నిజాం ఆర్ట్స్ కళాశాలలో ఉద్యోగం ఇస్తూ 1915లో ఉత్తర్వులు జారీ చేశారు. అతికొద్ది కాలంలోనే ఆయన ఈ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎదిగారు. హైదరాబాద్ వచ్చాక ధీరేన్ "అమార్‌దేశ్ (నా దేశం)' అనే మరో ఫొటో సంకలనాన్ని వెలువరించారు. దీని ప్రతినొక దానిని అప్పుడప్పుడే మూకీల నిర్మాణం ప్రారంభించిన జె.ఎఫ్.మదన్ (కలకత్తా)కి పంపారు. ధీరేన్ పని తనాన్ని చూసిన జె.ఎఫ్. మదన్ "మనం సినిమాల గురించిన కొంత పని కలిసి చేయాల్సి ఉంది. అందులో నీ ప్రతిభ ఉపయోగపడుతుందని, వెంటనే కలకత్తా రమ్మని ఉత్తరం రాశాడు.

1918లో ధీరేన్ కలకత్తా తిరుగు ప్రయాణమయ్యారు. జె.ఎఫ్.మదన్ ధీరేన్‌లోని రచయిత, నటుడు, ఫొటోగ్రాఫర్, చిత్రకారుడు ఇవన్నీ సినిమాకు పనికి వస్తాయనే నిర్ణయానికి వచ్చి కలిసి సినిమాలు తీద్దాం అని నిర్ణయించుకున్నారు. పైగా మన ధీరేన్‌కు ఠాగూర్‌తో దగ్గరి పరిచయం ఉంది. మదన్‌కు అది బాగా నచ్చింది. ఠాగూర్ రాసిన "సాక్రిఫైస్" (త్యాగం) నాటకం అప్పటికే బెంగాల్ సమాజంలో బాగా ప్రసక్తి పొందింది. దానిని సినిమాగా తీయాలనేది మదన్ ఆలోచన. ఠాగూర్ వద్దకు పోయి అనుమతి తేగలిగింది ధీరేన్ ఒక్కరేనని ఆయన గుర్తించారు. అనుకున్నట్లుగా అనుమతి తీసుకుని వచ్చాడు ధీరేన్. అయితే వివిధ కారణాల వల్ల ఈ సినిమా నిర్మాణం వాయిదా పడుతూ వచ్చింది. మరోవైపు 1919 నాటికి భారత రాజకీయాల్లో చాలా మార్పులు సంభవించాయి. అప్పటికి జనరల్ దయ్యార్ జలియన్ వాలాబాగ్ దురంతానికి కారకుడై దేశమంతా ఆగ్రహజ్వాలగా మారింది. రవీంద్రనాథ్ ఠాగూర్, బ్రిటీష్ సర్కారు తనకిచ్చిన "నైట్‌హుడ్" బిరుదును తిరిగి ఇచ్చేశాడు. గాంధీజీని బ్రిటీష్ ప్రభుత్వం జైల్లో పెట్టింది. పత్రికారంగంపై ఆంక్షలు విధించింది. ఇక సినిమాలపైనైతే అప్పట్లో తయారైన సినిమాల్లో 13 సినిమాలకు సెన్సార్ సర్టిఫికెట్లు తిరస్కరించగా, 49 సినిమాల లెక్కలేనన్ని కటింగ్స్‌తో అనుమతులిచ్చింది బ్రిటీష్ ప్రభుత్వం.

ఇలాంటి పరిస్థితుల్లో సినిమా రంగంలోకి వచ్చిన ధీరేన్ గంగూలీ నితీష్ చంద్ర లాహిరితో కలిసి 1921లో 'ఇండో బ్రిటిష్ ఫిలిం కంపెనీ' ప్రారంభించారు. తొలి ప్రయత్నంగా 'బిలాత్ ఫెరాత్' (ఇంగ్లాండ్ రిటర్న్‌డ్) అనే మూకీ తీశారు. ఇంగ్లాండ్ నుండి తిరిగి వచ్చిన భారతీయుడు ప్రవర్తించే తీరును వ్యంగంగా చిత్రీకరించిన ఈ చిత్రం విజయం సాధించింది. ఈ చిత్రం తరువాత భాగస్వాములంతా విడిపోయారు. అయితే "బిలాత్ ఫెరాత్" ఇచ్చిన సక్సెస్‌తో భవిష్యత్తులో కూడా మరిన్ని కామెడీలు తీయాలని ధీరెన్ నిర్ణయించుకున్నారు. ఈ సమయంలోనే రవీంద్రుడు తన దగ్గరి బంధువులమ్మాయితో ధీరేన్ వివాహం జరిపించారు.

1920ల నాటికి దేశవ్యాప్తంగా పలు నగరాలలో మూకీల నిర్మాణం ఊపందుకున్నది. హైదరాబాదులో కూడా సినిమాలు తీయాలని, అందుకు ఎవరైనా ప్రతిభావంతులుంటే పంపమని నిజాం జె.ఎఫ్.మదన్‌ని కోరారు. మదన్‌నే కోరడానికి వొక కారణముంది. 1908లో హైదరాబాదును మూసీ వరదలు ముంచెత్తాయి. ఆ దృశ్యాలను చిత్రీకరించింది జె.ఎఫ్.మదన్ బృందం ఆ పరిచయంతో నిజాం కోరగానే ధీరేన్ గంగూలీని హైదరాబాదుకు సినిమా నిర్మాణం వెళ్లమన్నారు. ధీరేన్‌కు ఎలాగూ హైదరాబాదుతో పరిచయం ఉంది గనుక కొందరు సినిమా టెక్నిషియన్లను తోడుగా తీసుకుని వచ్చేశాడు.

హైదరాబాదులో "లోటస్ ఫిలిం కంపెనీ" (దక్కన్)ని 1922లో నిజాం ఆజమాయిషీతో నెలకొల్పిన ధీరేన్ స్వంతంగా లాబోరేటరీనీ, రెండు థియేటర్లను కూడా ఏర్పాటు చేసుకున్నారు. తానే పిలిపించాడు గనుక నిజాం షూటింగ్‌లకు భవనాలను ఉపయోగించుకోవచ్చని ధీరేన్‌కు అనుమతిచ్చాడు. ధీరేన్ హైదరాబాదులో తీసిన మూకీలు మొత్తం ఎనిమిది అవన్నీ వరుసగా – "చింతామణి" (21.7.1922), "ఇంద్రజిత్' (1922) నటీనటులు ధీరేన్ గంగూలీ, సీతాదేవి), ''మేరేజ్ టానిక్"(1922), ధీరేన్ గంగూలీ, సీతాదేవి – కామెడీ చిత్రం), "సాధూకీ సైతాన్ (1922) ధీరేన్, లీలా వాలెంటేన్, సుశీలాదేవి – కామెడీ), "ది లేడీ టీచర్" (1922 ధీరేన్, సీతాదేవి – కామెడీ), "స్టెప్ మదర్" (1923– ధీరేన్ గంగూలీ, సీతాదేవి, జోయ్‌బెల్లే), 'యాయాతీ' (4.4.1923– ధీరేన్ , సీతాదేవి), 'హరగౌరి' (5.1.1923 – పౌరాణికం) ఈ మూకీలు అన్నీ కూడా హైదరాబాదులో ఆయనే నిర్మించిన రెండు థియేటర్లలో ప్రదర్శింపబడినవి. నిజాం ప్రభువు వీటి తర్వాత సినిమా నిర్మాణం కొనసాగించాలనుకున్నాడు కానీ 1924లో అర్దేషిర్ ఇరానీ 'మెజెస్టిక్ ఫిలిం కంపెనీ' బ్యానర్‌పై తీసిన 'రజియాబేగం'మూకీని ధీరేన్ హైదరాబాదులోని తన థియేటర్‌లో విడుదల చేశారు. ఈ చిత్రంలో హీరోయిన్ ముస్లిం. కానీ హిందువును ప్రేమించి పెళ్లాడుతుంది. అప్పటి హైదరాబాదు సంస్థానంలోని పరిస్థితులు దీనికి భిన్నంగా ఉండి ప్రజల మనోభావాలు దెబ్బతినేలా కథా, కథనాలున్నాయి. ధీరేన్ గంగూలీని ఇరవై నాలుగు గంటలలో నగరం విడిచి వెళ్లవలసిందిగా నిజాం ఆదేశించారు. నియంతకు ఎదురు చెప్పలేక, చేసేదేమీలేక కలకత్తా తిరిగి వెళ్ళాడు.

కలకత్తా వెళ్లి ధీరేన్ నాటకరంగంలో తన కృషిని కొనసాగించాడు. 1927లో "శంకరాచార్య" అనే మూకీలో నటించారు. ఈ చిత్ర దర్శకుడు కాళీ ప్రసాద్‌ఘోష్. దేవకీబోస్ దర్శకత్వంలో "పంచాసర్" (1.11.1930)లో 'ఆఫ్టర్ ది డెత్' (7.2.1931) ఎ.కె.రామ్ దర్శకత్వంలో "మనీ మేక్స్‌వాట్ నాట్" (7.2.1931) డి.పి.ఎవర్‌గోన్

డైరెక్షన్‌లో "ది బోర్డర్ థీఫ్" మూకీల్లో నటించారు. ధీరేన్ గంగూలీ. దర్శకునిగా 'అలీక్‌బాబు" (24.5.1930), "ఫ్లేమ్ ఆఫ్ ఫ్లెష్" (22.2.1930) "నాటీబాయ్" (1931), "చరిత్రహీన్"(9.5.1931) మూకీలను డైరెక్ట్ చేశాడు.

టాకీలు రాగానే న్యూథియేటర్స్ సంస్థాపకులలో ఒకరుగా కృషి చేసిన ధీరేన్ గంగూలీ "నైట్ బర్డ్", "ఎక్స్‌క్యూజ్‌మి సర్" (1934), "బిద్రోహి" (హిందీ / బెంగాలీ - 1935), "కంట్రీగర్ల్" (1936), "మస్ట్ టో భాయ్" (1940), "ఆహుతి" (1941), "శేష్‌నివేదన్" (1948), "కార్టూన్" (1948) వంటి టాకీలు తీసి కొన్నింటిలో నటించాడు. ఈయన తీసిన సినిమాల్లో ఎక్కువగా కామెడీలే. అందుకే ఆయనను "ఇండియన్ చాప్లిన్" అనే వారు. ఆయనే "జీవితంలో ప్రతి విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. సీరియస్‌గానే విశ్లేషణ జరపాలి. కానీ నేర్చుకున్న పాఠాలను ఇతరులకు చెప్పాల్సి వచ్చినపుడు వీలైనంత సరళంగా, హాస్యరస్ఫోరకంగా చెప్పే ప్రయత్నం చేస్తాను. నేను ఎక్కువగా కామెడీలు తీయడానికి కారణమిదే" అన్నారొక సందర్భంలో. సినిమా రంగానికి దేవకీబోస్, పి.సి.బారువా, సబితాదేవిలను యీయనే పరిచయం చేశారు.

అయితే సినిమా నిర్మాణం వ్యాపారపరంగా నష్టాలు తేవడం, ఆరోగ్యం సహకరించకపోవడంతో శరపరంపరగా సినిమాలు తీయాలనుకున్న ధీరేన్ ఇంటికే పరిమితం కావలసి వచ్చింది. భారతీయ సినిమాకు 50 ఏళ్లపాటు చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం 1974 "పద్మభూషణ్" పురస్కారంతో, 1975లో "దాదాఫాల్కే" అవార్డుతో గౌరవించింది. భారతీయ సినిమా పితామహుల్లో ఒకరుగానే హైదరాబాద్ సినిమాకు ఆద్యుడుగా ధీరేన్‌గా గంగూలీని మనం స్మరించుకోవాలి. ఆ మహనీయుడు 1978 నవంబర్ 17న తనువు చాలించారు. ఆయన వేసిన బీజాలే తెలంగాణ సినిమా చరిత్రకు పునాదిరాళ్లు గా నిలిచాయి.

## మహావీర్ ఫోటో ప్లేస్ - నేషనల్ ఫిలిం కంపెనీ

నిజాం ఆగ్రహం కారణంగా ధీరేన్ గంగూలీ 1924లో హైదరాబాదు విడిచి కలకత్తా వెళ్లాడు. దీంతో నిజాం సినిమా పరిశ్రమకు వ్యతిరేకమని చాలా మంది భావించారు. కానీ నిజాం స్వయంగా సినిమాలు చూడటానికి అంతకుముందే దేవిడీ ప్యాలెస్ ప్రాంగణంలో 1920లో సెలెక్ట్ టాకీస్‌ను కట్టించుకున్నాడు. ఇది కేవలం నిజాం కుటుంబీకులకు మాత్రమే చూడటానికి ఏర్పాటయిన సినిమా హాల్. లండన్ నుండి 16 ఎం.ఎం. ప్రొజెక్టర్‌ను తెప్పించాడు. థియేటర్లకి వినోదపు పన్ను మినహాయించడంతో మరో కొన్ని థియేటర్ల నిర్మాణం కూడా జరిగింది. వాటిల్లో ఒకటి "రాయల్‌టాకీస్" (1927). 1930 నాటికి నగరంలో నిర్మాణమైన థియేటర్ల సంఖ్య 17. 1920లో హైదరాబాదులో సెలెక్టివ్ టాకీస్ నిర్మాణమైతే 1923లో విజయవాడలో మారుతీ టాకీస్ కట్టారు. దీంతో థియేటర్ నిర్మాణంలో కూడా హైదరాబాదే ముందున్నదని రుజువైతున్నది.

మళ్లీ మూకీల విషయానికి వద్దాం. 1924 నుండి నాలుగైదేళు ఏ విధమైనా మూకీల నిర్మాణం జరగలేదు. అయితే 1929లో "మహావీర్ ఫోటోప్లేస్" అనే సినీ నిర్మాణ సంస్థ ఆవిర్భవించి "ఫాదర్స్ లవ్" లేదా "పితృప్రేమ" మూకీని 1929లో నిర్మించింది. ఇది హైదరాబాదులో మూకీల చరిత్రలో రెండవ అధ్యాయంగా చెప్పుకోవచ్చు. ఈ "ఫాదర్స్ లవ్" (పితృప్రేమ) చిత్రం హరిలాల్ ఎం.భట్ దర్శకత్వంతో తయారైంది. హిందీ, ఉర్దూ, గుజరాతి, ఇంగ్లీష్ సబ్ టైటిల్స్‌తో విడుదలైంది ఈ చిత్రం. ఈ చిత్రంలో బాలనటుడిగా నటించి ఆ తరువాత సినీ డిస్ట్రిబ్యూటర్‌గా మారిన మదన్ కొటారి ఈ సినిమా రీలును భద్రపరిచి ఆ తరువాత నేషనల్ ఆర్కైవ్స్‌కు అప్పగించాడు. ఇంకా ఈ మూకీలో మిస్ మణి, గాబిహిల్, మగన్‌లాల్ దావే, యూసుఫ్, ఎస్.పి.నిఫాడ్‌కర్‌లు నటించారు.

తర్వాత 1930లో మణి, మాస్టర్ శంకర్ నటించిన "ఎప్రిన్స్ ఆఫ్ పీపుల్" (రాజధర్మ), "యాన్ ఐడియల్ విమెన్" మూకీలు తీసిన ఈ మహావీర్ ఫోటోప్లేస్ సంస్థ, 1931లో హరిలాల్‌భట్ దర్శకత్వంలో కెకె అర్జానియా, మణి, పారోనాగ్ తదితరులు నటించిన యాక్షన్ చిత్రం "బ్లాక్ ఈగిల్", వి.కె.పాట్ని డైరెక్షన్‌లో ఎం.శంకర్, మణి నటించిన సోషల్ డ్రామా "కిడ్నాప్డ్ బ్రైడ్", చున్నీలాల్ పారేఖ్ దర్శకత్వంలో ప్రభాదేవి, శంకర్‌లు నటించిన "నిర్దర్ నిరు" చిత్రాలు నిర్మించారు. ఇవేగాక 1931లో వీరే మహావీర్ ఫోటో ప్లేస్ అండ్ థియేటర్స్" బానర్‌ని నెలకొల్పి హరిలాల్ భట్: డైరెక్షన్‌లో "సరోజ్‌కుమారి" మూకీని తీశారు. ఇందులో శంకర్, మణి ప్రధాన పాత్రధారులు.

ఇట్లా వరుస పెట్టి మహావీర్ సంస్థ వరుసపెట్టి మూకీలు తీస్తుండగానే "నేషనల్ ఫిలింకంపెనీ (దక్కన్) పేరున ఇంకొక సినిమా నిర్మాణ సంస్థ హైదరాబాదులో ఏర్పడింది. దీని అధినేత ఎవరో ఎక్కడా రికార్డు కాలేదు. ఈ సంస్థ రెండేళ్ల పాటు నాలుగు సైలెంట్ సినిమాలు తీసింది. వాటి వివరాలు వరుసగా "పీకో ఆఫ్ ది వరల్డ్" (1931 - దర్శకుడు చున్నిలాల్ పారేఖ్) , పీస్ ఆఫ్ ఈరాక్ (1931-కె.టి.భవే దర్శకుడు), దేశబంధు (1932 - కె.టి.భవే దర్శకుడు కాగా వసంత, విలిమా గార్బో నటించారు.

1932 నాటికి భారతదేశంలో మూకీల యుగం అంతరించింది. అంతటా టాకీల నిర్మాణం మొదలైనా హైదరాబాద్‌లో అలాంటి ప్రయత్నాలేవీ మొదలు కాలేదు. మొత్తం 20 మూకీలు హైదరాబాద్‌లో తయారైనవి. మద్రాసు పాలనలో ఉన్న ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడ ఎవరూ మూకీలు తీయలేదు. అలాగే ఇక్కడి వారూ అక్కడికి వెళ్లలేదు. పైగా మదరాసుతో సమాంతరంగా హైదరాబాదులో మూకీల నిర్మాణం జరిగినట్లుగా పైన చెప్పిన విషయాలు రుజువు పరుస్తున్నవి. తమిళనాట తెలుగు వారు తీసిన మూకీలు తెలుగు సినిమా చరిత్రను తొలిరోజులైతే హైదరాబాదు మూకీల నిర్మాణ కాలం తెలంగాణ సినిమా చరిత్రకు బీజవాపనగా పరిగణించాలి. మొన్నటిదాకా హైదరాబాదు మూకీల సంగతులన్నీఈ తెలుగు సినిమా చరిత్రలో భాగంగా మద్రాసులో మూకీల నిర్మాణంతో బాటు హైదరాబాదులో కూడా జరిగిందని రాసుకున్నాం. కానీ ఇప్పుడు హైదరాబాదు మూకీల కాలాన్ని తెలంగాణ సినిమా చరిత్రకు తొలిరోజులుగా చరిత్రకెక్కుతాయి.

**హెచ్.రమేష్‌బాబు**

(ఫ్రీలాన్స్ ఫిలిం జర్నలిస్ట్)




# విద్యుత్ పొదుపు చేద్దాం భావితరాలకు వెలుగునిద్దాం

విద్యుత్‌ను తయారు చేయడం నేర్చుకున్న మనిషి విద్యుత్‌కు దాసుడైపోయాడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ చిన్న పనిచేయాలన్న విద్యుత్ కావాలి. కాసేపు కరెంటుపోతే నిత్యజీవితంలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విద్యుత్ రంగంలో ఎటుచూసినా చీకట్లు ముసురుకుంటున్నాయి. విద్యుత్ కోతలు నిత్యకృతమయ్యాయి. కోతలతో పరిశ్రమలు కుదేలవుతున్నాయి. చతికిలబడిన విద్యుత్ సంస్థలు భవిష్యత్‌లో మరింత అంధకారమన్న సంకేతాలు ఇస్తున్నాయి. దేశంలో గత కొంత కాలంగా బొగ్గు ఉత్పత్తిలో పెద్దగా పెరుగుదల లేదు. విద్యుత్ రంగంలో బొగ్గు వినియోగం ఏటా ఆరుశాతం పెరిగిందని ఓ విశ్లేషణ తెలియజేస్తుంది.

మనిషి జీవనానికి ఆహారం ఎంత అవసరమో, సౌకర్యవంతమైన జీవనం గడపడానికి విద్యుత్ కూడా అంతే అవసరం. విద్యుత్ లేని ప్రపంచాన్ని ఊహించలేం. రోజురోజుకు విద్యుత్ అవసరాలు పెరిగిపోతున్నాయి. దీంతో ముఖ్యమైన వనరు రోజురోజుకు తరిగిపోయి కొరత ఏర్పడుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్‌ను ఆదా చేయడం తప్ప మరో మార్గం లేదు. భవిష్యత్ తరాలకు విద్యుత్ వెలుగులు అందాలంటే అందుకు పొదుపే శరణ్యం. అందుకు ప్రతి ఒక్కరు తమ వంతుగా విద్యుత్‌ను ఆదా చేయడంలో భాగస్వాములు కావాలి. అందుకోసం గృహాల్లోనూ, కార్యాలయాలలోనూ విద్యుత్ పొదుపుకు చర్యలు తీసుకోవాలి.

ఆధునికయుగంలో ఎన్నో రకాల అధునాతన గృహోపకరణాలు అందుబాటులోకి వచ్చాయి. వీటన్నింటికీ విద్యుత్ అవసరం. ఎల్లవేళలా సదుపాయాలు పొందటానికి యధేచ్ఛగా విద్యుత్‌ను వినియోగిస్తుంటాం. దీనివల్ల విద్యుత్ కొరత తలెత్తుతుంది. అందుకే మనవంతు బాధ్యతగా విద్యుత్‌ను పొదుపు చేద్దాం. అదేలా అంటారా...ఇదిగో సూచనలు. విద్యుత్‌ను ఆదా చేసే మార్గాలు :



**బల్బుల ద్వారా :**

- వెలుతురు కోసం పగటిపూట వీలైనంత వరకు బల్బుల ద్వారా వచ్చే కాంతిపై ఆధారపడకుండా ఇంటి లోపలకి సహజమైన సూర్యకాంతి వచ్చేలా చూసుకోవాలి.
- అవసరమైన ప్రదేశంలో మాత్రమే బల్బును అమర్చుకోని అవసరమైన పరిస్థితుల్లో మాత్రమే బల్బు ద్వారా వచ్చే కాంతిని ఉపయోగించుకోవాలి.
- వరండాలు, బాత్‌రూమ్‌లలో తక్కువ ఓల్టేజి ఉన్న బల్బులను వాడితే సరిపోతుంది.
- రాత్రి నిద్రించు సమయంలో 15వాట్స్ బల్బులకు బదులు 1 వాట్ బెడ్‌ల్యాంప్ ఉపయోగించాలి.
- ఫిలిమెంట్ ఉన్న బల్బులను వాడటం వల్ల 80% విద్యుత్‌ను ఆదా చేయవచ్చు.
- పగలు ఎక్కడైనా వీధి దీపాలు వెలుగుతూ ఉన్నట్లయితే సంబంధిత అధికారులకు తెలియజేసి విద్యుత్ ఆదాకు సహకరించాలి.

**టివి మరియు ఫ్యాన్‌ల ద్వారా**

- టివి, సిడిప్లేయర్, డివిడి & ఆడియోలు వాడేటప్పుడు రిమోట్‌ను ఉపయోగించినట్లయితే 7% విద్యుత్ ఆదా చేయవచ్చు.
- కొంత మంది టివిలను రిమోట్ ఆఫ్ చేసి వదిలేస్తారు. ఇలా కాకుండా ప్లగ్ వద్ద స్విచ్ ఆఫ్ చేస్తే ఎంతోకొంత విద్యుత్ ఆదా అవుతుంది.
- అవసరమైనప్పుడు మాత్రమే ఫ్యాన్‌లు ఉపయోగిస్తు సాధ్యమైనంత వరకూ సహజసిద్దమైన గాలిని ఆస్వాదించాలి.
- చిన్న రెగ్యులేటర్స్ (ఎలక్ట్రానిక్స్)కు బదులుగా పెద్ద రెగ్యులేటర్స్‌ని వాడాలి.
- వీలైనంత వరకూ ఫ్యాన్‌లు తక్కువ స్పీడ్‌లో ఉపయోగించుకోవాలి.

**రిఫ్రిజేటర్స్ మరియు వాటర్ హీటర్ల ద్వారా**

- వీలైనంత వరకు ఫ్రిజ్ వెనుకభాగంలో కిటికి ఉండేటట్లు చూడాలి. వీలుకాని పక్షంలో గోడకు, ఫ్రిజ్‌కు మధ్య ఒక అడుగు దూరం ఉండే విధంగా చూడాలి.
- ఫ్రిజ్‌లో వస్తువులు పెట్టాలన్నా తీయాలన్నా అన్ని గుర్తించుకుని ఒక్కసారి ఉపయోగించడం, అలా తక్కువసార్లు ఫ్రిజ్ తలుపు తీయడం వలన విద్యుత్ ఆదా అవుతుంది.
- ఫ్రిజ్ లోపలి ఉష్ణోగ్రతను కాలానుగుణంగా మార్చుకోవాలి.
- ఫ్రిజ్‌లో పెట్టే వస్తువులు ఉష్ణోగ్రత, గది ఉష్ణోగ్రతకు సమానంగా ఉండే విధంగా జాగ్రత్తపడాలి.

- డీప్‌ఫ్రిజ్‌లో ఐస్ గడ్డకట్టకుండా అప్పుడప్పుడూ కరిగించుకుంటూ (డిఫ్రాస్ట్) ఉండాలి.
- వాటర్ హీటర్లను ఉపయోగించే ఇంటిలోని వారందరూ వెంటవెంటనే స్నానానికి వెళ్ళేటట్లు చూసుకోవాలి.
- ఆటోమెటిక్ ఆన్ & ఆఫ్ ఉండే హీటర్లను ఉపయోగించాలి.
- సోలార్ వాటర్ హీటర్లను ఉపయోగించినట్లయితే చాలా వరకు విద్యుత్‌ను పొదుపు చేయవచ్చు.

**వాషింగ్ మెషిన్లు మరియు ఏసిలు**

- వాషింగ్ మెషిన్లు దుస్తులు వేసే ముందు వాటిని బాగా నానబెట్టుకోవాలి.
- తక్కువ టైమర్‌ను సెట్ చేసుకోవడం ద్వారా విద్యుత్ ఆదా అవుతుంది.
- వీలైనంత వరకు డ్రైయర్‌ను వాడకపోవడం మంచిది.
- ఏసిలు సాధారణ చల్లదనానికి 24 డిగ్రీలు సెట్ చేసుకోండి. సెట్టింగ్ తగ్గించడం (డిగ్రీలు పెంచడం) వల్ల ప్రతి సెంట్రీగ్రేడ్‌కు కనీసం 5 శాతం విద్యుత్ ఆదా చేసుకోవచ్చు.
- ఒక సీలింగ్ ఫ్యాన్ ఆన్‌లో ఉంచడం ద్వారా ఏసిను కొంచెం అధిక ఉష్ణోగ్రత వద్ద సెట్టింగ్ ఉండొచ్చు.
- ఏసి ఆన్‌లో ఉన్నప్పుడు తలుపులు, కిటికీలు మూసివేయాలి.
- ఇంటిపైకప్పుపై కూల్‌హోమ్ పెయింట్ / రూఫ్‌గార్డెన్ పెంచడం ద్వారా ఏసిపై లోడు తగ్గుతుంది.
- ఏసికి దగ్గరగా బల్బులు, టివిలు, ఉంచోద్దు. దీని వల్ల థర్మాస్టాట్ సెట్టింగ్‌పై ప్రభావం ఏర్పడుతుంది.
- బయటకు వెళ్ళేటప్పుడు గంట ముందుగానే ఏసిని ఆఫ్ చేయండి.

**వంటగది పరికరాలుద్వారా**

- పదార్థాలను ముందుగా నానబెట్టటం ద్వారా మిక్సీ విద్యుత్ వాడకం తగ్గించవచ్చు.
- సాధ్యమైనంత వరకు పొడి పదార్థాల గ్రైండింగ్‌ను నిరోధించండి.
- ఎలక్ట్రిక్ స్టౌవ్‌లకు బదులు మైక్రోవేవ్ ఓవెన్ వాడకం ద్వారా 50 శాతం విద్యుత్ ఆదా చేయవచ్చు.





- ఎలక్ట్రిక్ స్టౌవ్‌లు వాడేటప్పుడు నిర్ధారిత సమయానికి ముందే స్టౌవ్‌ను ఆఫ్ చేయండి.
- అడుగు భాగాన సమతులంగా ఉన్న స్టౌవ్‌ల వల్ల వేడి సమర్థవంతంగా వ్యాపించి విద్యుత్ ఆదా అవుతుంది.
- ఎలక్ట్రిక్ కుక్కర్‌కు బదులు ప్రెషర్ కుక్కర్ వాడటం ద్వారా విద్యుత్ ఆదా అవుతుంది.

విద్యుత్ కొరత రోజురోజుకీ తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు కరెంటు పొదుపు చర్యలుపై దృష్టిసారించవలసి ఉంటుంది. దానిలో భాగంగా ప్రభుత్వాలు ప్రతి ఇంటికి తక్కువ కరెంటు కాలే ఎల్ఈడి బల్బులు పై అవగాహన పెంచి వాటిని ఉచితంగా పంపిణీ చేసే విధంగా కృషి చేయాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ పొదుపు చర్యలు చేపట్టి ప్రతి ఒక్కరూ తమవంతుగా గృహాల్లోనూ, కార్యాలయాల్లోనూ విద్యుత్ పొదుపు పాటించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు పొదుపుపై ఎస్.ఎమ్.ఎస్, టెలివిజన్, పత్రికలు, ప్రకటనలు, ఎఫ్.ఎమ్.రేడియోల ద్వారా అవగాహన కల్పించాలి. ఇంటింటా కరెంటు కాలుష్యం లేకుండా తక్కువ ఖర్చుతో ఎవరికి వారే కరెంటును తయారుచేసుకునే పద్దతుల్ని ప్రభుత్వాలు కల్పించాలి. అనుమతులు లేని హోర్డింగ్‌లకు లైట్లను నియంత్రించే చర్చలు చేపట్టాలి. అంతేకాక పొదుపుపై ప్రజల్ని భాగస్వాముల్ని చేయ్యాలి.

భావితరాలకు విద్యుత్ వెలుగులు అందాలంటే ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలి. భవిష్యత్‌లో రాబోయే ఉపద్రవాన్ని నివారించి భావితరాలు అంధకారంలో మగ్గకుండా వారి జీవితాల్లో విద్యుత్ వెలుగులు అందించాలంటే విద్యుత్‌ను పొదుపు చేయడం తప్పనిసరి. విద్యుత్ జాతి సంపద అని విద్యుత్‌ను ఆదా చేస్తే విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లే అనే విషయం అందరికి తెలియజేయాలి. ప్రతి ఒక్కరూ తమ వంతు కర్తవ్యంగా ప్రజల్లో విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలి. ప్రతి ఒక్కరూ తమతమ ఇళ్ళల్లో సాధ్యమైనంత వరకు విద్యుత్ ఆదా చేస్తే భవిష్యత్‌లో కరెంట్ కోతలు నుండి తప్పించుకోవచ్చు అనే భావన ప్రతి ఒక్కరిలో కలగాలి. విద్యుత్ పొదుపు చేయడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోని విద్యుత్‌ను ఆదా చేసి భావి తరాల జీవితాల్లో వెలుగులు నింపుదాం.

ఎం.ప్రదీప్‌కుమార్, రీసెర్చ్ అసోసియేట్, టిసిపార్డ్.

# జీవవైవిధ్య పరిరక్షణ ఆవశ్యకత



**గా**లికి కోటి తాకిడులు, నీటికి లక్ష బిందువులు, అగ్నికి వేయి నాల్కలు, భూమికి సహస్రబాహువులు, ఆకాశానికి ముక్కోటి పడగలు, పంచభూతాలు సహస్రకోటి ప్రాణహితులు మితిమీరితే పంచభూతాలే ప్రపంచ భూతాలవుతాయి. జీవవైవిధ్యం మానవాళికి ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపద. కోట్లాది సంవత్సరాల పరిణామక్రమంలో లభించిన సహజసంపద. భూగోళం మీద లభించే సహజసిద్ధమైన మొత్తం సంపదను జీవవైవిధ్యం అని శాస్త్రజ్ఞులు నిర్వచించారు. రకరాకల జీవజాలం అంటే మానవులు, జంతువులు, పక్షులు, వృక్షాలు, చెట్లు, చేమలు, పురుగులు, కీటకాలు, భూసార తీరుతెన్నులు అంటే ఎడారులు, అడవులు, మెట్టభూములు, గాలి, నీరు, నేల అంతా జీవవైవిధ్యంలో భాగాలే. వీటి మధ్య సమతుల్యత, సమన్వయం వల్లే మానవజాతి మనుగడ సాగిస్తుంది. జీవ వైవిధ్యం ద్వారా లభ్యమవుతున్న సేవలు, వస్తు సముదాయం కారణంగా భూగోళం మానవజాతి సుస్థిరనివాసంగా రూపుదిద్దుకుంది. భౌగోళిక సమతుల్యతను కాపాడటంలో జీవవైవిధ్యానిది విశేషపాత్ర, మొక్కలు, జంతువులు, పక్షులు, సూక్ష్మజీవులు ఈ జీవవైవిధ్యంలో భాగం.

సరళీకృత ఆర్థిక విధానాల ప్రవేశం తర్వాత అభివృద్ధి నమూనా పెట్టుబడిదారుల అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంది. దాంతో అడవులు, జీవవైవిధ్యం, వాటి మీద తరతరాలుగా ఆధారపడిన ఆదివాసుల జీవనం వంటివన్నీ పెట్టుబడి ముందు దిగదుడుపే అయ్యాయి. ఖనిజతవ్వకాలు, విద్యుత్, ప్రాజెక్టులు, రేవులు, రహదార్లు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కారణంగా అడవులు, చిత్తడి నేలలు, తీరప్రాంత కొండలు దారుణ విధ్వంసానికి గురవుతున్నాయి. మనదేశంలో అద్భుతమైన జీవవైవిధ్యం ఉంది. ప్రపంచంలోని అన్ని జీవజాతులను మనదేశంలో ఏడు శాతం ఉన్నది. 668 రక్షిత ప్రాంతాలున్నాయి. జీవరాశుల మనుగడకు భూమి, నీరు, గాలి అత్యంత అవసరం. జీవవైవిధ్యం జీవరాశుల మనుగడకు అవసరం. ఆహారభద్రతకు, సేంద్రియ వ్యవసాయానికి జీవవైవిధ్యం పునాది. వాతావరణ మార్పులవల్ల కలిగే ఉపద్రవాలను తట్టుకోవడానికి జీవవైవిధ్యం అవసరం. మానవ మనుగడకు, అభివృద్ధికి జీవ వైవిధ్యం పునాది. ప్రస్తుతం అడవులు అంతరించిపోతున్నాయి. భూమిక్షీణిస్తున్నది. కొండలు తరిగిపోతున్నాయి. నదులు ఎండిపోతున్నాయి. ప్రకృతివనరులు దోపిడికి గురవుతున్నాయి. పర్యావరణం కాలుష్యమవుతున్నది. జీవవైవిధ్యం విధ్వంసం అవుతున్నది. భౌగోళికంగా ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో పెనుమార్పులు జరుగుతున్నాయి. ఇందుకు ఓజోన్‌పొర బలహీనపడటమే కారణమని శాస్త్రజ్ఞుల భావన. ఓజోన్‌పొర బలహీనపడితే బయట అంతరిక్షంలో నుంచి దూసుకువచ్చి ప్రమాదకరమైన అల్ట్రావైలెట్ కిరణాల నుండి రక్షణను మనం కోల్పోతున్నాం. ఈ కిరణాల తాకిడివల్ల మన జీవకణాల్లోకి



ప్రాణశక్తి దెబ్బతింటుంది. ఇప్పటికే ఓజోన్‌పొర బలహీనతవల్ల వాతావరణంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఇవి జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నది. మన రాజ్యాంగంలో 48వ అధికరణంలో దేశంలో అడవులు, వన్యప్రాణులకు భద్రత కల్పించడం, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్న దీన్ని మరింత మెరుగుపరచడానికి కృషి చేయడం ఈ రెండింటికి ప్రభుత్వం తప్పనిసరిగా శ్రమించాలని ఉంది. 51వ అధికరణలో వన్యప్రాణులతోపాటు సమస్త జీవజాలాన్ని ప్రేమిస్తూ చెరువులు, నదులు, అడవులతోసహా సహజపర్యావరణాన్ని పరిరక్షించడం దీన్ని మరింత సమర్థవంతంగా అభివృద్ధి పరచడం ఈ దేశంలో ప్రతి ఒక్క పౌరుడి బాధ్యతగా ఉంది.

జీవవైవిధ్య వినాశనానికి అడ్డుకట్టవేసే పటిష్టమైన అత్యవసర చర్యలు చేపట్టాలి. తద్వారా 2020 నాటికి పర్యావరణ వ్యవస్థలు యథాస్థితికి చేరి నిత్యావసర సేవలను కొనసాగించాలి. భూతలం మీద జీవవైవిధ్యం తేరుకుని మానవ శ్రేయస్సుకు, పేదరిక నిర్మూలనకు బాటలు పడే లక్ష్యసాధనకుగాను జన్యువనరుల వినియోగం వల్ల లభించే ప్రయోజనాల సక్రమ, సమతుల పంపిణీ జరుగుతుంది. జీవవైవిధ్య సమస్యలు, విలువలను ప్రధాన స్రవంతిలో చేర్చి తగిన విధానాలను సమర్థంగా అమలుచేయాలి. జీవవైవిధ్య విలువలను జాతీయ, స్థానిక అభివృద్ధిలో అనుసంధానం చేయాలి. పేదరిక నిర్మూలన వ్యూహాలను, ప్రణాళిక ప్రక్రియలను తగినట్టుగా రిపోర్టింగు వ్యవస్థలవలె జాతీయ అకౌంటింగులో పొందుపరచాలి. వాతావరణ మార్పు, సముద్రజలాల ఆధునీకరణ లేదా సముద్రగర్భంలో పగడాల కోసం అన్వేషణ వంటి మానవ చర్యలతో పర్యావరణానికి సముద్ర జీవుల మనుగడకు కలిగే అపార నష్టాన్ని నిరోధించి వాటి నివారణకు తీరప్రాంత కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి. అధిక పోషకాలతో సహకాలుష్యాన్ని పర్యావరణ వ్యవస్థ పనితీరుకు జీవవైవిధ్యానికి కీడు కలగనివిధంగా నియంత్రించాలి. అడవుల నరికివేత, పారిశ్రామికీకరణ వల్ల కలిగే దుష్పరిణామాలవల్ల జీవవైవిధ్యం క్షీణిస్తున్నందున అడవుల అభివృద్ధికి కృషి చేయడం, వాతావరణ మార్పుల వల్ల జీవవైవిధ్యంపై కలిగే ప్రభావాలకు సంబంధించి సమాచార మార్పిడి జరుగుతుంది. ఆధునిక శాస్త్ర సాంకేతికరంగాలు అభివృద్ధి చెందే కొద్దీ పారిశ్రామిక ఉత్పత్తుల వినియోగం పెరగడం తత్ఫలితంగా జీవులపై ప్రతికూల అనుకూల ఫలితాలపై నిఘా పెట్టడం ఆధునీకరణ, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వల్ల జీవవైవిధ్యానికి నష్టం జరగకుండా చూడాలి. సంరక్షణ కల్పించాల్సిన ప్రాంతాలను గుర్తించి అక్కడ పూర్తి భద్రత కల్పించడం పర్యావరణ పరంగా సురక్షితమైన ప్రాంతాల అభివృద్ధికి ప్రోత్సాహం అందించడం, క్షీణదశలో ఉన్న పర్యావరణ వ్యవస్థలను గుర్తించి నాటి పునరుద్ధరణకు, ఆయా ప్రాంతాలలోని అరుదైన జీవాలకు రక్షణ ఇచ్చేందుకు స్థానికుల సహకారంతో చర్యలు చేపట్టాలి. పర్యావరణానికి హాని కలిగించే ప్రాణాంతక జీవుల వృద్ధిని అరికట్టడం, అందుకు తగినట్టు నిబంధనలను రూపొందించాలి. అడవులతో సహా అన్ని సహజ ఆవాసాల క్షీణతరేటును కనీసం సగానికి లేదా దాదాపు సంపూర్ణంగా నిలువరించాలి.

జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా ప్రతి ఇంట్లో కనీసం ఒక మొక్కను నాటి, దాన్ని పెంచాలి. సామాజిక అడవుల పెంపకం చేపట్టాలి. పర్యావరణ సంబంధ శిక్షణా కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థులను భాగస్వాములను చేయాలి. పరిస్థితులకు అనుగుణంగా చట్టాలను రూపొందించాలి. పర్యావరణ చట్టాలను సక్రమంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలి. జీవవైధ్యాన్ని కాపాడేకృషిలో ప్రజలభాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. అభివృద్ధి లక్ష్యంగా చేపట్టే ప్రాజెక్టుల కారణంగా పర్యావరణానికి ఎదురయ్యే ముప్పును అంచనా వేయడంలో వారికి తగిన బాధ్యతలను అప్పగించాలి. జీవవైవిధ్యానికి పర్యావరణ వ్యవస్థకు ప్రాధాన్యంగల కనీసం 17 శాతం భూప్రాంతాలలో కీలకమైన నదులు, వాగులు, కాలువలు కాలుష్యం బారినపడకుండా పరిరక్షణ చర్యలు చేపట్టాలి. జీవవైవిధ్యపరిరక్షణ, సుస్థిర వినియోగానికి సంబంధించిన దేశీయ స్థానిక సమాజాల వద్దగల సంప్రదాయ విజ్ఞానం, ఆవిష్కరణలు, ఆనవాయితీలను గౌరవించాలి. వనరులదోపిడీ, విచక్షణారహిత వినియోగాలను అరికట్టాలి. జీవవైవిధ్యానికి హాని జరగకుండా చూడాలి. వట్టిపోయిన వ్యవసాయ భూములను తిరిగి సస్యశ్యామలం చేయడానికి నశించిపోతున్న అరుదైన జంతుజాతులను రక్షించడం కోసం సమగ్రమైన కార్యక్రమాలను పటిష్టంగా అమలుచేయాలి.

**ఆర్.వి.ఎం.సత్యం**
(విశ్రాంత ఉపాధ్యాయుడు)




# యాదాద్రి పుణ్యక్షేత్రం

**యా**దగిరిగుట్టను పంచనారసింహక్షేత్రంగా కూడా ఇక్కడి భక్తులు కొలుస్తూ ఉంటారు. 'యాద' అనే పేరుగల రుషికి, కరుణాంతరంగుడైన నారసింహస్వామివారిని పదే పదే పలుమార్లు చూడాలని కోరిక కలిగిందట. అందుకోసం మళ్లీ రెండోసారి యాద రుషి లక్ష్మీ నరసింహస్వామిని గూర్చి తపమాచరించాడని, ఆతని నిష్కళంక భక్తికి, వ్రత దీక్షకు తనపైగల ఆసక్తికి ఆ నరసింహస్వామి మెచ్చుకుని వచ్చి, ఆతని ఎదుట నిలిచాడట. స్వామీ ! తమరు అనేక రూపాలలో దర్శనమిచ్చి నన్ను ఆశీర్వదించుమని ఆ భక్తుడైన యాద రుషి నరసింహస్వామిని బ్రతిమాలుకున్నాడట. అందుకు దేవ దేవుడైన లక్ష్మీనరసింహస్వామివారు అంగీకరించి జ్వాలా, యోగ, నంద, గండ భేరుండ, నారసింహ అను ఐదు రూపాలలో దర్శనమిచ్చి భక్తుని తృప్తిగావించాడట. అందువల్లేదానికి పంచనారసింహ క్షేత్రం అనే పేరు ఏర్పడినట్టు పురాణాలు చెబుతున్నాయి.

స్వామియైనటువంటి నారసింహుడు రెండవ పర్యాయము తన భక్తుడైన యాదర్షికి దర్శనమిచ్చాడు. జ్వాలా యోగానందగండ భేరుండ నరసింహరూపాలలో ఉన్నాడనీ జ్వాలా నరసింహుడు సర్పరూపంలో ఉంటాడనీ, యోగానందుడు పూజింపబడే రూపంలో ఉంటాడనీ గండభేరుండ నారసింహుడు కొండ గుహలో కొలువైనాడనీ, తరువాత భక్తుడైన యాదర్శి తనను ఆ స్వామిలో ఐక్యం చేసుకోమని స్వామిని అడిగారని తెలియుచున్నది.

అయితే స్వామివారు దేవతలకు, మునీశ్వరులకు మాత్రమే గుహనుండి దర్శనమిస్తూ ఉండి, అనంతరం కొండపై యాదాద్రి కొలువుదీరినట్లు చెప్పుచున్నది చరిత్ర. కొండమీదే కొలువుదీరిన వైనాన్ని పరిశీలిద్దాం. నరసింహస్వామివారు కలియుగంలో కలికాలమునందుద్భవించిన జనుల కొరకు దర్శనం ఇస్తు/సరియైన మార్గంలో జీవించినవారికోసం తన మహత్యం ద్వారా వారిని పవిత్రులను గావించాలని సంకల్పించి, కొండకింద అనగా దిగువనున్న పల్లెలో ఉన్నట్టి /గ్రామాధికారి కలలో కనిపించి తాను ఈ ప్రాంతంలో

నాలుగురూపాలలో ఉన్నానని గుర్తులు చెప్పినారట. అతను ఆ రోజు ఉదయం కొంతమందితో కలిసి కొండపైకి వెళ్లి గుహను పరిశీలించి ఆ స్వామిని మరియు అచటనే గల ఆంజనేయ స్వామిని కనుగొన్నాడట. ఆ రోజు నుండి ఆ దేవుడు ప్రజల చేత పూజింపబడుతూ ఆరాధ్యదైవంగా గణతికెక్కినట్టు స్థలపురాణం తెలియజేయుచున్నది.

ఐదుగా, నాలుగుగా, మూడుగా ఆ స్వామి రూపాల్ని/వివిధ పురాణాలు తెలిపినా, స్వామివారి మూర్తి మంత్రం ఒక్కటే ! ఆ ఆత్మేశుడొక్కడే ! ఆయన చైతన్య స్వరూపం/కొలిచే భక్తుల పాలిట కొంగుబంగారం అనడం నిస్సందేహం. తలుచుకున్నవారికి ధన్యమైన ఆకారం. కాలక్రమేణ ఆ పవిత్రక్షేత్రం అభివృద్ధి అయ్యే విధంగా అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తి స్వామివారిని ఆరాధించసాగారు. నేడు ఆ క్షేత్రంలో నరసింహస్వామివారితోబాటు ఆంజనేయుడు, గరుత్మంతుడు, ఆండాళ్లమ్మ మొదలైన విగ్రహమూర్తులెందరో భక్తులకు దర్శనిమిచ్చి పవిత్రులను చేయచున్నారని చెప్పుకోవాలి.

ఆలయానికి సమీపాన ఆంజనేయుని స్నాన గుండము కూడా ఉన్నది. అక్కడ మహా సౌందర్యకళలతో అలరారు చున్న ముఖద్వారం గాలిగోపురం భక్త జనావళిని గొప్పగా ఆకర్షించుచున్నవి. యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం మన దేశానికి తలమానికమైన పవిత్ర పుణ్యక్షేత్రంగా భావించాలి. తరతరాల నుండి మనం చేసుకున్న పుణ్యంగా గమనించాల్సివుంది.

ఈ నరసింహక్షేత్రానికి సంబంధించి మరియొక కథ కూడా ప్రాచుర్యంలో ఉంది. అదేమనగా హిరణ్యకశిపుడు దానవశ్రేష్టుడు, మీదుమిక్కి హరిభక్తుడైన ప్రహ్లాదుని తండ్రి. తండ్రిపెట్టే బాధల నుంచి భక్తసులభుడైన శ్రీ మహా విష్ణువు ప్రహ్లాద కుమారుని రక్షించడం కోసంగాను భీకరరూపం ధరించిన వెనుక ఆ భయంకర రూపాన్ని ఉపసంహరించేందుకు ఎవరికిగాని సాధ్యం కాకుండా ఉంది. అంతదేవతలందరూ కలిసి జగన్మాతయైన హరిపత్నియైన లక్ష్మీదేవిని ప్రార్థించినారట. అ తల్లి తన స్వామి భయంకరరూపాన్ని శాంతింపజేయవలసినదని వేడుకున్నది.

భార్య అభ్యర్థనమేరకు నృసింహస్వామివారు తన శాంతరూపాన్ని అక్కడే దాల్చకుండా సమీపంలోగల యాదగిరికి వచ్చి శాంతాకారుడై లక్ష్మీనారసింహుడుగా రూపుదాల్చినట్టు చరిత్రకారుల ద్వారా తెలియవచ్చుచున్నది. ఇంకా ఈ క్షేత్రంలోని పుష్కరిణి విశేషాలు తెలుసుకోవాల్సి వుంది. రాక్షస సంహారనంతరం లోకాలకు శాంతిని, సౌఖ్యాన్ని చేకూర్చినందువల్ల బ్రహ్మదేవుడు సంతసించాడట. నరసింహస్వామి పాదాలను ఆకాశగంగతో కడిగాడట. ఆ గంగ లోయల గుండా ప్రవహించి, స్వామి పుష్కరిణికి చేరుకున్నదట. అందువల్లే దీనికి కూడా గొప్పప్రాముఖ్యత సంతరించుకున్నది. దీనిలో స్నానమాచరించి నరసింహస్వామిని సేవిస్తే భక్తుల చిరకాల వాంఛలు తీరుతాయనే విశ్వాసం కలిగింది.

విశేషించి చెప్పాల్సి వచ్చినట్లైతే ఈ స్వామి అనారోగ్యంతో అలమటించేవారికి, ఇంకా గ్రహపీడుతులైన కృశించేవారికి, సంతానం లేనివారికి ఈ దేవ దేవుడు సుఖప్రాప్తి కలిగిస్తాడన్న విశ్వాసం జనానికెంతో వున్నది. ఈ పవిత్ర క్షేత్రంలో గలకొండమీద తపమాచరించే రుషులు ఈ పుష్కరిణిలో స్నానం చేస్తారనేదానికి నిదర్శనంగా వారు అరుదెంచేటప్పుడు మృదంగధ్వనులవలె శుభసూచిక ధ్వనులు



వినిపిస్తాయని చెప్పుకుంటారు. వారియొక్క పాదముద్రలు కొందరుచూచినట్లుగా చెబుతారు. మెట్ల మార్గంలో వెళ్లేదారిలో ఒక శివాలయం దర్శనమిస్తుంది. ఆ శివయ్య కూడా యాదాద్రి క్షేత్రంలో స్వయంభువుగా వెలసినట్లు, భక్తులకు ఆయన దర్శనంతో కీళ్ల నొప్పులు మటుమాయమౌతాయని వారికి గట్టి నమ్మకం కూడా ఏర్పడింది.

ఆ స్వామి సన్నిధిలోప్రతినెలా వచ్చే స్వాతీ నక్షత్రం తిథినాడు అష్టోత్తరశతకులశ అభిషేకం అర్చక స్వాములు చేస్తారు. ఇదే మాదిరిగ సంవత్సరాది పండుగనాడు కూడా తిరువీధి సేవచేసి పంచాంగ శ్రవణం జరపడం ఆనవాయితీగా సాగుతున్నది. వీనికితోడు శ్రీరామ నవమి, హనుమజ్జయంతి, శ్రీకృష్ణాష్టమి, పర్వదినాలలో పవిత్ర ఉత్సవాలు జరుపుతుంటారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో శ్రీవారికి బ్రహ్మోత్సవాలు విధిగా జరుగుతుంటాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ఎదురుకోళ్లు, కల్యాణం, రథోత్సవం మిక్కిలి అంగరంగ వైభోగంగా, ఆకర్షణీయంగా జరుగుతుంటుంది. వీటికితోడు కవి సమ్మేళనాలు, ధార్మిక ఉపన్యాసాలు విరివిగా నిర్వహించబడుతుంటాయి. కొండపైకి గుట్ట రెండుమార్గాలు ఉన్నాయి. ఒకటి మెట్లదారి, రెండవది బస్సువెళ్లేదారి.

భక్తులకు సౌకర్యార్థం దేవస్థానం కమిటీవారు వసతిగృహాలను కూడా నిర్మించియున్నారు. ఈ క్షేత్రానికి విచ్చేసే భక్తులు కొండదిగువన కొలువుదీరిన పాతాళ నరసింహస్వామి వారిని కూడా దర్శించి మరీ వెళుతుంటారు. తమ తమ జాతకాల్లో రాహుకేతువుల దోషం గలవారుసైతం ఈ క్షేత్రానికి వచ్చి ఆయా గ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. కొన్ని సమస్యల వల్ల పెండ్లిండ్లు ఆగిపోయినవారు, నిస్సంతులు ఈ ఆలయమూర్తుల దర్శనం చేసుకుని మంచి ఫలితాలు పొందటం రివాజయ్యింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఈ యాదాద్రి క్షేత్రానికి మహర్దశ పట్టనున్నదని చెప్పుకోవచ్చు. ఈ క్షేత్రాన్ని దర్శించాలంటే విజయవాడ నుంచి, అటు హైదరాబాదు నుంచి బస్సు, రైలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. నల్గొండ జిల్లాలోని ఈ యాదగిరిగుట్ట మండల కేంద్రంగా అవతరించింది. చిత్తూరు జిల్లాలో తిరుపతి మాదిరిగా దీనిని అభివృద్ధి చేయదలచుకున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పడం జరిగింది. ముఖ్యంగా ఈ యాదగిరి గుట్టను దర్శించి, ఆ దేవ దేవుని అనుగ్రహాన్ని పొందిన భక్తులు తమ పిల్లలకు ఆయన పేర్లు, క్షేత్ర నామాల్ని లింగబేధం లేకుండా పెట్టుకుంటూ ఉండటం గమనించాల్సిన అంశం. భక్తి ముక్తిదాయకమైన ఈ క్షేత్రదర్శనం ఒక చక్కని దివ్యానుభూతిని కలిగిస్తుంది.

**రచయిత : డా.మంతెన సూర్యనారాయణరాజు**

# పరిమితి మించితే పాన్...లేదంటే పరేషాన్




- సామాన్యులు, రైతులు నుండి ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు వరకు అందరూ తెలుసుకోవాల్సిన అతి ముఖ్యమైన అంశం.
- 125 కోట్ల దేశజనాభాలో పన్ను చెల్లించే వారి సంఖ్య కేవలం 3 నుండి 4 శాతం లోపే.
- నల్లధనం నియంత్రణ / మరింత మంది ఆదాయపరులను టాక్స్ బ్రాకెట్ (పరిధి)లోకి తేవడం లక్ష్యం.
- ఖాతాదారుల బ్యాంకు లావాదేవీల అన్నింటిపై ఇక నుంచి ఐటి నిఘానేత్రం.
- బ్యాంకు ఖాతా / డిమ్యాట్ తెరవాలన్నా / క్రెడిట్ కార్డు కావాలన్నా పాన్‌కార్డు కావల్సిందే.
- 20కిపైగా లావాదేవీలకు పాన్‌కార్డు తప్పనిసరి.
- పాన్‌కార్డు లేకపోతే ఫారమ్ – 60 డిక్లరేషన్ ఇవ్వాల్సిందే.
- తప్పుడు ధృవీకరణకు 3 నెలల నుండి 7 సంవత్సరముల కఠిన జైలు శిక్ష, జరిమానా.
- 2016 జనవరి 1 నుండి అమలులోకి వచ్చిన ఐటి కొత్త నిబంధనలు.

**సు**మారు 125 కోట్లకుపైగా జనాభా కలిగిన భారతదేశంలో ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారి సంఖ్య కేవలం 3 నుండి 4 శాతంలోపే ఉండటం ఆశ్చర్యకరం అనిపిస్తుంది. చాలా మంది ఆదాయం పన్ను పరిధిలో ఉన్నా తమ లావాదేవీలను బ్లాక్‌లో నడిపించడం ద్వారా పన్ను ఎగవేస్తున్నారు. కోటి రూపాయలుపైగా ఆదాయం ఉన్న వారి సంఖ్య దేశంలో 48 వేలకు మించకపోవడం హాస్యాస్పదంగా ఉంది. పన్నులు నిర్వహణ వ్యవస్థలు లోపభూయిష్టంగా ఉండటం వలన మన దేశం మూడింట రెండు వంతుల పన్ను ద్వారా వచ్చే ఆదాయం కోల్పోతుందని వివిధ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. ఢిల్లీ కేంద్రంగా ఆర్థిక అధ్యయనాలు నిర్వహించే ఎన్ఐపిఇపి సంస్థ 1984లో దేశ జిడిపిలో 5వ వంతు నల్లధనం రూపంలో పోగుపడిందని అంచనా వేసింది. గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీ సంస్థ 2014 డిసెంబరులో వెల్లడించిన లెక్కల ప్రకారం 2003–2012 సంవత్సరముల మధ్య కాలంలో భారతదేశం నుండి విదేశములకు అక్రమంగా తరలిపోయిన మొత్తం 440 కోట్ల డాలర్లు అనగా అక్షరములా 28 లక్షల కోట్లు రూపాయలు ఇంచుమించు అంటే మొత్తంలో దేశీయంగాను నల్లధనం పోగుపడి ఉండవచ్చని ఒక అంచనా.

పన్ను వ్యవహారములను బ్లాక్‌లో నడిపిస్తూ తద్వారా పన్ను ఎగవేసే వారి వ్యవహారములకు అడ్డుకట్టవేసి వీరందరినీ టాక్స్ బ్రాకెట్ (పరిధి)లోకి తీసుకురావలసిన అవసరం ఉంది. రాబోయే సంవత్సరములలో ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారి సంఖ్య 3 నుండి 4 శాతం నుండి 7 నుండి 8 శాతంనకు పెంచడం కొరకుగాను కేంద్ర ప్రత్యక్ష పన్నుల శాఖ పాన్ (పర్మినెంట్ అకౌంట్ నంబర్) కార్డుకు సంబంధించి కొత్త నిబంధనలు ప్రవేశపెట్టింది. 2016 జనవరి 1వ తేదీ నుండి అమలులోకి వచ్చిన ఈ కొత్త నిబంధనల ప్రకారం ఇక పలు రకముల లావాదేవీలకు పాన్ నంబరు తప్పనిసరి. సుమారు 20కిపైగా లావాదేవీల విషయంలో దీనిని అమలు చేస్తారు. ప్రస్తుతమునకు కొన్ని లావాదేవీలకే దీనిని పరిమితం చేసినా రాబోయే కాలంలో అన్ని రకముల ఆర్థిక లావాదేవీలకు పాన్ నంబరు తప్పనిసరి చేస్తారని చెప్పడానికి దీనికి ఒక సంకేతంగా భావించవచ్చును.

కేంద్ర ప్రత్యక్ష పన్నుల శాఖ సూచనల మేరకు ఆర్థిక శాఖ ఆదేశముల ప్రకారం ఆదాయపు పన్ను శాఖ వారు జారీ చేసిన నియమనిబంధనలను అనుసరించి ఈ క్రింది లావాదేవీలకు పాన్‌కార్డు లేదా ఫారమ్-60 డిక్లరేషన్ తప్పనిసరిగా సమర్పించాలి.

1. జాతీయ బ్యాంకులు / సహకార బ్యాంకులు/ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలలో / తపాలా కార్యాలయములలో ఒకసారి 50,000/-కు మించి మీ ఖాతాలో నగదు డిపాజిట్ లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలన్నా, ఒక ఏడాదిలో చేసిన డిపాజిట్లు 5 లక్షల రూపాయలకుమించినా పాన్‌కార్డు వివరములు ఇవ్వవలసి ఉంటుంది.
2. ఒక రోజులో 50,000/- మించి బ్యాంకు డిడిలు, బ్యాంకర్స్ చెక్, పే ఆర్డర్ తీసుకొన్నప్పుడు.
3. సంవత్సరమునకు ఎల్ఐసి ప్రీమియం కోసం 50,000/- మించి చెల్లిస్తున్న.
4. 50,000/-లకు మించి క్యాష్ కార్డులు, ప్రీపెయిడ్ కార్డుల కోసం నమోదు చెల్లించినా.
5. ఏదైనా హోటల్ / రెస్టారెంట్‌లో 50,000/- మించి బిల్లు చేసి చెల్లించాల్సి వచ్చినప్పుడు.
6. 2 లక్షలకు మించి విలువైన బంగారు ఆభరణములను నగదు లేదా కార్డు ద్వారా కొనుగోలు చేసినా పాన్‌కార్డు వివరములను ఇవ్వవలెను. ఈ పరిమితిని 5,00,000/-లకు పెంచవలెనని గోల్డ్ జ్యూయెలరీ అసోసియేషన్ డిమాండ్ చేస్తున్నది.
7. విదేశీ ప్రయాణములలో 50,000/-లకు మించి నగదుతో టికెట్లు కొన్నప్పుడు నగదుతో విదేశీ కరెన్సీ కొన్న సందర్భములో
8. ప్రతి మోటారు వాహనం కొనుగోలు సమయంలో పాన్‌కార్డు తప్పనిసరిగా ఇవ్వవలెను. ద్విచక్ర వాహనముల లావాదేవీలకు మినహాయింపు ఇవ్వడం జరిగింది.
9. స్థిరాస్తి క్రయవిక్రయముల విలువ 10 లక్షల రూపాయలు దాటితో పాన్‌కార్డు వివరములు తప్పనిసరిగా ఇవ్వవలెను. ఇక్కడ కొన్నవారు - అమ్మినవారు ఇరువురూ కూడా పాన్‌కార్డు వివరములు ఇవ్వవలసి ఉంటుంది. గతంలో ఈ విలువ 5 లక్షల రూపాయల వరకు ఉ ఒడేది.
10. లక్ష రూపాయలకు మించి షేర్లు కొన్నప్పుడు ఏడాదిలో 50,000/ - పరిమితి దాటి కొన్న మ్యూచువల్ ఫండ్ యూనిట్లు, డిబెంచర్లు, ఆర్‌బిఐ జారీ చేసిన బాండ్లు కొన్నప్పుడు.

పై లావాదేవీల విషయంలోనే కాకుండా బ్యాంకులో ఖాతా తెరవాలన్నా, డిమ్యాట్ తెరవాలన్నా, క్రెడిట్‌కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నా పాన్‌కార్డును తప్పనిసరిగా సమర్పించవలసి ఉంటుంది. అయితే కొత్తగా బ్యాంకులో ఖాతా ప్రారంభించే విషయంలో ప్రధాన మంత్రి ధన్‌జన్ యోజన పథకం క్రింద ప్రారంభించే ఖాతాలకు మినహాయింపు ఇవ్వడం జరిగింది.

**పాన్‌కార్డు లేకపోతే ఎలా?**

2016 జనవరి 1వ తేదీ నుండి ఆదాయ పన్నుశాఖ జారీ చేసిన నియమనిబంధనల ప్రకారం బ్యాంకు లావాదేవీలు నిర్వహించే వారికి పాన్‌కార్డు తప్పనిసరి అయితే పాన్‌కార్డు లేని వారికి ఫారమ్-60 డిక్లరేషన్ పూరించడం తప్పనిసరి అని ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఫారమ్-60 డిక్లరేషన్ నమోదు చేవలసిన అంశాలు

ఈ ఫారమ్-60 డిక్లరేషన్ నందు లావాదేవీలు జరుపుతున్న వ్యక్తి యొక్క పేరు, అతని పూర్తి చిరునామా, పుట్టినతేదీ, మొబైల్ నంబరు వంటి వ్యక్తిగత వివరములను పూరించి, అతని యొక్క ఆధార్‌కార్డు, ఓటరు గుర్తింపుకార్డు వంటి వ్యక్తిగత నివాస ధృవీకరణ పత్రములను జతచేయాలి. లావాదేవీలు నగదు, చెక్కు, కార్డు, డ్రాఫ్ట్, బ్యాంకర్ చెక్, ఆన్‌లైన్ లావాదేవీ ఇలా ఏ పద్ధతిలో చేశారో కూడా నమోదు చేయాలి. ఆధార్‌కార్డు లేకపోతే ఆ వ్యక్తి ఆధార్ కోసం దరఖాస్తు చేసుకొన్నప్పుడు ఇచ్చిన సంఖ్యను నమోదు చేసే అవకాశమును ఫారమ్-60లో కల్పించారు. లావాదేవీలు నిర్వహించే వ్యక్తి వార్షిక వ్యవసాయ, వ్యవసాయేతర ఆదాయం వివరములను కూడా నమోదు చేయాల్సి ఉంటుంది.

**తప్పుడు వివరములకు శిక్షలు ఇలా**

పాన్‌కార్డు లేనివారు తమ లావాదేవీల నిర్వహణ కొరకు ఫారమ్-60 డిక్లరేషన్‌ను సమర్పించవచ్చును. అయితే దీనిలో తప్పుడు వివరములు సమర్పించినచో ఆదాయపు పన్నుశాఖ చట్టంలోని సెక్షన్ 277 ప్రకారం విచారిస్తారు. దీని మేరకు తప్పుడు సమాచారం అని రుజువైతే దానిని తీవ్ర నేరంగా పరిగణిస్తారు. ఇన్‌కమ్‌టాక్స్ చట్టాల ప్రకారం కనీసశిక్షగా 3 నెలలు కఠిన కరాగారం, గరిష్టముగా 7 సంవత్సరములు జైలు శిక్ష మరియు జరిమానా విధిస్తారు.

ఫారమ్ - 60 డిక్టరేషన్‌లో తప్పుడు సమాచారం ద్వారా 25 లక్షల కన్నా తక్కువ పన్ను ఎగవేసినట్లు నిర్ధారణ అయితే 3 నెలల నుండి 2 సంవత్సరముల వరకు కఠిన కారాగారశిక్ష, జరిమానాకు గురికావాల్సి ఉంటుంది. అలాగే 25 లక్షల కన్నా ఎక్కువ పన్నులు ఎగేవస్తే 6 నెలల నుండి 7 సంవత్సరముల వరకు కఠిన కారాగార శిక్ష మరియు జరిమానా చెల్లించవలసి ఉంటుంది.

రెండు పాన్ కార్డులు కలిగియున్నా, వేరే వారి పాన్‌కార్డు వివరములు పేర్కొన్నా కూడా శిక్ష తప్పదు. అలాగే పాన్‌కార్డు ఉండి వివరములు ఇవ్వకపోయినా దాన్ని నేరంగా పరిగణిస్తారు. కాబట్టి ఇక నుంచి బ్యాంకు లావాదేవీలు చేసేవారు మీ పాన్‌కార్డు వివరములు సెల్‌ఫోన్‌లో సేవ్ చేసుకొని బ్యాంకు లావాదేవీలు నిర్వహించేటప్పుడు జాగ్రత్తగా ఉండటం అవసరం.

రూ.50,000/-లకు మించి బ్యాంకులో డిపాజిట్ చేసేటప్పుడు పాన్‌కార్డు నెంబరు ఇవ్వాలన్న నిబంధన గతంలోను ఉంది. అయితేద అన్ని తప్పించుకొనుటకు నలగర్ల వెంకట్రావు ఎప్పుడూ 49,999/- రూపాయలు మాత్రమే డిపాజిట్ చేసేవాడు. అలా ఎన్నిసార్లు చేసినా పాన్ అవసరం లేదు. కనుక తన లావాదేవీలపై ఐటి అధికారుల నిఘా ఉండదు అన్నది నల్లగర్ల వెంకట్రావు నమ్మకం. ఇప్పటి వరకు కొనసాగిన ఇలాంటి వారి ఆటలు ఇకపై సాగవు. ఏడాదిలో రూ.5 లక్షల పైగా డిపాజిట్ చేస్తే పాన్‌కార్డు వివరములు తప్పనిసరి చేశారు ఇప్పుడు. ఇలాంటి నలగర్ల వెంకట్రావులు 49,999/- చొప్పున 10 సార్లు డిపాజిట్ చేసినా పాన్ వివరములు ఇవ్వవలసిన పనిలేదు. 11వసారి చేస్తే మాత్రం పాన్ నంబరు తప్పనిసరిగా ఇవ్వాలి. ఇక నుంచి మీ యొక్క ప్రతి బ్యాంక్ లావాదేవీని ఆదాయపు పన్ను శాఖ ఒక కంట కనిపెడుతూనే ఉందని గమనించాలి?

**కోమట్ల త్రినాథ్‌రెడ్డి**, ఎస్ఆర్‌పి 9704997880

Printed & Published by: Anita Ramachandran, Commissioner, on behalf of TSIPARD, Printed at Navatelangana Printers Pvt.Ltd. M.H.Bhavan, Near RTC Kalayanamandapam, Hyderabd.-20. Published at TSIPARD, Rajendranagar, Hyderabad- 500 030. Editor : Anita Ramachandran



ఏప్రిల్ 5 బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా టిసిపార్డులో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో అధికారులు మరియు సిబ్బంది



ఏప్రిల్ 11 మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా టిసిపార్డులో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో
పాల్గొన్న టిసిపార్డు అధికారులు మరియు సిబ్బంది



టిసిపార్డు దత్తత గ్రామం నాగులపల్లిలో ఏప్రిల్ 14 డా॥బి.ఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ ఉదయ్ సే భారత్ ఉదయ్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న టిసిపార్డు జాయింట్ డైరెక్టర్ శ్రీ కె.యాదయ్య గౌడ్, సమావేశంలో పాల్గొన్న టిసిపార్డు, మహబూబ్‌నగర్ జిల్లా అధికారులు మరియు గ్రామస్తులు

Regd. No. HSE/929/2014-2016
Published on 22-4-2016

Sthanika Palana
Date of posting April, 2016

RNI No.APTEL/27888/2009.
Licenced to post without prepayment
No.R&D/HSE/929/WPP/2015-16



దళిత బహుజనుల ఆశాకిరణం
డా॥బి.ఆర్.అంబేడ్కర్



సామాజిక సంస్కరణల ఆద్యుడు
మహాత్మా జ్యోతిరావు పూలే



దళిత ప్రజల ఆశాజ్యోతి
బాబూ జగ్జీవన్‌రామ్

తాజా సమాచారం కోసం www.tsipard.gov.in
మరియు YouTube facebook /tsipard
టోల్ ఫ్రీ నెం.: 1800 425 7070